

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 10

సంచిక: 153

బుధవారం 23-8-2017

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



బ్యాంకుల బంద్: సేవలు నిల్

ముగిసిన పీఎస్‌యూ బ్యాంకు ఉద్యోగుల ఒక రోజు సమ్మె - బిజినెస్‌లో



ప్రిక్వార్టర్స్‌లోకి సింధు

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ రెండో రౌండ్‌లో విజయం - స్పోర్ట్స్‌లో



నిబంధనలకు విరుద్ధంగా మంగళవారం బనగానపల్లెలో తిరుగుతున్న టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమా కారు (ఏపీ 16డీఎఫ్ 1314)



కోవెలకుంట్ల రోడ్లపై నెంబరు ప్లేట్లు తొలగించి తిప్పుతున్న మంత్రుల కార్లు



మంగళవారం రాత్రి నంద్యాలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పామోహన్‌రెడ్డి నివాసం వద్ద మోహరించిన పోలీసు బలగాలు

చెల్లని రూల్స్

నేడే నంద్యాల ఉప ఎన్నిక.. అక్రమాలపైనే అధికార పార్టీ దృష్టి

- వైఎస్సార్‌సీపీ ఏజెంట్లకు చివరి నిమిషం దాకా గుర్తింపు కార్డులు అందకుండా చేసే యత్నం
- విజయంపై నమ్మకం కోల్పోవడంతోనే ప్రత్యర్థులపై దాడులు.. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు యత్నాలు
- శిల్పామోహన్‌రెడ్డి ఇంట్లో పోలీసులతో సోదాలు
- 'శిల్పా సహకార్' సూపర్ మార్కెట్ మూసివేత
- నంబరు ప్లేట్లు లేని కార్లల్లో మంత్రుల చక్కర్లు
- బనగానపల్లె ఎమ్మెల్యే ఇల్లు కేంద్రంగా కార్యకలాపాలు
- ఎమ్మెల్యే ఇంట్లోకి బోండా ఉమా, బోడే ప్రసాద్ కార్లు
- గోస్పాడు మండలంలో విచ్చలవిడిగా డబ్బు పంపిణీ
- సూరజ్ హోటల్‌లో ఓ ఉన్నతాధికారి తిష్ట..

5 లో

'కోడ్' దాటిన అసత్య ప్రచారం

పోలింగ్ ముంగిట కోడ్ ఉల్లంఘించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- నిబంధనలకు విరుద్ధంగా విలేకరుల సమావేశం
- అనుకూల చానళ్లన్నిటిలో 'లైవ్' ప్రసారం..
- ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం
- నెల రోజుల కిందట తనే సొంత సర్వే చేయించుకొని తనే మార్కులు వేసుకున్న సీఎం
- సర్వే ఫలితాలంటూ పోలింగ్ ముందు రోజు ఆ వివరాలు వెల్లడి
- అందులో అంతా అవాస్తవాలే..
- సీఎం తీరుతో విస్తుపోతున్న జనం
- సుమోటోగా విచారణ జరపాలని ఈసీకి వైఎస్సార్ సీపీ డిమాండ్

2 లో



మంగళవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ట్రిపుల్ తలాక్ చెల్లదు

అది చట్ట, రాజ్యాంగ విరుద్ధం.. ఏకపక్షం, అహేతుకమన్న సుప్రీంకోర్టు

3-2 మెజారిటీతో ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు

పునరాలోచన చేసుకునేందుకు ఆస్కారం లేని, క్షణాల్లో ఇచ్చేసే ట్రిపుల్ తలాక్ ఖురాన్ సూక్తులకు వ్యతిరేకం. అంగీకారయోగ్యం కాదు. దీని ద్వారా విడాకులు అత్యంత ఏకపక్షం, అహేతుకం. రాజ్యాంగ ఉల్లంఘన కూడా. అందువల్ల ట్రిపుల్ తలాక్‌ను కొట్టివేయాల్సిందే.

- జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ ఆర్.ఎఫ్.నారిమన్, జస్టిస్ యు.యు.లలిత్

ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ.. 3–2 మెజారిటీతో తలాక్– ఎ–బిద్దత్ (ట్రిపుల్ తలాక్) చెల్లదని కొట్టివేస్తున్నాం.

- జస్టిస్ ఖేహర్ (సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి)

- వివరాలు 13లో



2న బక్రీద్

14 లో

'శిల్పా' పోలింగ్ ఏజెంట్ల విధులను

నిరోధించొద్దు

నంద్యాల పోలీసులకు హైకోర్టు ఆదేశం

5 లో





- వివరాలు 7లో

నీటి లభ్యత తగ్గితే

దామాషా పద్ధతి

కేంద్రానికి లేఖ రాయాలని బోర్డు నిర్ణయం

దిగువ రాష్ట్రాలకు ఊరట.. టెలీమీటర్లకు ఓకే

కృష్ణా నీటిలో అదనపు వాటా కోరిన తెలంగాణ డిమాండ్‌ను తోసిపుచ్చిన బోర్డు

మళ్లీ మొదలైన

డ్రామా

- పళని, పన్నీర్ వర్గాల విలీనంతో తమిళనాడులో తాజా సంక్షోభం
- పళనిస్వామికి మద్దతు ఉపసంహరించిన దినకరన్ వర్గం
- గవర్నర్‌ను కలిసిన 19 మంది ఎమ్మెల్యేలు
- సీఎంపై విశ్వాసం లేదంటూ లేఖలు
- విశ్వాస పరీక్ష కోరిన డీఎంకే

2 లో

తీరు మార్చుకో

- ఉగ్రవాదులకు పాక్ ఆశ్రయం కల్పిస్తే భారీ మూల్యం తప్పదు
- ట్రంప్ హెచ్చరిక -13లో

ఇదండీ సంగతి



నీమీద ఆన్‌లైన్‌లో కంప్లయింట్ వచ్చింది.. నడువ్ స్టేషన్‌కు!!

ఉప పోరుకు సర్వం సిద్ధం

- నేటి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్
- 6 గంటల్లోపు వరుసలో నిల్చున్న వారందరికీ ఓటు వేసేందుకు అనుమతి
- 82 ప్రత్యేక స్క్వాడ్‌లు.. అభ్యర్థుల వెంట షాడో పార్టీల నియామకం
- 15 మంది అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్న 2,18,858 మంది ఓటర్లు



పోలింగ్ సామగ్రిని ఆయా కేంద్రాలకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్న సిబ్బంది

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల ఉప ఎన్నికకు సర్వం సిద్ధమైంది. నేడు(బుధవారం) ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు పోలింగ్ జరగనుంది. ఈ ఉప ఎన్నికను అధికార, ప్రతిపక్షాలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. పోలింగ్‌ను పకడ్బందీగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కర్నూలు జిల్లా ఎన్నికల యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. గతంలో ఏ ఉప ఎన్నికకూ లేని విధంగా నంద్యాల ఉప ఎన్నికకు పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి హిమాన్స్ జ్యోతి చౌదరిని సాధారణ పరిశీలకుడిగా నియమించింది. అలాగే వ్యయ పరిశీలకుడిగా మూకాంబికేయన్‌ను, పోలీసు పరిశీలకుడిగా డేవిడ్‌సన్‌ను నియమించింది. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి అంశాన్ని గమనించేందుకు ఒక్కో కేంద్రానికి ఒక సూక్ష్మ పరిశీలకుడిని నియమించారు. వీరు సాధారణ పరిశీలకుడి ఆధ్వర్యంలో పనిచేస్తారు.

82 ప్రత్యేక స్క్వాడ్‌లు

కర్నూలు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ఉప ఎన్నిక ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఎన్నికల కమిషన్‌తోపాటు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్ పోలింగ్ ప్రక్రియను లైవ్ వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించనున్నారు. ఇందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6 గంటల్లోపు పోలింగ్ కేంద్రాల వద్ద వరుసలో నిల్చున్న వారందరినీ ఓటు వేసేందుకు అనుమతిస్తారు. నియోజక వర్గాన్ని 20 రూట్లుగా విభజించి.. రూట్ అధికారులను నియమించారు. 20 మంది జిల్లా అధికారులు సెక్టోరల్ అధికారులుగా ఉన్నారు. 82 ప్రత్యేక స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. అభ్యర్థులను అనుసరించేందుకు ప్రత్యేకంగా షాడో పార్టీలను ఏర్పాటు చేశారు. మొబైల్ స్క్వాడ్‌లు, స్ట్రైకింగ్ ఫోర్స్‌లను రంగంలోకి దించారు. 141 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల దగ్గర కేంద్ర బలగాలను మోహరించారు. ఎలాంటి సమస్య తలెత్తినా 92231 66166 నంబర్‌కు ఎస్‌ఎంఎస్ ద్వారా సమాచారం ఇవ్వొచ్చు. వెంటనే సంబంధిత రూట్ అధికారులను అప్రమత్తం చేస్తారు.

247 పోలింగ్ కేంద్రాలకు లైవ్ వెబ్‌కాస్టింగ్

నంద్యాల ఉప ఎన్నిక నిర్వహణకు 255 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు లైవ్ వెబ్‌కాస్టింగ్ సదుపాయం కల్పించాల్సి ఉండగా.. ఎనిమిది కేంద్రాలకు ఈ అవకాశం లేదని అధికారులు తేల్చారు. భీమవరంలో 2, బిల్లలాపురంలో 2, పార్వతీపురంలో 2, ఎస్.నాగులవరంలో 1, బీవీ నగర్‌లో 1 పోలింగ్ కేంద్రాలకు ఏ నెట్‌వర్క్ అందని కారణంగా వెబ్‌కాస్టింగ్‌కు అవకాశం లేకుండా పోయింది. దీంతో 247 పోలింగ్ కేంద్రాలకు లైవ్ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. అవకాశం లేని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. 247 పోలింగ్ కేంద్రాల్లో 195 కేంద్రాలకు బీఎస్‌ఎన్‌ఎల్, 52 కేంద్రాలకు జియో నెట్‌వర్క్‌తో వెబ్‌కాస్టింగ్ సదుపాయం కల్పించనున్నారు.

నంద్యాల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు	2,18,858
మహిళలు:	1,11,018
పురుషులు:	1,07,778
ఇతరులు:	62
పోలింగ్ కేంద్రాలు:	255
అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు:	141
విధుల్లో ఉండే మొత్తం పోలింగ్ సిబ్బంది:	1,275



సమస్యలు తలెత్తితే 92231 66166కు ఎస్‌ఎంఎస్ ద్వారా సమాచారం ఇవ్వొచ్చు

ఉప ఎన్నిక బరిలో 15 మంది

నంద్యాల ఉప ఎన్నిక బరిలో 15 మంది అభ్యర్థులు నిలిచారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీతోపాటు కాంగ్రెస్, రాయలసీమ పరిరక్షణ సమితి(ఆర్‌పీఎస్), ఇతర చిన్నాచితక పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. ప్రధాన పోటీ మాత్రం వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్య నెలకొంది. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారితోపాటు ముగ్గురు క్లర్క్‌లను నియమించారు. మొత్తం 1,275 మంది పోలింగ్ విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి 10 శాతం మంది రిజర్వ్‌లో ఉంటారు. ఈ ఉప ఎన్నికకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ను ఉపయోగిస్తున్నారు. ఇందుకోసం 700 బ్యాలెట్ యూనిట్‌లు, 400 కంట్రోల్ యూనిట్‌లు, 340 వీవీప్యాట్‌లు సిద్ధం చేశారు. మొదటిసారిగా అందుబాటులోకి వచ్చిన వీవీప్యాట్ ద్వారా ఓటర్లు తాము ఏ గుర్తుకు ఓటు వేశామో.. ఆ గుర్తుకు ఓటు పడిందా, లేదా అనే దానిని 7 సెకన్లపాటు చూసుకోవచ్చు. ఇది ఓటరుకు తప్ప ఇతరులకు తెలియదు.

26న కాకినాడలో జగన్ పర్యటన

- వినాయక చవితి పండుగ దృష్ట్యా షెడ్యూల్‌లో మార్పు
- ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడి



సాక్షి ప్రత్యేక ప్రతినిధి, కాకినాడ: కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26వ తేదీన కాకినాడలో పర్యటించనున్నారు. ఈ నెల 23 నుంచి రెండ్రోజులపాటు జగన్ కాకినాడలో పర్యటించాల్సి ఉన్నప్పటికీ వినాయక చవితి పండుగ నేపథ్యంలో షెడ్యూల్‌లో మార్పు చేశారు. ఈ విషయాన్ని పార్టీకి చెందిన కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల కోర్ కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి మంగళవారం సాయంత్రం మీడియాకు వెల్లడించారు. వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించడానికి కాకినాడ ప్రజలు ఏర్పాట్లు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో వారికెలాంటి ఇబ్బంది లేకుండా చేయడానికే జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో మార్పు చేసినట్లు తెలిపారు. తాజా షెడ్యూల్ ప్రకారం.. 26వ తేదీ ఉదయం వైఎస్ జగన్ హైదరాబాద్ నుంచి కాకినాడ వస్తారని, కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజల సాధక బాధకాలు తెలుసుకునేందుకు ఆ రోజు నగరంలో పర్యటిస్తారని ఆయన వివరించారు. 27వ తేదీన వైఎస్ జగన్ తిరిగి హైదరాబాద్‌కు బయల్దేరి వెళతారని తెలిపారు.

మహిళా స్వేచ్ఛకు లభించిన పెద్ద విజయం

లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్‌నారాయణ



సాక్షి, అమరావతి: ముమ్మారు తలాక్‌పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు 'మానవ హక్కులు, మహిళా స్వేచ్ఛ, హేతుబద్ధ భావాలకు' లభించిన పెద్ద విజయమని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముమ్మారు తలాక్ అనే ఇస్లాం మతాచారం చెల్లదని, షరియా చట్టాలను పరిగణనలోకి తీసుకుంటూ దీనిపై పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని కోర్టు పేర్కొనడం హర్షణీయమన్నారు. గుడ్డి విశ్వాసాలు, మూర్ఖపు ఆచారాలపై మానవ హక్కులు గెలిచాయన్నారు.

తమిళ డ్రామా మళ్లీ మొదలు..!

- పళనిస్వామికి మద్దతు ఉపసంహరించిన దినకరన్ వర్గం
- గవర్నర్‌ను కలసిన 19 మంది ఎమ్మెల్యేలు..

సాక్షి ప్రతినిధి, చెన్నై

తమిళనాడులో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ముఖ్యమంత్రి పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం వర్గాల విలీనం పూర్తయి 24 గంటలు గడవకముందే అధికార అన్నాడీఎంకే పార్టీలో మరో సంక్షోభం తలెత్తింది. పళనిస్వామి నిర్ణయంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి శశికళ, దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు తిరుగుబావుటా ఎగురవేశారు. ముఖ్యమంత్రి పళనిస్వామిపై తమకు విశ్వాసం లేదని ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం 19 మంది దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావును చెన్నైలోని రాజ్‌భవన్‌లో కలసి లిఖితపూర్వకంగా తమ నిర్ణయాన్ని తెలియజేశారు. కాగా, తాజా పరిణామాల నేపథ్యంలో పళనిస్వామి ప్రభుత్వం విశ్వాస పరీక్ష ఎదుర్కోవాలని డీఎంకే డిమాండ్ చేసింది.

పళనిస్వామిపై విశ్వాసం లేదు..

తన వర్గం ఎమ్మెల్యేలతో దినకరన్ మంగళవారం ఉదయం 8 గంటలకు సమావేశమయ్యారు. 9.30 గంటలకు ఏడు కార్లలో 19 మంది ఎమ్మెల్యేలు రాజ్‌భవన్‌కు వెళ్లి 10 గంటలకు గవర్నర్‌ను కలుసుకున్నారు. ఎమ్మెల్యేలంతా విడివిడిగా మద్దతు ఉపసంహరణ లేఖలను గవర్నర్‌కు సమర్పించారు. వాటిని పరిశీలించి తగిన చర్య తీసుకుంటానని గవర్నర్ వారికి హామీ ఇచ్చారు. ''మా వర్గం ఎమ్మెల్యేల మద్దతుతో కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకునేందుకు చర్యలు ప్రారంభించాం''అని దినకరన్ మద్దతుదారు, అండిపత్తి ఎమ్మెల్యే తంగ తమిళ్ సెల్వన్ గవర్నర్‌ను కలసిన అనంతరం ప్రకటించారు. పళనిస్వామి ప్రభుత్వం విశ్వాస పరీక్షను ఎదుర్కోవాలని కోరుకుంటున్నారా అని ప్రశ్నించగా.. తమ ఉద్దేశం అదే అని సెల్వన్ చెప్పారు. పార్టీ నుంచి శశికళను తొలగించే ప్రయత్నాలను ఆయన తప్పుబట్టారు.

విలీనం కాదు.. వెన్నుపోటు..

పళని–పన్నీర్ వర్గాల విలీనం పార్టీ ప్రధాన కార్యదర్శి శశికళకు వెన్నుపోటు పొడవడమే అని దినకరన్ అభివర్ణించారు. ఇది విలీనం కాదని, వాణిజ్య ఒప్పందమని, వ్యక్తిగత ప్రయోజనాలు, పదవీకాంక్ష, పదవులను కాపాడుకోవడం కోసమే ఈ పని చేశారని ట్వీటర్‌లో మండిపడ్డారు. శశికళకు వెన్నుపోటుపొడిచిన పళనిస్వామి, పన్నీర్‌సెల్వంను పార్టీ కార్యకర్తలే కాదు.. ప్రజలెవరూ క్షమించబోరని చెప్పారు. కాగా, అన్నాడీఎంకే నుంచి శశికళను తొలగించేందుకు చర్యలు ప్రారంభిస్తామని ప్రకటించిన సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ వైద్యలింగమ్‌ను పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు దినకరన్ ప్రకటించారు. వైద్యలింగమ్ పళనిస్వామికి సన్నిహితుడు.

విశ్వాస పరీక్ష పెట్టండి..

తాజా పరిణామాల నేపథ్యంలో పళనిస్వామిని సభలో బలం నిరూపించుకునేలా ఆదేశించాలని కోరుతూ డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రధాన ప్రతిపక్ష నేత ఎంకే స్టాలిన్ గవర్నర్‌కు ఓ లేఖ రాశారు. 22 మంది ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిపై విశ్వాసం లేదని ప్రకటించారని, దీంతో రాష్ట్రంలో రాజ్యాంగ సంక్షోభం ఏర్పడిందని పేర్కొన్నారు. పీఎంకే నేత అన్బుమణిరామ్‌దాస్ కూడా పళనిస్వామి బలం నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

బలాబలాలు ఇవీ..

తమిళనాడు అసెంబ్లీలో మొత్తం ఎమ్మెల్యేల సంఖ్య 234 కాగా.. జయలలిత మరణంతో ప్రస్తుతం ఒక స్థానం ఖాళీగా ఉంది. అన్నాడీఎంకేకు 135, ప్రధాన ప్రతిపక్షం డీఎంకేకు 89 సీట్లు, ఆ పార్టీ మిత్రపక్షాలైన కాంగ్రెస్‌కు 8, ఐయూఎంఎల్‌కు ఒక సీటు ఉన్నాయి. ప్రస్తుతం 233 మంది సభ్యులకు గాను అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకోవాలంటే పళని స్వామికి 117 మంది మద్దతు అవసరం. తాజా లెక్కల ప్రకారం ప్రకారం ఆయన బలం 122 నుంచి 112కు పడిపోయింది. గవర్నర్ బలపరీక్షకు ఆదేశిస్తే మరో ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఈ నేపథ్యంలో తమిళనాడులో మళ్లీ క్యాంప్ రాజకీయాలు మొదలయ్యాయి. తన వర్గంలోని 19 మంది ఎమ్మెల్యేలు చేజారిపోకుండా దినకరన్ పుదుచ్చేరిలో క్యాంప్ పెట్టారు. ప్రత్యేక బస్సులో మంగళవారం మధ్యాహ్నం ఎమ్మెల్యేల్ని పుదుచ్చేరికి పంపారు. అక్కడ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో ఎలాంటి ఇబ్బంది ఉండదని దినకరన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావును కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న దినకరన్ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు

ఏ వర్గంలో ఎంతమంది..	
పళని వర్గం	112 మంది
దినకరన్ వర్గం	19 మంది
దినకరన్‌కు మద్దతిస్తున్న మరో వర్గం (కరుణాస్, తనియరసు, తమీమ్ అన్సారీ)	3
తటస్థ ఎమ్మెల్యే 1 (తోప్పు వెంకటాచలం)	

'కోడ్' దాటిన అసత్య ప్రచారం

కోడ్ ఉల్లంఘించి ముఖ్యమంత్రి ప్రచారం

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: నంద్యాల ఎన్నికల ప్రచారం 21వ తేదీ సాయంత్రం ముగిసిపోయింది.. 23న పోలింగ్ జరగనుంది. అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం ప్రచారాన్ని ఇంకా ఆపలేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలులో ఉన్న నేపథ్యంలో ప్రభుత్వాధినేతగా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి దానిని పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాల్సి ఉన్నా స్వయంగా తానే దానిని ఉల్లంఘించడం చూసి రాష్ట్రప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. సోమవారం సాయంత్రంతో ప్రచారానికి గడువు ముగిసిపోయినా మంగళవారం సాయంత్రం ముఖ్యమంత్రి విలేకరుల సమావేశాన్ని నిర్వహించి.. దానిని నంద్యాల ఎన్నికల ప్రచారంలా ఉపయోగించుకుని ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారు. ఇది కచ్చితంగా కోడ్ ఉల్లంఘనేనని, ఈ ఘటనను సుమోటోగా తీసుకుని ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఎప్పుడో నెల రోజుల క్రితం మొదలుపెట్టిన ఓ సర్వేలో తేలిన అంశాలంటూ కొన్ని వివరాలను ఏకరువు పెడుతూ నంద్యాల ఓటర్లను ప్రభావితం చేసేలా ముఖ్యమంత్రి అనేక వ్యాఖ్యలు చేయడంపై విశ్లేషకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తీరా ఇదేదో రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన సర్వేనా అనుకుంటే అదీకాదు. ముఖ్యమంత్రి జరిపించుకుంటున్న సర్వేఅట. ఓ ప్రొఫెషనల్ ఏజెన్సీతో అధికారుల ప్రమేయం లేకుండా జరిపించిన సర్వే అని ఆయనే చెప్పుకున్నారు. అంటే తానే సర్వే జరిపించుకుని అందులో తేలిన అంశాలంటూ ముఖ్యమంత్రి తనకు 'నచ్చిన సమయం'లో 'తోచిన కథలు' వినిపించారన్నమాట. నిబంధనలకు విరుద్ధంగా విలేకరుల సమావేశం నిర్వహించడమే కాక అందులోనూ అనేక అవాస్తవాలను గుదిగుచ్చి వివరించడం, నంద్యాల ఓటర్లను ప్రభావితం చేసేలా మాట్లాడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సీఎం హైహై... చానళ్లు సైసై..

ఒకవైపు నంద్యాలలో 23వ తేదీ అంటే బుధవారం ఉదయం పోలింగ్ జరగనుండగా ముఖ్యమంత్రి చంద్రబాబు 22 సాయంత్రం 6 గంటలకు విలేకరుల సమావేశం నిర్వహించడం, తగుదునమ్మా అంటూ అనుకూల చానళ్లన్నీ దానిని ఆసాంతం లైవ్‌లో ప్రసారం చేయడం చూసి ప్రజాస్వామిక వాదులంతా నిర్ఘాంతపోయారు. ఇదెక్కడి విడ్డూరమంటూ రాష్ట్రమంతా చర్చించుకుంటున్నారు. పాలన, మద్యం విధానం, ఇసుక విధానం, విశాఖ భూముల వ్యవహారం, రైతుబజార్లు, టౌన్‌ప్లానింగ్ తదితర అనేక అంశాలపై ఎప్పుడో నెల రోజుల క్రితం తాను జరిపించుకున్నానని చెబుతున్న ఓ సర్వేను ముఖ్యమంత్రి ఇపుడు తన ప్రచారానికి ఉపయోగించుకున్నారు. తన ప్రభుత్వాన్ని పొగుడుకోవడానికి తన పాలనను కీర్తించుకోవడానికి ఆ సర్వేను ముఖ్యమంత్రి వాడుకున్నారు. తాము అనుసరిస్తున్న విధానాల పట్ల రాష్ట్ర ప్రజలలో సంతృప్తి వ్యక్తమౌతోందని చెప్పుకునేందుకు ఈ విలేకరుల సమావేశాన్ని ఉపయోగించుకున్నారు. నెల రోజుల క్రితం ప్రారంభించిన ఈ సర్వే ముగియలేదని, ఇంకా మరిన్ని వివరాలు సేకరించాల్సి ఉందని ముఖ్యమంత్రే చెప్పారు. అయినా ఇపుడు ఆ సర్వే వివరాలను ఎందుకు వెల్లడించాల్సి వచ్చింది? ఎందుకు నంద్యాల ఎన్నికల పోలింగ్ ముందు రోజు ఆ సర్వే వివరాలను వెల్లడించడానికి ఎంచుకున్నారు? అందులో పెద్దగా అర్థం కాకపోవడానికి ఏమీ లేదు. ఆ మిషతో నంద్యాల ఓటర్లను ఎంతోకొంత ప్రభావితం చేయవచ్చన్న కుట్ర ఇందులో దాగి ఉందని విమర్శకులంటున్నారు. ప్రభుత్వం బాగా పనిచేస్తోందన్న భావన ప్రజలలో కలిగించడానికే ఈ విలేకరుల సమావేశం ఉద్దేశించినట్లు స్పష్టంగా అర్థమవుతూనే ఉందని వారు పేర్కొంటున్నారు. కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి విలేకరుల సమావేశాన్ని చానళ్లు కూడా ప్రసారం చేయకూడదన్న ఆంక్షలున్నాయి. కానీ ముఖ్యమంత్రి అనుకూల చానళ్లు ఆ సంగతిని పట్టించుకున్నట్లు లేదు.

ఓటర్లను ప్రభావితం చేసే కుయుక్తులు..

తాము ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజలతో చర్చించి ప్రజల ఆమోదం తీసుకున్న తర్వాతనే అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. నంద్యాలలో రోడ్ల విస్తరణ పనుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. బాధితులతో అస్సలు మాట్లాడలేదని, మాట్లాడి ఉంటే గజం రూ.1.10లక్షలున్న చోట గజం రూ.18వేల పరిహారానికి ఒప్పుకునేవారం కామని నంద్యాల ప్రజలందరికీ తెలుసు. విశాఖలో 47,315మందికి కొత్తగా ఇళ్లజాగాలిచ్చామని ముఖ్యమంత్రి చెప్పుకున్నారు. అది నిజమో కాదో.. అర్హులెందరో.. ఆ పేరుతో పచ్చచొక్కాలు కాజేసినవెన్నో తర్వాత సంగతి.. ముందు నంద్యాల ఓటర్లను ప్రభావితం చేయాలన్న దుగ్ధ ఇందులో కనిపిస్తోందని విమర్శకులంటున్నారు.

అన్నీ అవాస్తవాలా..?

పరిపాలన బ్రహ్మాండంగా సాగుతోందని, అధికారులలో అత్యధికులు సంతృప్తిగా ఉన్నారని ముఖ్యమంత్రి చెప్పుకున్నారు. మూడున్నరేళ్లలో అవినీతి ఆకాశమెత్తుకు పెరిగిపోయిందని, 3.75 లక్షల కోట్ల రూపాయలమేర అవినీతి జరిగిందని సాక్ష్యాలతో సహా ప్రతిపక్షాలు విమర్శిస్తున్నా తన ప్రభుత్వం బాగా పనిచేస్తోందని, బాగా పాలన సాగిస్తున్నామని ప్రచారం చేసుకునేందుకు ముఖ్యమంత్రి ఈ సొంత సర్వేను ఉపయోగించుకున్నారు. ఇసుక విధానం గురించి చెబుతూ సమస్య అంతా ప్రజల వల్లే వస్తోందని చెప్పే ప్రయత్నం చేశారు. కూలీలు రేట్లు పెంచేస్తున్నారని, రవాణాకు ఉపయోగించే లారీలు, ట్రాక్టర్ల రేట్లు పెంచేస్తున్నారని వాపోయారు. అంతేకానీ రీచ్‌లన్నీ తెలుగుదేశం నాయకులు ఆక్రమించేసుకుని దందా సాగిస్తున్నారన్న విషయాన్ని ఆయన దాచేశారు. కూలీల రేట్లు, రవాణా చార్జీల పెంపు వల్ల రీచ్‌లలో దందాలు సాగిస్తున్న తమ్ముళ్లు బాధపడుతున్నారనేగానీ ప్రజలకు ఈ ఉచిత ఇసుక విధానం వల్ల నష్టం జరుగుతోందన్న బాధ ఆయనకు ఏ కోశానా కనిపించలేదు. బెల్టుషాపులను అరికట్టామని, పరిమితంగా వ్యాపారం చేసుకునేందుకు మాత్రమే అనుమతిస్తున్నాం తప్ప విచ్చలవిడిగా లేవని ముఖ్యమంత్రి చెప్పారు. కానీ ఎక్సైజ్ అధికారులకు నెలవారీ టార్గెట్లు ఇస్తున్న విషయాన్ని గానీ, తమ్ముళ్లు నడుపుతున్న మద్యం షాపుల జోలికి, బెల్టుషాపుల జోలికి వెళ్లనీయకుండా అధికారులను అడ్డుకుంటున్న విషయాన్ని గానీ ఆయన బైటపెట్టలేదు. ఇవాళ మంచినీళ్లు దొరకని ఊళ్లు ఉన్నాయి గానీ మద్యం దొరకని, బెల్టుషాపులు లేని ఊళ్లు లేవంటే అతిశయోక్తి కాదని అందరూ అంగీకరిస్తారు. కానీ ప్రజల కళ్లకు గంతలు కట్టేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నించారు. అరకొరగా అదీ తెలుగుతమ్ముళ్లకు మాత్రమే అమలవుతున్న కొన్ని పథకాల గురించి ఘనంగా వివరించే ప్రయత్నం చేయడం చూసి జనం విస్తుపోతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా కరెంటు సమస్యలేదని, తాగునీటి సమస్యలేదని, రోడ్లపై ఎక్కడా గుంతలు లేవని, వీధిలైట్లన్నీ వెలుగుతున్నాయని, ఇదంతా తాము సాధించిన ఘనత అని ముఖ్యమంత్రి చేస్తున్న ప్రచారం చూసి జనం ఆశ్చర్యపోతున్నారు.

జైల్లో శశికళకు లగ్జరీ బెడ్, ఎల్సీడీ టీవీలు!

సాక్షి, బెంగళూరు: బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలులో శిక్ష అనుభవిస్తున్న ఏఐఏడీఎంకె ప్రధాన కార్యదర్శి శశికళకు జైల్లో రాకపోకలకు అక్రమంగా ప్రత్యేక కారిడార్‌ను ఏర్పాటు చేశారని జైళ్ల మాజీ డీఐజీ రూప ఏసీబీకి చేసిన ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. జైలులో ఇరువైపులా ఉన్న కారిడార్‌లలో సంచారాన్ని పూర్తిగా నిషేధించారు. అయితే శశికళ మాత్రం కారిడార్‌ను సొంత అవసరాలకు వాడుకున్నారని చెప్పారు. ఈ కారిడార్‌లో ఆమె తన వంట పాత్రలు, స్టవ్, ఫ్యాన్, టేబుల్ వంటి వాటిని ఉంచినట్లు వెల్లడించారు. అంతేకాక జైలు గదిలో శశికళకు లగ్జరీ బెడ్, ఎల్‌సీడీ టీవీలను నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేశారని రూప చెప్పారు. ఇందుకు సాక్ష్యాలు కావాలనుకుంటే జైలులోని 6, 7 నంబర్‌ల సీసీ టీవీ కెమెరాల చిత్రాలను పరిశీలించవచ్చని పేర్కొన్నారు. న్యాయస్థానం అనుమతి లేకుండా ఖైదీలకు ఇలాంటి వసతులను ఏర్పాటు చేయడం చట్ట వ్యతిరేకం, కోర్టు ధిక్కరణ అవుతాయని రూప స్పష్టం చేశారు.

'సదావర్తి'పై దేవాదాయ శాఖ అధికారుల భేటీ

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా అమరావతిలోని సదావర్తి సత్రానికి చెన్నై నగర సమీపంలో ఉన్న 82.11 ఎకరాల భూముల అమ్మకానికి తిరిగి బహిరంగ వేలం నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆ శాఖ కమిషనర్ కె.అనూరాధ అధ్యక్షతన మధ్యాహ్నం ప్రారంభమైన ఈ సమావేశం రాత్రి పొద్దు పోయే వరకు కొనసాగింది. సదావర్తి సత్రం వ్యవస్థాపక కుటుంబీకుల తరపున సత్రం చైర్మన్‌గా కొనసాగుతున్న వాసిరెడ్డి సుధా స్వరూప్‌ను కూడా సమావేశానికి అధికారులు ఆహ్వానించారు. భూముల వేలం నిర్వహణ తేదీల ఖరారుపై చర్చించినట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. వేలం నిర్వహణకు శాఖలోని అధికారులతో ప్రత్యేకంగా ఒక కమిటీని నియమించాలని సమావేశంలో నిర్ణయించారు.

'బ్రాండెడ్' వలయంలో

రోగులు విలవిల

- జనరిక్ మందులు రాయని వైద్యులు
- 90 శాతం మంది డాక్టర్ల సిఫారసు బ్రాండెడ్ మందులకే
- ఆర్థికంగా చితికిపోతోన్న పేద రోగులు
- జనరిక్ మందులే రాయాలని ఎంసీఐ స్పష్టమైన ఆదేశాలు
- బ్రాండెడ్ మందులతో భారీగా నష్టపోతున్న క్యాన్సర్ పేషెంట్లు
- జనరిక్, బ్రాండెడ్ మందుల ధరల్లో భారీ వ్యత్యాసం

సాక్షి, అమరావతి

కుటుంబంలో ఎవరైనా వ్యాధికి గురైతే ఇంటిల్లిపాది బాధపడతారు. దీంతోపాటు వ్యాధి తగ్గడానికి పెట్టే ఖర్చు వారిని అప్పులపాలు చేసి ఆర్థికంగా చితికిపోయేలా చేస్తుంది. క్యాన్సర్‌లాంటి ప్రాణాంతక జబ్బులైతే చెప్పాల్సిన పనిలేదు. వైద్యానికి పెట్టే ఖర్చుల్లో అధిక భాగం మందులకే. కొన్ని మందులను కోర్సులా.. అంటే నెలలపాటు వాడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆయా మందులకు పెట్టే ఖర్చు తడిసిమోపెడవుతోంది. జనరిక్ మందులే రాయాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) 2013లోనే ఆదేశాలిచ్చినప్పటికీ వైద్యులు మాత్రం మొగ్గు చూపడం లేదు. మెడిసిన్ తయారీ కంపెనీలు ఇచ్చే కమీషన్లకు ఆశపడి ఖరీదైన బ్రాండెడ్ మందులకే పెద్ద పీట వేస్తున్నారు. దీంతో పేద రోగుల జేబుకు భారీ స్థాయిలో చిల్లుపడుతోంది.

ఓ వైపు మన దేశం నుంచి ఏడాదికి రూ.లక్ష కోట్ల విలువైన జనరిక్ మందులు పాశ్చాత్య దేశాలకు ఎగుమతి అవుతుంటే మన తెలుగు రాష్ట్రాల్లో మాత్రం డాక్టర్లు జనరిక్ మందులు రాసేందుకు ససేమిరా అంటున్నారు. భారతీయ వైద్య మండలి (ఎంసీఐ) 2013లో ఇచ్చిన ఆదేశాల ప్రకారం.. ప్రతి వైద్యుడూ జనరిక్ మందులే రాయాలి. అందులోనూ ఆ అక్షరాలను అందరికీ అర్థమయ్యే రీతిలో కేపిటల్ లెటర్స్‌లో ఇంగ్లిష్‌లో రాయాలి. స్వయానా ప్రధాని నరేంద్ర మోదీ కూడా భారతదేశంలో పేదలందరికీ అందుబాటులో ఉండే జనరిక్ మందులను డాక్టర్లు ప్రోత్సహించాలని సూచించారు. కానీ ఇవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. కార్పొరేట్ ఆస్పత్రుల్లో 90 శాతం మంది డాక్టర్లు బ్రాండెడ్ మందులనే రాస్తున్నారు. ఈ మందుల




చీటీ తీసుకుని మెడికల్ షాపులకు వెళ్తే.. పేద రోగికి గూబ గుయ్‌మంటోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కోట్లాది మంది బ్రాండెడ్ మందుల కోసం ఏటా రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్టు అంచనా.

సగటున 3 లక్షల మంది ఔట్‌పేషెంట్లుగా

సగటున రోజూ వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు ఔట్‌పేషెంట్లుగా వెళ్తున్న వారి సంఖ్య 3 లక్షల మందిపైనే ఉన్నట్టు అంచనా. ఇందులో 1.20 లక్షల మంది ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్తుంటే, 1.80 లక్షల మంది ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నవారే. వీరిలో ప్రతి ఒక్కరూ బ్రాండెడ్ మందుల పేరుతో సగటున కనీసం రూ.200 ఖర్చు చేస్తున్నారు. అదే జనరిక్ మందులైతే కేవలం రూ.50 లోపే వస్తాయి. పనితీరు పరంగా బ్రాండెడ్‌కు, జనరిక్‌కూ పెద్దగా తేడా ఏమీ ఉండదు. అవే డ్రగ్ కాంబినేషన్‌లు, బల్క్ డ్రగ్స్ ఉంటాయి. జనరిక్ మందులనూ పెద్ద కంపెనీలే తయారుచేస్తున్నాయి. కానీ కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యులు బ్రాండెడ్ మందులు బాగా పనిచేస్తాయని, జనరిక్ అంతగా పనిచేయవనే అపోహ కలిగించి రోగులను తికమకకు గురిచేస్తున్నారు. దీంతోపాటు జనరిక్ మందులపై సాధారణ ప్రజలకు, రోగులకు అవగాహన తక్కువగా ఉండటం వీరికి కలిసొస్తోంది.

భారీగా నష్టపోతున్న క్యాన్సర్ రోగులు

తెలుగు రాష్ట్రాల్లో బ్రాండెడ్ మందుల కారణంగా ఎక్కువ మంది నష్టపోతోంది క్యాన్సర్ బాధితులే. ఈ వ్యాధికి వాడే బ్రాండెడ్, జనరిక్ మందుల ధరల్లో హస్తిమశకాంతరం తేడా ఉంటోంది. కొన్ని మందుల్లో రెండిటి మధ్య 200 శాతం తేడా ఉంది. కొన్ని రకాల క్యాన్సర్ నిరోధక ఇంజక్షన్లు బ్రాండెడ్‌లో రూ.80 వేలు ఉంటే అదే జనరిక్‌లో రూ.8 వేలకే లభిస్తున్నాయి. దీన్నిబట్టి రెండిటి ధరల్లో ఎంత తేడా ఉందో ఊహించుకోవచ్చు. అంతేకాకుండా శస్త్రచికిత్స తర్వాత వాడే చాలా రకాల మందుల ధరల్లో వ్యత్యాసం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. యాంటీబయోటిక్స్ మందుల ధరల్లోనూ జనరిక్–బ్రాండెడ్ మధ్య నక్కకూ నాక లోకానికీ ఉన్నంత తేడా ఉంటోంది.



పేర్లే కాదు కాంబినేషన్‌లూ రాయాలి



చాలా రకాల మందులు రాసేటప్పుడు మాత్రల కంపెనీలను రాయడమే కాదు వాటి కాంబినేషన్ డ్రగ్స్ కూడా రాయాలి. చాలామంది డాక్టర్లు అలా రాయడం లేదు. జనరిక్ మందులు నాసిరకమైనవని, బ్రాండెడ్ మందులు మంచివని సాధారణ జనంలో అపోహ ఉంది. జనరిక్ మందుల్లో డ్రగ్ కాంబినేషన్స్‌పైనా అపోహ ఉంది. వీటన్నిటినీ తొలగించాల్సి ఉంది. కొన్ని పెద్ద పెద్ద కంపెనీలే జనరిక్ మందులు తయారు చేసి బ్రాండెడ్ రేట్లకు అమ్ముతున్న ఘటనలూ ఉన్నాయి. ఇలాంటివాటిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. పేదలకు మేలు జరగాలంటే జనరిక్ మందులు రాయాల్సిందే.

– డా.ప్రభుకుమార్, జనరల్ ఫిజీషియన్

జనరిక్ మందులూ ఎక్కువకు అమ్ముతున్నారు



కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో జనరిక్ మందులను కూడా ఎంఆర్‌పీ రేటుకు అమ్ముతున్నారు. దీనివల్ల క్యాన్సర్ రోగులు తీవ్రంగా నష్టపోతున్నారు. మా ఆస్పత్రులకు వచ్చే వాళ్లు కొనుగోలు చేసే సామర్థ్యం ఉన్నవాళ్లు కాబట్టి బ్రాండెడ్ మందులే వాడుతున్నాం అని డాక్టర్లు చెబుతున్నారు. అయితే పేద రోగులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ఉంది.

– డా.శ్రీనివాసన్, క్యాన్సర్ వైద్య నిపుణులు, నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రి

జనరిక్ బ్రాండెడ్ మధ్య తేడా ఏంటి?

బ్రాండెడ్ అంటే...ఓ కంపెనీ కొత్త మందును కనుక్కుని దానికి క్లినికల్ ట్రయల్స్ జరిపి, దాన్ని మార్కెట్లోకి తీసుకొచ్చేందుకు తమ కంపెనీ పేరు మీద బ్రాండెడ్ మెడిసిన్‌గా ముద్ర వేసుకుంటుంది. ఈ మందుపై ఆ కంపెనీ 10 ఏళ్లు పేటెంట్ (హక్కు) కలిగి ఉంటుంది.

పదేళ్ల తర్వాత ఈ మందును ఎవరైనా తయారు చేసుకోవచ్చు. వీటిని జనరిక్ మందులు అంటారు. క్లినికల్ ట్రయల్స్, బ్రాండ్ ఇమేజ్ అవసరం లేదు కాబట్టి తయారీ వ్యయం తక్కువగా ఉంటుంది. అదే డ్రగ్ కాంబినేషన్ ఉంటుంది. తయారీలోనూ తేడా ఉండదు. ధర బ్రాండెడ్‌తో పోల్చితే చాలా తక్కువగా ఉంటుంది.

కొన్ని క్యాన్సర్ కారక మందుల్లో తేడా ఇలా..

మందు	మోతాదు	బ్రాండెడ్ రేటు	జనరిక్ రేటు
డోసిటాక్సిల్	120 ఎంఎల్	రూ.80 వేలు	రూ.8 వేలు
టాక్సిటోసిల్	300 ఎంజీ	రూ.20 వేలు	రూ.6 వేల లోపు
ఎర్లోటినిబ్	30 మాత్రలు	రూ.1,00,000	రూ.15,000
పాపిసిటాబిన్	60 మాత్రలు	రూ.12,000	రూ.3,500

రాష్ట్రంలో 2016లో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నమోదైన రోగుల వివరాలు

- ఔట్‌పేషెంట్లు 2.13 కోట్లు
- ఇన్‌పేషెంట్లు 13.60 లక్షలు
- మేజర్ సర్జరీలు 3.77 లక్షలు
- మైనర్ సర్జరీలు 2.14 లక్షలు

కల్లోల కడలి



సూర్య గ్రహణం, అమావాస్య కలిసి రావడంతోపాటు బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం తీరప్రాంతంలోని సముద్రం మంగళవారం అల్లకల్లోలంగా మారింది. 10 మీటర్ల మేర ఎత్తున ఎగసిపడుతున్న కెరటాలు బీచ్‌రోడ్డును ధ్వంసం చేస్తుండగా.. తీర ప్రాంతం కోతకు గురవుతోంది. ఉప్పాడకు రక్షణగా వేసిన జియోట్యూబ్ రక్షణ గోడను సైతం దాటుకుని సముద్రం ఉప్పొంగడంతో ఉప్పాడ శివారు పల్లిపేట తదితర ప్రాంతాల్లోకి సముద్రపు నీరు చొచ్చుకు వస్తోంది. దీంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. సముద్ర కెరటాల ఉధృతికి బీచ్‌రోడ్డు సుమారు 3 కి.మీ మేర కోతకు గురైంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉండడంతో తీర ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు.

– పిఠాపురం

స్తంభించిన బ్యాంకింగ్ రంగం

ఒకరోజు సమ్మె ఎఫెక్ట్

- రెండు రాష్ట్రాల్లోని 8,500 శాఖల్లో నిలిచిపోయిన సేవలు
- రూ.35,000 కోట్ల క్లియరెన్స్‌లకు బ్రేక్
- అక్టోబర్‌లో రెండు రోజుల సమ్మెపై నేడు నిర్ణయం

సాక్షి, అమరావతి: బ్యాంకుల ప్రైవేటీకరణ, కార్పొరేట్ మొండి బకాయిలపై ప్రభుత్వ ఉదాసీనతకు వ్యతిరేకంగా ప్రభుత్వ బ్యాంకుల ఉద్యోగులు మంగళవారం నిర్వహించిన ఒకరోజు సమ్మె విజయవంతమైంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 8,500 బ్యాంకు శాఖల్లో లావాదేవీలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో తెలంగాణలో సుమారు రూ.25,000 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో రూ.10,000 కోట్ల లావాదేవీలపై సమ్మె ప్రభావం చూపినట్లు బ్యాంకుల ఉద్యోగ



సంఘాలు పేర్కొన్నాయి. రెండు రాష్ట్రాలకు చెందిన 65,000 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నట్లు ఆలిండియా ఆంధ్రాబ్యాంక్ ఆఫీసర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.హరినాథ్ తెలిపారు. ఏపీ నుంచి 30,000 మంది ఉద్యోగులు, తెలంగాణ నుంచి 35,000 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈసారి ప్రభుత్వ బ్యాంకులతోపాటు కోటక్ మహీంద్రా, ఐడీబీఐ బ్యాంకులు కూడా సమ్మెలో పాల్గొన్నాయన్నారు. హైదరాబాద్‌లోని బ్యాంకుల ప్రధాన కార్యాలయాల వద్ద ఉద్యోగులు పెద్దఎత్తున ధర్నా చేశారు. విజయవాడలో జరిగిన ధర్నా కార్యాక్రమానికి వామపక్ష సంఘాల నేతలు మద్దతు ప్రకటించాయి. కృష్ణాజిల్లా వ్యాప్తంగా 250 బ్యాంకులు మూతబడ్డాయి. నెల్లూరులో భారీ ర్యాలీ నిర్వహించగా, తిరుపతిలో రహదారులను దిగ్బంధం చేశారు. శ్రీకాకుళం జిల్లాలో మానవహారంతో ఉద్యోగులు తమ నిరసనను తెలియచేశారు.

ప్రభుత్వం దిగిరాకపోతే...

బ్యాంకుల పరిరక్షణ కోసం చేసిన నిరసన కార్యక్రమం పెద్దఎత్తున విజయవంతం కావడంపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికీ దిగిరాకపోతే అక్టోబర్‌లో మరో రెండ్రోజులు సమ్మె చేయనున్నామని, అయినా ప్రభుత్వం స్పందించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని ఏపీ, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కొండలరావు హెచ్చరించారు. భవిష్యత్తు కార్యాచరణపై బుధవారం ముంబైలో జరిగే ఆలిండియా ఫెడరేషన్ సమావేశంలో ఒక నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు.

ఉద్దానం సమస్యకు హోమియో యాక్షన్ ప్లాన్

- ప్రముఖ హోమియోపతి డాక్టర్ కొంగర రమేశ్ వెల్లడి
- రోగులకు నేడు హెవీమెటల్ టెస్టులు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వారికి హోమియోపతి వైద్యం ద్వారా నయం చేయటానికి కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) రూపొందించినట్టు ప్రముఖ హోమియోపతి డాక్టర్ కొంగర రమేశ్ తెలిపారు. ఆయన మంగళవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. కిడ్నీ సమస్యల్ని హోమియోపతిద్వారా నయం చేయవచ్చన్నారు. గత రెండేళ్లలో సుమారు 80 మంది మొదటి, రెండోదశ కిడ్నీ రోగులకు సాంత్వన చేకూర్చామని, 30 మంది డయాలసిస్ రోగులకూ వ్యాధిని నియంత్రించామని తెలిపారు. ఎక్కువమంది శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాలనుంచి కిడ్నీ సమస్యలతో తమ వద్దకొచ్చారని చెప్పారు. ఉద్దానంలో కిడ్నీ సమస్యకు కారణాలు తెలుసుకునేందుకు బుధవారం అక్కడ వందమందికి హెవీమెటల్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. వీటి నివేదికల ఆధారంగా ఏ మందులు వాడితే ప్రయోజనం ఉంటుందనే దానిపై ప్రముఖ హోమియోపతి వైద్యులందరితో సమావేశం నిర్వహిస్తామన్నారు. కిడ్నీ సమస్యలు రావటానికి 30 రకాల కారణాలున్నట్లు పరిశోధనలో తేలిందని, అందులో ముఖ్యమైనది ఈ–కోలి బ్యాక్టీరియా అన్నారు. దీన్ని తొలగించే మందు హోమియోపతిలో ఉందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న హోమియోపతి వైద్యుడు రమేశ్

దళిత ద్రోహి చంద్రబాబు

- నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో బుద్ధి చెప్పండి
- ప్రజలకు రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు చంగయ్య పిలుపు



కాకినాడ: చంద్రబాబు పాలనలో దళితులు అన్ని విధాలా వేధింపులకు గురవుతున్నారని రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు కల్లూరి చంగయ్య అన్నారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితుల సంక్షేమానికి పాటుపడాల్సిన ముఖ్యమంత్రి దళిత ద్రోహిగా మారారని ధ్వజమెత్తారు. ప్రతి దళిత కుటుంబానికి రెండెకరాల భూమి ఇస్తానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు ఆ హామీని నెరవేర్చకపోగా ఉన్న భూములను కూడా పరిశ్రమల పేరిట దోచుకుంటున్నారని ఆరోపించారు. లక్షా 50 వేల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి దగా చేశారని మండిపడ్డారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తామని చేసిన ప్రకటన ఏమైందని చంద్రబాబుని నిలదీశారు. ఇలాంటి పాలకులకు నంద్యాల ఉప ఎన్నిక, కాకినాడ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్సీ నాయకులు జాన్‌మోజేష్ అబ్బయ్య పాల్గొన్నారు.

నేడు పోస్టల్ ఉద్యోగుల సమ్మె

సాక్షి ప్రతినిధి, తిరుపతి: అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం తపాలా ఉద్యోగులు ఒక రోజు సమ్మె నిర్వహించనున్నారు. ఇందుకోసం నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపునిచ్చింది. దీంతో రాష్ట్రంలోని అన్ని ప్రధాన, ఉప తపాలా కార్యాలయాల్లో పనిచేసే గ్రూప్–డీ, జీడీఎస్ ఉద్యోగులు విధులను బహిష్కరించనున్నారు. పోస్టల్, సార్టింగ్ అసిస్టెంట్స్, పోస్ట్‌మెన్, ఎంటీఎస్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, సివిల్ సర్వెంట్ స్టేటస్‌తో సహా కమలేష్ చంద్ర జీడీఎస్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలన్న 10 డిమాండ్లతో ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారు. విశాఖ, కర్నూలు, విజయవాడ రీజియన్లలోని 45 డివిజన్లలో 6 వేల మంది ఉద్యోగులు గురువారం విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొననున్నారు.

రూ.20 లక్షల విలువైన నల్లమందు పట్టివేత

పాడేరు రూరల్: విశాఖ మన్యంలో నిషేధిత గంజాయి సాగు, నల్లమందు, సారా తయారీ వంటివి హెచ్చుమీరుతున్నాయి. పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది రాలేని మారుమూల గిరిజన గ్రామాలనే స్థావరాలుగా ఎంచుకుంటున్న ముఠాలు, స్మగ్లర్లు వీటిని ప్రోత్సహిస్తున్నారు. తాజాగా అత్యంత విలువైన నల్ల మందును తరలిస్తూ ముగ్గురు యువకులు పట్టుబడ్డారు. ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ బాబ్జీరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతపల్లి మండలం కిన్నెర్ల గ్రామానికి చెందిన పాంగి బాలకృష్ణ, కొర్రా సోమరాజు, శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన రాజయ్య అనే ముగ్గురు యువకులు కాలినడకన మూటల్లో నల్లమందును తరలిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం తెల్లవారుజామున జి.మాడుగుల మండలం కొత్తపల్లి జంక్షన్ వద్ద కాపుకాసి వీరిని పట్టుకున్నారు. మూడు మూటల్లో ఉన్న 20 కిలోల నల్లమందును స్వాధీనం చేసుకుని వారిని అరెస్ట్‌చేశారు. పట్టుబడిన నల్లమందు విలువ రూ.20 లక్షలు ఉంటుందని బాబ్జీరావు చెప్పారు. తాము పట్టుకున్నది నల్లమందా? లేదా గంజాయితో తయారుచేసిన మరే ఇతర సరుకా.. అనేది తెలియాల్సి ఉందని, నిర్ధారణకోసం ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు. దాడుల్లో ఏఈఎస్ చిట్టిబాబు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు పాల్గొన్నారు.

ఐదో రోజుకు మురుగన్ దీక్ష

- వైద్య నిపుణుల కౌన్సెలింగ్
- నిర్ణయం మార్చుకోనని స్పష్టీకరణ

వేలూరు (తమిళనాడు): మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్య కేసులో వేలూరు సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న మురుగన్ చేపట్టిన దీక్ష ఐదో రోజుకు చేరింది. 26 ఏళ్ల పాటు జైలు శిక్ష అనుభవిస్తున్న మురుగన్ జీవితంపై విరక్తి చెంది జీవ సమాధి అయ్యేందుకు నిర్ణయించుకుని ఈనెల 18వ తేదీ నుంచి జైలులో దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. మంగళవారం కూడా మురుగన్ ఆహారం తీసుకోకుండా నీళ్లు మాత్రమే తాగి ధ్యానంలో ఉన్నాడు. అతడి ఆరోగ్యం క్షీణించకుండా జైలులోని వైద్యులు పరీక్షలు చేస్తున్నారు. సోమవారం రాత్రి మురుగన్‌కు ప్రభుత్వ ఆస్పత్రి సైక్రియాటిస్ట్‌తో కౌన్సెలింగ్ ఇప్పించారు. అయినా తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని, దీక్ష కొనసాగిస్తానని మురుగన్ చెప్పినట్టు జైలు అధికారులు తెలిపారు.

సాక్షి
బుధవారం, ఆగస్టు, 23

ఈ చెలిమి గెలుస్తుందా?

తమిళనాట ఆర్నెల్లనాడు మొదలై ఎడతెగకుండా సాగుతున్న అసంబద్ధ రాజకీయ నాటకానికి ఎట్టకేలకు తెరపడింది. అన్నా డీఎంకేకు చెందిన ముఖ్యమంత్రి పళనిస్వామి, మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం వర్గాలు రెండూ సోమవారం విలీనమయ్యాయి. పార్టీ పగ్గాలను పన్నీర్‌సెల్వం, ప్రభుత్వ సారథ్యాన్ని పళనిస్వామి చేపట్టాలని ఇరుపక్షాలూ ఒప్పందానికొచ్చాయి. పన్నీర్‌సెల్వానికి పార్టీ పగ్గాలు మాత్రమే కాదు... అదనంగా ఉప ముఖ్యమంత్రి పదవి దక్కింది. ఆయనకు కీలకమైన ఆర్థిక శాఖతోపాటు గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి, ప్లానింగ్, శాసనసభా వ్యవహారాలు వంటి అరడజనుకు పైగా శాఖలు కేటాయించారు. అన్నా డీఎంకే అధినేత జయలలిత మరణించాక ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన పన్నీర్ సెల్వం రెండు నెలల తర్వాత అనూహ్య పరిస్థితుల్లో ఫిబ్రవరిలో ఆ పదవిని వదులుకుని తానే స్వయంగా శశికళను ప్రతిపాదించి ఆమె ఏకగ్రీవ ఎన్నికకు దోహదపడ్డారు. మరికొన్ని రోజులకే తిరుగుబాటు చేశారు. అమ్మ జయలలిత ఆత్మ ఆదేశించడం పర్యవసానంగానే ఇదంతా చేస్తున్నానని ప్రకటించి కలకలం సృష్టించారు. మళ్లీ ఆ పదవిని పొందడానికి అన్ని ప్రయత్నాలూ చేశారు. ఈలోగా శశికళ జైలుపాలు కావడంతో ఆమె వర్గం తరపున పళనిస్వామి తెరపైకి వచ్చారు. తన శిబిరంలోని ఎమ్మెల్యేలను చెదరగొట్టడానికీ, బలహీనపర్చడానికీ ఎవరెన్ని ఎత్తుగడలు పన్నినా పళనిస్వామి నిబ్బరంగా ఎదుర్కొని చివరకు విశ్వాస పరీక్షలో విజయం సాధించారు. ఇంతవరకూ జరిగిన పరిణామాలు అందరికీ అర్థమయ్యాయి. అధికార కుమ్ములాటలుండే ఏ రాష్ట్రంలోనైనా ఇలాంటి ఎత్తులు, పైయెత్తులు సర్వసాధారణమే. కానీ ఆ తర్వాతే చిత్రవిచిత్రాలు చోటుచేసుకున్నాయి.

తమిళనాడు రాజకీయాలు విలక్షణమైనవి. సినీ ప్రముఖులు రాజకీయ రంగ ప్రవేశం చేయడం... ఆ వీరాభిమానం రాజకీయ రంగానికి కూడా బదిలీ కావడం అక్కడ కనబడే ధోరణి. రాష్ట్రంలో మొదటినుంచీ ద్రవిడ ఉద్యమం బలంగా ఉండటం వల్ల ఈ ధోరణికి మరింత ఊపు వచ్చింది. జయలలిత మరణానంతరం చోటు చేసుకుంటున్న పరిణామాలు మాత్రం ఈ విలక్షణతకు కూడా భిన్నమైనవి. నిన్నమొన్నటి వరకూ పన్నీర్, పళని వర్గాలు కత్తులు నూరుకున్నాయి. అవినీతి పరురాలైన శశికళ మార్గదర్శకత్వంలో పనిచేస్తున్నారని పళనిపై పన్నీర్ నిప్పులు చెరిగితే...అందుకు దీటుగా ఆ వర్గం స్పందించింది. అమ్మ వారసులం మేమేనంటూ ఇరు పక్షాలూ వీధికెక్కాయి. అయితే ఉన్నట్టుండి అవి రెండూ స్వరం తగ్గించాయి. అమ్మ కలలు నెరవేర్చడం కోసం కలిసి పనిచేస్తామని సంకేతాలివ్వడం ప్రారంభించాయి. ఫిబ్రవరిలో జరిగిన విశ్వాస పరీక్షలో కేవలం 11 ఓట్లు మాత్రమే సంపాదించిన పన్నీర్ సెల్వాన్ని 122మంది ఎమ్మెల్యేల బలం ఉన్న సీఎం పళనిస్వామి కలిసుందాం... రమ్మని అభ్యర్థించడం, ఆయన షరతులు విధిస్తూ పోవడం, మొదట బెట్టు చేసినట్టు కనబడిన పళని ఒక్కో మెట్టే దిగుతూ దాదాపుగా అన్ని డిమాండ్లకూ అంగీకారం తెలపడం ఎవరికైనా ఆశ్చర్యం కలిగిస్తుంది. శశికళ జైలుపాలయ్యాక తన బంధువు టీటీవీ దినకరన్‌ను విశ్వాసపాత్రునిగా ఎంచుకుని ఆయనకు పార్టీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ పదవి కట్టబెట్టారు. అది పళనికి ఆగ్రహం కలిగించి ఉండొచ్చుగానీ... అందుకు బలహీనుడిగా మిగిలిన పన్నీర్ సెల్వంతో చేతులు కలపడం వల్ల ఆయనకు ఒరిగేదేమీ ఉండదు. దినకరన్ శిబిరంలో 28మంది ఎమ్మెల్యేలున్నారు. ప్రతిపక్ష డీఎంకే సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే, వారికి దినకరన్ వర్గం మద్దతుగా నిలిస్తే ప్రభుత్వం కుప్పకూలుతుంది. అయినా ఆయన పన్నీర్‌ను ప్రాధేయపడ్డారు తప్ప దినకరన్‌తో ఏదో రకమైన సర్దుబాటుకు సిద్ధపడదామనుకోలేదు. ఏమైతేనేం ఇప్పుడు పళని, పన్నీరు వర్గాలు కలిసిపోయాయి. పన్నీర్‌సెల్వం డిమాండు మేరకు జయలలిత మరణంపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించబోతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. శశికళను పార్టీ నుంచి బహిష్కరించాలన్న మరో కీలక డిమాండు మాత్రం పెండింగ్‌లో పడింది. అందుకు పార్టీ జనరల్ కౌన్సిల్ సమావేశం తప్పనిసరని చెబుతున్నారు. ఆ ప్రక్రియ సజావుగా పూర్తి కావడం పళనిస్వామికి పెద్ద సవాలే.

తమిళనాట జరుగుతున్న పరిణామాల్లో తమ ప్రమేయం లేదని బీజేపీ నాయకత్వం చెబుతోంది. అయితే అలాంటి బలమైన శక్తేదో లేకుండానే ఆ రాష్ట్రంలో ఈ మాదిరి పరిణామాలు చోటుచేసుకుంటాయంటే ఎవరూ నమ్మజాలరు. నిజానికి కొన్ని రోజుల క్రితం బిహార్‌లో జరిగిన పరిణామాలు కూడా ఆశ్చర్యకరమైనవే. అక్కడ అధికార పక్షమైన జేడీ(యూ)...తన కూటమిలోని భాగస్వామి ఆర్జేడీని బయటకు నెట్టి కొత్త భాగస్వామి బీజేపీని తెచ్చుకుంది. తమిళనాడులో ఇప్పుడు ఏర్పడ్డ కొత్త చెలిమి పర్యవసానంగా అంతా సర్దుకుంటుందని, ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుందని భావించడానికి లేదు. పన్నీర్ సెల్వం మొన్న ఫిబ్రవరిలో అమ్మ పేరు చెప్పి ప్రత్యర్థి వర్గంపై విరుచుకుపడినప్పుడు ఆయనకు మద్దతుగా నిలిచిన కమల్‌హాసన్ తదితర సినీ నటులు ఇప్పుడు తాజా విలీనాన్ని హేళన చేస్తున్నారు. తమిళ ప్రజల నెత్తిన టోపీ పెడుతున్నారంటూ కమల్ వ్యాఖ్యానించారు. డీఎంకే పెట్టబోయే అవిశ్వాస తీర్మానం సంగతలా ఉంచి తమిళ ప్రజలు ఈ వింత పరిణామాలను ఎలా చూస్తున్నారనేది ప్రశ్న. అన్నాడీఎంకేలో గౌండర్, తీవర్ రెండూ బలమైన కులాలు. జయలలిత బలమైన నాయకురాలు గనుక ఈ రెండు కులాలకు తగినంత ప్రాధాన్యమిచ్చి పార్టీ వెనక దృఢంగా ఉండేలా చూసుకోగలిగారు. ఆ స్థాయిలో పళని, పన్నీర్‌లు పార్టీని పటిష్టంగా నడపగలరా అన్నది సందేహమే. పళనిస్వామి గౌండర్ అయితే పన్నీర్ తీవర్ కులస్తుడు. రాజకీయ సుస్థిరత లేనప్పుడు పాలన కుంటుబడుతుంది. ఫలితంగా ప్రజలు ఇబ్బంది పడతారు. తమిళనాడులో గత ఆర్నెల్ల పరిణామాలు దీన్నే రుజువు చేశాయి. ఇప్పుడు కుదిరిన సఖ్యత ఎంతవరకూ దాన్ని మెరుగుపరచగలదో చూడాలి.



ఫైకి నీతి సూత్రాలు వల్లిస్తూ స్వార్థ ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేసే పార్టీలు అటు పాలననూ మెరుగుపర్చలేవు. ఇటు విలువలనూ స్థాపించలేవు.

– కోలిన్ క్విన్
అమెరికన్ నటుడు, రచయిత

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, తిథి శు.విదియ రా.9.57 వరకు, తదుపరి తదియ నక్షత్రం పుబ్బ ప.3.54 వరకు, తదుపరి ఉత్తర, వర్జ్యం రా.11.06 నుంచి 12.44 వరకు, దుర్ముహూర్తం ప.11.37 నుంచి 12.28 వరకు అమృతఘడియలు ఉ.9.33 నుంచి 11.08 వరకు.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.16
రాహుకాలం : ప 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	4.46	మగ్రీబ్	6.37
జొహర్	12.19	ఇషా	7.51
అసర్	4.45		

బలిపీఠంపై భారత రైతాంగం

విశ్లేషణ



దేవిందర్‌శర్మ

మన దేశం ఆర్‌సీఈపీ ఒప్పందం కోసం జరుపుతున్న చర్చల్లో మనం 92 శాతం వస్తువులపై దిగుమతి సుంకాలను పూర్తిగా ఎత్తివేయడాన్ని పరిశీలిస్తున్నాం. ఈ ఒప్పందం కింద ఒకసారి దిగుమతి సుంకాలను సున్నాకు తగ్గించిన వస్తువులపై ఆ తర్వాత సుంకాలను పెంచడానికి వీల్లేదు. ఈ ఒప్పందంపై సంతకాలు చేయడానికిఅంగీకరిస్తే, దిగుమతి సుంకాలే లేని దిగుమతులు మన దేశంలో శాశ్వతంగా తిష్టవేస్తాయి. ఇది, మనకు 60 కోట్ల మంది రైతుల జీవనోపాధికి భద్రతను కల్పించే హక్కు లేకుండా చేసేస్తుంది.

వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టం రైతులకు సంబంధించి భవిష్యత్తులో ఎదుర్కొనవలసిన అతి పెద్ద ఆందోళనకరమైన సమస్య. కాగా, పుష్కలంగా పండిన పంట చేతికి వచ్చాక ధరలు పతనం కావడం వల్ల రైతులు ఎదుర్కొనవలసి వస్తున్న విపత్కర పరిస్థితి అంతకంటే పెద్ద సమస్య. ఎప్పుడు దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడబోతున్నాయో, ఆ వేడిగాలులు ఎంత ఎక్కువ కాలంపాటూ కొనసాగుతాయో, వాటిని తట్టుకోడానికి తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలు ఏవో రైతులకు తెలుసు. అంతేకాదు, చీడపీడల దాడులను ఎదుర్కొనడం ఎలాగో, అధిక వర్షాలవల్ల కలిగే పంటనష్టాన్ని తక్కువ చేసుకోవడం ఎలాగో కూడా వారికి తెలుసు. కానీ పుష్కలంగా పంటను తీశాక, ధరలు ఘోరంగా పడిపోవడాన్ని ఎదుర్కోవడం ఎంత తీవ్ర అఘాతమో మీరే ఊహించుకోండి. 'ఉత్పత్తి చెయ్యి, నాశనమై పో' అని నేను అనేది దీన్నే. రైతులు రికార్డు స్థాయి పంటలను పండించేది, ముందుగా ఊహించని ఈ వినాశనం బారిన పడి బాధపడటానికే.



ఆర్‌సీఈపీ ఒప్పంద వ్యతిరేక నిరసన (ఫైల్ ఫొటో)

ముందున్నది రైతు ఆందోళనల కాలం

రెండేళ్లు వరుసగా దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొన్న రైతులపైన ఎట్టకేలకు ఆ వాన దేవుడు అనుగ్రహం చూపాడు. సాధారణ వర్షాలను ఆశించిన రైతులు గత రెండేళ్ల నష్టాలను కొంత వరకైనా భర్తీ చేసుకోవాలనే ఆశతో కష్టించి పని చేశారు. పుష్కలంగా పంట చేతికి వస్తుందని, మంచి ధరలు లభిస్తాయని అనుకున్నారు. కానీ హఠాత్తుగా మార్కెట్‌లో ధరలు పాతాళానికి పడిపోయాయి. పప్పు, టమాటా, బంగాళదుంప, ఉల్లి, ఆవ, కూరగాయలన్నిటి ధరలు ఘోరంగా పడిపోయాయి. రైతులకు, పంటను ప్రధాన రహదార్లపై కుమ్మరించిపోవడం తప్ప గత్యంతరం లేని దుస్థితికి నెట్టింది. రైతుల ఆగ్రహం భారీ నిరసనగా బద్ధలైంది. అది మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో మొదలై చివరికి పోలీసు కాల్పుల్లో ఐదుగురు రైతులు మరణించడానికి దారితీసింది.

రైతును సాగు నుంచి గెంటేసే పెను ముప్పు

అయితే, రైతులనుంచి ప్రభుత్వం ఎదుర్కొనాల్సిన మరింత పెద్ద సమస్యకు రంగం సిద్ధమౌతోంది. రైతు సంఘాలు ఆగస్టు 9 నుంచి ఆగస్టు 15 వరకు జైల్‌భరో నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నాయి. వ్యవసాయ రుణాల మాఫీని, ఉత్పత్తి వ్యయంపై 50 శాతం లాభాన్ని ఇవ్వాలన్న స్వామినాథన్ కమిటీ సిఫారసును అమలు చేయాలని వారు కోరుతున్నారు. కానీ, ప్రస్తుతం సాగుతున్న అంతర్జాతీయ వాణిజ్య చర్చలు భారత వ్యవసాయానికి మరింత పెద్ద ముప్పును తేనున్నాయని వారికి తెలియదు. నిజానికి ఆ ఒప్పందం అమల్లోకి వచ్చినపుడు, అది భారీ సబ్సిడీలతో కూడిన వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులను ఎలాంటి పన్నులూ లేకుండా, అడ్డూ అదుపూ లేకుండా దేశంలోకి అనుమతిస్తారు. ఈ దిగుమతులు, చిన్న రైతులను వ్యవసాయాన్ని వదిలి పెట్టేసేలా చేస్తాయి.

మనం ఏం కోల్పోవాల్సి వస్తుందో పరిశీలిద్దాం. గత కొన్ని దశాబ్దాలుగా, ప్రత్యేకించి 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) ఉనికిలోకి వచ్చినప్పనుంచి అభివృద్ధి చెందుతున్న దేశాలను వాణిజ్యపరమైన అడ్డంకులను, దిగుమతి సుంకాలను ఎత్తివేయాలని నిర్బంధించే యత్నాలు జరుగుతున్నాయి. తొలుత డబ్ల్యూటీఓ ద్వారా రెండు దేశాల మధ్య లేదా కొన్ని దేశాల బృందం మధ్య స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాలను దూకుడుగా ముందుకు నెట్టారు. దేశీయ మార్కెట్‌ను ఇతరుల కోసం బార్లా తెరవడం వల్ల భారత్‌కు పెద్దగా ఎలాంటి లాభమూ చేకూరలేదని పలు అధ్యయనాలు స్పష్టం చేశాయి. అయితే దాని వల్ల మన వ్యవసాయరంగానికి కలిగిన నష్టం అపారమైనది.

పాత ఒప్పందాల గుదిబండలు

శ్రీధర్. ఆర్, తిరువనంతపురానికి చెందిన తనల్ అనే ఒక స్వచ్ఛంద సంస్థకు చెందినవారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ), ఆగ్నేయ ఆసియా దేశాల వాణిజ్య కూటమి (ఆసియాన్) కారణంగా ఇప్పటికే కేరళలోని ప్లాంటేషన్ (తోటల) పెంపకందార్ల జీవనోపాధిని ఎలా దెబ్బతీశాయో ఆయన వివరించారు. ''ఏడేళ్ల క్రితం, మేం, ఒక పౌర సమాజం, కేరళ ప్రభుత్వం కలిసి దిగుమతి సుంకాల తగ్గింపు... కేరళపై, ప్రత్యేకించి రబ్బరు, మసాలా దినుసుల విషయంలో తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతుందంటూ ముందస్తు అంచనాను ఇచ్చాం'' తాము చెప్పినట్టే దిగుమతులు పెరిగి, ధరలు పడిపోయాయని ఆయన చెప్పారు. తమ హెచ్చరికను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఒప్పందంపై సంతకాలు చేసిందే తప్ప, దాని పర్యవసానంగా ప్రభావితమైన రైతులకు లేదా దాని వల్ల ఉపాధిలను కోల్పోయిన వారికి ఎలాంటి నష్టపరిహారాన్ని లేదా సహాయాన్ని అందించలేదు. పైగా, రబ్బరు ధర పడిపోయినందుకు గానూ కేరళ ప్రభుత్వమే ఆ రైతులకు ఏటా రూ. 500 కోట్ల పరిహారపు భారాన్ని మోయాల్సి వస్తోంది. ఆ పరిహారం కూడా కేవలం 30 శాతం రైతులకే లభిస్తోంది. మిగతా రైతులంతా క్రమక్రమంగా వ్యవసాయం నుంచి బయటకు పోవాల్సివచ్చింది.

రైతు జీవనోపాధిని హరించే కొత్త ఒప్పందం

ఇది చాలదన్నట్టు, ఇప్పుడు ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (ఆర్‌సీఈపీ) కుదుర్చుకుంటున్నారు. ఈ జూలైలో ఆ ఒప్పందంపై తాజా చర్చలు హైదరాబాద్‌లో జరిగాయి. అది, వాణిజ్యం జరిపే వస్తువులలో 92 శాతంపై దిగుమతి సుంకాలను పూర్తిగా ఎత్తివేయడాన్ని పరిశీలిస్తోంది. అంతకన్నా అధ్వానంగా, ఈ ఒప్పందం కింద ఒకసారి దిగుమతి సుంకాలను సున్నాకు తగ్గించిన వస్తువులపై ఆ తర్వాత సుంకాలను పెంచడానికి వీల్లేదు. ఇది, డబ్ల్యూటీఓ సైతం విధించని నిబంధన. మరోవిధంగా చెప్పాలంటే, ఆర్‌సీఈపీ ఒప్పందంపై సంతకాలు చేయడానికి భారత్ అంగీకరిస్తే, భారత మార్కెట్లో దిగుమతి సుంకాలే లేని దిగుమతులు శాశ్వతంగా తిష్టవేస్తాయి. ఇది, 60 కోట్ల మంది రైతుల జీవనోపాధికి భద్రతను కల్పించే, పరిరక్షించుకునే హక్కును మన దేశానికి లేకుండా చేసేస్తుంది. ఈ ఒప్పందం కోసం దక్షిణ కొరియా, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, చైనా సహా పదహారు దేశాలు చర్చలు జరుపుతున్నాయి.

మన దేశం ప్రపంచంలోనే అతి పెద్ద పాల ఉత్పత్తిదారు. ప్రస్తుతం పాలు, పాల ఉత్పత్తుల దిగుమతులపై 40 నుంచి 60 శాతం దిగుమతి సుంకాలు విధిస్తున్నారు. ఇది స్థానిక డెయిరీలకు తగినంత రక్షణను కల్పించి, స్థానిక పోటీతత్వాన్ని పెంపొందింపజేస్తోంది. పాల దిగుమతులు వెల్లువెత్తడానికి తలుపులను బార్లా తెరవడంతో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌ల నుంచి చౌకగా లభించే పాలు దేశాన్ని ముంచెత్తుతాయి. కేవలం 6,300 మంది పాడి రైతులున్న ఆస్ట్రేలియా, 12,000 మంది పాడి రైతులున్న న్యూజిలాండ్ తమ చిన్న పాడి రైతుల సముదాయాల ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈ దిగుమతులను బలవంతంగా రుద్దడానికి ప్రయత్నిస్తున్నాయి. కాగా, పదిహేను కోట్ల మంది పాడి రైతుల జీవనోపాధిని త్యాగం చేయడం కోసం భారతదేశం సిద్ధమౌతోంది.

రహస్య మంతనాలు జాతికి ఉరితాళ్లు

భారత్‌లో పాలకు విస్తారమైన దేశీయ మార్కెట్ ఉంది. ఆస్ట్రేలియా న్యూజిలాండ్‌ల వలే మనకు ఎగుమతి చేయదగిన మిగులు పాల ఉత్పత్తి లేదు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లు మన ఐటీ నిపుణులకు మరిన్ని అవకాశాలను కల్పించడానికి సుముఖతను కనబరచినంత మాత్రాన, భారత పాడి రైతులను బలిపీఠంపైకి ఎక్కించేస్తామనడం అర్థరహితం.

మనం మార్కెట్లను తెరుస్తున్నది కేవలం పాల ఉత్పత్తులకు మాత్రమే కాదు. మనం అన్ని రకాల పళ్లు, కూరగాయలు, పప్పులు, బంగాళదుంపలు, మసాలా దినుసులు, తోటల పంటలు, విత్తనాలు, పట్టు, ప్రాసెస్డ్ ఆహారం తదితరాలన్నిటికీ మార్కెట్ల దిగుమతులకు కూడా తలుపులను తెరవాల్సి ఉంటుంది. వాణిజ్యం జరిపే వస్తువుల్లో 80 శాతానికే సున్నా దిగుమతి సుంకాలను అనుమతిస్తామని భారత్ ఇంకా పట్టుబడుతూ, మూడు దొంతర్ల అమరికను కోరుతోంది. కానీ ప్రాబల్య శక్తులుగా ఉన్న చైనా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు చివరకు తమ మాటే నెగ్గించుకుంటాయి.

డబ్ల్యూటీఓని రూపొందించినది కేవలం ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్న 1 శాతం వాణిజ్య ప్రయోజనాల కోసమేనని ప్రపంచానికి అర్థం కావడానికి ఎన్నో ఏళ్లు పట్టింది. అయినా ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోకుండా, ఈ ఆర్‌సీఈపీ ఒప్పందం కోసం చర్చలను పూర్తి రహస్యంగా సాగిస్తున్నారు. హైదరాబాద్ చర్చలలో ఏం జరిగిందో బహిర్గతం చేయలేదు. కొద్ది మంది వ్యక్తులు పకడ్బందీ ఏర్పాట్లతో రహస్యంగా కూర్చొని జరిపే చర్చల ద్వారా జరిగే నిర్ణయాలు, చివరకు 99 శాతం జనాభా భవిష్యత్తును ప్రభావితం చేస్తాయి. ఇది పూర్తిగా అన్యాయం.

వ్యాసకర్త వ్యవసాయ నిపుణులు
ఈ–మెయిల్ : hunger55@gmail.com

చలనశక్తే సాధికారత

చలనశక్తి మహిళల కదలికలనే కాదు, వారి ఆలోచనలను కూడా చలనశీలం చేస్తుంది. ఇప్పుడు మహిళలకి కావల్సినది, వారినో మూలన ఉంచి అన్నలిచ్చే రక్షణ కాదు. స్వతంత్రతనిచ్చే చలనశక్తే.



సామాన్య కిరణ్

అర్ధరాత్రి రహదార్లపై ఒక మహిళ స్వేచ్ఛగా నడవగలిగిన రోజే, భారతదేశం తన స్వాతంత్ర్యాన్ని సాధించిందని మనం చెప్పగలం అన్నారు గాంధీ. ఆ వ్యాఖ్య రక్షణ గురించే కాకుండా అంతర్లీనంగా స్త్రీ మొబిలిటీ (చలన శక్తి)ని కూడా ప్రస్తావించిందేమో.. తెరాస ఎంపీ కవిత ''సిస్టర్స్ ఫర్ చేంజ్'' అని రక్షాబంధన్ రోజు ఒక కార్యక్రమాన్ని ప్రారంభించారు. దానికి స్లోగన్ ''అన్న మనకు రక్ష–అన్నకు హెల్మెట్ రక్ష''. రాఖీ కట్టి హెల్మెట్ ఇచ్చి సోదరుల ప్రాణాలను ప్రమాదాలనుంచి కాపాడండి అని ఆ కార్యక్రమ సందేశం. ఇందులో మనకు బాహ్యంగా కనిపిస్తున్న అంశం తోడబుట్టిన వారి మీద ప్రేమ. కానీ ఈ నినాదం చాలా బలమైన మూస ధోరణిలో పురుషస్వామ్యాన్ని మళ్లీ నొక్కి చెబుతోంది. చలనశక్తి ఉన్న అన్నకు హెల్మెట్ రక్ష, ఇంట్లో వుండే ఆడవాళ్లకు అన్న లేదా మరో మగవాడు రక్ష అనే భావజాలాన్ని ఇది వ్యాపింపచేస్తుంది.

'జెండర్ ఈక్వాలిటీ అండ్ డెవలప్‌మెంట్' అనే పేరుతో వరల్డ్ బ్యాంకు 2012లో ప్రచురించిన రిపోర్టుకి 'జెండర్ అండ్ మొబిలిటీ ఇన్ ది డెవలపింగ్ వరల్డ్' అనేది ఒక నేపథ్య వ్యాసం. అందులో వారు ప్రొఫెసర్ సెలెస్ట్ లాంగన్ పేర్కొన్న 'మొబిలిటీ డిసెబిలిటీ' భావనని ఉటంకించారు. రూసో తన 'సోషల్ కాంట్రాక్టు'లో.. పరుగెత్తాలని ఆరాటపడే శారీరక వైకల్యంగల వ్యక్తీ, శారీరకంగా అంతా బాగుండి ఆ కోరిక లేని వ్యక్తీ ఇద్దరూ ఒక్క చోటే ఉండిపోతారంటారు. ఈ మాటల్ని లాంగన్ ఖండిస్తారు. సామాజిక వాతావరణం, ఆచారాలే చలన శక్తిని, చలన హీనతను సృష్టించగలవు. ఇవి సర్వాంగాలు సక్రమంగా ఉన్న వ్యక్తిని కూడా చలనహీనుల్ని చేయగలవు. సమాజం, ఆచారాల పేరిట స్త్రీలను అలా నిస్సహాయులను చేసింది అంటారామె. స్త్రీలు కీలక స్థానాలలో లేకపోవడం వల్ల ఇలా జరుగుతుందేమో అనే అభిప్రాయం ఈ వ్యాసాలలో వ్యక్తమయింది కానీ, పురుషులు స్త్రీల శరీరాలనే కాదు మెదడులను కూడా నియంత్రించారు కదా. అందుకే కీలక పదవులలో ఉన్న కొద్దిమంది స్త్రీలు కూడా పైకి ఆధునికులుగా కనిపిస్తూ వెనుకబాటు భావజాలాన్నే ప్రచారం చేస్తుంటారు.

స్త్రీవాద ఉద్యమమిచ్చిన చైతన్యాలలో చలనశక్తి కూడా ఒకటి. 1896 సంవత్సరంలో అమెరికన్ సివిల్ రైట్స్ లీడర్ సుసాన్ బి ఆంథోనీ 'ద్విచక్ర వాహనం స్త్రీలకు చాలా విముక్తిని ఇచ్చింది. అది ఎక్కిన మరుక్షణం వారికి స్వావలంబన భావాలు కలుగుతాయి' అంటారు. నా భర్త ఉద్యోగరీత్యా గిరిజన ప్రాంతాలలో ఉన్నపుడు నేను నా స్కూటీపై కూతుర్ని తీసుకుని చుట్టుపక్కల సంతాలీ పాడాలు తిరిగేదానిని. నా మొబిలిటీ నాకిచ్చిన స్వేచ్ఛ వారిని నాకు స్నేహితుల్ని చేసింది. నెల్లూరులో నాకొక స్నేహితురాలు ఉంది. చిన్నప్పుడు తన సైకిల్‌పై మేమిద్దరం డబుల్స్ వెళ్ళేవాళ్ళం. నవ్వులే నవ్వులు. కావలసినంత స్వేచ్ఛ. గత పదిహేనేళ్లుగా తన భర్త సౌదీలో ఉద్యోగం చేస్తూ ఉంటే, తాను ఇక్కడ పిల్లల్ని చదివిస్తూ ఉంది. సైకిల్ నుంచి స్కూటర్‌కు, కార్‌కు మారింది. మొబిలిటీ మా జీవితాలకు సుఖాన్నిచ్చింది. కష్ట సమయాలలో స్థైర్యాన్నిచ్చింది. అదే మాట్లాడుకుంటూ ఎవరైనా రాజకీయనేత డిగ్రీ అమ్మాయిలకు ఉచితంగా స్కూటీనిచ్చే స్కీమ్ పెడితే బాగుండును, అది వారిలో ఎంతో ధైర్యం నింపుతుంది కదా అనుకున్నాం. బిహార్ ప్రభుత్వం 9వ తరగతి అమ్మాయిలకు సైకిళ్ళ పంపిణీ చేసే కార్యక్రమం మొదలుపెట్టినపుడు దాని ప్రభావాలపై కేంబ్రిడ్జి కోసం పరిశోధన చేసిన కార్తీక్ మురళీధరన్, నిషిత్ ప్రకాష్‌లు కూడా అమ్మాయిల మొబిలిటీ భావితరాల్ని ప్రభావితం చేయబోతోందన్నారు.

ఆలోచనం



ఈ ప్రపంచీకరణ సమాజంలో, మొబిలిటీ స్త్రీల పేదరికంపై చూపిస్తున్న ప్రభావం గురించి కూడా అనేక పరిశోధనలు జరిగాయి. పేద స్త్రీలు పనికి నడిచి వెళుతున్నారని, వాహనాలు ఎక్కలేక, పని ప్రదేశాలకు ఆలస్యంగా చేరుతున్నారనీ, దీని వలన వీరికి పేదరికం నుంచి బయటపడే అవకాశాలు తగ్గిపోతున్నాయనీ తెలుస్తున్నది. ప్రస్తుతం నేను నివాసముంటున్న బెంగాల్‌కి, తెలుగు సమాజానికి మధ్య నేను గమనించిన ప్రధానమైన తేడా మొబిలిటీనే. బెంగాల్‌లో పేద స్త్రీలు సైకిల్‌ని చాలా ఎక్కువగా వినియోగిస్తారు. మొబిలిటీ నా పరిశీలన మేరకు మన కదలికలనే కాదు, ఆలోచనలను కూడా చలనశీలం చేస్తుంది. మన దేశంలో చాలా సార్లు సర్పంచ్ భర్తలు, తామే సర్పంచులమని చెప్పుకుంటారు. ఉత్తర భారత్‌లో ప్రధాన్ పతి (సర్పంచ్ భర్త) అనే కొత్త పదం కూడా పుట్టింది. బెంగాల్లో సర్పంచుల భర్తలెవరో కూడా ప్రస్తావనకు రాదు. స్త్రీ సాధికారతకు మొబిలిటీకి ఉన్న సంబంధానికి ఇదో ఉదాహరణ. అంతెందుకు చిన్నప్పుడు చరచరా సైకిల్‌పై వీధులన్నీ చుట్టపెట్టేదట మమతా బెనర్జీ. ఆమెని రక్షించే, లేక రక్షిస్తున్న అన్నల గురించి మీరెప్పుడైనా విన్నారా? అందుకేనేమో ఆమె 'సబూజ్ సాథీ' పేరిట అమ్మాయిలకు 45 లక్షల సైకిళ్ళు పంపిణీ చేసి, వాహనమే మీ నేస్తం అనే సందేశాన్నిచ్చారు. ఇలా రాజకీయ నేతలు ఇప్పుడు జరుగుతున్న సామాజిక ఉద్యమాల గురించి వారి డిమాండ్ల గురించి తెలుసుకుని ఉంటే బాగుంటుంది కదా. కొంత స్త్రీవాద స్పృహ అలవరచుకొంటే, ఎంతో చురుకుదనం ఉన్న టీఆర్ఎస్ ఎంపీ కవిత కూడా ''అన్నలు, చెల్లెళ్లకి మోటార్ బైక్ నడపడం విధిగా నేర్పించండి, చెల్లెళ్లకి హెల్మెట్లు బహుమతులుగా ఇవ్వండి'' అనేవారేమో.

లోపలి లోకాలను తాకే ''సంచారమే ఎంత బాగున్నది'' పాటలో గోరటి వెంకన్న ''మూలనున్నవి మురిగి పోతున్నవి, సంచరించేవి శక్తితోనున్నవి'' అంటారు. నిజం! ఇప్పుడు స్త్రీకి కావల్సినది, ఆమెనో మూలన ఉంచి అన్నలిచ్చే రక్ష కాదు. స్వతంత్రతనిచ్చే మొబిలిటీనే.

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి ꠰ 91635 69966

గోల గోల పండుగల వేళ

ధ్వని కాలుష్య నిరోధం గురించిన ప్రభుత్వ చట్టాలున్నా పండుగ సంబరాల నిర్వాహకులకు ఆ పట్టింపే ఉండదు. శబ్ద కాలుష్యం తాత్కాలికమైనదే అయినా, శాశ్వతమైన నష్టాన్ని కలగజేయగలదని రుజువైంది.

విశ్లేషణ



మహేష్ విజాపృకర్

మన భారతీయులకు లెక్కలేనన్ని పండుగలున్నాయి. అవి ఎక్కువగా మతంతో ముడిపడినవి. ఈ వేడుకల విలువకు కొలబద్ద శబ్దమేనని మన వాళ్లు అపార్థం చేసుకుంటున్నారని అనిపిస్తుంది. రాత్రంతా చెవులు చిల్లులు పడేలా చేసే సంగీత ఘోషతో కూడిన దేవీ నవరాత్రే కావచ్చు, లేదా రోడ్డుకు అడ్డంగా పైనుంచి వేలాడుతున్న ఉట్టిని అందుకోడానికి దొంతరలు, దొంతరలుగా ఒకరిపైకి ఒకరు పైకి ఎక్కే దహీహండి (ఉట్లు కొట్టడం)యే కావచ్చు.

శ్రీకృష్ణ జన్మాష్టమి తర్వాతి రోజున... కృష్ణ పరమాత్మునికి అందకుండా తల్లి ఎత్తుగా ఉన్న ఉట్టిలో ఉంచిన వెన్నను దొంగిలించడానికి ఆయన చేసిన లీలను అనుకరిస్తూ దహీహండి వేడుక జరుగుతుంది. మహారాష్ట్రలో అది పెద్దగా చప్పుళ్లు లేకుండానే సాగిపోతుంది. హైడెసిబల్ సౌండ్ సిస్టమ్స్‌ను సరఫరా చేస్తే పోలీసులు స్వాధీనం చేసుకుంటారని వాటిని అద్దెకు ఇవ్వకపోవడమే అందుకు కారణం. లేకపోతే అది కూడా మహా శబ్ద ఘోషగా సాగేదే.

ఆ తర్వాత చలికాలం వచ్చేసరికి దేవీ నవరాత్రి వంతు వస్తుంది. ఆ తొమ్మిది రాత్రులు స్త్రీ పురుషులు రాత్రిళ్లు గుజరాతీ దాండియా (కోలాటం) బాణీలు మోగుతుండగా నృత్యాలు చేస్తారు. అవి దసరా పండుగతో ముడిపడినవి. కాబట్టి నవరాత్రులకు కూడా ప్రాతిపదిక మతమే. కానీ, ఈ దాండియా వేడుకలను, ప్రధానంగా వాణిజ్యపరమైన కార్యక్రమాలుగా ఈవెంట్ మేనేజర్లు టికెట్లు అమ్మి నిర్వహిస్తారు. వాటిలో కూడా డీజేలు హై డెసిబల్ సౌండ్ సిస్టమ్స్‌ను ఉపయోగిస్తూ, చెవులు గింగురుమనేలా సంగీతాన్ని వినిపిస్తారు.

ఇక ఇప్పుడు, శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే గణేశ్ చతుర్థి వంతు. దాదాపు ప్రతి వీధి మలుపునా గజాననుని విగ్రహానికి పూజలు చేస్తారు. రోడ్లను, రోడ్డు పక్క ఉండే పాదచారుల బాటలను ఆక్రమించి, వాహనాలు సహా రాకపోకలన్నింటినీ అడ్డగించేస్తారు. లౌడ్ స్పీకర్లు ఈ పండుగ సర్వసాధారణ లక్షణం. ఈ శబ్ద కాలుష్యానికి వ్యతిరేకంగా చేసిన ప్రచార ఉద్యమం ఏమైనా విజయం సాధించిందో లేదో వేచి చూడాలి. కోర్టులైతే అలాంటి ధ్వనులను నిషేధించాయి.

దహీహండి పగటిపూట సాగే ఒక రోజు కార్యక్రమం. నవరాత్రి, గణేశ్ చతుర్థి తొమ్మిది రోజులు, పది రోజులు సాగే వేడుకలు. నిర్వాహకులు ఈ వేడుకలకు లౌడ్ స్పీకర్ల ఉపయోగపు వేళల పరిమితులను 10 గంటల పరిమితికి దాటి కొనసాగేలా, కనీసం చివరి మూడు రోజులకైనా మినహాయింపులను కోరి, సాధిస్తారు. ఈ వేడుకల్లో పాల్గొనేవారు ఇది మతపరమైన ఉత్సాహం అంటారు, ఇతరులేమో ఆ విపరీత శబ్దాల వల్ల బాధపడాలి. 70 డెసిబల్స్‌కు మించిన శబ్దాలు ఈ పండుగలకు గుర్తుగా మారాయి.



గణేశ్ చతుర్థి సందర్భంగా, రెండో రోజు నుంచే నిమజ్జనాలు సాగుతుంటాయి. కాబట్టి రోజంతా ఆ గోల సాగుతూనే ఉంటుంది. పదో రోజున పెద్ద పెద్ద విగ్రహాలన్నిటినీ ఊరేగింపుగా తీసుకుపోయి సాగనంపుతారు. భారీ డోళ్లు, భేరీలు, పోర్టబుల్ డీజే సెట్లు విగ్రహాలతో పాటే ట్రక్కులపై జలాశయాలకు సాగిపోతాయి. శుభ శకునాల వేల్పును, పూజించడం కోసం పందిళ్లకు తరలించేటప్పుడు కూడా అవన్నీ వెంట ఉండాల్సిందే.

ముంబై హైకోర్టు దహీహండిలో పాల్గొనే వారి ప్రాణ రక్షణ కోసం, కాళ్లుచేతుల రక్షణ కోసం ఉట్టి కట్టే ఎత్తు మీద, అందులో పాల్గొనేవారి వయసుపైన ఆంక్షలను విధించినప్పుడు... నిర్వాహకులు, ప్రధానంగా రాజకీయవేత్తలు అది ఒక 'సాహస క్రీడ' అంటూ వాదించడం ఆసక్తికరం. ఇది అవకాశవాదానికి సుస్పష్టమైన ఉదాహరణ. ఈ కేసులో, హైకోర్టు తీర్పును సమీక్షించాలని సుప్రీం కోర్టు కోరింది. దీంతో అది వాటిని నియంత్రించే పని చట్టసభల పనే తప్ప తాము చేయజాలమంటూ మునుపటి యథాతథస్థితి కొనసాగింపును పునరుద్ధరించింది.

గణేశ్ చతుర్థికి రాజకీయపరమైన ప్రాపకం కూడా భారీ ఎత్తున ఉంది. అది స్థానిక రాజకీయ వేత్తలు అందించే దానికే పరిమితం కాదు. పైగా ఇది లాభసాటి వ్యవహారం కూడా. చిన్న సంస్థలు చిన్న విగ్రహాలను ఎంచుకుని, అక్రమంగా రోడ్డు స్థలాలను ఆక్రమిస్తాయి. అందుకోసం అవి రాజకీయ వేత్తల మద్దతును కోరతాయి. ఎన్నికల సమయంలో చిన్న గృహ సముదాయాల ప్రాతిపదికపై ఏర్పడ్డ బృందాలు రాజకీయవేత్తల నుంచి నిధులను కోరతాయి. 'దానికి బదులు'గా ఓటును ఆశించి ఆశించి వారు సమర్పించుకోడానికి అంగీకరిస్తారు.

ధ్వని కాలుష్య నిరోధం గురించి ప్రభుత్వ చట్టాలున్నా నిర్వాహకులకు దాదాపుగా ఆ పట్టింపే ఉండదు. శబ్ద కాలుష్యం తాత్కాలికమైనదే అయినా, శాశ్వతమైన నష్టాన్ని కలగజేయగలదని రుజువైంది. నగరాలు, పట్టణాలలో అన్ని వైపులా చుట్టేసి వ్యాపించే శబ్ద కాలుష్యం... గణేశ్ చతుర్థి వంటి పండుగల సమయంలో మరింత ఎక్కువగా పెరుగుతున్నదే తప్ప తగ్గడం లేదని మహారాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు అధ్యయనాలు తేల్చి చెప్పాయి.

వ్యాసకర్త సీనియర్ పాత్రికేయులు
ఈ–మెయిల్ : mvijapurkar@gmail.com

చెల్లని రూల్స్

నంద్యాల ఉప ఎన్నికలో విజయంపై నమ్మకం కోల్పోయిన టీడీపీ

నంద్యాల నుంచి 'సాక్షి' ప్రత్యేక ప్రతినిధి

మహాసంగ్రామానికి నాంది కాబోతున్న నంద్యాల ఉప ఎన్నిక నేడే జరగనుంది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సాగే పోలింగ్‌పై రాష్ట్రమంతా ఉత్కంఠ నెలకొంది. విజయం ఖాయమైపోయిందని ఓవైపు, మెజారిటీ ఎంత అని మరోవైపు రాజకీయ నేతలు, ప్రజలు కూడా లెక్కల్లో మునిగితేలారు. ఇంకోవైపు పోలింగ్‌కు ఇక ఒక్కరోజే సమయం మిగిలి ఉండడంతో ఎలాగైనా నెగ్గాలన్న లక్ష్యంతో మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు ఎన్నికల కోడ్‌ను అపహాస్యం చేస్తూ నంద్యాల నియోజకవర్గంలో హల్‌చల్ చేశారు. విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ జరిగింది. మరోవైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి తన ఇంట్లో పార్టీ ఏజెంట్లకు గుర్తింపు కార్డులు ఇస్తుండగా ఒక్కసారిగా భారీగా తరలివచ్చిన పోలీసులు హడావుడి చేశారు. ఏజెంట్లకు గుర్తింపు కార్డులు ఇవ్వకుండా అడ్డుకునేందుకు చివరి వరకు అధికారపార్టీ ప్రయత్నిస్తోందనడానికి ఇదే నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ప్రతిపక్ష ఏజెంట్లు ఉండొద్దా?

నంద్యాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి ఇంట్లో అధికారులు సోదాలు నిర్వహించారు. ఇంట్లోని సిబ్బందిని, పోలింగ్ ఏజెంట్లను బయటకు తరిమేశారు. అలాగే పేదలకు చౌక ధరలకే సరుకులు అందజేస్తున్న 'శిల్పా సహకార్'ను మూసివేశారు. శిల్పా ఇంటి వద్ద మంగళవారం రాత్రి పోలీసులు భారీగా మోహరించారు. విధినిర్వహణలో ఉన్న పోలింగ్ ఏజెంట్లను అడ్డుకోవద్దని, ఎన్నికల ఏజెంట్లను అడ్డుకునే హక్కు పోలీసులకు లేదని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా వారు లెక్కచేయలేదు. శిల్పా ఇంటివద్ద ఎవరూ ఉండవద్దంటూ హెచ్చరించారు. పోలింగ్ బూత్‌ల ఏజెంట్లకు గుర్తింపు కార్డులు ఇవ్వకుండా అడ్డుకున్నారు. అక్కడున్న ఏజెంట్లపై లాఠీలు ఝుళిపించారు. దీంతో శిల్పా ఇంటి వద్ద ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను నియమించుకోకపోతే ఇక తమ అరాచకాలకు అడ్డే ఉండదని టీడీపీ నాయకత్వం భావిస్తోందని స్థానికులు మండిపడ్డారు. పోలీసుల తీరుపై శిల్పా మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ ఏజెంట్లను అడ్డుకోవడాన్ని ప్రశ్నించారు. మరోవైపు శిల్పా మోహన్‌రెడ్డి సోదరుడు శిల్పా చక్రపాణిరెడ్డి స్థానికేతరుడని, ఆయన నంద్యాల నుంచి వెళ్లిపోవాలంటూ పోలీసులు హుకుం జారీ చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న శిల్పా మోహన్‌రెడ్డి



శిల్పా సహకార్‌ను అధికారులు మూసివేయించిన దృశ్యం

ఆధారాలు లభించలేదు

నంద్యాలలో పేదలకు ఆసరాగా ఉన్న 'శిల్పా సహకార్' సూపర్ మార్కెట్‌ను టీడీపీ నేతల ఒత్తిడి మేరకు అధికారులు మూసివేశారు. శిల్పా సహకార్‌లో నిత్యావసర సరుకులను పేదలకు 10 శాతం రాయితీతో విక్రయిస్తున్నారు. ఇక్కడ సరుకులు ఉచితంగా ఇస్తున్నారంటూ తెలుగుదేశం నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం కర్నూలు జిల్లా కలెక్టర్ సత్యనారాయణ, ఎస్పీ గోపీనాథ్ జెట్టి, అదనపు ఎస్పీ రవిప్రకాశ్, రిటర్నింగ్ అధికారి ప్రసన్న వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్.. ఇలా ఒకరి తర్వాత ఒకరు శిల్పా సహకార్ సూపర్ మార్కెట్‌లోకి వెళ్లి అక్కడ పంపిణీ చేస్తున్న నిత్యావసరాలను పరిశీలించారు. రాత్రి 8 గంటలకు సంస్థను మూసివేశారు. కొందరు చేసిన ఫిర్యాదు మేరకే ఇక్కడ తనిఖీలు నిర్వహించామని, ఉచితంగా సరుకులు ఇస్తున్నట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ చెప్పారు. పోలింగ్ అనంతరం ఈ సంస్థ యథాతథంగా పని చేస్తుందని వెల్లడించారు.

బెదిరింపులకు భయపడం

నంద్యాల ఉప ఎన్నికలో ఎలాగైనా నెగ్గాలనే కుట్రతో అధికార పార్టీ నాయకులు భయానక వాతావరణం సృష్టిస్తున్నారని, వారి బెదిరింపులకు భయపడబోమని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి తేల్చిచెప్పారు. మరికొన్ని గంటల్లో పోలింగ్ జరగాల్సి ఉండగా తన ఇంట్లో సోదాలు చేశారని, ఏజెంట్లకు గుర్తింపు కార్డులు ఇవ్వకుండా అడ్డుకున్నారని, శిల్పా సహకార్‌ను మూసివేశారని మండిపడ్డారు. స్థానికేతరులైన మంత్రులు, ఎమ్మెల్యేలు నంద్యాలలోనే మకాం వేసినా పట్టించుకోని పోలీసులు వైఎస్సార్‌సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారని దుయ్యబట్టారు. నంద్యాలలో టీడీపీ వేధింపులు తారస్థాయికి చేరాయని ఆరోపించారు. మంత్రి ఆదినారాయణరెడ్డి నంద్యాలలోనే తిరుగుతూ డబ్బులు పంచుతున్నా పట్టించుకోని పోలీసులు తన ఇంట్లో మాత్రం సోదాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం 5 గంటలకే ముగిసినా టీడీపీ ఎమ్మెల్సీ ఫరూఖ్ మంగళవారం కూడా నంద్యాలలో సమావేశం ఏర్పాటు చేసి, ఓటర్లకు డబ్బులు పంచారని ఆరోపించారు.

ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వెంటే...

ప్రతిపక్ష ఏజెంట్లు లేకుండానే పోలింగ్‌ను ఏకపక్షం చేసి, దౌర్జన్యంగా నెగ్గాలని అధికార పార్టీ కుట్ర పన్నుతోందని శిల్పా మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. ఓటమి భయంతోనే టీడీపీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని స్పష్టం చేశారు. తన సోదరుడు, మాజీ ఎమ్మెల్సీ శిల్పా చక్రపాణిరెడ్డి నంద్యాలలో స్థానికుడేనని ఆయన పేర్కొన్నారు. ఇందుకు అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. చక్రపాణిరెడ్డి నంద్యాలను విడిచి వెళ్లాలంటూ పోలీసులు హెచ్చరించడాన్ని తప్పుపట్టారు. టీడీపీ కుట్రలను తిప్పికొడతామన్నారు. పోలీసుల చర్యలను న్యాయస్థానం ద్వారా ఎదుర్కొంటామన్నారు.

టీడీపీ నేతలకు రాచమర్యాదలు

తమ సంస్థలను పోలీసులు టార్గెట్ చేశారని, మూసివేయాలంటూ తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారని శిల్పా మోహన్‌రెడ్డి తనయుడు రవిచంద్ర కిషోర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇలాంటి దౌర్జన్యాలను ప్రజలు సహించరని, ఉప ఎన్నికలో టీడీపీకి బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. మంత్రులు ఆదినారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డితోపాటు 50 మంది టీడీపీ ఎమ్మెల్యేలు నంద్యాలలోనే ఉంటున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. ఓటర్లను మభ్యపెట్టేందుకు డబ్బులు, చీరలు పంచినా ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని దుయ్యబట్టారు. టీడీపీ నేతలకు రాచమర్యాదలు చేస్తున్నారని విమర్శించారు. పోలింగ్ ఏజెంట్లను సైతం వెళ్లిపోవాలని బెదిరింపు చర్యలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. నంద్యాలలో తప్ప దేశంలో ఇలాంటి పరిస్థితులు ఎక్కడా లేవన్నారు.

చిన్న తప్పు కూడా దొరకలేదు

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి తన మామ కావడం వల్ల అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో 17 రోజులుగా ప్రతి రోజూ ఒక పరిశీలకుడిని శిల్పా సహకార్‌లో ఉంచారని శిల్పా సేవా సమితి చైర్మన్ శిల్పా నాగినిరెడ్డి చెప్పారు. ఇక్కడ ఎవరికీ ఉచితంగా సరుకులు ఇవ్వడం లేదని, పేదలకు 10 శాతం సబ్సిడీతో ఇస్తున్నామని తెలిపారు. చిన్న తప్పు కూడా అధికారులకు దొరకలేదని, అయితే, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతోనే శిల్పా సహకార్‌ను మూసివేశారని ఆరోపించారు.



శిల్పాసహకార్‌లో తనిఖీకి వచ్చిన అధికారులను ప్రశ్నిస్తున్న శిల్పా సేవాసమితి చైర్మన్ నాగినిరెడ్డి

శిల్పా పోలింగ్ ఏజెంట్ల విధులను నిరోధించవద్దు

- పోలీసులకు హైకోర్టు ఆదేశం
- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తేనే చర్యలు తీసుకోండి



సాక్షి, హైదరాబాద్: నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి పోలింగ్ ఏజెంట్లుగా ఉన్న వారిని వారి విధులు నిర్వర్తించకుండా నిరోధించరాదని ఉమ్మడి హైకోర్టు మంగళవారం నంద్యాల పోలీసులను ఆదేశించింది. ఒకవేళ వారు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చట్ట ప్రకారం మాత్రమే తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ ఉత్తర్వులు జారీ చేశారు. తమపై తప్పుడు కేసులు నమోదు చేయకుండా.. చట్ట విరుద్ధంగా అరెస్టులు చేయకుండా.. ఎటువంటి వేధింపులకు గురి చేయకుండా నంద్యాల పోలీసులను ఆదేశించాలని కోరుతూ పోలింగ్ ఏజెంట్లు ఎం.విజయశేఖర్‌రెడ్డి మరో 44 మంది సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ విచారణ జరిపారు. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వాదనలు వినిపిస్తూ... పోలింగ్ ఏజెంట్లుగా నియమితులైన పిటిషనర్లను పోలీసులు ఇళ్లకొచ్చి మరీ బెదిరిస్తున్నారని, వారిపై ఎటువంటి కేసులు లేకపోయినా కూడా బెదిరింపులకు పాల్పడుతున్నారని కోర్టుకు నివేదించారు. వైఎస్సార్‌సీపీకి పోలింగ్ ఏజెంట్లు లేకుండా చేయాలన్న ఉద్దేశంతోనే పోలీసులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తరువాత ప్రభుత్వ న్యాయవాది (హోం) విద్యావతి వాదనలు వినిపిస్తూ... పిటిషనర్లలో పలువురిపై కేసులు ఉన్నాయని, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉందని తెలిపారు. పిటిషనర్లు కేవలం భయాందోళనతోనే ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారని చెప్పారు. ఈ సమయంలో గూడపాటి స్పందిస్తూ... కేసులున్నవారు పోలింగ్ ఏజెంట్లుగా అనర్హులని ప్రజా ప్రాతినిధ్య చట్టంలో ఎక్కడా లేదని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, పోలింగ్ ఏజెంట్లుగా ఉన్న పిటిషనర్లను వారి విధులు నిర్వర్తించకుండా నిరోధించవద్దని పోలీసులను ఆదేశించారు. అయితే వారు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చట్ట ప్రకారం మాత్రమే చర్యలు తీసుకోవాలని పోలీసులకు స్పష్టం చేస్తూ ఈ వ్యాజ్యాన్ని పరిష్కరించారు.

బెడిసికొట్టిన 'పంపిణీ'

- నంద్యాలలో విచ్చలవిడిగా నగదు, బంగారం, చీరల పంపకం
- తమకు తక్కువ ఇచ్చారని టీడీపీ నేతలను నిలదీసిన మహిళలు
- రోల్డ్‌గోల్డ్ ముక్కుపుడకలు ఇస్తారా? అని ఆగ్రహం
- చిరిగిన చీరలు ఇవ్వడంతో మండిపాటు

నంద్యాల నుంచి 'సాక్షి' ప్రతినిధి

నంద్యాల ఉప ఎన్నికలో ఎలాగైనా నెగ్గాలన్న లక్ష్యంతో అధికార తెలుగుదేశం పార్టీ చేపట్టిన నగదు, ముక్కుపుడకల పంపిణీ బెడిసికొట్టింది. తమకు తక్కువ డబ్బులు పంచారని కొన్నిచోట్ల, నకిలీ ముక్కుపుడకలు ఇచ్చారని మరికొన్నిచోట్ల మహిళలు తిరగబడ్డారు. పంపిణీలో వ్యత్యాసాలు ఉండడతో టీడీపీ నేతలను ఎక్కడికక్కడ నిలదీశారు.

టీడీపీ పెద్దలు, మంత్రులు, ప్రజాప్రతినిధులు దాదాపు నెల రోజులుగా నంద్యాలలోనే మకాం వేశారు. అభివృద్ధి చేస్తున్నాం, ఆదరించండి అంటూ ప్రచారం చేశారు. రకరకాల ప్రలోభాల వల విసిరారు. సెంటిమెంట్‌ను సైతం ప్రయోగించారు. లొంగని వారిని బెదిరించారు. ఇన్ని చేసినా ఉప ఎన్నికలో గెలుస్తామన్న నమ్మకం లేకపోవడంతో ఆఖరి అస్త్రంగా నగదు, బంగారం, చీరల పంపిణీకి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో నోట్ల కట్టలు వెదజల్లడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఒక్కో ఓటుకు రూ.2 వేలు, రూ.3 వేలు, రూ.5 వేలు, రూ.10 వేలు, ఉమ్మడి కుటుంబాలకు రూ.లక్ష... ఇలా తెలుగు తమ్ముళ్ల చేత పంపిణీ కార్యక్రమం సాగించారు.

మేము ఓటర్లం కాదా?

నంద్యాల పట్టణంలో ఒక్కో వార్డులో ఒక్కోరకంగా నగదు పంపిణీ చేయడంపై మహిళలు నిప్పులు చెరిగారు. టీడీపీ నేతలు కొన్ని వార్డుల్లో ఒక్కో ఓటుకు రూ.5 వేలు ఇచ్చారు. ఆ సొమ్ము తీసుకున్నవాళ్లు పక్కనున్న వార్డుల్లోని ఓటర్లకు ఫోన్ చేసి, టీడీపీ వాళ్లు మాకు రూ.5 వేలు ఇచ్చారు, మీకు ఎంత ఇచ్చారు అంటూ ఆరా తీశారు. ఈ నేపథ్యంలో 15వ వార్డు టీడీపీ కార్యాలయం వద్దకు మహిళలు చేరుకొని నేతలను నిలదీశారు. ఒక్కో చోట ఒక్కోలాగా పంచుతారా? మేము ఓటర్లం కాదా? మాకు రూ.2 వేలే ఎందుకు ఇచ్చారు? అని మండిపడ్డారు. సమాధానం చెప్పలేక టీడీపీ నాయకులు నీళ్లు నమిలారు.

మహిళల శాపనార్థాలు

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో టీడీపీ నేతలు మహిళలకు ముక్కుపుడకలు పంచారు. ఆ విషయం తెలుసుకున్న ఇతర ప్రాంతాల్లోని మహిళలు టీడీపీ నాయకులను నిలదీశారు. మాకేందుకు ఇవ్వరని ప్రశ్నించడంతో వారికి కూడా అప్పటికప్పుడు ముక్కుపుడకలు అందజేశారు. అయితే, ఇవి రోల్డ్‌గోల్డ్ ముక్కుపడకలు అని తేలడంతో మహిళలు శాపనార్థాలు పెట్టారు. నకిలీ ముక్కపుడకలు ఇచ్చి ఓట్లు దండుకోవాలని చూస్తారా? అని మండిపడ్డారు. తెలుగుదేశం నాయకులు పంపిణీ చేసిన చీరలు చిరిగిపోయి ఉండడంతో అవి తమకెందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నంద్యాలలో మంత్రుల హల్‌చల్

ఉప ఎన్నికలో ఈసీ ఆదేశాలు బేఖాతరు ● నిబంధనలకు విరుద్ధంగా నంద్యాల పరిసరాల్లోనే మకాం



కోవెలకుంట్ల రోడ్డుపై నంబరు ప్లేట్లు తీసేసి తిరుగుతున్న మంత్రుల కార్లు



బనగానపల్లెలో టీడీపీ ఎమ్మెల్యేలు బోండా ఉమా, బోడే ప్రసాద్‌ల కార్లు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: ఉప ఎన్నికల నేపథ్యంలో నెల రోజులకు పైగా నంద్యాలలో తిష్టవేసి మంత్రాంగం నడిపిన మంత్రులు.. ప్రచారం గడువు ముగిసి 24 గంటలైనా పట్టణం వీడటం లేదు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర జిల్లాలవారు సోమవారం సాయంత్రం ఐదు గంటల తర్వాత జిల్లాలో ఎక్కడా ఉండేందుకు వీలులేదు. నంద్యాల ఓటర్లు మినహా జిల్లాలోని ఇతర ప్రాంతాల వారు సైతం నంద్యాలలో మకాం వేయకూడదని ఈసీ స్పష్టంగా పేర్కొంది. అయితే, మొదటి నుంచి నంద్యాల ఉప ఎన్నికలను పర్యవేక్షించిన మంత్రులు ఇతర జిల్లాల వారు కావడంతో వారు తప్పకుండా సోమవారం ఐదు గంటలకు జిల్లా సరిహద్దులను దాటి వెళ్లిపోవాల్సి ఉంటుంది. కానీ బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఇంట్లో సోమవారం రాత్రి వరకూ విందు అనంతరం 12 గంటల ప్రాంతంలో తమ జిల్లాలకు వెళ్లారు. తిరిగి మంగళవారం ఉదయమే ఎమ్మెల్యే ఇంట్లో తిష్టవేసి అక్కడి నుంచే నగదు పంపిణీపై సూచనలు, అధికారులకు ఆదేశాలు ఇస్తున్నట్టు తెలుస్తోంది. టీడీపీ ఎమ్మెల్యేలు బొండా ఉమాకు చెందిన ఏపీ16డీఎఫ్1314, బోడేప్రసాద్‌కు చెందిన ఏపీ16డీఏ567 కార్లు ఎమ్మెల్యే ఇంట్లోకి వెళ్లడం కనిపించింది. మంత్రి అమరనాథరెడ్డి వెలుగోడులో మకాం వేశారు. మరికొందరు మంత్రులు నెంబర్ ప్లేట్లు తీసేసిన కార్లలో తిరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రధానంగా జమ్ములమడుగు, చిత్తూరు జిల్లాల నుంచి తీసుకొచ్చిన రూ.40 కోట్లు మొత్తాన్ని వైఎస్సార్‌సీపీకి పట్టున్న గోస్పాడు మండలంలో పంచిపెట్టేందుకు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. తమకు ఓట్లు వేయకపోయినా ఫరవాలేదని, ఓటింగుకు రాకుండా ఉండేందుకు డబ్బులు తీసుకోవాలని ప్రలోభాలకు గురిచేస్తున్నారు.



బనగానపల్లె రోడ్లపై మంగళవారం తిరుగుతున్న కారు (ఏపీ 16డీఎఫ్ 1314) బోండా ఉమాదేనని ఏపీ ట్రాన్స్‌పోర్ట్ శాఖ వెబ్‌సైట్‌లో వివరాలు

ఏసీబీ వలలో పడిన డీఎస్పీ..

శిల్పా ఇంటికి ఎలా వెళతారు?

ఎమ్మెల్సీ గోపాల్‌రెడ్డి విమర్శ

సాక్షి, హైదరాబాద్: ఏసీబీకి పట్టుబడిన చరిత్ర ఉన్న డీఎస్పీ కేశవయ్య ఎన్నికల విధుల్లో పాల్గొనడానికే అనర్హుడని, అలాంటిది ఆయనను వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి ఇంటి వద్దకు పంపి చట్ట విరుద్ధంగా వ్యవహరించడం దారుణమని ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో విమర్శించారు. టీడీపీ అభ్యర్థిని గెలిపించే పనిలో పోలీసులు తలమునకలయ్యారని ఆయన దుయ్యబట్టారు. మంగళవారం రాత్రి వరకూ మంత్రులు, ఎమ్మెల్యేలు నంద్యాలలోను, పరిసర ఊర్లలో బస చేసి ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తుంటే పట్టించుకునే దిక్కులేదన్నారు. టీడీపీ నేతలు చీరెలు, జాకెట్లు, కుంకుమ భరిణెలు పంపిణీ చేస్తూ ప్రలోభాలకు గురి చేస్తున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు పాటుపడాల్సిన పోలీసులు ఏకపక్షంగా టీడీపీ విజయానికి కృషి చేయడం నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. ఇలాంటి దిగజారుడు విధానాలను ప్రోత్సహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దిగజారుడు రాజకీయాలు నడుపుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి పోలింగ్ ఏజెంట్లను కూడా నియమించుకోకుండా పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. అన్నీ గమనిస్తున్న విజ్ఞులైన నంద్యాల ఓటర్లు శిల్పా మోహన్‌రెడ్డిని గెలిపించాలని గోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

నంద్యాలలోనే మంత్రుల తిష్ట

- ఎన్నికల సంఘానికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు
- ఓటమి భయంతో అధికార పార్టీ అడ్డదారులు
- ఓటర్లను భయపెట్టేందుకు టీడీపీ యత్నాలు
- ముక్కుపుడకలు, చీరలు, మద్యం విచ్చలవిడిగా పంచుతున్నారు
- వెంటనే జోక్యం చేసుకుని నంద్యాలలో ప్రజాస్వామ్యాన్ని కాపాడండి



భన్వర్‌లాల్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ నేతలు కె.శివకుమార్, చల్లా మధుసూదన్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: నంద్యాల నియోజకవర్గాన్ని విడిచి వెళ్లిపోవాలంటూ ఎన్నికల సంఘం విధించిన గడువు ముగిసినా మంత్రులు, అధికార టీడీపీ నేతలు అక్కడే తిష్ట వేశారని ఎన్నికల సంఘానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. పోలింగ్ ప్రశాంతంగా జరగకుండా, ఓటర్లను భయభ్రాంతులను గురి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ నేతలు కె.శివకుమార్, చల్లా మధుసూదన్ రెడ్డి మంగళవారం ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్‌ను కలిశారు. నంద్యాలలో నిబంధనలను ఉల్లంఘిస్తున్న అధికార పార్టీపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

ఓటర్లను ప్రలోభపెడుతున్నారు

ఉప ఎన్నిక ప్రచారం గడువు ముగిసినా మంత్రులు, స్థానికేతర టీడీపీ నాయకులు ఇంకా నంద్యాలలో తిష్ట వేశారని, వారిని తక్షణమే బయటకు పంపాలని ఈసీని కోరినట్టు గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. బనగానపల్లెలో మంత్రులు కాల్వ శ్రీనివాసులు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, అఖిలప్రియ మకాం వేయడం నిబంధనల ఉల్లంఘన కాదా? అని ప్రశ్నించారు. ఆళ్లగడ్డలో మరో 12 మంది టీడీపీ ఎమ్మెల్యేలు తిష్టవేశారని పేర్కొన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తెలుగుదేశం పార్టీ నేతలు ముక్కుపుడకలు, చీరలు, మద్యం విచ్చలవిడిగా పంచుతున్నారని, తక్షణమే స్పందించాలని ఈసీని కోరినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లు ఎక్కువగా పండే ప్రాంతాల్లో ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు టీడీపీ కుట్ర పన్నుతోందన్నారు. నంద్యాలలో గెలవలేని ఆ పార్టీ అడ్డదారులను అన్వేషిస్తోందని ఆరోపించారు.

చంద్రబాబు ప్రెస్‌మీట్లను అడ్డుకోవాలి

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చానల్‌పై చర్య తీసుకోవాలని ఈసీకి ఫిర్యాదు చేసినట్లు గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈసీ ఆదేశాలను పట్టించుకోకుండా ఆ చానల్ సర్వే వివరాలను ప్రసారం చేసిందని, ఇందుకు సంబంధించిన సీడీని కూడా ఈసీకి అందజేశామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ అధికార పార్టీ నేతలు నిర్వహించే విలేకరుల సమావేశాలపైనా దృష్టి సారించాలని కోరినట్లు వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆదరిస్తున్న తీరును సహించలేక ఆంధ్రజ్యోతిలో తప్పుడు వార్తలు రాయిస్తున్నారని మండిపడ్డారు. ఓటర్లకు డబ్బులు పంచుతూ దొరికిపోయిన టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణపై వెంటనే చర్యలు తీసుకోవాలని భన్వర్‌లాల్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. ఎవరికి ఓటు వేశారో తమకు తెలుస్తుందంటూ ఓటర్లను టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని నంద్యాలలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని శ్రీకాంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఓటర్లను ప్రభావితం చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహిస్తున్న ప్రెస్‌మీట్లను అడ్డుకోవాలని ఈసీని కోరామన్నారు. దీనిపై భన్వర్‌లాల్ సానుకూలంగా స్పందించారని, చంద్రబాబు ప్రెస్‌మీట్లను కర్నూలు జిల్లాలో ప్రసారం కానివ్వబోమని హామీ ఇచ్చారని శ్రీకాంత్‌రెడ్డి వివరించారు.

'సాక్షి' చానల్‌పై ఈసీకి టీడీపీ ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా 'సాక్షి' చానల్ ఎన్నికల గుర్తుల్ని ప్రసారం చేసిందని, తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ తెలుగుదేశం పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు టీడీపీ నేతలు కొనకళ్ల నారాయణ, పల్లె రఘునాథరెడ్డి, కేశినేని నాని మంగళవారం ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్‌ను కలిశారు. అనంతరం కేశినేని నాని మీడియాతో మాట్లాడుతూ.. తాము ఇప్పటివరకు ఇచ్చిన ఫిర్యాదులపై ఆలస్యం చేయకుండా విచారణ జరిపించాలని ఈసీని కోరినట్టు చెప్పారు. నంద్యాలలో తమ పార్టీ ఓటుకు రూ.5 వేల చొప్పున పంచుతున్నట్టు చేస్తున్న ఆరోపణలకు రుజువులేంటని ప్రశ్నించారు. ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్‌పై చేసిన ఫిర్యాదును విలేకరులు ప్రస్తావించగా.. తాము ఆయనకిచ్చిన ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని, తక్షణమే స్పందించాలని కోరడమే దీని ఉద్దేశమని నాని నర్మగర్భంగా అన్నారు. అంటే.. ఈసీ తక్షణమే స్పందించట్లేదా? అని విలేకరులు ప్రశ్నించగా.. టీడీపీ నేతలు జవాబివ్వలేదు.

నంద్యాల ఎన్నికల్లో టీడీపీని ఓడించండి

ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు షేక్ జలీల్



సమావేశంలో మాట్లాడుతున్న షేక్ జలీల్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): మతతత్వ బీజేపీతో కేంద్రంలో, రాష్ట్రంలో పొత్తు పెట్టుకున్న టీడీపీని నంద్యాల ఎన్నికల్లో ఓడించాలని ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడు, ముస్లిం, క్రిస్టియన్ కూటమి చైర్మన్ ఎస్కే జలీల్ పిలుపునిచ్చారు. స్థానిక ముస్లిం ఐక్యవేదిక కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని బతికించేందుకు మతతత్వ శక్తులను ఓడించాలన్నారు. ముస్లిం, క్రైస్తవ మైనార్టీల సమస్యలు పరిష్కరించడంలో టీడీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ కనుమరుగవడం ఖాయమన్నారు. రిజర్వేషన్లు అమలు చేయడంలోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరారు. లౌకికవాదాన్ని కాపాడుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో చైతన్య యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో మైనార్టీ నాయకులు అబ్దుల్ రెహమాన్, అబ్దుల్ అజీజ్, ఖాజా హుస్సేన్, ఎస్.ఎ.షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలలో టీడీపీకి ఓటుతో బుద్ధిచెప్పండి

ఫార్మసీ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు అన్నపురెడ్డి పిలుపు

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ఫార్మసిస్టుల వ్యవస్థను సర్వనాశనం చేసిన టీడీపీ ప్రభుత్వానికి నంద్యాలలో ఓటుతో బుద్ధి చెప్పాలని ఫార్మసీ కౌన్సిల్ మాజీ అధ్యక్షులు అన్నపురెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఫార్మాసిస్టులను ఉద్దేశించి మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 45 వేల మంది ఫార్మాసిస్ట్‌లకు ఉపాధి కలుగుతుందని టీడీపీకి ఓటేస్తే, ఇప్పుడు వారి సంక్షేమాన్ని మరచి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గత మూడేళ్లుగా కౌన్సిల్‌కు ఎన్నికైన సభ్యులను పక్కన పెట్టి, ఫార్మసీ కౌన్సిల్‌ను అవినీతికూపంలా మార్చారని ఆరోపించారు. ఫార్మాసిస్టులు మృతి చెందినా వారి పేర్ల మీద అలాగే షాపులు కొనసాగిస్తున్న అవినీతిపరులకు ప్రభుత్వం కొమ్ముకాస్తూ, వేరొకరికి ఉపాధి కల్పించడంలో విఫలమైందన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీకి వ్యతిరేకంగా ఓటు వేసి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

పుర్రెలూ నిజాలు చెబుతాయి!



స్థానికులు ఇచ్చిన సమాచారంతో సికింద్రాబాద్‌లోని లాలాగూడా పోలీసులు దగ్గర్లోని ఒక డ్రైనేజీ దగ్గరకు వెళ్లారు. అప్పటికే అక్కడ జనం గుంపులుగా పోగై ఆసక్తిగా చూస్తున్నారు. పోలీసులు జనాన్ని నెట్టేస్తూ డ్రైనేజీ దగ్గరకు వెళ్లారు. ఎవరిదో శవం. చనిపోయి చాలా రోజులైనట్టుంది. చర్మం మొత్తం కుళ్లిపోయి ఊడిపోయింది. అస్థి పంజరం మాత్రమే ఉంది. పోలీసుల్లో ఒకతను దాన్ని లేపే ప్రయత్నం చేశాడు. మిగతా భాగాల నుంచి పుర్రె విడిపోయింది. అన్నింటినీ ఒక అట్టపెట్టెలో పెట్టారు.

తమిళనాడులోని సేలంకు దగ్గర్లోని ఓ పల్లెటూరది. 15 రోజుల క్రితం ముత్తుస్వామి సేలం పోలీసులకు తన కొడుకు పళనిస్వామి కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు. అతని మొబైల్ నెంబర్ ఆధారంగా పోలీసులు ఇన్వెస్టిగేషన్ చేశారు. లాలాగూడ సమీపంలోని సెల్ టవర్‌కు చివరిసారిగా ఆ మొబైల్ కనెక్ట్ అయినట్టు సమాచారం వచ్చింది. సేలం పోలీసులు లాలాగూడా పోలీసులకు రేడియో మెసేజ్‌తోపాటు ఫ్యాక్స్‌లో పళనిస్వామి ఫొటో పంపారు.



ఆంధ్రప్రదేశ్ ఫోరెన్సిక్ లేబొరేటరీలో గుర్తుతెలియని పుర్రెను, ఓ ఫొటోను సూపర్ ఇంపోజ్ చేశారు. గంట తర్వాత సైంటిఫిక్ ఆఫీసర్ ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ దగ్గరకొచ్చాడు. 'ఎస్.. ఆ ఫొటోలో వ్యక్తిదే ఆ పుర్రె.. తలపై కొట్టి హత్య చేసినట్టుంది. హత్యకు బలమైన రాడ్ ఉపయోగించినట్టుంది. హత్య తర్వాత మూడు అడుగుల దూరం శవాన్ని ఈడ్చుకెళ్లినట్టు తెలుస్తోంది' అని చెప్పాడు.

- నేర పరిశోధనలో 'సూపర్' ఇంపోజిషన్
- ఘటన తీరు.. స్థలం గుర్తించే ప్రక్రియ
- హత్యకు వాడిన ఆయుధం పసిగట్టే టెక్నిక్
- ఏయేటికాయేడు పెరుగుతున్న టెక్నాలజీ

సాక్షి, అమరావతి

పుర్రె, ఫొటో, టెక్నాలజీ ఆధారంగా.. చనిపోయిన వ్యక్తి ఆనవాళ్లను గుర్తించడాన్ని సూపర్ ఇంపోజిషన్ అంటారు. మిస్సింగ్ కేసుల్లో శాస్త్రీయ ఆధారంగా సూపర్ ఇంపోజిషన్ కీలక సమాచారం ఇస్తోంది. డిజిటల్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత స్పష్టమైన ఫలితాలు వస్తున్నాయి. నేర ప్రదేశంలో పుర్రె దొరికినప్పుడు దాన్ని ఫోరెన్సిక్ లేబొరేటరీలో అన్ని విధాలా పరీక్షిస్తారు. ప్రత్యేక స్టాండ్‌లో అమర్చి డిజిటల్ ఫొటో తీస్తారు. పుర్రెలోని అతి చిన్న ఎముకను కూడా పరీక్షించే కాంతి కిరణాలను దీని మీదకు పంపుతారు. ఔట్‌లైన్ ఆధారంగా ఆ పుర్రె వ్యక్తి ముఖం కోలగా, గుండ్రంగా ఉంటుందా? అసలా పుర్రె పురుషుడిదా? స్త్రీదా? అనే అంచనా వేస్తారు. పుర్రెలోని ఎముకల మందాన్ని బట్టి, అరుగుదలను బట్టి వయసును నిర్ధారిస్తారు. సాధారణంగా 35 ఏళ్ల తర్వాత నుంచి ఎముకలో అరుగుదల కనిపిస్తుంది. దవడ ఎముకలు, దంతాలు, వాటి మధ్య ఉన్న అంతరం (గ్యాప్) నేర పరిశోధనలో కీలకం. ఉదాహరణకు దంతాలు ఏ మేర అరిగిపోయాయి? ఎక్కడెక్కడ పుచ్చిపోయాయి? అనే వివరాలను బట్టి ఆ వ్యక్తి అలవాట్లు, వయసు తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. పుర్రె ఎముక భాగాలను లోతుగా డిజిటలైజ్ చేస్తారు కాబట్టి ఏ చిన్న ఎముకకు ఎలాంటి దెబ్బ తగిలినా సూపర్ ఇంపోజ్‌లో బయటపడుతుంది. ఎముక చిట్లిపోయే తీరును బట్టి.. హంతకుడు ఎలాంటి ఆయుధంతో.. ఎంత దూరం నుంచి కొట్టి ఉండొచ్చని అంచనా వేస్తారు. దగ్గర్నుంచి ఇనుప రాడ్‌తో మోది ఉంటే.. పుర్రెలోని కొన్ని ఎముకలు కన్పించనంతగా చిట్లిపోతాయి. వాస్తవానికి దీనిపై అభివృద్ధి చెందిన దేశాల్లో అనేక పరిశోధనలు జరిగాయి. పుర్రెలోని 60 ఎముకలను విడివిడిగా ఏ స్థాయి దెబ్బలకు ఏమేర పగిలిపోతాయి? ఎంత వరకూ చిట్లిపోతాయనే సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చారు. మన దేశంలో జాతీయ ఫోరెన్సిక్ లేబొరేటరీలోనూ ఇలాంటి పరిశోధనలు జరిగాయి. ప్రస్తుతం వీటినే రాష్ట్ర ఫోరెన్సిక్ లేబొరేటరీలు అనుసరిస్తున్నాయి.


ఇంపోజ్ ఇలా చేస్తారు..

మృతుడి ఫొటోను డిజిటల్ టెక్నాలజీ ద్వారా నెగెటివ్‌గా మారుస్తారు. పుర్రెను కూడా ఔట్‌లైన్‌తో నెగెటివ్ తీసుకుంటారు. రెండింటినీ స్టాండ్‌పై అమర్చిన బోర్డ్ మీదకు తీసుకొస్తారు. రెండింటి ఔట్‌లైన్స్ కచ్చితంగా సరిపోయేలా అమరుస్తారు. ముక్కు, ఎముక భాగాలు, దవడ, దంతాలు, తలపై భాగం.. ఇలా అన్నిటిని పరిశీలిస్తారు. పాయింట్ 5 తేడా కూడా లేకుండా నిక్కచ్చిగా రెండు నెగెటివ్‌లు కలిసిపోతే ఆ పుర్రె మృతుడిదే అని నిర్ధారిస్తారు. తర్వాత పుర్రెలో నిక్షిప్తమైన సమాచారాన్ని విశ్లేషిస్తారు. మద్యం సేవించే వ్యక్తి అయితే ఎముక మజ్జ అరిగిపోయి అంతర్భాగం క్రమంగా డొల్లగా మారుతుంది. దీన్ని కచ్చితంగా అంచనా వేస్తారు. వ్యక్తి చనిపోయిన తర్వాత ఎముకల్లో ఉండే కొన్ని రకాల రసాయనాలు అక్కడి వాతావరణ పరిస్థితులను బట్టి మారతాయి. ఘటన స్థలానికి సమీపంలో రసాయన పరిశ్రమలుంటే అవి అస్థి పంజరంలోని ఎముకలను కొరికేస్తాయి. 24 గంటల్లో ఈ ప్రక్రియ ఏమేర ఉంటుందనే అంచనా ఫోరెన్సిక్ నిపుణులకే తెలుసు. దీన్నిబట్టి ఎన్ని రోజుల క్రితం హత్య జరిగిందనే నిర్ధారణకు వస్తారు. ఎముకపై రసాయన ప్రభావాలను బట్టి ఏ ప్రాంతంలో మృతదేహం ఎక్కువ కాలం ఉంచారనే విశ్లేషణ చేస్తారు. నొసటి భాగంలో చిన్న ఎముకలుంటాయి. కళ్లజోడు వాడే వ్యక్తికి ఆ ఎముకలపై ఒత్తిడి ఉంటుంది. ఈ ప్రభావాన్ని పరిశీలించి, ఆ వ్యక్తి ఎన్నేళ్ల నుంచి కళ్లజోడు వాడుతున్నాడు? అనేది గుర్తిస్తారు. దీన్నిబట్టి కూడా వయసు నిర్ధారణకు వీలవుతుంది.

దేశంలో ఇప్పటివరకు జరిగిన ఇంపోజిషన్..

దేశంలో సూపర్ ఇంపోజిషన్ గుర్తింపు సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మన ఫోరెన్సిక్ నిపుణులు అంతర్జాతీయంగా జరిగే పరిశోధనల్లో భాగస్వాములవుతున్నారు. వారి అనుభవాలను, పరిశోధన ఫలితాలను పరిగణనలోనికి తీసుకుంటున్నారు.

సూపర్ ఇంపోజిషన్ చేసిన కేసులు (సంవత్సరం)



అనుబంధ సమాచారమే..

నేర దర్యాప్తును ముందుకు తీసుకెళ్లేందుకు మాత్రమే సూపర్ ఇంపోజిషన్ వీలు కల్పిస్తుంది. దీన్ని ప్రధాన సాక్ష్యంగా న్యాయస్థానాలు పరిగణలోనికి తీసుకోవు. అయితే, దర్యాప్తులో ఇప్పుడిది కీలక భూమిక పోషిస్తోంది. నెట్‌వర్క్ విస్తృతమవ్వడం, అంతర్రాష్ట్ర నేరస్తుల వివరాలను దేశవ్యాప్తంగా అనుసంధానం చేసే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ఇంపోజిషన్ సులభమవుతోంది. పోలీసులకు కూడా దీనిపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. మిస్సింగ్ కేసుల్లో సెల్‌ఫోన్ ద్వారా సమాచారం సేకరిస్తారు. ఆ వ్యక్తి చివరిగా ఎక్కడ తప్పిపోయాడో తెలుసుకుంటారు. ఆ ప్రాంతంలో లభించిన గుర్తుతెలియని మృతదేహాల వివరాలు పోలీస్ నెట్‌వర్క్‌లో అందుబాటులో ఉంటాయి. కాబట్టి ఫలానా వ్యక్తి కావచ్చని ఓ అంచనాకు వచ్చిన తర్వాత.. ఆ అనుమానాన్ని ఫోరెన్సిక్ లేబొరేటరీకి పంపి, పుర్రె, మిస్సింగ్ వ్యక్తి ఫొటోను పంపుతున్నారు.

కారు ఇంజన్‌లోకి పాము

హైదరాబాద్: కారు ఇంజన్‌లోకి పాము దూరింది. ఈ సంఘటన హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. వోడాఫోన్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న ఎ.ఎస్.చౌదరి బిజినెస్ పని మీద ఏపీ 28 డీయూ 3121 అనే నంబర్ గల కారులో రైల్వేగేట్ సమీపంలోని ఒక మొబైల్ షాప్‌కు వచ్చారు. ఈ సమయంలో కారు ముందు ఇంజన్ భాగంలో పాము ఉన్నట్లు గుర్తించిన స్థానికులు చౌదరికి తెలపారు. వెంటనే ఆయన ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీకి సమాచారం అందించారు. సొసైటీ నుంచి వచ్చిన మహ్మద్ అస్లాం, మెకానిక్ సాయంతో ఇంజిన్ కింది భాగంలో ఉన్న పాము పిల్లను బయటకు తీశారు. ఇంజిన్‌లోకి పాము ఎలా వెళ్లిందో తెలియదని చౌదరి తెలిపారు.


కారు ఇంజన్‌లో నుంచి తీసిన పాము

రేపట్నుంచి భారీ వర్షాలు

ఈశాన్య బంగాళాఖాతంలో ఆవర్తనం • కొనసాగుతున్న ద్రోణి

సాక్షి, విశాఖపట్నం: ఈశాన్య బంగాళాఖాతంలో మంగళవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. మరోవైపు ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు కోస్తాంధ్ర, రాయలసీమల మీదుగా అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోంది. ఉపరితల ఆవర్తనం గురువారం నాటికి బలపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. వీటి ఫలితంగా బుధవారం కోస్తాంధ్రలో పలుచోట్ల, రాయలసీమలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావారణ విభాగం (ఐఎండీ) మంగళవారం తెలిపింది. గురువారం నుంచి మూడు రోజులపాటు కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలకు ఆస్కారం ఉందని ఐఎండీ వెల్లడించింది. గడచిన 24 గంటల్లో రాయచోటిలో 4, పుంగనూరు, సత్యవేడు, చిన్నమండెం, కొమరాడ, రాచెర్ల, బొబ్బిలి, తెనాలి, వెలిగండ్లలో 3 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది.

పిడుగుపడి పేలిన సెల్‌ఫోన్


సబ్బవరం (పెందుర్తి): ఫోన్‌లో మాట్లాడుతుండగా సమీపంలో పిడుగుపడి ఫోన్ పేలిపోయి యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. విశాఖ జిల్లా సబ్బవరం మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నాయనమ్మపాలెం గ్రామంలో పిడుగుపడింది. అదే సమయంలో పిడుగుపడ్డ ప్రాంతానికి సమీపంలో గ్రామానికి చెందిన మార్టూరి అశోక్ (22) గొడుగు వేసుకుని పశువులను మేపుకొంటూ ఫోన్లో మాట్లాడుతున్నాడు. పిడుగు తాకిడికి ఫోన్ పేలిపోయి యువకుడి కుడి చెవి, కుడి చెయ్యి, కుడి కాలు తీవ్రంగా కాలిపోయాయి. గమనించిన స్థానికులు బాధితుడిని మంగళవారం రాత్రి 108లో విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.


బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

చెన్నై విమానాశ్రయంలో 17 కిలోల బంగారం స్వాధీనం

అన్నానగర్: చెన్నై విమానాశ్రయంలో ఓ సంచిలో ఉన్న 17 కిలోల బంగారు బిస్కెట్లు, నగలను సోమవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.4 కోట్ల 60 లక్షలు ఉంటుందని కస్టమ్స్ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి సంబంధించి ప్రయాణికుల బ్యాగులను ట్రాలీల్లో తీసుకుని వెళ్లే ప్రైవేటు సంస్థకి చెందిన తాత్కాలిక కార్మికులు కుమార్ (30), విస్కాన్ (32)లను అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. చెన్నై నుంగంబాక్కం విమానాశ్రయానికి విదేశాల నుంచి వచ్చే విమానాల్లో బంగారంను అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో వారు తనిఖీలు చేస్తుండగా విమానాశ్రయంలో ఓ సంచి అనుమానాస్పదంగా కనబడింది. అందులో బాంబు ఉందనుకుని భావించిన అధికారులు బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలకు సమాచారం అందించారు. బాంబ్ స్క్వాడ్ బృందం సంచిని తెరిచి చూడగా అందులో బంగారు బిస్కెట్లు, నగలు ఉన్నట్లు గుర్తించింది. వీటిని అధికారులు స్వాధీనం చేసుకుని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించారు. బంగారు బిస్కెట్లు, నగలు ఉన్న సంచిని సింగపూర్ నుంచి వచ్చిన విమానంలో నుంచి తీసుకుని వచ్చారని, దీనిని ఇద్దరు కార్మికులు ట్రాలీల్లో విమానాశ్రయంలోని ప్లాట్‌ఫాంపైకి తీసుకుని వచ్చినట్లు గుర్తించారు. ఈ మేరకు ఇద్దరు కార్మికులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పొరుగు రాష్ట్రాలకు గంటలోనే విద్యుత్



- విద్యుత్ ఇచ్చిపుచ్చుకునే సరికొత్త విధానానికి రూపకల్పన
- ఎస్ఆర్‌పీసీ ముసాయిదాపై దక్షిణాది రాష్ట్రాల ఏకాభిప్రాయం
- త్వరలో విధివిధానాల రూపకల్పన, ఒప్పందం ఖరారు

సాక్షి, హైదరాబాద్: దక్షిణాది రాష్ట్రాల మధ్య విద్యుత్ ఇచ్చిపుచ్చుకునేందుకు సరికొత్త విధానం అనుసరించే విషయంలో భాగస్వామ్య రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. దక్షిణాదిలో ఏ రాష్ట్రానికి విద్యుత్ అవసరం ఉన్నా, గంటలోపు పక్క రాష్ట్రాల నుంచి పొందేలా ఈ కొత్త విధానానికి రూపకల్పన చేశారు. ఇది అమల్లోకి వస్తే ఎలాంటి జాప్యానికి అవకాశం లేకుండా ఇరుగు పొరుగు రాష్ట్రాలు విద్యుత్ ఇచ్చిపుచ్చుకునే వెసులుబాటు కలుగుతుంది. త్వరలో దీనికి సంబంధించి దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ సంస్థలు ఒప్పందం కుదుర్చుకోనున్నారు. దక్షిణ భారత రాష్ట్రాల విద్యుత్ కమిటీ(ఎస్ఆర్‌పీసీ) అధ్యక్షుడు, తెలంగాణ ట్రాన్స్కో సీఎండీ డి.ప్రభాకర్‌రావు అధ్యక్షతన కేరళ రాజధాని తిరువనంతపురంలో సోమ, మంగళవారాల్లో కమిటీ సమావేశాలు జరిగాయి. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల మధ్య సరళమైన విద్యుత్ విధానానికి సంబంధించి ప్రాథమిక చర్చలు జరిగాయి. ఆ సమావేశాల్లోనే ఎస్ఆర్‌పీసీ సభ్య కార్యదర్శి ఎస్ఆర్ భట్ నేతృత్వంలో కమిటీని నియామించారు. కొత్త విధానానికి సంబంధించి ఈ కమిటీ ముసాయిదాను తయారు చేసి తిరువనంతపురం సమావేశంలో ప్రవేశపెట్టింది. దీనిపై రెండు రోజుల పాటు చర్చ జరిగింది. ప్రభాకర్‌రావుతో పాటు సభ్య కార్యదర్శి ఎస్ఆర్ భట్, కేరళ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు సీఎండీ కె.ఎలంగోవన్, కర్ణాటక ట్రాన్స్కో ఎండీ జావేద్ అక్తర్, ఏపీ ట్రాన్స్కో సీఎండీ విద్యావంతుల, తమళనాడు ట్రాన్స్కో ఎండీ ఎస్.షణ్ముగం, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు చర్చలో పాల్గొని ముసాయిదా ఒప్పందానికి ఆమోదం తెలిపారు.

ముసాయిదా సారాంశం..

దక్షిణ భారతదేశ పరిధిలోని పొరుగు రాష్ట్రంలో ఎక్కడ విద్యుత్ అవసరం ఉన్నా.. మిగులు విద్యుత్ కలిగిన రాష్ట్రం నుంచి పొందవచ్చని ముసాయిదాలో పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా విషయాల్లో పరస్పరం సహకరించుకోవాలని కూడా నిర్ణయించారు. ప్రస్తుతం విద్యుత్ కొనుగోళ్లన్నీ పవర్ ఎక్స్ఛేంజ్ ద్వారానే జరగాలి. ఈ విధానం వల్ల క్రయవిక్రయాల్లో జాప్యం జరుగుతోంది. ఈ విధానం వల్ల ఒకరోజు ముందుగానే సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఒకరోజు ముందే అంచనా వేయడం వల్ల అది వాస్తవ పరిస్థితికి తగ్గట్టు ఉండడం లేదు. ఈ పరిస్థితిని నివారించడానికి దక్షిణాది రాష్ట్రాలు ఎప్పుడు కావాలంటే అప్పుడు గంట వ్యవధిలోనే పక్క రాష్ట్రం నుంచి విద్యుత్ పొందవచ్చు. క్రయ విక్రయాలకు సంబంధించి ప్రతీసారి ఒప్పందం కుదుర్చుకోవాల్సిన అవసరం లేదు. ఈ విధానం వల్ల ఏ రోజు డిమాండ్‌ను ఆ రోజే అంచనా వేసి విద్యుత్‌ను పొందడమో, అందివ్వడమో చేయొచ్చు. దీని వల్ల మిగులు విద్యుత్ రాష్ట్రాలకు, లోటు విద్యుత్ రాష్ట్రాలకు మేలు కలుగుతుంది. ఎవరికి విద్యుత్ కావాలన్నా, ఎవరు విద్యుత్ ఇవ్వాలనుకున్నా ఈ సమాచారాన్ని సదరన్ లోడ్ డిస్పాచింగ్ సెంటర్‌కు సమాచారం అందివ్వాలి. దక్షిణాది రాష్ట్రాల మధ్య విద్యుత్ ఇచ్చిపుచ్చుకోవడం సదరన్ లోడ్ డిస్పాచింగ్ సెంటర్ ద్వారానే జరుగుతాయి. ఈ ముసాయిదాను సభ్య రాష్ట్రాలు రెండు రోజులపాటు కూలంకషంగా చర్చించాయి. త్వరలోనే ఈ విధానం అమలుకు విధివిధానాలు రూపొందించుకోవాలని, ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించాయి.

ప్రైవేటుగా చదివిన వారికే 'స్థానికత' సర్టిఫికెట్లు

జీవో జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: స్థానికత (లోకల్ స్టేటస్ సర్టిఫికెట్ల) జారీకి ప్రభుత్వం నిబంధనలను సవరించింది. నాలుగు నుంచి పదో తరగతి వరకు ప్రైవేటుగా చదివిన విద్యార్థులకు మాత్రమే లోకల్ స్టేటస్ సర్టిఫికెట్లు ఇవ్వాలంటూ రెవెన్యూ శాఖ తహసీల్దార్లను ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం జీవో జారీ చేసింది. రెగ్యులర్‌గా చదివిన వారికి లోకల్ స్టేటస్‌కు స్టడీ సర్టిఫికెట్ ఉంటే సరిపోతుంది. ఇతరులు మాత్రం ఆధార్, రేషన్ కార్డులు సమర్పించాల్సి ఉంటుంది. నాలుగు నుంచి పదో తరగతి మధ్య ప్రైవేటుగా చదివిన విద్యార్థులకు మాత్రం 'స్థానికత ' సర్టిఫికెట్లు అవసరం. వీరికి లోకల్ స్టేటస్ సర్టిఫికెట్ కావాలంటే 4,10 తరగతులు ప్రైవేటుగా చదివినట్లు వ్యక్తిగత ధ్రువీకరణ పత్రం (సెల్ఫ్ డిక్లరేషన్)తో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని జీవోలో పేర్కొంది.

విజయవాడలో రూ. 10 కోట్లతో కళాభవన్

సాంస్కృతిక శాఖ సమీక్షలో చంద్రబాబు

సాక్షి, అమరావతి: విజయవాడ సత్యనారాయణపురంలో కళాభవన్ నెలకొల్పాలనే సాంస్కృతిక శాఖ ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. రూ. 10 కోట్లతో నిర్మించే కళాభవన్ కోసం ఇప్పటికే స్థలాన్ని గుర్తించామన్నారు. మంగళవారం వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో సీఎం సాంస్కృతిక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని 110 పురపాలక పట్టణాలు, నగరాల్లో ఆనంద లహరి పేరుతో వారాంతపు వినోద కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రొఫెషనల్ ఆర్టిస్టులు, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులతో వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, పోటీలు నిర్వహించడంతో పాటు హస్తకళల ప్రదర్శనలు, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. పలు సామాజిక అంశాలతో కళా, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ కార్యక్రమాల కోసం పార్ట్‌టైమ్ ప్రాతిపదికన శిక్షకులను నియమిస్తామన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో స్థానిక రుచులతో ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సీఎం మాట్లాడుతూ.. తరచూ ఫుడ్ ఫెస్టివల్స్ నిర్వహించి ప్రజలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని రుచులను అందుబాటులో ఉంచాలన్నారు. వచ్చే నెలలో వెలగపూడి సచివాలయంలో ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు ముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు.

జాతీయస్థాయి గులాబీ ప్రదర్శనకు ఏర్పాట్లు

- భవానీ, పున్నమి ఘాట్ల వద్ద ఐదెకరాల్లో మొక్కల పెంపకం
- డిసెంబర్ 23 నుంచి 25 వరకు ప్రదర్శన


విజయవాడ సెంట్రల్ : ఆల్ ఇండియా 36వ గులాబీ ప్రదర్శన (రోజ్ కన్వెన్షన్ ప్రదర్శన) డిసెంబర్ 23 నుంచి 25 వరకూ విజయవాడ నగరంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.నివాస్ చెప్పారు. నగరపాలక సంస్థ, రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఏపీ అర్బన్ గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ప్రదర్శనకు అనువైన ప్రాంతాలను మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నగరంలో అభ్యుదయ కాలనీలోని రోజ్‌గార్డెన్‌ను పరిశీలించిన ఉద్యానశాఖ అధికారి పుండరీకాక్షుడు జాతీయస్థాయి ప్రదర్శనకు ఆ ప్రాంతం సరిపోదన్నారు. జాతీయస్థాయిలో సుమారు 250 మంది ప్రతినిధులతో పాటు విదేశాల నుంచి డెలిగేట్స్ వచ్చే అవకాశం ఉందని చెప్పారు. భవానీ, పున్నమిఘాట్ల వద్ద సుమారు ఐదు ఎకరాల స్థలంలో ఏపీ అర్బన్ గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ పర్యవేక్షణలో, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రోజ్‌గార్డెన్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఆ ప్రాంతంలో గులాబీ ప్రదర్శనకు 250 స్టాల్స్‌ను ఏర్పాటుచేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రదర్శనకు వచ్చే ప్రతినిధులు నగరంలోని పలు ప్రదేశాలను సందర్శించే అవకాశం ఉన్నందున ఎయిర్‌పోర్టు నుంచి బెంజిసర్కిల్, స్క్రూ బ్రిడ్జి, ఎంజీరోడ్డులో సెంట్రల్ డివైడర్లను గ్రీనరీతో అభివృద్ధి చేయాల్సిందిగా కమిషనర్ అధికారుల్ని ఆదేశించారు. రాజీవ్‌గాంధీ పార్కులోని మ్యూజిక్ ఫౌంటేషన్ చుట్టూ 1,500 గులాబీ మొక్కల కుండీల్ని ఏర్పాటు చేయాల్సిందిగా సూచించారు. నగరపాలక సంస్థ ఏడీహెచ్ ప్రదీప్‌కుమార్, రోజ్ సొసైటీ ఆఫ్ ఏపీ ప్రతినిధులు టి.అఖిలాండేశ్వరరాణి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


పున్నమిఘాట్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ధూప దీప నైవేద్యాలతో ఆలయాలు వర్ధిల్లాలి

కమలానంద భారతి స్వామిజీ


వెంకటగిరి రూరల్ : రాష్ట్రంలోని అన్ని ఆలయాలు నిరంతరం ధూపదీప నైవేద్యాలు, పూజలతో వర్ధిల్లాలని హిందూ దేవాలయ ప్రతిష్ఠన పీఠాధిపతి కమలానంద భారతి స్వామిజీ పేర్కొన్నారు. వెయ్యి గ్రామాల సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శన రథయాత్రలో భాగంగా మంగళవారం నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలం దాచెరువు, లాలాపేట, టీడీపల్లి, మొక్కలపాడు, పాళెంకోట గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల ఉండే ప్రతి ఆలయాన్ని అభివృద్ధి చేసే దిశగా సందర్శన రథయాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తితో నిర్వహించాలే తప్ప హిందూ సమాజానికి మచ్చ తెచ్చేలా ఉత్సవాల్లో రికార్డింగ్ డ్యాన్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించొద్దని సూచించారు. బుధవారం వెంకటేశ్వరపురం, ఆర్ఎస్ కండ్రిగ, సుంకరవారిపల్లి, వడ్డిపల్లి, సోమసానిగుంట, ఎరువ అరవపాళెం, బ్యాండుపాళెం, కుర్జాగుంట గ్రామాల్లో రథయాత్ర సాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సమరత సేవా ఫౌండేషన్ మండల కో–ఆర్డినేటర్ శేషాద్రి, మాజీ మండలాధ్యక్షుడు రామచంద్రయ్య పాల్గొన్నారు.


భక్తులతో మాట్లాడుతున్న కమలానందభారతి స్వామిజీ

కోర్టులంటే జోక్ అయిపోయింది!

- తెలంగాణ హోంశాఖ ముఖ్య కార్యదర్శిపై హైకోర్టు మండిపాటు
- అదనపు పీపీల నియామకపు రికార్డులను సమర్పించాలని ఆదేశం
- వచ్చే వారం కల్లా కౌంటర్ దాఖలు చేయండి
- లేకుంటే స్వయంగా కోర్టు ముందు హాజరుకండి
- ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (ఏపీపీ) నియామకం విషయంలో ఆ రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి కౌంటర్ దాఖలు చేయకపోవడం పట్ల ఉమ్మడి హైకోర్టు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. కోర్టులంటే అధికారులకు జోక్ అయిపోయిందంటూ మండిపడింది. వచ్చే వారానికల్లా కౌంటర్ దాఖలు చేయాలని, లేనిపక్షంలో హోంశాఖ ముఖ్య కార్యదర్శి స్వయంగా కోర్టు ముందు హాజరు కావాలని హైకోర్టు తేల్చి చెప్పింది. అదనపు పీపీల నియామకానికి సంబంధించిన అన్నీ రికార్డులను కూడా తమ ముందుంచాలంది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (జస్టిస్) రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా కోర్టులో అదనపు పీపీల నియామకం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోందంటూ హైకోర్టులో మూడు వ్యాజ్యాలు దాఖలైన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలపై ఇటీవల విచారణ జరిపిన ధర్మాసనం అదనపు పీపీల నియామకపు ప్రక్రియపై స్టే విధిస్తూ, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. మంగళవారం ఈ వ్యాజ్యాలు విచారణకు రాగా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కౌంటర్ దాఖలు చేయకుండా, మరింత గడువు కావాలని కోరడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. చివరి అవకాశం ఇవ్వాలని ప్రభుత్వ సహాయ న్యాయవాది అభ్యర్థించడంతో ధర్మాసనం అందుకు అంగీకరిస్తూ విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.



టీడీపీకి త్వరలో కవిత రాజీనామా!

నామినేటెడ్, ఎమ్మెల్సీ పదవుల భర్తీలో ఆర్యవైశ్యులకు అన్యాయం జరిగిందని అసంతృప్తి



సాక్షి, అమరావతి: సినీ నటి కవిత త్వరలో తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయనున్నట్టు తెలిసింది. టీడీపీలో ఆర్యవైశ్యులకు అన్యాయం జరుగుతోందని ఆమె తన అనుయాయుల వద్ద మంగళవారం ప్రస్తావించినట్టు సమాచారం. పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు లేదని ఆమె ఆగ్రహంతో ఉన్నట్టు తెలుస్తోంది. నామినేటెడ్, ఎమ్మెల్సీ పదవుల భర్తీలో ఆర్యవైశ్యులకు అన్యాయం జరిగిందని, తనకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తానని చంద్రబాబు మోసం చేశారని కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు ఆమె అనుచరవర్గాల సమాచారం. ఎన్టీఆర్ నాటి టీడీపీకి చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీకి పోలికే లేదని ఆమె భావిస్తున్నట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. ఫిరాయింపుదారులను చేర్చుకోవడంతో పార్టీ పరువు మరింతగా దిగజారి పోయిందని ఆమె వ్యాఖ్యానించారని సమాచారం. వైజాగ్‌లో జరిగిన పార్టీ మహానాడులో తనను తీవ్రంగా అవమానించి కన్నీళ్లు పెట్టించిన చంద్రబాబుకు ఆర్యవైశ్య ఆడపడుచుల ఉసురు తగులుతుందని కవిత అప్పట్లో ఆవేదన వ్యక్తం చేశారు.

వెన్నుపోటు వెన్నతో పెట్టిన విద్య

సీఎం చంద్రబాబుపై లక్ష్మీపార్వతి విమర్శ



సాక్షి ప్రత్యేక ప్రతినిధి, కాకినాడ: పిల్లనిచ్చి, రాజకీయాల్లో పైకి తీసుకొచ్చిన ఎన్టీ రామారావును మొదలుకొని.. నేడు అన్ని వర్గాల ప్రజలకూ చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని, ఇది ఆయనకు వెన్నతో పెట్టినవిద్య అని వైఎస్సార్‌సీపీ నాయకురాలు నందమూరి లక్ష్మీపార్వతి విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ తొలి దఫా తొమ్మిదేళ్లలోనే చంద్రబాబు దారుణమైన పాలనను చూసి ప్రజలు బుద్ధి చెప్పారని, పదేళ్లపాటు ప్రతిపక్షంలో కూర్చోబెట్టారని గుర్తు చేశారు. ఈ దఫా మూడేళ్ల పాలన అంతకుమించి దిగజారిపోయిందన్నారు. ఆయన హయాంలో హెరిటేజ్ ఆస్తులు, దోపిడీ, అవినీతి మాత్రమే పెరిగాయి తప్ప అభివృద్ధి కాదని చెప్పారు. డబ్బులు వెదజల్లి, గిమ్మిక్కులు చేసి ఎన్నికల్లో గెలిచేద్దామంటే అన్నిసార్లూ సాధ్యం కాదన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఆయన ప్రకటించిన నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలు అమలై రాష్ట్రంలో నవరత్నాలు నిండాలంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలన్నారు. దీనికి నాందిగా నంద్యాల, కాకినాడ ప్రజలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, పార్టీ నేతలు చెల్లుబోయిన వేణు, ఆకుల వీర్రాజు పాల్గొన్నారు.

వచ్చే నెలలో రజనీ పార్టీ ఆవిర్భావం ?

సాక్షి ప్రతినిధి, చెన్నై: తమిళనాడు సూపర్‌స్టార్ రజనీకాంత్ సెప్టెంబర్‌లో రాజకీయ అరంగేట్రం ఖాయమని ఆయన అభిమాని ఒకరు మంగళవారం మీడియాకు తెలిపారు. చెన్నైలో అభిమానులు ఏర్పాటుచేసే మహానాడులో పార్టీ పేరు, చిహ్నాన్ని అధికారికంగా ప్రకటించి పతాకాన్ని కూడా విడుదల చేస్తారని ఆయన పేర్కొన్నారు. రజనీ సన్నిహితుల నేతృత్వంలో ఇందుకు సంబంధించి ఏర్పాట్లు, మేనిఫెస్టో రూపకల్పన జరుగుతున్నాయని చెప్పారు. రజనీ నటించిన 2 ఓ షూటింగ్ పూర్తయిందని, కాలా చిత్రం పనులు త్వరలో ముగించుకుని వచ్చే నెలలో పార్టీ కార్యక్రమాల్లో ఆయన నిమగ్నమవుతారని తెలిపారు. రాఘవేంద్ర కల్యాణ మండపంలో సెప్టెంబర్‌లో అభిమానులతో సమావేశమై పార్టీ ప్రకటన తేదీపై తుదినిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. వచ్చే నెలలో వీలుకాని పక్షంలో డిసెంబర్ 12వ తేదీ ఆయన జన్మదినం రోజున, లేదా 2018 జనవరిలో 2 ఓ చిత్రం విడుదలయ్యాక పూర్తిస్థాయిలో రాజకీయ రంగప్రవేశం చేస్తారని అభిమాని వివరించారు.

నల్లమలలో రైలు ఢీకొని చిరుత మృతి

మహానంది: నల్లమల ఘాట్‌లోని బొగద వద్ద సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో రైలు ఢీకొని ఆడ చిరుత పులి మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న నంద్యాల డీఎఫ్‌ఓ శివప్రసాద్, పశు వైద్యాధికారి డాక్టర్ కరుణాకర్, సిబ్బంది మంగళవారం ఘటనా స్థలానికి వెళ్లి చిరుతపులికి పోస్టుమార్టం నిర్వహించారు. నంద్యాల–గుంటూరు రైల్వేలైన్‌లోని 223/8 కిలోమీటరు రాయి వద్ద ప్రమాదం చోటు చేసుకున్నట్లు డీఎఫ్‌ఓ వెల్లడించారు. రైల్వేట్రాక్ దాటుతుండగా వేగంగా వస్తున్న రైలు ఢీకొట్టడంతో చిరుతపులి అక్కడికక్కడే మృతి చెందిందన్నారు. దీని వయసు రెండున్నరేళ్లు ఉంటుందని తెలిపారు. వన్యప్రాణులకు హాని కలగకుండా నల్లమల అడవిలో రైళ్ల వేగాన్ని తగ్గించాలని రైల్వే శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాస్తామని డీఎఫ్‌ఓ చెప్పారు.

నీటి లభ్యత తగ్గితే దామాషా పద్ధతి

కేంద్రానికి లేఖ రాయాలని కేఆర్‌ఎంబీ నిర్ణయం

- కృష్ణా నీటి పంపిణీలో దిగువ రాష్ట్రాలకు ఊరట
- ఏకాభిప్రాయం మేరకే రెండోదశ టెలీమీటర్ల ఏర్పాటు
- అదనపు వాటాకు తెలంగాణ డిమాండ్‌ను తోసిపుచ్చిన బోర్డు



విజయవాడలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అధికారులతో కృష్ణాబోర్డు సమావేశాన్ని నిర్వహిస్తున్న బోర్డు చైర్మన్ శ్రీవాత్సవ

సాక్షి, అమరావతి: కృష్ణా నదిలో నీటి లభ్యత తగ్గినప్పుడు దిగువ రాష్ట్రాల ప్రయోజనాలు పరిరక్షించేలా దామాషా పద్ధతిలో నీటిని పంపిణీ చేసే విధానాన్ని అమలు చేయాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) నిర్ణయించింది. తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ, కృష్ణా బోర్డు వర్కింగ్ మాన్యువల్ (కార్యనిర్వాహక నియమావళి) ముసాయిదా రూపకల్పనపై నివేదిక ఇచ్చేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన ఏకే బజాజ్ కమిటీకి ఈ లేఖను పంపనుంది. ఈ ఏడాది కృష్ణాలో నీటి లభ్యత కనిష్ట స్థాయికి పడిపోయిన నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొన్నందున.. మహారాష్ట్ర, కర్ణాటక ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటిని విడుదల చేయించాలని కోరనుంది. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా మంగళవారం విజయవాడలో చైర్మన్ ఎస్కే శ్రీవాత్సవ నేతృత్వంలో కృష్ణా బోర్డు సమావేశమైంది. సభ్య కార్యదర్శి సమీర్ ఛటర్జీ, రెండు రాష్ట్రాల జలవనరుల శాఖ కార్యదర్శులు శశిభూషణ్‌కుమార్, ఎస్కే జోషి, ఈఎన్‌సీలు ఎం.వెంకటేశ్వరరావు, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. కృష్ణా నది పరివాహక ప్రాంతంలోని మహారాష్ట్ర, కర్ణాటకల్లో భారీ వర్షాలు కురిసి.. కోయినా, ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు పూర్తిగా నిండినా, ఆ రాష్ట్రాలు దిగువకు నీటిని విడుదల చేయకుండా.. కేటాయించిన జలాలకన్నా అధికంగా నీటిని వినియోగించుకుంటున్నాయని రెండు రాష్ట్రాల అధికారులు బోర్డు దృష్టికి తీసుకొచ్చారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో నీటి నిల్వలు పూర్తిగా (డెడ్ స్టోరేజీ) పడిపోయాయని, తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రస్తావించారు. దిగువ రాష్ట్రాలకు న్యాయం చేసే నీటి పంపిణీ విధానాన్ని అమలు చేసేలా కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. ఈ ప్రతిపాదనతో ఏకీభవించిన బోర్డు చైర్మన్ ఈ మేరకు కేంద్రానికి లేఖ రాస్తామని హామీ ఇచ్చారు.

టెలీమీటర్ల ఏర్పాటుపై కుదరని సయోధ్య

కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఇరు రాష్ట్రాల నీటి వినియోగం లెక్కలు తేల్చేందుకు తొలి దశలో 18 ప్రాంతాల్లో బోర్డు టెలీమీటర్లను ఏర్పాటు చేసింది. రెండో దశలో 29 ప్రాంతాల్లో టెలీమీటర్లు ఏర్పాటు చేయాలన్న బోర్డు ప్రతిపాదనపై ఏపీ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏపీలో మరో 17 ప్రాంతాల్లో టెలీమీటర్లు ఏర్పాటు చేయాలన్న తెలంగాణ సర్కార్ ప్రతిపాదనపై కూడా అభ్యంతరం వ్యక్తం చేసింది. టెలీమీటర్ల ఏర్పాటుపై మార్గదర్శకాలు రూపొందించాలని, వాటిపై చర్చించాక ఏకాభిప్రాయంతో రెండో దశ టెలీమీటర్ల ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని సూచించగా బోర్డు అంగీకరించింది.

ఈ ఏడాదీ అదే సర్దుబాటు

పునర్విభజన చట్టం మేరకు 2015లో ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీల చొప్పున పంపిణీ చేస్తూ కేంద్రం చేసిన తాత్కాలిక సర్దుబాటునే ఈ ఏడాది అమలు చేయాలని బోర్డు నిర్ణయించింది. 812 టీఎంసీల కన్నా అధికంగా నీటి లభ్యత ఉంటే.. ఇదే నిష్పత్తిలో ఇరు రాష్ట్రాలకు పంపిణీ చేస్తామని పేర్కొంది. పట్టిసీమ ద్వారా ఏపీ కృష్ణా డెల్టాకు తరలించిన గోదావరి జలాలకుగానూ కృష్ణా జలాల్లో తమకు అదనపు వాటా ఇవ్వాలన్న తెలంగాణ డిమాండ్‌ను బోర్డు తోసిపుచ్చింది.

రెండో దశలో టెలీమీటర్ల ఏర్పాటుకు 4కోట్లు

కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో రెండో దశలో టెలీమీటర్ల ఏర్పాటుకు వీలుగా కృష్ణా బోర్డు ఖాతాలో రూ.నాలుగు కోట్లను జమ చేస్తూ మంగళవారం జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇరు రాష్ట్రాల నీటి వినియోగం లెక్కలు తేల్చేందుకు కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల పరిధిలో టెలీమీటర్లను ఏర్పాటు చేయాలని బోర్డు నిర్ణయించిన విషయం విదితమే. టెలీమీటర్ల ఏర్పాటుకు అవసరమైన నిధులను రెండు రాష్ట్రాలు 50 శాతం చొప్పున అందించాలని బోర్డు కోరింది. తొలి దశలో టెలీమీటర్ల ఏర్పాటు పూర్తయింది. రెండో దశలో 29 ప్రాంతాల్లో టెలీమీటర్ల ఏర్పాటుకు రూ.4 కోట్లు జమ చేయాలంటూ గత ఫిబ్రవరి 1న బోర్డు సభ్య కార్యదర్శి సమీర్ ఛటర్జీ లేఖ రాశారు. దీనిపై స్పందించిన సర్కార్ నిధులను బోర్డు ఖాతాలో జమ చేసింది.

ఆ ప్రాజెక్టుల డీపీఆర్‌లు ఇవ్వండి

కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో అనుమతి లేకుండా ఆంధ్రప్రదేశ్ సర్కార్ తొమ్మిది.. తెలంగాణ ప్రభుత్వం ఐదు ప్రాజెక్టులు చేపట్టిందంటూ ఇరు రాష్ట్రాలు పరస్పరం కేంద్రానికి, బోర్డుకు ఫిర్యాదు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాజెక్టుల డీపీఆర్‌లు (సమగ్ర ప్రాజెక్టు నివేదికలు) ఇవ్వాలని రెండు రాష్ట్రాల అధికారులను బోర్డు చైర్మన్ కోరారు. ఇలాఉండగా బోర్డు నిర్వహణకు అయ్యే వ్యయాన్ని చెరి సగం భరించేందుకు ఇరు రాష్ట్రాలు అంగీకరించాయి. బోర్డుకు 25 మంది సిబ్బందిని ఇవ్వడానికి కూడా అంగీకరించాయి. ఏకే బజాజ్ కమిటీ నివేదిక మేరకే కృష్ణా బోర్డు వర్కింగ్ మాన్యువల్‌ను ఖరారు చేయాలని ఇరు రాష్ట్రాలు చేసిన ప్రతిపాదనకు బోర్డు ఆమోదముద్ర వేసింది.

బాబు పాలనలో బాగుపడిన వ్యాపారులెవరు?

- ఎన్నికల్లో లబ్ధి కోసమే ఆర్యవైశ్య కార్పొరేషన్ జపం
- మరోసారి మోసపోవడానికి సిద్ధంగా లేరు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ కోలగట్ల విమర్శ



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కె.వీరభద్రస్వామి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, కాకినాడ కో-ఆర్డినేటర్ ముత్తా శశిధర్, పెద్దిరత్నాజీ, పశ్చిమగోదావరి జిల్లా మహిళా కన్వీనర్ సాయిబాలపద్మ, కె.హరినాథ్

సాక్షి ప్రత్యేక ప్రతినిధి, కాకినాడ: ఈ మూడేళ్లలోనే కాదు చంద్రబాబు గత పాలనలోనూ ఆర్యవైశ్యులకు ఒరిగిందేమీ లేదని, బాగుపడిన వ్యాపారులూ లేరని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు, ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం విజయవాడకు చెందిన మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్యవైశ్యుల్లో పేదల లబ్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని గత మూడేళ్లుగా ప్రదక్షిణ చేసినా చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. తాము అధికారంలోకి వస్తే ఆర్యవైశ్యుల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్ నంద్యాల బహిరంగ సభలో ప్రకటించేసరికి చంద్రబాబులో చలనం వచ్చిందన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానంటూ బాబు సన్నాయి నొక్కులు నొక్కడం నంద్యాల, కాకినాడ ఎన్నికలలో లబ్ధి కోసమేనని విమర్శించారు. అందరిలాగే గత ఎన్నికలలో చంద్రబాబు హామీలు నమ్మి ఓటేసిన ఆర్యవైశ్యులు.. ఇప్పుడు మరోసారి మోసపోవడానికి సిద్ధంగా లేరన్నారు. మూడేళ్లుగా నంద్యాలను పట్టించుకోని చంద్రబాబు ఉప ఎన్నిక వచ్చేసరికి ఆకస్మికంగా రోడ్ల విస్తరణ పేరుతో దుకాణాలు కూలదోయించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాకినాడలో కూడా 45 దుకాణాలు కూల్చేశారని, కానీ 24 మందికే టీడీఎస్‌లు ఇచ్చారని గుర్తు చేశారు. నంద్యాల, కాకినాడలో ధనం, అధికార బలానికి ప్రజాబలానికి మధ్య జరుగుతున్న ఈ పోరులో జగన్‌కే ప్రజలు జేజేలు పలుకుతున్నారని చెప్పారు.

చంద్రబాబు గిమ్మిక్కులు పనిచేయవు: వెలంపల్లి

నంద్యాల అసెంబ్లీతోపాటు కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకే ప్రజాదరణ ఉందని, బాబు గిమ్మిక్కులు పని చేయవని మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ చెప్పారు. ఆర్యవైశ్యులను వేధింపులకు గురిచేస్తున్న చంద్రబాబు ప్రభుత్వానికి ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ఇవ్వబోరని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ కాకినాడ సిటీ కోఆర్డినేటర్ ముత్తా శశిధర్, కాకినాడ నగర వాణిజ్య విభాగం అధ్యక్షుడు పెద్ది రత్నాజీ, పార్టీ జిల్లా కోశాధికారి కాకరపర్తి హరనాథ్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ గోదావరి జిల్లా మహిళా విభాగం కన్వీనర్ వందనపు సాయిబాలపద్మ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో రూ.కోట్ల వరద

- డివిజన్‌కు రూ.కోటి చొప్పున టీడీపీ పంపిణీ?
- వైఎస్సార్‌సీపీ కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల కోర్ కమిటీ సభ్యుడు చెవిరెడ్డి



సాక్షి ప్రత్యేక ప్రతినిధి, కాకినాడ: కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో డివిజన్‌కు కోటి రూపాయల చొప్పున నోట్ల వరద పారించడానికి టీడీపీ నాయకులు సిద్ధమయ్యారని వైఎస్సార్‌సీపీ కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల కోర్ కమిటీ సభ్యుడు, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి విమర్శించారు. మంగళవారం సాయంత్రం ఆయన తూర్పు గోదావరి జిల్లా కాకినాడలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో పంపిణీకి చెరో రూ.24 కోట్ల చొప్పున సమకూర్చే బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు తన మంత్రులైన యనమల రామకృష్ణుడు, ప్రత్తిపాటి పుల్లారావుకు అప్పగించారని ఆరోపించారు. అంత డబ్బు తేలేక చేతులెత్తేయడం వల్లే జిల్లా మంత్రి నిమ్మకాయల చినరాజప్పను తప్పించి గుంటూరుకు చెందిన ప్రత్తిపాటి పుల్లారావుకు బాధ్యతలిచ్చి ఉంటారని ఎద్దేవా చేశారు. మరోవైపు డివిజన్‌కో ఎమ్మెల్యే చొప్పున 48 మందిని, మూడు డివిజన్లకో మంత్రి చొప్పున 16 మందిని కాకినాడకు రప్పించి ఎన్నికల బాధ్యత అప్పగిస్తున్నారన్నారు. కాకినాడను ఆక్రమించుకోవడానికా అన్నట్లుగా బయటి ప్రాంతాల నుంచి పార్టీ నేతలను రప్పించి మోహరిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు తరచుగా వల్లించే నీతిమంతమైన పాలన, అభివృద్ధి పాలనే అయితే ఇంత మందీమార్బలం అవసరం ఎందుకని ప్రశ్నించారు. టీడీపీ వైఫల్యానికి, వైఎస్ జగన్ నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారనడానికి ఇదే నిదర్శనమని చెవిరెడ్డి వ్యాఖ్యానించారు.

• తెలంగాణ

ఆర్టీఐ చీఫ్ కమిషనర్‌గా రాజ సదారాం?

సాక్షి, హైదరాబాద్: శాసనసభ కార్యదర్శి రాజ సదారాం పదవీకాలం త్వరలో ముగియనున్న నేపథ్యంలో సుదీర్ఘ అనుభవం ఉన్న ఆయన సేవలను మరో రూపంలో వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఆయనను సమాచార హక్కు (ఆర్టీఐ) చీఫ్ కమిషనర్‌గా నియమించాలని ప్రభుత్వ స్థాయిలో సూత్రప్రాయ నిర్ణయం జరిగినట్లు సమాచారం. రాజ సదారాం పదవీ కాలాన్ని ప్రభుత్వం నాలుగు పర్యాయాలు పొడిగించింది. రాష్ట్ర విభజనకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక సారి పదవీకాలం పొడిగించగా, ఆ తర్వాత టీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడు సార్లు పదవీ కాలాన్ని పొడిగించింది. దీంతో మొత్తంగా ఆయన నాలుగేళ్లు అదనంగా పదవిలో కొనసాగారు. ఈ నేపథ్యంలో ఆయనను కార్యదర్శిగా మరో ఏడాది కొనసాగించడం కంటే మరో పోస్టుకు ఎంపిక చేయాలన్న నిర్ణయం జరిగినట్లు విశ్వసనీయ సమాచారం. మరోవైపు కార్యదర్శిగా రాజ సదారాం పదవీకాలాన్ని పొడిగిస్తారా లేదా అన్న చర్చ నేపథ్యంలోనే కొందరు ఉద్యోగులు మండలి చైర్మన్‌ను కలిసి ఈ అంశంపై చర్చించారు. కార్యదర్శికి, సిబ్బందిలో కొందరికి పొసగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. అదీగాక పదవీ విరమణ పొందిన ఉద్యోగులను తిరిగి రెగ్యులర్ పోస్టుల్లో నియమించుకోవద్దన్న ప్రభుత్వ ఉత్తర్వులను కాదని కొందరికి పోస్టింగులు ఇవ్వడంపై రెగ్యులర్ ఉద్యోగులు ఆగ్రహానికి గురైనట్లు సమాచారం.

ప్రభుత్వం కళ్లు తెరిచేలా ప్రజాతీర్పు

హామీల అమలులో చంద్రబాబు మోసం
వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి



కాకినాడలో విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి కొప్పన, వీర్రాజు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి, కాకినాడ: టీడీపీ ప్రభుత్వానికి కళ్లు తెరిపించేలా నంద్యాల, కాకినాడలో ప్రజాతీర్పు ఉండబోతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చెప్పారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు..ఈ మూడేళ్లలో వాటిని విస్మరించడమేగాక అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయారని ఉమ్మారెడ్డి విమర్శించారు. ఈ ప్రభుత్వానికి ఎప్పుడు బుద్ధి చెబుదామా అని ప్రజలు అసంతృప్తితో రగిలిపోతున్నారన్నారు. దీన్ని ప్రతిఫలించేలా నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో ప్రజాతీర్పు ఉండబోతోందన్నారు. 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో టీడీపీ రైతుల రుణమాఫీ అంశం చేర్చేటప్పటికీ రూ.87,612 కోట్ల మేర బ్యాంకు బకాయిలు ఉన్నాయని, కానీ.. మూడు విడతల్లో మాఫీ చేసింది కేవలం రూ.11,000 కోట్లు మాత్రమేనని ఉమ్మారెడ్డి అన్నారు. ఈ మొత్తం రుణాల చక్రవడ్డీలు, అపరాధ వడ్డీల చెల్లింపునకే సరిపోలేదని వివరించారు. అలాగే, రూ.14,300 కోట్ల డ్వాక్రా బకాయిల్లో కేవలం రూ.3,000 కోట్లు మాత్రమే మూడు విడతల్లో మంజూరు చేశారని, అదీ డ్వాక్రా మహిళల చేతికి అందలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలా అన్ని రకాలుగా చంద్రబాబు హామీల అమలులో మోసం చేశారని ఉమ్మారెడ్డి విమర్శించారు. కనీసం రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించినా పరిశ్రమలు ఏర్పాటయ్యేవని, తద్వారా కొంతమందికైనా ఉపాధి లభించేదన్నారు. ఇక రాష్ట్రంలో ఇసుక, మట్టి, మద్యం మాఫియాల దోపిడీ పెరిగిపోయిందని ఆరోపించారు. గోదావరి పుష్కరాల్లో 29 మంది మృత్యువాతకు కారణమైన చంద్రబాబుకు ప్రజా బ్యాలెట్ ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాపులకు రిజర్వేషన్ల హామీని చంద్రబాబు అటకెక్కించారని విమర్శించారు. తుని సభకు వెళ్లిన యువతపై కేసులు, రౌడీషీట్లు బనాయించిన టీడీపీ ప్రభుత్వంపై వారంతా ఆగ్రహంతో ఉన్నారన్నారు. స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేయడంవల్ల రూ.4,000 కోట్ల కేంద్ర నిధులు మళ్లిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపట్ల ప్రజలకు విశ్వాసం పెరుగుతోందని ఉమ్మారెడ్డి చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, పార్టీ నేతలు కొప్పన మోహనరావు, చెల్లుబోయిన వేణు, ఆకుల వీర్రాజు, కర్రి పాపారాయుడు పాల్గొన్నారు.

'ఏడీపీ' బోర్డుకు ఇద్దరు డైరెక్టర్ల నియామకం

సాక్షి, అమరావతి: సింగపూర్ కన్సార్టియంకు అప్పగించిన రాజధాని స్టార్టప్ ఏరియా ప్రాజెక్టుకు సంబంధించి అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్ (ఏడీపీ) బోర్డుకు ప్రభుత్వం తరపున ఇద్దరు డైరెక్టర్లను నియమించారు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏడీసీ) చైర్‌పర్సన్‌ను, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిని డైరెక్టర్లుగా నియమిస్తూ సీఆర్‌డీఏ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుత్ ప్రమాదాల పరిహారం ఇక సులభం


ఏపీఈఆర్‌సీ కొత్త రెగ్యులేషన్ • కారణం ఏదైనా పరిహారం రూ.5 లక్షలు

సాక్షి, అమరావతి

విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబాలకు కొంత ఊరట లభించనుంది. ఇకపై విద్యుత్ తీగల వల్ల మృతి చెందిన, శాశ్వత అంగవైకల్యం కలిగిన వారి కుటుంబాలకు విద్యుత్ పంపిణీ సంస్థలు రూ.5 లక్షల నష్టపరిహారం ఇవ్వనున్నాయి. అదే విధంగా క్షతగాత్రులైనా కొంత పరిహారం రాబట్టుకునే వెసులుబాటు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఇందుకు అనుగుణంగా విద్యుత్ చట్టంలోని నిబంధనలకు కొన్ని సవరణలు చేసింది. రాష్ట్రంలో ఏటా దాదాపు 500 మంది విద్యుత్ ప్రమాదాల వల్ల చనిపోతున్నారు. మరో 1500 మంది గాయపడుతున్నారు. లైన్లు తెగిపడటం, పంటపొలాలకు రక్షణగా విద్యుత్ వలయాలు ఏర్పాటు చేసుకోవడం, ఇంటిపై నుంచి వెళ్లే విద్యుత్ తీగలు తెగడం, చెట్ల కొమ్మలు నరుకుతున్న కారణంగా షాక్ కొట్టడం.. ఇలా అనేక కారణాల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రతి ఊర్లో స్థానికంగా పనిచేసే తాత్కాలిక లైన్‌మెన్లు విద్యుత్ షాక్ వల్ల మృత్యువాత పడుతున్నారు. విద్యుత్ సంస్థల తప్పిదం వల్ల ప్రమాదం జరిగితే రూ.2 లక్షల పరిహారం ఇవ్వాలనే నిబంధన ఉంది. అయితే, సంస్థ తప్పిదమని రుజువు చేయడానికి అనేక సాంకేతిక ఇబ్బందులుండేవి. ఫలితంగా ఈ మాత్రం పరిహారం కూడా అందేది కాదు. ప్రజాభిప్రాయ సేకరణల్లో దీనిపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమయ్యేది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీఈఆర్‌సీ ప్రత్యేకంగా రెగ్యులేషన్‌ను తీసుకొచ్చింది.

ఎలా ఇస్తారు?

- విద్యుత్ ప్రమాదం జరిగినప్పుడు ముందుగా స్థానిక అసిస్టెంట్ ఇంజనీర్ ఘటనా స్థలం పరిశీలించాలి. 24 గంటల్లో డివిజనల్ ఇంజనీర్‌కు నివేదిక పంపాలి. డీఈ దీన్ని పరిశీలించి 20 రోజుల్లో విద్యుత్ సంస్థ సీఎండీకి నివేదిక ఇవ్వాలి. ఇది అందిన 15 రోజుల్లో బాధిత కుటుంబానికి రూ. 5 లక్షలు ఇవ్వాలి. పరిహారం కోసం బాధిత కుటుంబాలు ఎలాంటి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు.
- విద్యుత్ ప్రమాదం ఎవరి వల్ల జరిగిందనే నిబంధన ఇక ఉండదు. దీనికోసం పోలీసుల నుంచి నివేదికలు పొందాల్సిన అవసరమూ లేదు. మృతి చెందిన కుటుంబాలు నేరుగా విద్యుత్ సంస్థలను పరిహారం కోసం సంప్రదించే వీలు కల్పించారు. క్షతగాత్రులు పరిహారం కోసం అవసరమైతే అప్పీలుకు కూడా వెళ్లొచ్చు.
- మూగజీవాలు విద్యుత్ ప్రమాదాల వల్ల చనిపోయినా పరిహారం వర్తిస్తుంది. వాటి విలువ ఆధారంగా పరిహారం చెల్లించాలి.
- ఎవరైనా విద్యుత్ తీగలను ఇష్టపూర్వకంగా తాకి మరణించినా (ఆత్మహత్య ప్రయత్నం), బలవంతం వల్ల ప్రమాదానికి గురైనా పరిహారం పొందేందుకు అర్హులే. అయితే, ఇందుకు సంబంధించిన ధ్రువ పత్రాలను అధికారులకు సమర్పించి, బాధిత కుటుంబాలే స్వయంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- గృహాల్లో, కార్యాలయాల్లో జరిగే ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోయినా, వైకల్యం కలిగినా నష్టపరిహారం అందదు.
- ప్రమాదాల సందర్భంగా స్థానిక విద్యుత్ ఏఈలపై కేసులు నమోదు చేస్తున్నారు. ఇలాంటి సందర్భంలో ఇక మీదట స్టేషన్‌లోనే బెయిల్ పొందే వెసులుబాటు ఉద్యోగులకు లభిస్తుంది.
- వ్యక్తి మృతి చెందినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా రూ.5 లక్షల పరిహారం ఇస్తారు. ఇతర అంగవైకల్యానికి రూ. లక్ష నుంచి రూ.3 లక్షల వరకూ పరిహారం చెల్లిస్తారు. ప్రమాదం జరిగినప్పుడు వైద్య ఖర్చులు కూడా ఇస్తారు (ఖర్చును బట్టి).



విద్య నేటి విద్యలో..
- జనరల్ స్టడీస్: ఇండియన్ జాగ్రఫీ
- బ్యాంక్ పీవోస్, క్లర్క్స్: క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

పరీక్ష తేదీలు

- ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో అసిస్టెంట్ సిగ్నల్ అండ్ టెలికామ్ ఇంజనీర్ (గ్రూప్ బి) పోస్టులకు రాతపరీక్ష: ఆగస్టు 25
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్)లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు స్కిల్ టెస్ట్: ఆగస్టు 26
- ఎయిమ్స్ రాయ్‌పూర్‌లో ట్యూటర్/క్లినికల్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ): ఆగస్టు 26



GOODS AND SERVICES TAX

FEDERAL ASPECT

గ్రూప్స్, సివిల్స్ ప్రత్యేకం

ఎకానమీ/పాలిటీ

Civils Mains GS P-II

Issues and challenges pertaining to the federal structure; Devolution of finances and challenges..

The introduction of GST into the Indian fiscal regime is a departure from the age old indirect taxation process. It is a bold move undertaken to transform the cumbersome procedure of taxation that prevailed from the colonial times in the country. GST to put in simple terms is a destination based indirect tax on consumption. It absorbs most of the indirect taxes that eliminates cascading effect and creates a national market for goods and services.

The antagonists of GST criticize it to be anti-federalist and it is operated completely under the aegis of Union Government. **This is due to the following reasons -**

1. The only heavy revenue generating component of the federal units is the indirect tax such as sales tax, entertainment tax (except the ones levied by the local governments), octroi, etc. All these have been subsumed into the 'unitary' GST regime.
2. The levy procedures dependent on IGST (Integrated) framework which is a heavy loss to the States.
3. The distribution procedure of the taxes collected under GST is decided by the GST Council that is constituted by the President of India (Article 279A) and headed by the 'Union' Finance Minister.
4. Net settlement in the destination based taxation will make the manufacturing States unhappy.
5. Tapering Effect i.e., year by year lessening of compensation aid given to the States for five years is not in the interest of any State as it is a definite revenue loss.
6. Reduces the SGDP and results in the inflation of commodities due to the varied tax slabs on different items.
7. Article 1 of Indian Constitution states that India is a Union of States, but GST has forgotten the fact of 'States' but took care of satisfying only the 'Union'.

The above points are used to justify that the new GST regime is violating

a. The principle of internal sovereignty.
b. The basic structure doctrine of federal feature of India.

On the other hand, the reality of GST as argued by its proponents is that

1. The absorption of indirect taxation is done in order to bring down the Rate Arbitrage which means the inequality in the taxation system wherein in the earlier regime, only the manufacturing States had advantage of more tax generation.
2. The IGST levy is a 'procedure' to bring the uniform taxation, but it is not a tax in itself. It is just a system of levy which is redistributed among the States by dividing among CGST and SGST.
3. The distribution procedure of IGST is given in the hands of GST Council, of which the CGST distribution is decided by the independent Constitutional body, Finance Commission.
4. The GST Council, although headed by the Union Finance Minister, the three-fourths voting majority of the members i.e., the State Finance Ministers who covers about two-thirds of the States i.e., 20 States is an absolute democratic procedure to decide on any matter within the Council. A quorum of 50% majority is required to conduct any meeting of the Council.
5. Terming GST as unified can be ruthlessly ruled out as it is done in a manner of Constitutional Amendment with the ratification of more than half of the States. It is a concurrent taxation system which simplifies the costs in collection and distribution.
6. Inflation in the States is a short run phenomenon for a long run benefit. Abolition of Rate Arbitrage system will improve the welfare option for the States such that the residents can flourish in a wealthy tax distribution regime. This will help in higher ancillarisation and outsourcing activities that directly impact the job production in the States.
7. The most revenue generating commodities have been set under the higher tax slabs by the SGST legislations under the GST that usually bring up the SGDP.

Thus the current argument concludes that GST establishes..

a. Cooperative Federalism.
b. A pooled sovereignty, not a threat to internal sovereignty.



In a two trillion dollar economy of India, indeed any bold measure will initially have challenges. However, GST doubtlessly is a major milestone in the Indirect Tax reforms.

Question

1. GST is not a unitary taxation system that foils the federal body politic of Indian Constitution but upholds the principle of quasi-federalism as argued by our Constitutional framers. *Discuss.*


Krishna pradeep
Director,
21st Century IAS, Hyd.



కాంపిటీటివ్ కౌన్సెలింగ్

వీఆర్‌వో, వీఆర్ఏ పరీక్షలకు సంబంధించిన సమాచారం తెలియజేయండి?

– మురళీమోహన్ రెడ్డి, హైదరాబాద్.



వీఆర్‌వోలు విధి నిర్వహణలో భాగంగా విలేజ్ రెవెన్యూ అకౌంట్లు, రికార్డుల నిర్వహణ; నీటితీరువా, భూమిశిస్తుల వసూలు, ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినప్పుడు ప్రజలను అప్రమత్తం చేయడం, నష్ట నివారణకు అవసరమైన ఏర్పాట్లు చేయడం తదితర విధులు నిర్వహిస్తారు. వీఆర్ఏలు అన్ని రకాల విధుల్లో వీఆర్‌వోలకు సహాయకులుగా వ్యవహరిస్తారు. వీఆర్‌వోగా విధుల్లో చేరినవారు జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ పోస్టుల వరకు ఎదగడానికి అవకాశముంది. వీఆర్ఏగా చేరినవాళ్లు ఆ తర్వాత వీఆర్‌వో, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, డిప్యూటీ తహసీల్దార్ వరకు పదోన్నతులు పొందొచ్చు.

- ఇంకా నోటిఫికేషన్ రాలేదు కాబట్టి వీఆర్‌వో, వీఆర్ఏ ఔత్సాహికులు ప్రస్తుతానికి జనరల్ స్టడీస్, లాజిక్ స్కిల్స్, అర్థమెటిక్ స్కిల్స్ విభాగాలపై పట్టు సాధించేందుకు కృషిచేయాలి. జనరల్ స్టడీస్‌లో భూగోళశాస్త్రం, చరిత్ర, అర్థశాస్త్రం, పౌరశాస్త్రం, సైన్స్ అండ్ టెక్నాలజీ, రాష్ట్రానికి సంబంధించిన ప్రత్యేక అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. వీటి ప్రాథమిక అంశాలపై పట్టుకోసం హైస్కూల్ స్థాయి పాఠ్యపుస్తకాలను ఉపయోగించుకోవాలి. భూగోళ శాస్త్ర విషయానికొస్తే.. గ్రామీణ నేపథ్యం, వ్యవసాయం, ఆనకట్టలు, స్థానిక ప్రత్యేకతలు, సాగు తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి. అర్థశాస్త్రంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, వాటిని ప్రారంభించిన సంవత్సరాలు, లక్ష్యాలు తదితర అంశాలను అధ్యయనం చేయాలి. పౌరశాస్త్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ; 73, 74వ రాజ్యాంగ సవరణలు; రాజ్యాంగ ప్రతిపత్తి తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలి. జీవశాస్త్రంలో వ్యాధులు, కారణాలు, నివారణ, పోషణ వంటి అంశాలపై పట్టు సాధించాలి. భౌతిక-రసాయన శాస్త్రంలో ప్రశ్నలు ఎక్కువగా అనువర్తిత విధానంలో ఉంటాయి. నిత్య జీవితంలో సైన్స్ అండ్ టెక్నాలజీ, సమకాలీన ఆవిష్కరణలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి. కరెంట్ అఫైర్స్‌లో భాగంగా జాతీయంగా, అంతర్జాతీయంగా చోటు చేసుకున్న ముఖ్య సంఘటనలను అధ్యయనం చేయాలి. ఏ అంశం చదువుతున్నా గ్రామీణ నేపథ్యంతో అనుసంధానం చేసుకుంటూ చదవడం లాభిస్తుంది.
- అర్థమెటిక్ స్కిల్స్‌లో పశ్నలు అనువర్తిత విధానంలో ఉంటాయి. భాజనీయత సూత్రాలు, సరాసరి, కాలం-పని, ఎత్తులు-దూరాలు, లాభనష్టాలు, వడ్డీ, శాతాలు, క్షేత్రమితి, వైశాల్యం తదితర అంశాలపై ప్రశ్నలు వస్తాయి. ఈ విభాగంలో మెరుగైన మార్కులు సాధించాలంటే వీలైనంత ఎక్కువగా మాదిరి ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల్లోని గణిత శాస్త్ర అంశాలను అంశాల వారీగా ప్రాక్టీస్ చేయడం లాభిస్తుంది.

లాజికల్ స్కిల్స్: ఇందులో కోడింగ్/డీకోడింగ్, పోలికలు, బంధాలు, సంఖ్యా శ్రేణులు, అక్షర శ్రేణులు, భిన్న లక్షణాల నిర్ధారణ, దిశ నిర్ధారణ, క్యాలెండర్, నాన్-వెర్బల్ రీజనింగ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఈ విభాగంలో మెరుగైన మార్కులు సాధించాలంటే మౌలిక భావనలను అవగాహన చేసుకుని, మాదిరి ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. పేపర్ రీడింగ్ తప్పనిసరి.

రిఫరెన్స్: 6-10 సోషల్, సైన్స్, మ్యాథ్స్ పుస్తకాలు. - మనోరమ ఇయర్ బుక్. - అర్థమెటిక్, లాజికల్ రీజనింగ్-ఆర్.ఎస్.అగర్వాల్.

'చైల్డ్ జీనియస్' పోటీలో విజేత?



కాంపిటీటివ్ గైడెన్స్
జీకే అండ్ కరెంట్ అఫైర్స్


1. 2017, ఆగస్టులో అమెరికాలోని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినవారు?
– క్రిస్టోఫర్ రే
2. 2017, ఆగస్టులో బ్రిటన్‌లోని ఛానల్ 4 నిర్వహించిన 'చైల్డ్ జీనియస్' పోటీలో విజేతగా నిలిచిన భారత సంతతి బాలుడు?
– రాహుల్
3. 2017, జూన్‌లో క్యూబాలో నిర్వహించిన కాపాబ్లాంకా మెమోరియల్ చెస్ టోర్నీలో విజేతగా నిలిచిన భారత క్రీడాకారుడు?
– కృష్ణన్ శశికిరణ్
4. నాసా చేపట్టనున్న అంతరిక్ష యాత్రలకు ఎంపికైన భారత సంతతి వ్యోమగామి?
– రాజాచారి
5. మన దేశంలో తొలిసారిగా ఏ రైల్వే స్టేషన్‌ను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)లో రూ.450 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు?
– హబీబ్‌గంజ్ రైల్వే స్టేషన్ (భోపాల్)
6. ఆంధ్రప్రదేశ్‌లోని ఓర్వకల్లులో నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ఇటీవల పర్యావరణ అనుమతి లభించింది. అయితే ఈ ప్రాంతం ఏ జిల్లాలో ఉంది?
– కర్నూలు
7. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ (ఐఎండీ) ఇటీవల విడుదల చేసిన 63 దేశాల పోటీతత్వ జాబితాలో భారత్ ర్యాంక్?
– 45
8. ఉగ్రవాదానికి మద్దతిస్తోందని ఆరోపిస్తూ పలు అరబ్ దేశాలు ఇటీవల ఏ దేశంతో దౌత్య సంబంధాలను తెంచుకున్నాయి?
– ఖతార్
9. 3,136 కిలోల బరువు కలిగిన జీశాట్-19 ఉపగ్రహాన్ని 2017, జూన్ 5న కక్ష్యలోకి ప్రవేశపెట్టిన రాకెట్?
– జీఎస్ఎల్‌వీ మార్క్ 3-డి1
10. సూర్యునిపై పరిశోధనలకు ఇస్రో ప్రయోగించనున్న ఉపగ్రహం?
– ఆదిత్య-ఎల్1
11. ఉన్నత విద్యా రంగ నియంత్రణకు యూజీసీ, ఏఐసీటీఈల స్థానంలో ఏర్పాటుకానున్న సంస్థ?
– హీరా (హయ్యర్ ఎడ్యుకేషన్ ఎంపవర్‌మెంట్ రెగ్యులేషన్ ఏజెన్సీ).
12. భారత ప్రధాని నరేంద్ర మోదీతో ఇటీవల సమావేశమైన నుర్‌సుల్తాన్ నజర్‌బయేవ్ ఏ దేశ అధ్యక్షుడు? **– కజకిస్తాన్**
13. ప్రధాని నరేంద్ర మోదీ 2017, మే 26న ఏ రాష్ట్రంలో నిర్మించిన ధోలా-సాదియా వంతెనను ప్రారంభించారు? **– అసోం**
14. లోహిత్.. ఏ నదికి ఉప నది? **–బ్రహ్మపుత్ర**
15. ధోలా-సాదియా వంతెనకు మరో పేరు?
– భూపేన్ హజారికా వంతెన
16. ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ వర్సిటీలో స్నాతకోత్సవ ప్రసంగం చేసిన అత్యంత పిన్న (33 ఏళ్ల) వయస్కుడు?
–ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్
17. 2017, మేలో జీ-7 దేశాల శిఖరాగ్ర సదస్సును ఎక్కడ నిర్వహించారు?
– ఇటలీలోని తావోర్మినా
18. 2017 మేలో భారత్‌లో పర్యటించిన ప్రవింద్ జగన్నాథ్ ఏ దేశ ప్రధానమంత్రి? **– మారిషస్**
19. 2017 జూన్‌లో బీసీసీఐ పరిపాలకుల కమిటీ నుంచి తప్పుకున్న ప్రముఖ చరిత్రకారుడు, రచయిత? **– రామచంద్ర గుహ**
20. భారత్‌లో రష్యా రాయబారిగా పనిచేసిన ఎవరి పేరును ఢిల్లీలో ఓ వీధికి పెడుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల ప్రకటించారు? **– అలెగ్జాండర్ కదకిన్**
21. ఇంద్ర-2017 పేరిట తొలిసారి త్రివిధ దళాల విన్యాసాలు నిర్వహించాలని నిర్ణయించిన దేశాలు? **– భారత్, రష్యా**
22. రష్యాలోని రెండో పెద్ద నగరం సెయింట్ పీటర్స్‌బర్గ్ ఏ నదీ తీరంలో ఉంది? **– నేవా**
23. ఫ్రాన్స్ అధ్యక్షుని అధికార నివాస భవనాన్ని ఏమంటారు? **– ఎలిసీ ప్యాలెస్**
24. 2017, జూన్‌లో నేపాల్ ప్రధానిగా నాలుగో సారి బాధ్యతలు చేపట్టినవారు?
– షేర్ బహదూర్
25. 2017 మేలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన తొలి విదేశీ పర్యటనను ఏ దేశంలో నిర్వహించారు?
– సౌదీ అరేబియా



ఎన్.విజయేందర్‌రెడ్డి
జనరల్ అవేర్‌నెస్
సీనియర్ ఫ్యాకల్టీ

స్టాక్ మార్కెట్

కాంపిటీటివ్ గైడెన్స్
ఇండియన్ ఎకానమీ



ఒక దేశ ఆర్థిక వ్యవస్థ పునాదులు ఆ దేశ ద్రవ్య, మూలధన మార్కెట్ల పనితీరుపై ఆధారపడి ఉంటాయి. ఇవి పారిశ్రామిక రంగ అభివృద్ధి తీరుతెన్నులను నిర్దేశిస్తాయి. పరిశ్రమల నిర్వహణకు కావాల్సిన స్వల్పకాలిక అవసరాలను తీర్చేందుకు ద్రవ్య మార్కెట్ దోహదపడితే.. సంస్థల స్థాపన, వాటి దీర్ఘకాలిక అవసరాలను తీర్చేందుకు మూలధన మార్కెట్ ఉపయోగపడుతుంది.

☆ కంపెనీల స్థాపనకు పెద్ద మొత్తంలో మూలధనం అవసరమవుతుంది. దీన్ని సమకూర్చుకోవడానికి కంపెనీలు తమ వాటాలను ప్రజలకు అమ్ముతాయి. దీన్నే ప్రాథమిక మార్కెట్ అంటారు. ప్రజలు ప్రాథమిక మార్కెట్ ద్వారా కొనుగోలు చేసిన వాటాలను తిరిగి అమ్మడానికి లేదా కొనడానికి వీలుగా ఏర్పాటైన వ్యవస్థీకృత వ్యవస్థే స్టాక్ మార్కెట్. దీన్ని ద్వితీయ మార్కెట్ అంటారు.

☆ కంపెనీల వాటాలు క్రయ, విక్రయాలు జరిగే ప్రదేశాన్ని స్టాక్ ఎక్స్ఛేంజ్ అంటారు. ప్రపంచంలోని అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్. దీన్ని 1792, మే 17న న్యూయార్క్‌లోని వాల్‌స్ట్రీట్‌లో స్థాపించారు. కాగా, ద్వితీయ స్థానంలోని నాస్‌డాక్ స్టాక్ ఎక్స్ఛేంజ్ 1971, ఫిబ్రవరి 4న న్యూయార్క్‌లో స్థాపితమైంది. 11వ స్థానంలోని బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్‌ను 1875లో స్థాపించారు.

☆ బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆసియాలోనే పురాతనమైంది. ఇది 'ది నేటివ్ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ అసోసియేషన్' ద్వారా 1875లో బొంబాయిలోని దలాల్ స్ట్రీట్‌లో స్థాపితమైంది. ప్రభుత్వం దీన్ని సెక్యూరిటీస్ కాంట్రాక్ట్ రెగ్యులేషన్ యాక్ట్-1956 ప్రకారం 1957లో స్టాక్ ఎక్స్ఛేంజ్‌గా గుర్తించింది. ఈ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో 1986లో 30 షేర్లతో సెన్సెక్స్ సూచీని ప్రవేశపెట్టారు. 1978-79 సంవత్సరం సెన్సెక్స్‌కు ఆధార సంవత్సరం. సెన్సెక్స్ సూచీలో 30 కంపెనీలకు స్థానం కల్పించినప్పటికీ వాటి స్థానం శాశ్వతం కాదు. సెన్సెక్స్‌లో వాటి స్థానం, సెన్సెక్స్ సూచీని నిర్ణయించడం.. వాటి వెయిటేజీ, ఆ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్‌పై ఆధారపడి ఉంటుంది. స్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్‌తోపాటు ఇతర సూచీలను కూడా ప్రవేశపెట్టారు. 1995 నుంచి దీనిలో బొంబాయి ఆన్‌లైన్ ట్రేడింగ్ (బోల్ట్)ను ప్రారంభించారు. ఇందులో సుమారు 5,000 కంపెనీల షేర్లు నమోదయ్యాయి.

☆ ప్రస్తుతం మన దేశంలో సెక్యూరిటీస్ కాంట్రాక్ట్ రెగ్యులేషన్ యాక్ట్-1956 గుర్తించిన స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు 23 ఉన్నాయి. ఇవి సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) నియంత్రణకు లోబడి కార్యకలాపాలు నిర్వహిస్తాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో జీడీపీలో కార్పొరేట్ రంగం వాటా 70 శాతం ఉండగా, మన దేశంలో కేవలం 12 శాతం మాత్రమే ఉంది. ఇందులో 4 శాతం మాత్రమే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో నమోదవుతున్నాయి. అయితే స్టాక్ మార్కెట్ విస్తరణను దృష్టిలో పెట్టుకొని 1992 నవంబర్‌లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియాను బొంబాయిలో ఏర్పాటు చేశారు.

☆ నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియాకు 1993 ఏప్రిల్‌లో సెక్యూరిటీస్ కాంట్రాక్ట్ రెగ్యులేషన్ యాక్ట్-1956 ప్రకారం గుర్తింపు లభించింది. ఇది 1994 నుంచి మార్కెట్ కార్యకలాపాలు, 2000 జూన్ నుంచి డెరివేటివ్స్ విభాగంలో వ్యాపార వ్యవహారాలను నిర్వహిస్తుంది. దీనిలో 50 షేర్లతో నిఫ్టీ ప్రధాన సూచీగా ఉంది. ప్రస్తుతం నిఫ్టీ సూచీ 10,000 పాయింట్ల దరిదాపుల్లో ఉంది. ఇందులో దాదాపు 1,600 కంపెనీల షేర్లు నమోదయ్యాయి.

☆ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో జరిగే షేర్ల లావాదేవీలకు సంబంధించి కాలానుగుణంగా అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. మొదట్లో స్టాక్ బ్రోకర్లు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో ప్రత్యక్షంగా తమ ఖాతాదారుల తరఫున షేర్ల అమ్మకం, కొనుగోళ్లు నిర్వహించేవారు. అయితే ప్రస్తుతం స్టాక్ ఎక్స్ఛేంజ్ కార్యకలాపాలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. షేర్లను భౌతిక రూపంలో నుంచి ఎలక్ట్రానిక్ రూపంలోకి మార్చారు. వీటిని డీమ్యాట్ షేర్లుగా పేర్కొంటారు. వీటి నిర్వహణకు 1986లో ప్రభుత్వం స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను నెలకొల్పింది. ప్రస్తుతం పెద్ద బ్యాంకులన్నీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు బ్రోకర్లుగా వ్యవహరిస్తూ ఖాతాదారులకు ట్రేడింగ్ కార్యకలాపాలు, డీమ్యాట్ అకౌంట్ల సౌకర్యాలను కల్పిస్తున్నాయి.

☆ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో నమోదైన షేర్ల ధరల్లో హెచ్చుతగ్గులు అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయి. మార్కెట్‌ను ప్రభావితం చేసే అంశాల్లో ప్రధానంగా కంపెనీ ఆర్థిక ఫలితాలు, కంపెనీ యాజమాన్యంలో వచ్చే మార్పులు, రాజకీయ మార్పులు, వాతావరణంలో వచ్చే మార్పులు, రుతుపవనాల ప్రభావం, రాజకీయ, ఆర్థిక కుంభకోణాలు, అంతర్జాతీయ సంబంధాలు, సరిహద్దుల్లో ఘర్షణ, యుద్ధ భయాలు, స్టాక్ మార్కెట్లలో కుంభకోణాలు వంటివి ఉంటాయి.

☆ మనదేశ స్టాక్ మార్కెట్లో 1992లో హర్షద్ మెహతా, 1999 కేతన్ పరేఖ్ కుంభకోణాల కారణంగా అనేక మంది చిన్న ఇన్వెస్టర్లు విపరీతంగా నష్టపోయారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో ఇన్వెస్టర్లు నష్టపోకుండా చూసేందుకు సెబీకి మరిన్ని అధికారాలు కల్పించారు.

☆ షేర్వాణి కమిటీ సిఫార్సుల ఆధారంగా సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)ను 1988లో ఏర్పాటు చేశారు. దేశంలోని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు దీని నియంత్రణలో పనిచేస్తాయి. ప్రస్తుత సెబీ ఛైర్మన్ అజయ్ త్యాగి.

స్టాక్ ఎక్స్ఛేంజ్‌లపై అవగాహనకు వాటిలో తరచూ ఉపయోగించే కింది పదాలకు అర్థాలను తెలుసుకోవాలి.

☆ **షేర్లు:** కంపెనీలు పెద్ద మొత్తంలో మూలధనం సమకూర్చుకోవడానికి తమ వాటాలను ప్రజలకు అమ్ముతాయి. గతంలో వీటి ముఖ విలువ రూ.10, రూ.100 ఉండేది. ప్రస్తుతం రూ.1, రూ.2 ముఖ విలువ కలిగిన షేర్లు ప్రాచుర్యంలోకి వచ్చాయి. షేర్లు భౌతిక రూపంలో కాకుండా డీమ్యాట్ (డీమెటీరలైజేషన్) రూపంలో ఉంటున్నాయి. ప్రాథమిక మార్కెట్లో షేర్లు జారీ అయిన తర్వాత స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో షేర్ల క్రయ, విక్రయాలు జరగడాన్ని ద్వితీయ మార్కెట్ అంటారు. ఇందులో నిర్ణయించిన షేర్ల ధరలను మార్కెట్ విలువ అంటారు. సాధారణంగా ముఖ విలువ కంటే మార్కెట్ విలువ ఎక్కువగా ఉంటుంది. కంపెనీ పనితీరు సరిగా లేకపోయినా, భారీ నష్టాలతో కంపెనీ నడుస్తున్నా, షేర్ల ముఖ విలువ కంటే మార్కెట్ విలువ తక్కువగా ఉంటుంది. షేర్లకు ప్రతిఫలంగా లభించే వాటిని డివిడెండ్లు అంటారు.

☆ **బుల్:** భవిష్యత్తులో షేర్ల ధరలు పెరుగుతాయని భావించి మార్కెట్లో షేర్లను కొనుగోలు చేసేవారిని బుల్స్‌గా పేర్కొంటారు. షేర్ల కొనుగోళ్లు పెరిగినప్పుడు మార్కెట్ సూచీ కూడా పెరుగుతుంది. దీన్ని బులిష్ మార్కెట్‌గా వ్యవహరిస్తారు. బుల్ స్వభావరీత్యా తన కొమ్ములతో మట్టిని పైకి ఎగజిమ్ముతుంది. అందుకే ధరలు పైపైకి పెరగడాన్ని బుల్‌తో పోల్చారు.

☆ **బేర్:** భవిష్యత్తులో షేర్ల ధరలు తగ్గుతాయని భావించి, మార్కెట్లో షేర్ల అమ్మకాలు చేసేవారిని బేర్స్‌గా పేర్కొంటారు. షేర్ల అమ్మకాలు పెరిగినప్పుడు మార్కెట్ సూచీలు తగ్గుతాయి. దీన్ని బేరిష్ మార్కెట్‌గా వ్యవహరిస్తారు. బేర్ (ఎలుగుబంటి) స్వభావరీత్యా నేలను తన మూతితో కిందికి తోస్తుంది. అందుకే ధరలు తగ్గడాన్ని (కిందికి) బేర్‌తో పోల్చారు.

☆ **డిబెంచర్లు:** కంపెనీలు తమ స్వల్పకాలిక అవసరాలు, చరమూలధనాన్ని సమకూర్చుకునేందుకు డిబెంచర్లు జారీ చేస్తాయి. వీటిని కొనుగోలు చేసినవారికి డిబెంచర్ పత్రంలో పేర్కొన్న నిర్ణీత శాతం వడ్డీ చెల్లిస్తాయి. కంపెనీ లాభ నష్టాల ప్రభావం వీటిపై ఉండదు.

☆ **రైట్స్ ఇష్యూ:** కంపెనీలు తమ స్థాపిత సామర్థ్యాన్ని పెంచుకోవడం, విస్తరించుకోవడానికి మూలధనం అవసరమైనప్పుడు వాటాలు ఉన్నవారికే ఒక ధరను నిర్ణయించి వాటాలను జారీ చేయడాన్ని రైట్స్ ఇష్యూ అంటారు.

☆ **ప్రీమియం షేర్లు:** అప్పటికే స్థాపితమై, మంచి ఆర్థిక పునాదులున్న కంపెనీలు నూతనంగా వాటాలను జారీ చేయాలనుకున్నప్పుడు ముఖ విలువకు కాకుండా అదనపు ధరను నిర్ణయించి, వాటాలను జారీ చేస్తే వాటిని ప్రీమియం షేర్లు అంటారు.

☆ **బోనస్ షేర్లు:** కంపెనీ మంచి లాభాలతో నడుస్తూ, వాటాదారులకు ఏటా డివిడెండ్లు చెల్లిస్తూ ఎక్కువ మార్కెట్ క్యాపిటలైజేషన్ కలిగి ఉన్నట్లయితే వాటాదారులకు వారు కలిగి ఉన్న షేర్లకు నిర్ణయించిన నిష్పత్తిలో ఉచితంగా షేర్లను జారీ చేస్తే వాటిని బోనస్ షేర్లు అంటారు.



అక్కెనపల్లి మీనయ్య
ఎకనామిక్స్ (హెచ్‌వోడీ)- రిటైర్డ్
నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
నల్లగొండ

ప్రతి వారం మీ భవిత మెయిన్ పేజీల్లో...

సోమవారం	మంగళవారం	బుధవారం	గురువారం	శుక్రవారం	శనివారం	ఆదివారం
10+2/గ్రాడ్యుయేట్స్ స్పెషల్	ఇంజనీరింగ్/ ఎంబీఏ స్పెషల్	జాబ్ పాయింట్	కెరీర్ గైడెన్స్/ టెక్నాలజీ స్పెషల్	ఫారెన్ ఎడ్యుకేషన్ స్పెషల్	గవర్నమెంట్ జాబ్స్/ కరెంట్ అఫైర్స్ (ఇంగ్లిష్)	జాబ్ స్కిల్స్/ గెస్ట్ కాలమ్
గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం	గ్రూప్స్ ప్రత్యేకం

జాబ్ పాయింట్



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం — 223 ఖాళీలు

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయ శంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం (పీజేటీఎస్ఏయూ).. 223 బోధనా ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువరించింది.

- **పోస్టు పేరు:** అసిస్టెంట్ ప్రొఫెసర్
- **వేతనం:** రూ.15,600–రూ.39,100+ ఏజీపీ రూ.6,000
- **మొత్తం ఖాళీలు:** 223
- **విభాగాల వారీ ఖాళీలు:** అగ్రికల్చర్–185; అగ్రికల్చర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ–22; హోమ్ సైన్స్–16. అగ్రికల్చర్ విభాగంలో లైబ్రరీ సైన్స్ పోస్టులు 5 ఉన్నాయి.
- **బోధనాంశాల వారీ ఖాళీలు:** అగ్రికల్చర్ విభాగంలో.. అగ్రి ఎకనామిక్స్ –12, అగ్రి ఎక్స్‌టెన్షన్–24, అగ్రి మైక్రోబయాలజీ–4, ఆగ్రోనమీ–35, క్రాప్ ఫిజియాలజీ–2, ఎంటమాలజీ–22, జెనెటిక్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్– 24, హార్టికల్చర్–17, ప్లాంట్ పాథాలజీ–13, ప్లాంట్ మాలిక్యులార్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ–1, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ–1, సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చర్ కెమిస్ట్రీ–18, స్టాటిస్టిక్స్ అండ్ మ్యాథమెటిక్స్–7, లైబ్రరీ సైన్స్–5; అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలో.. అగ్రికల్చర్ ప్రాసెస్ అండ్ ఫుడ్ ఇంజనీరింగ్–2, ఫర్మా మెషినరీ అండ్ పవర్ ఇంజనీరింగ్–7, ఫుడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ –1, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్–3, ఫుడ్ ప్రాసెస్ టెక్నాలజీ –3, సాయిల్ అండ్ కన్జర్వేషన్ ఇంజనీరింగ్–6; హోమ్‌సైన్స్ విభాగంలో.. అప్పెరల్ అండ్ టెక్స్‌టైల్–1, ఫుడ్స్ అండ్ న్యూట్రిషన్–9, హ్యూమన్ డెవలప్‌మెంట్ అండ్ ఫ్యామిలీ స్టడీస్–3, హోమ్ సైన్స్ ఎక్స్‌టెన్షన్ అండ్ కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్–1, రీసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ కన్స్యూమర్ సైన్స్–2
- **అర్హతలు:** సంబంధిత విభాగాలు, బోధనాంశాలను అనుసరించి నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ/ 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ/ నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/మాస్టర్స్ డిగ్రీ ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ ఎంఏబీఎం/ఎంబీఏ (ఏబీఎం). దీంతోపాటు సంబంధిత సబ్జెక్టులో నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) క్వాలిఫై, తెలుగులో పనిచేయగల నైపుణ్యం, రీసెర్చ్ పబ్లికేషన్స్, ఉద్యోగానుభవం తదితరం ఉండాలి. పీహెచ్‌డీ అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి నెట్ నుంచి మినహాయింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** అకడమిక్ ప్రతిభ, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు ఫీజు:** ఓసీ, బీసీ–రూ.1,500; ఎస్సీ, ఎస్టీ– రూ.750
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దానిని ప్రింటవుట్ తీసుకుని సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, ఫొటోలు తదితర వాటిని జతచేసి కవరులో ఉంచి 'ది రిజిస్ట్రార్, ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, రాజేంద్రనగర్, హైదరాబాద్'కు గడువులోగా చేరేలా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్, 20, 2017
- **దరఖాస్తు హార్డ్‌కాపీలు చేరడానికి చివరి తేదీ:** సెప్టెంబర్ 29, 2017
- **వెబ్‌సైట్:** www.pjtsau.ac.in

గెయిల్ ఇండియా లిమిటెడ్ — 151 ఖాళీలు

గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (జీఏఐఎల్)లో వివిధ విభాగాల్లోని 151 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** ఫోర్‌మ్యాన్–75(ఎలక్ట్రికల్–40 + ఇన్‌స్ట్రుమెంటేషన్–35); జూనియర్ కెమిస్ట్–12; జూనియర్ సూపరింటెండెంట్ (అఫీషియల్ లాంగ్వేజ్) –5; అసిస్టెంట్–59 (స్టోర్స్ అండ్ పర్చేజ్–15 + అకౌంట్స్–24 + మార్కెటింగ్ –20).
- **వేతనం:** అసిస్టెంట్ పోస్టులకు రూ.12,500 –రూ.33,000; మిగిలిన పోస్టులకు రూ.14,500 –రూ.36,000
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి 60 శాతం మార్కులతో డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్/ 55 శాతం మార్కులతో డిగ్రీ/ డిగ్రీ (హిందీ లిటరేచర్/ట్రాన్స్‌లేషన్ (హిందీ–ఇంగ్లిష్/ ఇంగ్లిష్–హిందీ) /డిప్లొమా/ ఎంఎస్సీ (కెమిస్ట్రీ)/బీబీఏ/బీబీఎస్/బీబీఎం/బీఎంఎస్. దీంతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం తప్పనిసరి. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు మార్కుల శాతంలో 5 శాతం సడలింపు ఉంటుంది.
- **వయో పరిమితి:** ఫోర్‌మ్యాన్, జూనియర్ కెమిస్ట్, జూనియర్ సూపరింటెండెంట్ (అఫీషియల్ లాంగ్వేజ్) పోస్టులకు 2017 సెప్టెంబర్ 15 నాటికి 30 ఏళ్లు, అసిస్టెంట్ పోస్టులకు 28 ఏళ్లు మించకూడదు. 18 ఏళ్ల లోపు వయసున్న అభ్యర్థులు అనర్హులు.
- **ఎంపిక విధానం:** సంబంధిత పోస్టులను అనుసరించి రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్ /స్కిల్ టెస్ట్/కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్
- **దరఖాస్తు ఫీజు:** రూ.50 (జనరల్/ఓబీసీ(ఎన్‌సీఎల్)); ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ కేటగిరీల అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 15, 2017
- **వెబ్‌సైట్:** www.gailonline.com

ఏపీ డీఎంఈ — 198 ఖాళీలు

ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (ఏపీ డీఎంఈ).. 198 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువరించింది.

- **పోస్టు పేరు:** అసిస్టెంట్ ప్రొఫెసర్
- **మొత్తం ఖాళీలు:** 198 (బ్యాక్‌లాగ్–178, రెగ్యులర్–20).
- **విభాగాలు:** అనాటమీ, ఫిజియాలజీ, ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్
- **వేతనం:** రూ.15,600–రూ.39,100
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి ఎంబీబీఎస్/ ఎండీ/ ఎంఎస్/డీఎం/ఎంసీహెచ్/డీఎన్‌బీ/ఎంఎస్సీ/ పీహెచ్‌డీ/ఎండీఎస్/డీఎస్సీ
- **వయోపరిమితి:** 2017 జూలై 1 నాటికి ఓసీ–40 ఏళ్లు; ఎస్సీ/ఎస్టీ/ బీసీ–45 ఏళ్లు, ఎక్స్–సర్వీస్‌మెన్ కేటగిరీకి 50 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక విధానం:** అకడమిక్ విద్యార్హతలు, ఉద్యోగానుభవం ఆధారంగా...
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000 (ఓసీ/బీసీ); రూ.500(ఎస్సీ/ఎస్టీ).
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు పత్రం డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నింపాలి. సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి కవరులో ఉంచి 'ది డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్–ఏపీ, విజయవాడ' చిరునామాకు గడువులోగా చేరేలా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా పంపాలి. నేరుగా అయినా అందించవచ్చు.
- **దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ:** సెప్టెంబర్ 4, 2017
- **వెబ్‌సైట్:** dme.ap.nic.in

ఏపీ డీఎంఈ — 12 ఖాళీలు

ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్.. 12 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టు పేరు:** డాక్టర్
- **ఖాళీలు:** జనరల్ మెడిసిన్ (ఎండీ)–3;అనస్థీసియా(ఎండీ)–3; సర్జరీ (ఎంఎస్)–3; ఆర్థో సర్జరీ (ఎంఎస్)–3
- **వేతనం:** రూ.75,000
- **అర్హతలు:** సంబంధిత విభాగాలను అనుసరించి ఎంబీబీఎస్+ఎండీ/ఎంఎస్. నిబంధనల మేర ఉద్యోగానుభవం. ఏపీ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- **వయోపరిమితి:** 40 ఏళ్లకు మించకూడదు.
- **ఎంపిక విధానం:** అకడమిక్ క్వాలిఫికేషన్, ఇంటర్వ్యూ, ఉద్యోగానుభవం ద్వారా.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్– ఆంధ్రప్రదేశ్, ఓల్డ్ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ ప్రిమిసెస్, హనుమాన్‌పేట్, ఆపోజిట్ తుమ్మలపల్లి కళాక్షేత్రం, విజయవాడ–520003.
- **దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ:** ఆగస్టు 28, 2017
- **వెబ్‌సైట్:** dme.ap.nic.in

బీఈసీఐఎల్ — 42 ఖాళీలు

నోయిడాలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్).. కాంట్రాక్టు పద్ధతిలో 42 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** కంటెంట్ ఆడిటర్–1; సీనియర్ మానిటర్–3 (ఇంగ్లిష్ లాంగ్వేజ్); మానిటర్–38 (అస్సామీస్ –4, బెంగాలీ–2, గుజరాతీ–1, కన్నడ –6, మలయాళం–6, మరాఠీ–3, పంజాబీ–2, తమిళం–6, తెలుగు–6, ఉర్దూ–1, భోజ్‌పురి–1).
- **వేతనం:** కంటెంట్ ఆడిటర్–రూ.49,800; సీనియర్ మానిటర్– రూ.37,500; మానిటర్–రూ.28,635
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి పీజీ డిప్లొమా (జర్నలిజం/ మాస్ కమ్యూనికేషన్)/గ్రాడ్యుయేట్ + సంబంధిత భాషా విభాగాన్ని అనుసరించి కంప్యూటర్ నాలెడ్జ్‌లో నైపుణ్యం. దీంతోపాటు నిబంధనల మేర విజువల్ మీడియా/న్యూస్ ఏజెన్సీస్‌లో పనిచేసిన అనుభవం.
- **దరఖాస్తు ఫీజు:** రూ.300; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రం డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నింపాలి. సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు తదితర అవసరమైన వాటిని జతచేసి కవరులో ఉంచి 'బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్, సీ/56ఏ 17, సెక్టార్–62, నోయిడా–201307' చిరునామాకు గడువులోగా చేరేలా పోస్ట్ చేయొచ్చు. నేరుగా అయినా అందించొచ్చు.
- **దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ:** సెప్టెంబర్ 15, 2017
- **వెబ్‌సైట్:** www.becil.com

గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ — 150 ఖాళీలు

బెంగళూరులోని గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (జీటీఆర్ఈ)లో 150 అప్రెంటీస్ ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన వెలువడింది. ఇది కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన డీఆర్‌డీవో (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో పనిచేస్తుంది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ట్రైనీస్–90; డిప్లొమా అప్రెంటీస్ ట్రైనీస్ –30; ఐటీఐ అప్రెంటీస్ ట్రైనీస్–30.
- **విభాగాల వారీ ఖాళీలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ట్రైనీస్‌లో.. మెకానికల్/ ప్రొడక్షన్/ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్–35, ఏరో/ఏరో–మెకానికల్–20, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/మెకాట్రోనిక్స్–15, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ–15, మెటలర్జీ–3, సివిల్– 2; డిప్లొమా అప్రెంటీస్ ట్రైనీస్‌లో.. మెకానికల్/ప్రొడక్షన్/టూల్/డై డిజైన్–15, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్–10, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్–3, మెటలర్జీ–2; ఐటీఐ అప్రెంటీస్ ట్రైనీస్‌లో.. మెషినిస్ట్–4, ఫిట్టర్–4, టర్నర్–4, ఎలక్ట్రీషియన్–2, వెల్డర్–2, షీట్ మెటల్ వర్కర్–2, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(కోపా)–8, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్క్ మెయింటెనెన్స్–2, మెకానిక్ మోటార్ వెహికల్–2.
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి బీఈ/బీటెక్ లేదా తత్సమాన విద్యార్హత/డిప్లొమా(ఇంజనీరింగ్/టెక్నాలజీ)/ఇంటర్మీడియెట్+ సంబంధిత ట్రేడ్ విభాగంలో ఐటీఐ(ఎన్‌సీవీటీ). అలాగే బీఈ/బీటెక్/ డిప్లొమా అభ్యర్థులు www.mhrdnats.gov.in వెబ్‌సైట్ ద్వారా, ఐటీఐ అభ్యర్థులు ncvtmis.gov.in వెబ్‌సైట్ ద్వారా అప్రెంటీస్‌షిప్ రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలి.
- **వయో పరిమితి:** 2017 సెప్టెంబర్ 1 నాటికి 18–27 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** గ్రాడ్యుయేట్ అప్రెంటీస్ ట్రైనీస్ పోస్టులకు క్వాలిఫైయింగ్ ఎగ్జామినేషన్ మార్కులు, ఇంటర్వ్యూ; డిప్లొమా/ఐటీఐ అప్రెంటీస్ ట్రైనీస్ పోస్టులకు క్వాలిఫైయింగ్ ఎగ్జామినేషన్ మార్కులు, మెడికల్ ఫిట్‌నెస్.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు పంపాల్సిన చిరునామా:** ది డైరెక్టర్, గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్, సీవీ రామన్ నగర్, బెంగళూరు–560093, కర్ణాటక
- **దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ:** సెప్టెంబర్ 5, 2017
- **వెబ్‌సైట్:** www.drdo.gov.in

ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ — 139 ఖాళీలు

తమిళనాడులోని తిరునల్వేలి జిల్లా మహేంద్రగిరిలో ఉన్న ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో 139 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** టెక్నీషియన్ అప్రెంటీస్–59; ట్రేడ్ అప్రెంటీస్– 80
- **విభాగాల వారీ ఖాళీలు:** ట్రేడ్‌లో.. ఫిట్టర్–15, వెల్డర్–8, ఎలక్ట్రీషియన్–8, టర్నర్–2, మెషినిస్ట్–2, డ్రాట్స్‌మ్యాన్ (మెకానిక్–2+సివిల్–7) –9, ఎలక్ట్రానిక్ మెకానిక్/ మెకానిక్ (రేడియో అండ్ టెలివిజన్)–4, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ –2, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్–1, మెకానిక్ డీజిల్–8; కార్పెంటర్–2, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్(కెమికల్ ప్లాంట్)–1, ప్రోగ్రామింగ్ అండ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ (పీఏఎస్ఏఏ)/ కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(సీవోపీఏ)–18; టెక్నీషియన్‌లో.. మెకానికల్–13, ఎలక్ట్రికల్–7, ఎలక్ట్రానిక్స్–12, కెమికల్–5, సివిల్–7, కమర్షియల్ ప్రాక్టీస్–15.
- **స్టైపెండ్:** టెక్నీషియన్ అప్రెంటీస్ పోస్టులకు రూ.3,542; ట్రేడ్ అప్రెంటీస్ పోస్టులకు విభాగాలను అనుసరించి రూ.6,400/రూ.7,200.
- **అర్హతలు:** ట్రేడ్ అప్రెంటీస్ పోస్టులకు.. పదోతరగతితో పాటు సంబంధిత ట్రేడ్ విభాగంలో ఐటీఐ; టెక్నీషియన్ అప్రెంటీస్ పోస్టులకు.. 2015/ 2016/2017లో డిప్లొమా (ఇంజనీరింగ్/టెక్నాలజీ/కమర్షియల్ ప్రాక్టీస్/ మోడర్న్ ఆఫీస్ ప్రాక్టీస్) పూర్తి చేసి ఉండాలి.
- **వయో పరిమితి:** 2017 సెప్టెంబర్ 2 నాటికి టెక్నీషియన్ అప్రెంటీస్‌లోని కమర్షియల్ ప్రాక్టీస్ పోస్టులకు 26 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు పత్రం డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నింపాలి. సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి కవరులో ఉంచి 'ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్(ఐపీఆర్‌సీ), మహేంద్రగిరి, తిరునల్వేలి(డిస్ట్రిక్ట్), తమిళనాడు' చిరునామాలో గడువు లోపల నేరుగా అందించాలి.
- **ఎంపిక విధానం:** విద్యార్హతల మార్కుల ఆధారంగా..
- **దరఖాస్తులు అందించడానికి చివరి తేదీ:** సెప్టెంబర్ 2, 2017
- **వెబ్‌సైట్:** www.iprc.gov.in

ఐఐటీ మద్రాస్ — 32 ఖాళీలు

తమిళనాడులోని చెన్నైలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ (ఐఐటీఎం)లో 32 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** రిజిస్ట్రార్–1; సిస్టమ్స్ ఇంజనీర్–1; సెక్యూరిటీ ఆఫీసర్–1; జూనియర్ ఇంజనీర్ –3; స్టాఫ్ నర్స్–4; జూనియర్ టెక్నీషియన్–12; జూనియర్ అసిస్టెంట్–10
- **వేతనం:** రిజిస్ట్రార్‌కు–రూ.37,400 –రూ.67,000+జీపీ రూ.10,000; సిస్టమ్స్ ఇంజనీర్, సెక్యూరిటీ ఆఫీసర్‌లకు రూ.15,600 –రూ.39,100; జూనియర్ ఇంజనీర్, స్టాఫ్‌నర్స్‌కు రూ.9,300–రూ.34,800; జూనియర్ టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్‌కు రూ.5,200–రూ.20,200
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి ఐటీఐ/డిగ్రీ/డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్/ బీఎస్సీ (నర్సింగ్)/ఎంఈ/ఎంటెక్/పీజీ. దీంతోపాటు నిబంధనల మేర మార్కుల శాతం, ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయోపరిమితి:** రిజిస్ట్రార్, సిస్టమ్ ఇంజనీర్ పోస్టులకు 50 ఏళ్లు, సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టులకు 45 ఏళ్లు, జూనియర్ ఇంజనీర్, స్టాఫ్‌నర్స్‌లకు –32 ఏళ్లు, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ టెక్నీషియన్ పోస్టులకు 27 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు ఫీజు :** రూ.100; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ్/ఎక్స్–సర్వీస్‌మెన్ కేటగిరీ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దానిని ప్రింటవుట్ తీసుకుని సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, ఫీజు రిసీట్ తదితర వాటిని జత చేసి కవరులో ఉంచి 'ది అసిస్టెంట్ రిజిస్ట్రార్, రిక్రూట్‌మెంట్ సెక్షన్, అడ్మిన్ బిల్డింగ్ (ఫస్ట్ ఫ్లోర్), ఐఐటీ మద్రాస్, చెన్నై–600036' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 8, 2017
- **దరఖాస్తు హార్డ్‌కాపీలు చేరడానికి చివరి తేదీ:** సెప్టెంబర్ 15, 2017
- **వెబ్‌సైట్:** www.iitm.ac.in

ఏపీ పోస్టల్ సర్కిల్‌లో మల్టీ టాస్కింగ్ స్టాఫ్ — 39 ఖాళీలు

ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్‌లోని వివిధ కార్యాలయాలు, డివిజన్లలో 39 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

- **పోస్టు పేరు:** మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్)
- **మొత్తం ఖాళీలు:** 39(ఓసీ–21, ఓబీసీ–10, ఎస్సీ–6, ఎస్టీ–2)
- **వేతనం:** రూ.5,200–రూ.20,200+ నిబంధనల మేర అలవెన్సులు
- **అర్హతలు:** పదో తరగతి లేదా ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయో పరిమితి:** 2017 సెప్టెంబర్ 18 నాటికి 18–25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ కేటగిరీల అభ్యర్థులకు నిబంధనలు అనుసరించి సడలింపు ఉంటుంది.
- **ఎంపిక విధానం:** ఎగ్జామినేషన్ ద్వారా.
- **పరీక్ష విధానం:** ఇది ఆప్టిట్యూడ్ టెస్ట్. ఆబ్జెక్టివ్ విధానంలో 100 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్నపత్రం మొత్తం మూడు విభాగాలుగా ఉంటుంది. పార్ట్–ఎలో జనరల్ నాలెడ్జ్, పార్ట్–బిలో మ్యాథమెటిక్స్, పార్ట్– సిలో ఇంగ్లిష్ లాంగ్వేజ్, తెలుగు లాంగ్వేజ్ అంశాలు ఉంటాయి. ఒక్కోదాని నుంచి 25 ప్రశ్నలు చొప్పున మొత్తం 100 ప్రశ్నలు 100 మార్కులకు ఉంటాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500 (అప్లికేషన్ ఫీ రూ.100+ ఎగ్జామినేషన్ ఫీ రూ.400); ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ అభ్యర్థులకు ఫీజు రూ.100 (అప్లికేషన్ ఫీజు మాత్రమే)
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 18, 2017
- **వెబ్‌సైట్:** www.indiapost.gov.in, www.appost.in

నాల్కోలో 'మెడికల్' — 16 ఖాళీలు

ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఉన్న నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (ఎన్ఏఎల్‌సీఓ-నాల్కో).. 16 'మెడికల్' ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టుల పేరు-ఖాళీలు:** జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ (జీడీఎంఓ)–5; సీనియర్ మెడికల్ ఆఫీసర్ (ఎస్ఆర్ఎంఓ)–11 (మెడిసిన్–2 + ఆర్థోపెడిక్స్ –1+ ఓబీఎస్ అండ్ గైనకాలజీ–1 + పీడియాట్రిక్స్–2 + ఆప్తాల్మాలజీ–1 + అనస్థీసియా–1 + రేడియాలజీ–1 + పాథాలజీ–1 + డెర్మటాలజీ–1)
- **వేతనం:** జీడీఎంకు రూ.24,1900 –రూ.50,500; ఎస్ఆర్ఎంఓలకు రూ.29,100 –రూ.54,500
- **అర్హతలు:** సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఎంబీబీఎస్/ ఎండీ/ఎంఎస్/ పోస్ట్ ఎంబీబీఎస్ డిప్లొమా
- **వయో పరిమితి:** 2017 ఆగస్టు 18 నాటికి జీడీఎం పోస్టులకు 32 ఏళ్లు, పీఎస్ఆర్ఎంఓ పోస్టులకు 37 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.
- **ఎంపిక విధానం:** జీడీఎం పోస్టులకు రాతపరీక్ష/ఇంటర్వ్యూ; ఎస్ఆర్ ఎంఓ పోస్టులకు ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100; ఎస్సీ/ ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దానిని ప్రింటవుట్ తీసుకొని సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి కవరులో ఉంచి 'అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్‌డీ), రిక్రూట్‌మెంట్ సెల్, హెచ్ఆర్‌డీ డిపార్ట్‌మెంట్, నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్, నాల్కో భవన్, పీ/1, నయాపల్లి, భువనేశ్వర్–751013, ఒడిశా' చిరునామాకు గడువులోగా చేరేలా పోస్టు ద్వారా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** సెప్టెంబర్ 15, 2017
- **దరఖాస్తు హార్డ్‌కాపీలు చేరడానికి చివరి తేదీ:** సెప్టెంబర్ 25, 2017
- **వెబ్‌సైట్:** www.nalcoin-dia.com

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
33 ▲	11 ▲
31,292	9,766

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండూ రాత్రి 11:30కి)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	6,288	▲	75
డోజోన్స్	21,867	▲	164
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,382	▲	63
డాక్స్	12,229	▲	163
షాంఘై	3,291	▲	4
నికాయ్	19,384	▼	9

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	58.29	67.59
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	75.09	87.11
€	యూరో	థామస్‌కుక్	68.81	79.80
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	53.35	61.87
AUS$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	46.27	53.54
SS	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	42.82	50.74
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.50	18.37
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.86	18.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.81	11.04

అభివృద్ధి సైనికులుగా మారండి

దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు తోడ్పడండి ● యువ సీఈవోలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచన



న్యూఢిల్లీ: అభివృద్ధి సాధన కోసం యువ వ్యాపారవేత్తలు సైనికులుగా మారాలని ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. భారత్ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు తగు పరిష్కార మార్గాలు కనుగొనాలని, తద్వారా దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. అలాగే తక్కువ నగదు చలామణిలో ఉండే ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని తీర్చిదిద్దడంలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. 'మార్పునకు ప్రతినిధులు' పేరిట నీతి ఆయోగ్ నేతృత్వంలో మంగళవారం సుమారు 200 మంది సీఈవోలు, స్టార్టప్ సంస్థలతో భేటీ అయిన ప్రధాని ఈ సూచనలు చేశారు. పర్యాటకాన్ని మరింతగా ప్రోత్సహించడంలో పాలుపంచుకోవాలని, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను పెంచే దిశగా కృషి చేయాలని ప్రధాని చెప్పారు. స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మా గాంధీ సామాన్యులను కూడా ఎలా భాగస్వాములను చేశారో.. భారత అభివృద్ధి విషయంలో కూడా అదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన చెప్పారు. 'కలసికట్టుగా పనిచేయడం ద్వారా దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించవచ్చు' అని ప్రధాని తెలిపారు.

భీమ్ యాప్‌కి మరింత ప్రాచుర్యం..

ఎకానమీలో నగదు వాడకం తగ్గించే దిశగా.. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు భీమ్ యాప్‌నకు మరింత ప్రాచుర్యం కల్పించాలని సీఈవోలకు ప్రధాని సూచించారు. 2022 నాటికల్లా తమ తమ సంస్థల్లోని ఉద్యోగులు నగదు రహిత లావాదేవీలే జరిపేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఇందులో భాగంగా సిబ్బందికి దీపావళి వంటి పండుగల సందర్భంగా ఇచ్చే బహుమతులను ఖాదీ కూపన్స్ రూపంలో అందించాలని ఆయన చెప్పారు. 'సుసంపన్నమైన సంస్కృతి మనకు గర్వకారణం. మనం మన సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకోవడం మొదలుపెడితే.. యావత్ ప్రపంచం భారత్ సందర్శించేందుకు ఉవ్విళ్లూరుతుంది' అని పర్యాటక రంగం ప్రాధాన్యం గురించి వివరించారు.

మ్యాక్స్‌క్యూర్‌లో వాటా విక్రయం

మెడికవర్ చేతికి 22 శాతం వాటా ● విలువ రూ.100 కోట్లు



మీడియా సమావేశంలో మెడికవర్ సీఈవో ఫ్రెడ్రిక్ రాగ్‌మార్క్, అనిల్ కృష్ణ, ఫ్రెడ్రిక్ స్టెన్మో, హరికృష్ణ (ఎడమ నుంచి)

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వైద్య సేవల రంగంలో ఉన్న మ్యాక్స్‌క్యూర్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌లో యూరప్ సంస్థ మెడికవర్ 22 శాతం వాటా చేజిక్కించుకుంది. ఇందుకోసం రూ.100 కోట్లు వెచ్చించింది. రెండేళ్లలో మరో రూ.220 కోట్ల దాకా వ్యయం చేయనుంది. తద్వారా మెడికవర్ వాటా 51 శాతానికి చేరుతుందని మ్యాక్స్‌క్యూర్ ఎండీ అనిల్ కృష్ణ మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ సహా పలు నగరాల్లో 9 ఆసుపత్రులను నిర్వహిస్తున్నామని, 1,500 పడకల సామర్థ్యం ఉందని ఆయన తెలియజేశారు. 2016–17లో రూ.350 కోట్ల టర్నోవర్ సాధించామని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.500 కోట్లు ఆశిస్తున్నామని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతిలో 250 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు ప్రతిపాదించామని, వరంగల్, కాకినాడలోనూ అడుగుపెట్టనున్నామని వివరించారు. బెంగళూరు, పుణే, చెన్నై, ఈశాన్య రాష్ట్రాల్లో విస్తరిస్తామని మ్యాక్స్‌క్యూర్ సీఈవో హరికృష్ణ చెప్పారు. రెండేళ్లలో ఆసుపత్రుల సంఖ్య 20కి చేరనుందని, ఇందుకు రూ.500 కోట్ల దాకా వెచ్చిస్తామని తెలియజేశారు.

భారత్‌లో సెలెక్స్ గ్రూప్ పాగా..

మెడికవర్‌ను ప్రమోట్ చేస్తున్న సెలెక్స్ గ్రూప్ భారత్‌లో దీర్ఘకాలిక వ్యూహంతో అడుగులేస్తోంది. ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో గతేడాది ఏడు ఫెర్టిలిటీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది మరో 10 కేంద్రాలను నెలకొల్పుతామని, 2019 కల్లా వీటి సంఖ్య 50కి చేరుతుందని మెడికవర్ చైర్మన్ ఫ్రెడ్రిక్ స్టెన్మో 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధికి చెప్పారు. ''మార్కెట్ కంటే వేగంగా మ్యాక్స్‌క్యూర్‌ను విస్తరిస్తాం. ప్యారడైజ్ రెస్టారెంట్స్‌లో మాకు 50 శాతం వాటా ఉంది. ఈ రెస్టారెంట్ల సంఖ్య పెరిగేలా చూస్తాం. రానున్న రోజుల్లో భారత్‌లో డయాగ్నొస్టిక్ సేవల్లోకి కూడా ప్రవేశిస్తాం. ఏడేళ్లలో దేశంలో రూ.650 కోట్ల దాకా ఖర్చు చేశాం. మ్యాక్స్‌క్యూర్ పెట్టుబడి చాలా చిన్నది. ఇంకా పెద్ద ఎత్తున ఇన్వెస్ట్ చేస్తాం. మా కుటుంబంలో రెండో తరం వ్యాపార బాధ్యతలు తీసుకుంది. భారత్‌లో అపార వ్యాపార అవకాశాలున్నాయి. ఇక్కడ నిలదొక్కుకుంటాం'' అని వెల్లడించారు. సెలెక్స్ గ్రూప్ నిర్వహణలో ఒరిఫ్లేమ్, ఒరెసా అసెట్ మేనేజ్‌మెంట్ వంటి కంపెనీలున్నాయి.

దేశీ వ్యాపారాన్ని లాభాల్లోకి తెస్తాం

వాణిజ్య వాహనాల విభాగంపై ప్రత్యేక దృష్టి ◆ టాటా మోటార్స్ చీఫ్ చంద్రశేఖరన్ ఆశాభావం

ముంబై: టాటా మోటార్స్ దేశీ వ్యాపారాన్ని మళ్లీ లాభాల్లోకి మళ్లించడంపై దృష్టి పెడుతున్నట్లు టాటా గ్రూపు చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ చెప్పారు. ముఖ్యంగా సమస్యాత్మక పరిస్థితులతో ప్రతికూల ప్రభావాలెదుర్కొన్న వాణిజ్య వాహనాల విభాగంపై మరింతగా కసరత్తు చేయనున్నట్లు తెలియజేశారు. టాటా మోటార్స్‌కు కూడా చైర్మన్‌గా వ్యవహరిస్తున్న చంద్రశేఖరన్... చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా టాటా మోటార్స్ వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2016–17లో టాటా మోటార్స్ స్టాండెలోన్ ప్రాతిపదికన స్థూల ఆదాయం 3.6 శాతం వృద్ధితో రూ. 49,100 కోట్లకు చేరగా.. పన్నుల అనంతరం నష్టం రూ. 62 కోట్ల నుంచి రూ. 2,480 కోట్లకు పెరిగిందని తెలియజేశారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీ అమలుతో పాటు బీఎస్ 3 నుంచి బీఎస్ 4 ప్రమాణాలకు మారాల్సిందేనన్న సుప్రీం కోర్టు ఆదేశాలు మొదలైన వాటి రూపంలో వాణిజ్య వాహనాల వ్యాపారం పలు సవాళ్లు, అనిశ్చితి పరిస్థితిని ఎదుర్కొనాల్సి రావడమే ఇందుకు కారణమని చెప్పారు. మరోవైపు, మార్కెట్‌ను అందుకోలేకపోవడం సైతం కంపెనీకి ప్రతికూలంగా మారిందన్నారు. అయిదేళ్ల క్రితం 60 శాతంగా ఉన్న మార్కెట్ వాటా ఈ ఏడాది మార్చి నాటికి 44.4 శాతానికి పడిపోయిందని చెప్పారు. గడచిన మూడేళ్లుగా వాణిజ్య వాహనాల పరిమాణం 3,20,000 యూనిట్లకు దరిదాపుల్లోనే కొనసాగుతూనే ఉన్నప్పటికీ.. నిర్వహణ వ్యయాలు గణనీయంగా పెరిగాయని పేర్కొన్నారు. కంపెనీ పనితీరుపై ఇవన్నీ ప్రభావం చూపాయని చంద్రశేఖరన్ వివరించారు.

నెక్సాన్‌పై ఆశలు..

ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రవేశపెట్టబోయే నెక్సాన్ కారు అమ్మకాలు ఆశావహంగా ఉండగలవని భావిస్తున్నట్లు చంద్రశేఖరన్ చెప్పారు. ఎటువంటి జాప్యాలు లేకుండా కొత్త ఉత్పత్తులను గడువులోగా ప్రవేశపెట్టడం, మళ్లీ మార్కెట్ వాటాను మెరుగుపర్చుకోవడం, వ్యయాలను నియంత్రించుకోవడం వంటి అంశాలపై దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. ప్యాసింజర్ వాహనాల విభాగంలో దేశీయంగా మార్కెట్ వాటాను మెరుగుపర్చుకోగలిగినప్పటికీ.. ప్రస్తుత, భవిష్యత్ ఉత్పత్తులపై పెట్టుబడుల కారణంగా వ్యయాలు సైతం పెరిగాయన్నారు.



నానో ఆపేయాలన్నది ఏకగ్రీవ నిర్ణయం: మిస్త్రీ



నష్టాల్లోని నానో కారు ప్రాజెక్టును లాభాల్లోకి మళ్లించేందుకు చేసిన ప్రయత్నాలన్నీ వృథా కావడంతో.. కార్ల తయారీ నిలిపివేయాలని టాటా మోటార్స్ ఏడాది క్రితమే ఏకగ్రీవ నిర్ణయం తీసుకుందని టాటా సన్స్ మాజీ చైర్మన్ సైరస్ మిస్త్రీ తెలిపారు. నానో కారు, చిన్న వాణిజ్య వాహనాల విభాగంలో (ఎస్‌సీవీ) రిస్కులను తగిన స్థాయిలో మదింపు చేయకుండా రుణాలివ్వడం వల్ల కంపెనీకి, టాటా మోటార్ ఫైనాన్స్‌కి దాదాపు రూ. 4,000 కోట్ల మేర మొండిబాకీల రూపంలో నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు. 2016–17 వార్షిక నివేదికలో కొత్త చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇస్తూ మిస్త్రీ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎస్సార్ ఆయిల్ షేరుకు అదనంగా రూ.75.48

మాజీ మైనారిటీ వాటాదారులకు శుభవార్త



న్యూఢిల్లీ: ఎస్సార్ ఆయిల్ మాజీ మైనారిటీ వాటాదారులకు ఎస్సార్ గ్రూపు తీపి కబురు అందించింది. ఒక్కో షేరుకు రూ.75.48 చొప్పున అదనంగా చెల్లించనున్నట్టు ప్రకటించింది. ఎస్సార్ ఆయిల్‌ను రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్, ఇతర ఇన్వెస్టర్ల కూటమి 12.9 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ విక్రయానికి ముందే 2015లో ఎస్సార్ ఆయిల్‌ను స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల నుంచి ఎస్సార్ గ్రూపు డీలిస్ట్ చేసింది. ఆ సమయంలో బైబ్యాక్‌లో పాల్గొన్న ఇన్వెస్టర్లకు వారి దగ్గరున్న ఒక్కో షేరుకు రూ.262.80 చొప్పున చెల్లించింది. తాజాగా ఎస్సార్ ఆయిల్‌ను రాస్‌నెఫ్ట్‌కు విక్రయించగా, ఒక్కో షేరుకు రూ.338.28 చొప్పున తమకు చెల్లింపులు జరిగాయని, ఈ నేపథ్యంలో ఒకనాటి మైనారిటీ వాటాదారులకు గతంలో చెల్లించిన రూ.262.80కు అదనంగా ఇప్పుడు ఒక్కో షేరుకు రూ.75.48 చొప్పున చెల్లించనున్నట్టు ఎస్సార్ గ్రూపు తెలిపింది.

బ్యాంకుల బంద్; సేవలు నిల్!

ముగిసిన పీఎస్‌యూ బ్యాంకు ఉద్యోగుల ఒకరోజు సమ్మె



న్యూఢిల్లీ: ఉద్యోగుల సమ్మెతో మంగళవారం దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగ బ్యాంకులు, పాత తరం ప్రైవేటు బ్యాంకుల్లో సేవలు నిలిచిపోయాయి. నగదు బదిలీలు, చెక్కుల క్లియరెన్స్, నగదు జమలు, ఉపసంహరణలు తదితర సేవలకు అంతరాయం కలిగింది. ముంబై, హైదరాబాద్, కోల్‌కతా, అహ్మదాబాద్, బెంగళూరు, పాట్నా, చెన్నై, పుణె, జైపూర్ తదితర నగరాల్లో సమ్మె ప్రభావం పూర్తిగా కనిపించింది. ముఖ్యంగా ఏటీఎంలలో నగదు లేక జనం ఇబ్బందులు పడ్డారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకుల్లో మాత్రం సేవలు యథావిధిగా కొనసాగాయి. బ్యాంకుల విలీనాలు సహా పలు అంశాలపై వివిధ బ్యాంకు ఉద్యోగుల ఉమ్మడి సంఘమైన యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. కాగా, అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ) జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటాచలం దీనిపై మాట్లాడుతూ... ''మరింతగా బ్యాంకు సేవల అవసరం ఉన్న ఈ సమయంలో బ్యాంకుల స్థిరీకరణ, బ్యాంకుల విలీనాల గురించి ప్రభుత్వం మాట్లాడుతోంది. బ్యాంకుల విలీనాలతో బ్యాంకు శాఖలు మూతపడతాయి. అనుబంధ బ్యాంకులను విలీనం చేసుకున్న ఎస్‌బీఐ విషయంలో ఇప్పుడు అదే జరిగింది. విలీనాల ద్వారా పెద్ద బ్యాంకులను ఏర్పాటు చేయడం వల్ల రిస్కు కూడా పెరుగుతుంది'' అని ప్రభుత్వ తీరును విమర్శించారు. బ్యాంకు ఉద్యోగుల గ్రాట్యుటీని తక్షణమే రూ.20 లక్షలకు పెంచాలని ఆల్ ఇండియా బ్యాంకు అధికారుల కాన్ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ ఫ్రాంకో డిమాండ్ చేశారు.

హ్యుందాయ్ 'వెర్నా'లో కొత్త వెర్షన్



ప్రారంభ ధర రూ.7.99 లక్షలు

న్యూఢిల్లీ: దక్షిణ కొరియాకు చెందిన వాహన తయారీ కంపెనీ 'హ్యుందాయ్' తాజాగా 'వెర్నా'లో కొత్త వెర్షన్‌ను (ఐదో జనరేషన్) మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. దీని ప్రారంభ ధర రూ.7.99 లక్షలుగా (ఎక్స్ షోరూమ్ ఢిల్లీ) ఉంది. మిడ్‌సైజ్డ్ సెడాన్ విభాగంలో తిరిగి అధిక మార్కెట్ వాటాను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో కంపెనీ ఈ కారును ఆవిష్కరించింది. ఈ ఐదో జనరేషన్ వెర్నా ప్రధానంగా హోండా సిటీ, మారుతీ సుజుకీ సియాజ్ మోడళ్లకు గట్టి పోటీనిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీని పెట్రోల్ వేరియంట్స్ ధర రూ.7.99 లక్షలు–రూ.12.23 లక్షల శ్రేణిలో, డీజిల్ వేరియంట్స్ ధర రూ.9.19 లక్షలు–రూ.12.61 లక్షల శ్రేణిలో ఉంటుందని కంపెనీ తెలిపింది. ఇక ఈ వాహనాలకు సంబంధించి నెలకు 4,000 నుంచి 5,000 యూనిట్ల విక్రయాలను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని హ్యుందాయ్ మోటార్ ఇండియా (హెచ్‌ఎంఐఎల్) ఎండీ, సీఈవో వై.కె.కో తెలిపారు. కాగా పైన పేర్కొన్న కార్ల ధరలు తొలి 20,000 మంది కస్టమర్లకు మాత్రమే వర్తిస్తాయని, తర్వాత వాహన ధరలను పెంచుతామని హెచ్‌ఎంఐఎల్ డైరెక్టర్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) రాకేశ్ శ్రీవాత్సవ పేర్కొన్నారు. కొత్త వెర్షన్ వెర్నాలో 1.6 లీటర్ పెట్రోల్/డీజిల్ ఇంజిన్స్, మాన్యువల్/ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్స్, సన్‌రూఫ్, స్టాండర్డ్ డ్యూయెల్ ఎయిర్ బ్యాగ్స్, ఏబీఎస్, రియర్ పార్కింగ్ సెన్సార్స్ వంటి పలు ప్రత్యేకతలున్నాయని వివరించారు.

షేర్ల బైబ్యాక్ సైజు పెంచాలి





- ఈ చర్య ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచుతుంది
- మూర్తిపై బోర్డు నిందలు తప్పులను కప్పిపుచ్చుకోవడమే
- ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో బాలకృష్ణన్

న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ కంపెనీ ప్రకటించిన షేర్ల బైబ్యాక్ మొత్తం చాలదని ఆ సంస్థ మాజీ సీఎఫ్‌వో వి.బాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు. తాజా అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచేందుకు బైబ్యాక్ పరిమాణాన్ని పెంచాలని ఆయన సూచించారు. ''రూ.13,000 కోట్ల విలువ మేర షేర్ల బైబ్యాక్ ప్రకటించిన సమయం అసాధారణమైనది. ఒక్కో షేరుకు రూ.1,150 అన్నది సరైనదే. కానీ, మరింత ధరను నిర్ణయించాల్సి ఉంది. రూ.1,200 ధర ఇన్వెస్టర్లలో తగినంత నమ్మకాన్ని కలిగించగలదు'' అని బాలకృష్ణన్ పేర్కొన్నారు. విశాల్ సిక్కా ఎండీ, సీఈవో పదవులకు రాజీనామా చేసిన మరుసటి రోజు ఇన్ఫోసిస్ బోర్డు, ఒక్కో షేరును రూ.1,150 చొప్పున 11.3 కోట్ల షేర్లను ఇన్వెస్టర్ల నుంచి కొనుగోలు చేయాలని (బైబ్యాక్) నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. సీఈవో బయటకు వెళ్లిపోవడం, వ్యవస్థాపకులతో వివాదం సమసిపోని అనిశ్చిత పరిస్థితుల్లో ఇన్ఫోసిస్ బోర్డు కేవలం బైబ్యాక్‌ను ప్రకటించి ఊరుకోవడం సరికాదని బాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు. బైబ్యాక్ కార్యక్రమంలో తాను కూడా పాల్గొంటానన్నారు. అమెరికాలో నాలుగు న్యాయ సంస్థలు ఇన్ఫోసిస్‌పై విచారణ మొదలుపెట్టినందున బైబ్యాక్‌పై దాని ప్రభావం ఉంటుందని తాను అనుకోవడం లేదన్నారు. క్లాస్ యాక్షన్ సూట్‌ను దాఖలు చేయాలా అన్నదానిపై అమెరికా న్యాయ సంస్థలు విచారణ చేస్తున్నాయని, ఈ ప్రక్రియలో భాగంగా లాసూట్ దాఖలు చేసే ముందు తగిన మద్దతు సమీకరిస్తాయని వివరించారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే: సీఈవోగా సిక్కా తప్పుకోవడంతో కంపెనీ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తిపై బోర్డు నిందలు వేయడం తన స్వీయ తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకేనని బాలకృష్ణన్ ఆరోపించారు.

కఠిన పరిస్థితులను తట్టుకోగలం: సీఈవో


ఇన్ఫోసిస్‌నీలో అనిశ్చితి ఉద్యోగులపై ప్రభావం చూపించకుండా కంపెనీ తాత్కాలిక సీఈవో, ఎండీ యూబీ ప్రవీణ్ రావు ఉద్యోగులకు ఈ మెయిల్ పంపారు. కంపెనీ తాజా పరిణామాలను తట్టుకుని నిలబడగలుగుతుందని భరోసా ఇచ్చారు. ముందున్న ప్రయాణం అంత సులభం కాదని, అయినప్పటికీ తమ విధులపై దృష్టి సారించాలని ఉద్యోగులను ప్రవీణ్‌రావు కోరారు. ఈ తరహా కఠిన సవాళ్లు ఇన్ఫోసిస్‌కు ఇదే మొదటి సారి కాదని, ఆర్థిక సంక్షోభ పరిస్థితులు, నాయకత్వం కంపెనీ నుంచి వెళ్లిపోవడం వంటివి గతంలో ఎదుర్కొన్నవేనని, వాటిని తట్టుకుని నిలబడిన సందర్భాన్ని గుర్తు చేసుకోవాలని కోరారు.

ట్రేడింగ్ ఖాతాలు ఆధార్‌తో లింక్ కావాల్సిందే: సెబీ




ఇన్ఫోసిస్ షేరు కదలికలను తాము పరిశీలిస్తున్నట్టు సెబీ తెలిపింది. గత శుక్రవారం ఇన్ఫోసిస్ షేరు 10 శాతం నష్టపోగా, సోమవారం మరో 5 శాతం తగ్గిన విషయం తెలిసిందే. దీనిపై సెబీ చైర్మన్ అజయ్‌త్యాగి స్పందిస్తూ ఇన్ఫోసిస్ షేరు ధరలను తాము పరిశీలిస్తున్నామని చెప్పారు. ట్రేడింగ్ ఖాతాలను ఆధార్ నంబర్‌తో అనుసంధానానికి విధించిన డిసెంబర్ గడువుకు కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. డిసెంబర్ 31 నాటికి ఆధార్‌తో అనుసంధానం కాని వాటిని ఆ వివరాలు ఇచ్చేంత వరకు సస్పెన్షన్‌లో ఉంచనున్నట్టు త్యాగి చెప్పారు. నల్లధన ప్రవాహం, పన్నుల ఎగవేతను అరికట్టేందుకే ఈ చర్య అని చెప్పారు. క్లయింట్ల ఆధార్ వివరాలు అందించేందుకు గల సన్నద్ధత గురించి ఈ నెల 23 నాటికి వివరాలు తెలియజేయాలని గత వారం బీఎస్‌ఈ ట్రేడింగ్, క్లియరింగ్ సభ్యులను ఆదేశించిన విషయం తెలిసిందే.

మార్కెట్ విలువలో టాప్-10 నుంచి ఇన్ఫోసిస్ ఔట్



ఇన్ఫోసిస్ టెక్నాలజీస్ సీఈఓ సిక్కా అర్ధాంతరంగా వైదొలగడం, ఈ పరిణామ నేపథ్యంతో ఇన్ఫోసిస్ షేరు మార్కెట్ విలువ రూ. 2.01,074 కోట్లకు పడిపోయింది. దాంతో అత్యధిక మార్కెట్ విలువకలిగిన టాప్–10 కంపెనీల జాబితాలో ఇన్ఫీకి స్థానం లేకుండా పోయింది. బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈల్లో మార్కెట్ విలువరీత్యా ఇన్ఫోసిస్ 11వ స్థానానికి దిగిపోయింది. వరుసగా రెండురోజుల్లో రూ. 33,911 కోట్ల విలువను కంపెనీ కోల్పోయింది. రూ. 5.08 లక్షల కోట్ల మార్కెట్ విలువతో రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానంలో వుండగా, టీసీఎస్ (రూ. 4.78 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.4.51 లక్షల కోట్లు), ఐటీసీ (రూ. 3.45 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ (రూ. 2.79 లక్షల కోట్లు), హెచ్‌యూఎల్ (రూ. 2.60 లక్షల కోట్లు), ఎస్‌బీఐ (రూ. 2.37 లక్షల కోట్లు), మారుతి సుజుకి (రూ.2.27 లక్షల కోట్లు), ఐఓసీ (రూ. 2.05 లక్షల కోట్లు), ఓఎన్‌జీసీ (రూ. 2.04 లక్షల కోట్లు) తర్వాతి స్థానాల్లో వున్నాయి.

జైట్లీతో ఇన్ఫోసిస్ కో-చైర్మన్ రవి భేటీ



ఇన్ఫోసిస్ సహ చైర్మన్ రవి వెంకటేశన్ మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో ఢిల్లీలో భేటీ అయ్యారు. విశాల్ సిక్కా అనూహ్యంగా కంపెనీ ఎండీ, సీఈవో పదవుల నుంచి తప్పుకున్న అనంతరం ఏర్పడిన అనిశ్చిత పరిస్థితుల్లో ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఇన్ఫోసిస్‌లో జరుగుతున్న పరిణామాలు, వాటాదారులకు సంబంధించి తీసుకున్న చర్యల్ని వెంకటేశన్ వెల్లడించారు.



నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

పత్తి (వరంగల్, వ్యాపారస్తులు) రూ.4,800 (కనిష్టం) రూ.5,200 (గరిష్టం)



మిర్చి (వరంగల్, తేజ) రూ.2,000(కనిష్టం) రూ.5,300(గరిష్టం)



పసుపు (నిజామాబాద్, కొమ్ము) రూ.3,500(కనిష్టం) రూ.8,237(గరిష్టం)



ఉల్లి (కర్నూలు) రూ.260 (కనిష్టం) రూ.840 (గరిష్టం) (20న ముగింపు)



చక్కెర (చెన్నై) రూ.4,080



బియ్యం (కరీంనగర్) రూ.3,600 (హెచ్‌ఎంటీ)



కందిపప్పు (చెన్నై) రూ.7,500



సుబాబులు (కృష్ణా) రూ.4,400 (టన్నుకు)



ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి) రూ.6,781



పతనానికి బ్రేక్

ఇన్ఫోసిస్‌తో సహా స్వల్పంగా కోలుకున్న సూచీలు

ప్రపంచ సంకేతాల తోడ్పాటు

ముంబై: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ టెక్నాలజీస్ కార్పొరేట్ రభస కారణంగా వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో జరిగిన పతనానికి మంగళవారం బ్రేక్‌పడింది. ఇన్ఫోసిస్‌తో సహా ప్రధాన స్టాక్ సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. గత శుక్ర, సోమవారాల్లో కలిపి సెన్సెక్స్ 540 పాయింట్ల వరకూ తగ్గగా, ఇన్ఫోసిస్ షేరు 15 శాతం పడిపోయిన సంగతి తెలిసిందే. అయితే మంగళవారం ప్రపంచ మార్కెట్లు సానుకూలంగా ట్రేడ్‌కావడం, ఇటీవలి క్షీణత తర్వాత కొన్ని బ్లూచిప్ షేర్లను కనిష్టస్థాయిల్లో ఇన్వెస్టర్లు కొనుగోలు చేయడం వంటి అంశాలతో సెన్సెక్స్ 33 పాయింట్లు పెరిగి 31,292 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 11 పాయింట్ల పెరుగుదలతో 9,766 పాయింట్ల వద్ద క్లోజయ్యింది. అయితే బీఎస్ఈ 200 కంపెనీలను ఈ వారంలో డీలిస్ట్ చేయనున్నట్లు ప్రకటించడంతో రోజంతా సూచీలు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. సెన్సెక్స్ 31,484–31,220 పాయింట్ల గరిష్ట, కనిష్టస్థాయిల మధ్య, నిఫ్టీ 9,828–9,752 పాయింట్ల మధ్య ఒడిదుడుకులకు లోనైనప్పటికీ, దేశీయ సంస్థల కొనుగోళ్ల ప్రభావంతో చివరకు లాభాలతో ముగియగలిగినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.



స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	3,063
ఎన్ఎస్ఈ (ఈక్విటీ)	23,681
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	6,28,156
ఎఫ్ఐఐ	-829
డీఐఐ	435

వెలుగులో ఫార్మా షేర్లు..

రెండు రోజులపాటు భారీ పతనాన్ని చవిచూసిన ఇన్ఫోసిస్ షేరు ఇంట్రాడేలో మూడేళ్ల కొత్త కనిష్టస్థాయి రూ.860 వద్దకు క్షీణించిన తర్వాత..షార్ట్ కవరింగ్ ప్రభావంతో స్వల్పంగా కోలుకుని, 0.42 శాతం లాభంతో రూ. 877 వద్ద ముగిసింది. వరుస క్షీణతల్ని నమోదుచేస్తున్న ఫార్మా షేర్లలో కొనుగోళ్లు జరగడంతో డాక్టర్ రెడ్డీస్ లాబ్ 2.77 శాతం, లుపిన్ 2.08 శాతం, సన్‌ఫార్మా 2.4 శాతం చొప్పున ర్యాలీ జరిపాయి. ఆయిల్ పీఎస్‌యూ షేర్లు బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీ, ఓఎన్‌జీసీ, గెయిల్‌లు 1–4 శాతం మధ్య ర్యాలీ జరిపాయి. ఐఫోన్‌తో సహా యాపిల్ ఉత్పత్తులను మార్కెట్ చేయనున్నట్లు ప్రకటించడంతో హెచ్‌సీఎల్ ఇన్ఫోసిస్టమ్స్ భారీగా 9.5 శాతం పెరిగింది. మరోవైపు ఎన్‌టీపీసీ, హీరో మోటో కార్ప్, బజాజ్ ఆటో, టీసీఎస్‌లు స్వల్ప తగ్గుదలతో ముగిశాయి.

ఎస్‌బీఐ..ఫ్యూచర్స్ సిగ్నల్స్

మంగళవారం గ్యాప్‌అప్‌తో సూచీలు ప్రారంభంకావడానికి ప్రధాన కారణం బ్యాంకింగ్ షేర్లు. కానీ గరిష్టస్థాయి నుంచి అవి వేగంగా తగ్గి, చివరకు దాదాపు ఫ్లాట్‌గా ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంకింగ్ షేరు ఎస్‌బీఐ కూడా ఇదేబాటలో రూ. 277 గరిష్టస్థాయి నుంచి రూ. 271 కనిష్టస్థాయికి తగ్గిన తర్వాత...చివరకు క్రితం ముగింపుకంటే రూ. 0.75 క్షీణతతో రూ. 273.90 వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఎస్‌బీఐ ఫ్యూచర్ కాంట్రాక్టు ఓపెన్ ఇంట్రస్ట్ (ఓఐ) నుంచి 37.56 లక్షల షేర్లు (–4.94 శాతం) కట్ అయ్యాయి. దీంతో మొత్తం ఓఐ 7.22 కోట్ల షేర్లకు తగ్గింది. స్పాట్ ధరతో పోలిస్తే ఫ్యూచర్ ప్రీమియం క్రితంరోజు స్థాయిలోనే రూ. 0.60 మేర ఉంది. గరిష్టస్థాయి నుంచి ధర తగ్గడం, ఓఐ కట్‌కావడం పొజిషన్ల అన్‌వైండింగ్‌ను సూచిస్తున్నది. ఆప్షన్స్ విభాగంలో రూ. 290 స్ట్రయిక్ వద్ద కాల్ కవరింగ్, రూ. 280 స్ట్రయిక్ వద్ద కాల్ రైటింగ్ జరిగింది. రూ. 290 కాల్ ఆప్షన్ నుంచి 10.89 లక్షల షేర్లు కట్‌కాగా, బిల్డప్ 56.82 లక్షల షేర్లకు తగ్గింది. రూ. 280 కాల్ ఆప్షన్లో 8.82 లక్షల షేర్లు యాడ్‌కాగా, బిల్డప్ 48.06 లక్షలకు పెరిగింది. ఈ షేరు రూ. 280 స్థాయిని అధిగమించకపోవొచ్చన్న అంచనాలతో ఆప్షన్ రైటర్లు పై స్థాయి కాల్‌ను కవర్‌చేసుకుని, దిగువస్థాయి వద్ద రైట్ చేసినట్లు ఈ డేటా విశ్లేషిస్తున్నది. రూ. 280 స్ట్రయిక్ పుట్ ఆప్షన్ నుంచి 3.09 లక్షల షేర్లు కట్‌కాగా, బిల్డప్ 29.16 లక్షల షేర్లకు తగ్గింది. రూ. 270 పుట్ ఆప్షన్లో కేవలం 9 వేల షేర్లు యాడ్‌కాగా, బిల్డప్ 33.45 లక్షల షేర్లకు చేరింది. ఈ షేరు రూ. 280 దిగువన బలహీనంగా ఉండవచ్చని, రూ. 270 స్థాయిని కోల్పోతే మరింత క్షీణించవచ్చన్న అంచనాలు పుట్ ఆప్షన్ రైటర్లలో ఉన్నట్లు ఈ డేటా వెల్లడిస్తున్నది.

→ కెనరా బ్యాంక్ ఫ్యూచర్ సంకేతాలు ఎలా ఉన్నాయి? ఈ వివరాలు www.sakshibusiness.comలో

జియోకి ఎయిర్‌టెల్ చెక్!!

రూ. 2,500కే 4జీ స్మార్ట్‌ఫోన్ ఆవిష్కరణకు ప్రయత్నాలు



న్యూఢిల్లీ: టెలికం దిగ్గజ కంపెనీ ఎయిర్‌టెల్.. రిలయన్స్ జియోకి కౌంటర్ ఇవ్వనుందా? జియో దెబ్బకి లాభాల్ని కోల్పోయిన ఎయిర్‌టెల్ ఇప్పుడు అదను చూసి జియోని దెబ్బకొట్టడానికి రెడీ అవుతోందా? అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి పరిశ్రమ వర్గాల నుంచి. జియో 4జీ ఫీచర్ ఫోన్‌ను తీసుకువస్తోంటే.. ఎయిర్‌టెల్ వాయిస్, డేటా సర్వీసులతో కూడిన 4జీ స్మార్ట్ ఫోన్స్‌ను రూ.2,500 ధరతో మార్కెట్‌లోకి తీసుకురావడానికి లావా, కార్బన్ వంటి పలు మొబైల్ హ్యాండ్‌సెట్స్ తయారీ కంపెనీలతో చర్చలు జరుపుతోందట. ఈ ఫోన్లు దీపావళికి అందుబాటులోకి రావొచ్చట. అలాగే గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్స్ కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కాగా రిలయన్స్ జియో ఇటీవల రూ.1,500 రిఫండబుల్ డిపాజిట్‌తో 4జీ ఫీచర్ ఫోన్‌ను ఆవిష్కరించిన విషయం తెలిసిందే.

ఎయిర్‌టెల్‌కు పెరిగిన కస్టమర్లు...



న్యూఢిల్లీ: ఐడియా, వొడాఫోన్ సహా నాలుగు ప్రైవేట్ టెలికం కంపెనీలు జూలైలో మొత్తంగా 43.7 లక్షల మంది యూజర్లను కోల్పోయాయి. ఇదే సమయంలో ఎయిర్‌టెల్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య కొత్తగా 6 లక్షలు పెరిగింది. పరిశ్రమ సమాఖ్య సీవోఏఐ తాజా గణాంకాల ప్రకారం... ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియా, ఎయిర్‌సెల్, టెలినార్ సంస్థల మొత్తం మొబైల్ కస్టమర్ల సంఖ్య జూలైలో 37.74 లక్షల క్షీణతతో 82.6 కోట్లకు తగ్గింది. వీరి సంఖ్య జూన్‌లో 83 కోట్లుగా ఉంది. ఎయిర్‌టెల్ యూజర్ల సంఖ్య 28.12 కోట్లకు చేరింది. ఐడియా 23 లక్షల మంది, వొడాఫోన్ 13.89 లక్షల మంది, ఎయిర్‌సెల్ 3.91 లక్షల మంది, టెలినార్ 2.75 లక్షల మంది సబ్‌స్క్రైబర్లను కోల్పోయాయి.

ప్రణాళిక ప్రకారమే ఢిల్లీ విమానాశ్రయ విస్తరణ: జీఎంఆర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మాస్టర్ ప్లాన్ 2016 ప్రకారమే ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ విస్తరణ పనులు ప్రారంభించనున్నట్టు జీఎంఆర్ గ్రూప్ వెల్లడించింది. మూడు దశల్లో మాస్టర్ ప్లాన్ అమలు చేయనున్నట్టు తెలిపింది. 2018–21లో ఫేజ్–3ఏ, 2021–25లో ఫేజ్–3బీ, 2026 తర్వాత ఫేజ్–4 పనులు చేపట్టనుంది. డిపార్చర్, అరైవింగ్ టెర్మినళ్లను అనుసంధానించి ఏటా 4 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే విధంగా సామర్థ్యాన్ని విస్తరిస్తారు. విమానాలను నిలిపి ఉంచే అప్రాన్ ఆధునీకరణతోపాటు బ్రిడ్జ్ మౌంటెడ్ ఎక్విప్‌మెంట్, విజువల్ డాకింగ్ గైడెన్స్ సిస్టమ్, ఏరోబ్రిడ్జ్ ఆపరేషన్స్ వంటి ఆధునిక వసతులను ఏర్పాటు చేస్తారు. టెర్మినల్–1 సామర్థ్యాన్ని 2 కోట్ల నుంచి 4 కోట్లకు, టి–3 సామర్థ్యాన్ని 3.4 కోట్ల నుంచి 4.5 కోట్ల ప్రయాణికులకు చేరుస్తామని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సీఈవో ఐ.ప్రభాకరరావు తెలిపారు.

విస్తారాతో కతర్ ఎయిర్‌వేస్ ఒప్పందం



ముంబై: విమానయాన సంస్థలు విస్తారా, కతర్ ఎయిర్‌వేస్ తాజాగా ఇంటర్‌లైన్ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. దీంతో ఇరు సంస్థల ప్రయాణికులు నిరాటంకంగా గమ్యం చేరుకునేందుకు దోహదపడే థ్రూ–చెకిన్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఈ ఒప్పందంతో.. కతర్ ఎయిర్‌వేస్ ప్రయాణికులు భారత్‌కి వచ్చినప్పుడు, వెళ్లేటప్పుడు మధ్యలో మళ్లీ బోర్డింగ్ పాస్‌లు, బ్యాగేజ్ చెకిన్ వంటి బాదరబందీ లేకుండా విస్తారా ఫ్లయిట్స్‌లో ప్రయాణించవచ్చు. విస్తారాకి ఇప్పటికే ఎయిర్ ఫ్రాన్స్, కేఎల్ఎం, జపాన్ ఎయిర్‌వేస్ తదితర సంస్థలతో ఈ తరహా ఒప్పందాలున్నాయి. కతర్ ఎయిర్‌వేస్ ప్రస్తుతం దోహా హబ్ నుంచి భారత్‌లోని 13 నగరాలకు సర్వీసులు నడుపుతోంది. ఇక విస్తారా 19 ప్రాంతాలకు సర్వీసులు అందిస్తోంది.

సోరియాసిస్ డ్రగ్ తయారీని ఔట్‌సోర్స్ చేసిన డాక్టర్ రెడ్డీస్

అమెరికాకు చెందిన ఎన్‌కోర్‌కు అప్పగింత



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గతంలో సోరియాసిస్ వ్యాధి చికిత్స డ్రగ్ 'డీఎఫ్‌డీ–06'ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పిన డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీ... దాని తయారీ, వాణిజ్య హక్కులను అమెరికాకు చెందిన ఎన్‌కోర్ డెర్మటాలజీ సంస్థకు ఔట్ సోర్సింగ్ చేసింది. ఇందుకు గాను డాక్టర్ రెడ్డీస్‌కు చెందిన అనుబంధ సంస్థ ప్రోమియస్ ఫార్మాకు 32.5 మిలియన్ డాలర్ల వరకు సమకూరుతాయి. ఔషధం అభివృద్ధి, వాణిజ్య అమ్మకాలు మొదలైతే వాటిపై రాయల్టీ చెల్లింపులు కూడా ఉంటాయి.

మూడున్నర రెట్లకుపైగా పెరిగిన గతి లాభం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జూన్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో గతి నికరలాభం క్రితంతో పోలిస్తే మూడున్నర రెట్లకుపైగా పెరిగి రూ.18 కోట్లు నమోదు చేసింది. టర్నోవరు రూ.428 కోట్ల నుంచి రూ.453 కోట్లకు చేరింది.

26% పెరిగిన 'మైక్రో' రుణాలు



న్యూఢిల్లీ: సూక్ష్మ రుణ సంస్థల (ఎంఎఫ్ఐ) రుణ మంజూరీలు 2017 తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) 26 శాతం ఎగసి రూ.35,045 కోట్లకు పెరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో ఈ మొత్తం రూ. 27,921 కోట్లు. 2017 జూన్ 30వ తేదీతో ముగిసిన త్రైమాసికంలో 2.08 కోట్ల మందికి సూక్ష్మ రుణ మంజూరీలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో పోల్చితే ఈ సంఖ్య 19 శాతం పెరిగింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆల్-ఇన్-వన్ 'డిజీపీవోఎస్ మెషీన్లు'



ముంబై: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాజాగా ఆల్-ఇన్-వన్ 'డిజీపీవోఎస్ మెషీన్'లను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. వీటి ద్వారా పలు రకాల డిజిటల్ పేమెంట్ చెల్లింపులను నిర్వహించవచ్చు. ఒక వర్తకుడు డిజీపీవోఎస్ మెషీన్ ద్వారా డెబిట్/క్రెడిట్ కార్డు స్వైపింగ్‌తోపాటు యూపీఐ వంటి పలు డిజిటల్ పేమెంట్ సర్వీసులను పొందొచ్చు.

కన్ఫెక్షనరీ విభాగంలోకి ఎంటీఆర్ ఫుడ్స్

బెంగళూరు: ఎంటీఆర్ ఫుడ్స్ మాతృ సంస్థ, నార్వేకి చెందిన ఓక్లా గ్రూప్ తాజాగా భారతీయ కన్ఫెక్షనరీ ఉత్పత్తుల విభాగంలో ప్రవేశించింది. నార్వేలో పేరొందిన 'లబన్' కన్ఫెక్షనరీ బ్రాండ్‌ను భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. స్ట్రాబెర్రీ, మామిడి, గ్రీన్ మ్యాంగో, నారింజ, తదితర ఫ్లేవర్స్‌లో ఇది లభిస్తుంది. 26 గ్రాముల ప్యాక్ ధర రూ.10గాను, 65 గ్రాముల ప్యాక్ రేటు రూ.30గాను ఉంటుంది.

బులియన్ రూ.లలో

ముంబై			
బంగారం (99.9, 10గ్రా)	29,080	▼	45
బంగారం (99.5, 10గ్రా)	28,930	▼	45
వెండి (కిలో)	38,870	▼	75
చెన్నై			
బంగారం (24 క్యారెట్లు)	--		
బంగారం (22 క్యారెట్లు)	27,720	▲	140
వెండి (కిలో)	--		
హైదరాబాద్			
బంగారం (24 క్యారెట్లు)	29,510	▲	70
బంగారం (22 క్యారెట్లు)	27,590	▲	60
వెండి(కిలో)	39,265	▲	150
ప్రొద్దుటూరు			
బంగారం (24 క్యారెట్లు)	29,850		0
బంగారం (22 క్యారెట్లు)	27,720	▲	10
వెండి(కిలో)	40,000	▲	200
విశాఖపట్నం			
బంగారం (24 క్యారెట్లు)	29,920		0
బంగారం (22 క్యారెట్లు)	27,530		0
వెండి(కిలో)	39,500		0
విజయవాడ			
బంగారం (24 క్యారెట్లు)	30,100		0
బంగారం (22 క్యారెట్లు)	27,900		0
వెండి(కిలో)	40,200		0
ఏపీ బులియన్ అసోసియేషన్			
బంగారం (24 క్యారెట్లు)	30,010	▼	80
బంగారం (22 క్యారెట్లు)	27,780	▼	80
వెండి(కిలో)	40,100	▼	150

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	47.73 (రాత్రి 11.30కు)	$ 47.53 (సోమవారం ముగింపు)
బ్రెంట్	51.68 (రాత్రి 11.30కు)	$ 51.66 (సోమవారం ముగింపు)

వడ్డీ రేట్లు

బేస్‌రేట్ రేంజ్	9.00 – 9.55
డిపాజిట్ రేట్ రేంజ్ (ఏడాది)	6.25 – 6.75
డాలర్ లిబార్ (6 నెలలు)	1.45

అంకెలు శాతాల్లో

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 23-8-2017

విశాఖ	362-00
చిత్తూరు	390-00
వరంగల్	357-00
ముంబై	400-00
చెన్నై	397-00
విజయవాడ	359-00
గోదావరి	359-00
నమక్కల్	387-00
22-8-2017 ఫామ్ ధర...	
హైదరాబాద్	355-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.15
బెంగళూరు	382-00
ఢిల్లీ	360-00
కోల్‌కతా	394-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ACC LIMITED	1789.3	1792.6
ADANI PORT	375.65	375.95
AMBUJA CEME	273.15	274.4
ASIAN PAINT	1129.45	1134.45
AXIS BANK L	499.2	494.8
BAJAJ AUTO	2740.55	2766.5
BANK OF BAR	139.35	142.1
BHARTI AIRT	422.1	419.15
3M INDIA LI	13864	13803.8
63 MOONS TE	60.75	62.65
8K MILES SO	494.35	514.65
AARTI DRUGS	516.75	517.65
AARTI INDUS	859.9	864.7
ABAN OFFSHO	172.65	176.45
ABBOTT INDI	4299.15	4222.65
ACCELYA KAL	1405.4	1403.25
ACCORD SYNE	51	51.05
ACTION CONS	59.45	60.1
BEML LIMITE	1789.45	1832.75
BERGER PAIN	237.15	238.85
BF INVESTME	156.4	160
BF UTILITIE	317.05	321.4
BGR ENERGY	128.35	129.05
BHAGERIA IN	259.15	261.7
BHANSALI EN	84.3	85.1
BHARAT BIJL	1142.75	1190.9
BHARAT FIN	850.2	867.55
BHARAT FORG	1136.65	1135.85
BHARAT GEAR	140.7	146.1
BHARAT RASA	2956.6	2995.15
BHARAT WIRE	82.85	83.75
DOLLAR INDU	2059.45	2052.65
DOLPHIN OFF	83.6	86.65
DONEAR IND.	55.2	56.25
DR. LAL PAT	809.95	809.55
DWARIKESH S	61.3	65.1
DYNAMATIC T	2133.6	2156.05
DYNEMIC PRO	115.75	118.25
ECE INDUSTR	198.35	205.15
ECLERX SERV	1254.4	1277.85
EDELWEISS F	241	245
HARITA SEAT	708.6	720.95
HARRISON MA	72.95	75
HATSUN AGRO	633.6	620.15
HEALTHCARE	274.65	271.35
HEC INFRA P	100.7	106
HEG LTD	471.65	473
HEIDELBERGC	123	122.6
HERCULES HO	150.6	133.95
HESTER BIOS	848.95	863.05
HEXAWARE TE	265.1	265.65
HI-TECH PIP	160	171
HIKAL LIMIT	204.1	204.55
HIL LIMITED	1092.85	1123.2
JINDAL WORL	840.4	827.55
JK CEMENT L	1013.4	1001.15
JK LAKSHMI	412.45	413.3
JK PAPER LI	93.25	93.15
JK TYRE & I	141.65	143.1
JKUMAR INFR	189.8	196.05
JM FINANCIA	124.5	121.25
JMC PROJECT	366.15	350.7
JOCIL LIMIT	165.1	168.1
JOHNSON CON	1999.45	2028.45
JSW ENERGY	61	62.8
JSW HOLDING	1747.85	1742.45
JUBILANT FO	1357.1	1383.6
MAZDA LIMIT	362.3	366.7
MCLEOD RUSS	177.8	175.95
MEGHMANI OR	72.25	71.35
MENON BEARI	75.6	76.4
MEP INFRA.	113.8	114.5
MERCK LIMIT	1161.9	1153
MINDA CORPO	109.45	110.7
MINDA INDUS	773.4	771.8
MINDTECK (I	66.85	67.45
MINDTREE LI	453.95	461.4
MIRZA INTER	152.55	154.7
MITCON CON	61	64
MM FORGINGS	607.6	608.65
PODDAR PIGM	251.15	256.7
POKARNA LIM	1167.5	1179.15
POLY MEDICU	210	209
POLYPLEX CO	432.6	440.05
PONNIE SUGA	171.2	169.35
POWER MECH	530.15	528.6
PPAP AUTOMO	317.8	326.55
PRABHAT DAI	131.25	132.85
PRAJ INDUST	66.5	67.5
PRAKASH IND	105.95	110.25
PRECISION C	106.85	106.1
PRECISION W	138.7	141.8
PRECOT MERI	71.15	72.55
SHEMAROO EN	335.15	340.75
SHILPA MEDI	552.15	552.3
SHIPPING CO	90	89.5
SHIRPUR GOL	140.65	139
SHIVA TEXYA	372.35	365.8
SHIVAM AUTO	61.7	62.65
SHOPPERS ST	338.5	334.9
SHRE PUSH C	199.55	199
SHRENIK LIM	91.25	87.5
SHREYANS IN	149.5	150.05
SHREYAS SHI	391.4	385.85
SHRIRAM CIT	2198.85	2182.95
SICAL LOGIS	229.95	232.1
THE STATE T	151.85	152.75
THE TINPLAT	136.65	138.25
THEJO ENGIN	378	360
THEMIS MEDI	434.3	446.05
THERMAX LTD	879.85	885.25
THIRU AROOR	54.1	55.25
THIRUMALAI	1225.55	1202.8
THOMAS COOK	217.95	219.35
THYROCARE T	706.9	706.6
TIDE WATER	5697.05	5660.9
TIL LTD	421.1	418.55
TIME TECHNO	177.9	180.1
TIMKEN INDI	699.65	720.65
[illegible]	[illegible]	[illegible]

బీఎస్ఈలో ఎస్ఎంఈ స్టాక్స్

[illegible]

సముద్ర జలాల్లో వ్యూహాత్మక అడుగులు

నేవీ చీఫ్ సునీల్ లాంబా



నేవీ చీఫ్ అడ్మిరల్ సునీల్ లాంబాతో నేవీ అధికారులు

విశాఖ సిటీ: సముద్ర జలాల్లో భారత నౌకాదళం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని ఇండియన్ నేవీ చీఫ్ అడ్మిరల్ సునీల్ లాంబా అన్నారు. తూర్పు నౌకాదళ స్వర్ణోత్సవాల్లో భాగంగా విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళానికి చెందిన సాముద్రిక ఆడిటోరియంలో మేరీటైం సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సునీల్ లాంబా మాట్లాడుతూ.. తీరంలో భారత నౌకాదళం బలీయమైన శక్తిగా మారుతోందని చెప్పారు. నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్ ఆర్కే ధోవన్ మాట్లాడుతూ.. మేరీటైం పవర్‌లో మరింత శక్తిమంతంగా మారాలంటే ప్రస్తుత విధానాలకు మరిన్ని మెరుగులుదిద్దాల్సి ఉందన్నారు. తూర్పు నావికా దళ మాజీ చీఫ్ కమాండర్ వైస్ అడ్మిరల్ ప్రదీప్ చౌహాన్ మాట్లాడుతూ.. హిందూ మహాసముద్రంలో భౌగోళిక ఆర్థిక ప్రయోజనాలు పొందేందుకు చైనా ప్రయత్నిస్తున్న తీరును తప్పుబట్టారు. కార్యక్రమంలో ఈఎన్‌జీ మాజీ చీఫ్‌లు, భారత నౌకాదళ వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

క్యాట్ సభ్యుడిగా జస్టిస్ రెడ్డి కాంతారావు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) హైదరాబాద్ బెంచ్ జ్యుడీషియల్ సభ్యుడిగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రెడ్డి కాంతారావు నియమితులయ్యారు. మంగళవారం ఈ మేరకు కేంద్ర శిక్షణ, సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. క్యాట్ సభ్యుడిగా ఆయన రెండేళ్ల పాటు కొనసాగుతారు.

ముగిసిన 2017 హజ్ యాత్ర

హజ్ కమిటీ ప్రత్యేక అధికారి షుకూర్

సాక్షి, హైదరాబాద్: 2017 హజ్ యాత్ర ముగిసిందని, అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో హజ్ క్యాంప్‌ను విజయవంతంగా పూర్తి చేశామని రాష్ట్ర హజ్ కమిటీ ప్రత్యేక అధికారి ప్రొఫెసర్ ఎస్ఎ.షుకూర్ తెలిపారు. మంగళవారం హజ్ క్యాంప్ ముగింపు సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర హజ్ కమిటీ ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 6,347 మంది హజ్ యాత్రికులు హజ్ ఆరాధనలకు వెళ్లినట్లు చెప్పారు. తెలంగాణ నుంచి 3,445 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 2,096 మంది, కర్ణాటక నుంచి 806 మంది హజ్ యాత్రకు వెళ్లారని వివరించారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో హజ్‌హౌస్‌ను మినీ ఎయిర్‌పోర్టుగా మార్చామని, దీంతో యాత్ర సజావుగా సాగినట్లు చెప్పారు. 2017 హజ్ క్యాంపు ఈ నెల 11న ప్రారంభమైందన్నారు.

'ఫాతిమా' విద్యార్థులకు న్యాయం చేయండి

సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్

సాక్షి, న్యూఢిల్లీ: కడపలోని ఫాతిమా వైద్య కళాశాలలోని 2015 బ్యాచ్ విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వారిని మరో కళాశాలలో చదువు కొనసాగించేందుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీం కోర్టు విచారణకు స్వీకరించింది. కళాశాలకు మెడికల్ కౌన్సిల్ అనుమతులు రద్దు చేయడంతో 2015 బ్యాచ్ విద్యార్థుల చదువుపై సందిగ్ధత నెలకొన్న నేపథ్యంలో విద్యార్థులు గత కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ పిటిషన్ దాఖలు చేసింది.

16 మంది ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

పోరుమామిళ్ల: వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల సర్కిల్ పరిధిలోని పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరు మండలాల పోలీసులు నిర్వహించిన దాడుల్లో 16 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 16 ఎర్రచందనం దుంగలు, ఒక ఆటో, మోటార్‌బైక్, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు మైదుకూరు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. పట్టుబడిన వారిలో మోస్ట్ వాంటెడ్ అంతర్జాతీయ స్మగ్లర్లు శశికుమార్ (బెంగళూరు), గుద్దేటి రామనాథరెడ్డి (వింజమూరు)తోపాటు వాళ్ల అనుచరులు కూడా ఉన్నారని చెప్పారు. కాగా పట్టుబడిన 482 కిలోల బరువున్న ఎర్రచందనం దుంగల విలువ సుమారు రూ.3.5 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు.

మందులపై జీఎస్టీ 5 శాతానికి పరిమితం చేయాలి

ఐఎంఏ రాష్ట్ర కమిటీ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పి.గంగాధరరావు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ప్రాణాంతక వ్యాధులకు వాడే మందులపై సైతం జీఎస్టీ 28 శాతం విధించడంతో రోగులకు భారంగా మారిందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.గంగాధరరావు తెలిపారు. ప్రస్తుతం మందులపై జీఎస్టీ 5 , 12, 18, 28 శాతాలుగా నాలుగు శ్లాబుల్లో ఉందని, దీన్ని 5 శాతానికి పరిమితం చేస్తూ ఒకే శ్లాబు కిందకు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. విజయవాడలోని ఐఎంఏ హాలులో మంగళవారం గంగాధరరావు విలేకరులతో మాట్లాడుతూ.. గుండెపోటు, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులకు వాడే మందులపై సైతం జీఎస్టీ 28 శాతం విధించారని తెలిపారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలన్నారు. ప్రస్తుత సమాజంలో మధుమేహ రోగులు పెరుగుతున్న నేపథ్యంలో వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఐఎంఏ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కేఎస్ కరుణామూర్తి తెలిపారు. అందులో భాగంగా వైద్యులకు మధుమేహ చికిత్సలపై ఏడాది పాటు శిక్షణా తరగతులు నిర్వహించి సర్టిఫికెట్‌లు అందిస్తామన్నారు. సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర కమిటీ ఫైనాన్స్ సెక్రటరీ పరుచూరి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎంఏ రెహమాన్, మాజీ అధ్యక్షులు పి.వెంకటేశ్వర్లు, సీఎస్ఆర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఉద్యోగం నుంచి తొలగించిన ఆయుష్ ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవటంతోపాటు వేతన బకాయిలను కూడా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉమ్మడి హైకోర్టు ఆదేశించింది. సుమారు వెయ్యి మంది ఆయుష్ ఉద్యోగులను తొలగించిన రాష్ట్ర ప్రభుత్వం వారికి ఇవ్వాల్సిన 17 నెలల వేతనాలను కూడా చెల్లించలేదు. దీనిపై వారు కోర్టును ఆశ్రయించటంతో వ్యాజ్యాన్ని పరిశీలించిన హైకోర్టు ధర్మాసనం.. తక్షణమే వేతనాలు చెల్లించి తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని సర్కారును ఆదేశించింది. డాక్టర్లను నియమించలేదనే కారణంతో కాంపౌండర్లు, ఆర్డర్లీ నర్సింగ్ సిబ్బందిని ఎలా తొలగిస్తారని సర్కారుకు మొట్టికాయలు వేసింది. కోర్టు తీర్పు అనంతరం ఆయుష్ ఉద్యోగులు హనుమంతరెడ్డి, సురేష్‌గుప్తా, లక్ష్మీనారాయణ, రాధాకుమారి తదితరులు ఓ ప్రకటన విడుదల చేస్తూ... ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థను పరిరక్షించండి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఊడిగం మాని ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థను పరిరక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. బ్యాంకులకు రూ.వేలకోట్లు బకాయిపడ్డ కార్పొరేట్ సంస్థల నుంచి రుణాలు రికవరీ చేసేందుకు ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. బ్యాంకుల స్థిరీకరణతో పాటు పలు ఇతర అంశాలను పరిష్కరించాలంటూ బ్యాంకు ఉద్యోగులు మంగళవారం చేపట్టిన ఒక రోజు దేశవ్యాప్త సమ్మెను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్పొరేట్ కంపెనీలు బ్యాంకుల నుంచి భారీగా రుణాలు పొంది ఎగవేతకు పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. వాటి రుణాలను కేంద్రం మాఫీ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు.

చైల్డ్ కేర్ లీవ్ పేరుతో సీఎం భజన!

- జీవో ఇచ్చి ఏడాదైతే ఇప్పుడు సీఎం సంతకమా!
- రెండేళ్లు ఇవ్వాల్సి ఉంటే రెండు నెలలే ఇస్తే ప్రశంసలా?
- సీఎంకు వంతపాడుతూ మమ్మల్ని ఎంతకాలం మోసగిస్తారు?
- ఏపీఎన్జీవో నేతలపై మహిళా ఉద్యోగుల ఆగ్రహం



సాక్షి, అమరావతి: మహిళా ఉద్యోగులకు పదో వేతన సవరణ సంఘం (పీఆర్సీ) సిఫార్సుల మేరకు రెండు నెలల చైల్డ్‌కేర్ లీవ్ ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని, ఇందుకు సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం సంతకంచేశారని ఏపీఎన్‌జీవో నేతలు అశోక్‌బాబు, చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం అమరావతిలో ప్రకటించడంపై ఉద్యోగులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఏడాది కిందటే జీవో జారీచేసుంటే ఇప్పుడు కొత్తగా ఫైలుపై సీఎం సంతకం చేయడమేంటి, త్వరలో ఉత్తర్వులు వస్తాయని ఏపీఎన్‌జీవో నేతలు చెప్పడమేంటి, వారికి జీవో ఉన్న విషయం తెలీదా.. లేక మతిపోయిందా..అని మహిళా ఉద్యోగులు నిలదీస్తున్నారు. సచివాలయంలోనూ, వివిధ కార్యాలయాల్లోనూ మహిళా ఉద్యోగుల మధ్య మంగళవారం ఈ అంశం చర్చనీయాంశమైంది. రెండు నెలల చైల్డ్ కేర్ లీవ్ మంజూరుచేస్తూ ప్రభుత్వం 2016 జూలై 6న జీవో నంబరు 132 జారీచేసింది. దీని ప్రకారం చాలామంది ఉద్యోగినులు ఇప్పటికే చైల్డ్ కేర్ లీవును వినియోగించుకున్నారు. ఇప్పుడు ఏపీఎన్‌జీవో నేతలు రెండు నెలల చైల్డ్ కేర్ లీవు అనడం 'పెళ్లయిన ఏడాదికి మళ్లీ పెళ్లి.. అన్న చందంగా ఉంది' అని రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగినులు విమర్శించారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిందిపోయి భజన చేస్తారా?

'సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం మర్చిపోయి సర్కారును పొగడటానికి ఏపీఎన్‌జీవో నేతలు పోటీ పడుతున్నారు. అందుకే పెద్ద సంఖ్యలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు జేఏసీ నుంచి బయటకు వెళ్లి మరో జేఏసీని ఏర్పాటు చేసుకున్నారు. ఇలాగే సర్కారును పొగడటం మానకపోతే ఉన్న పదవులను పోగొట్టుకోక తప్పదు.. అని చిత్తూరు జిల్లాకు చెందిన ఏపీఎన్‌జీవో ప్రతినిధులు వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి వంతపాడటానికి వీరిని ఎన్నుకున్నామా? అని ఉద్యోగులు నిలదీస్తున్నారు.

పీఆర్సీ సిఫార్సులను పట్టించుకోని చంద్రబాబు

మహిళా ఉద్యోగులకు రెండేళ్లు చైల్డ్ కేర్ లీవ్ ఇవ్వాలని పదోవేతన సవరణ సంఘం సిఫార్సు చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగినులకు ఎప్పటి నుంచో ఇది అమలవుతోంది. రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న వారు, రాష్ట్రంలో పనిచేస్తున్న అఖిల భారత సర్వీసు అధికారులు కూడా బాలల సంరక్షణ సెలవులను వినియోగించుకుంటున్నారు. బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో తల్లిపాత్ర కీలకం. ఉద్యోగినులైన తల్లులు దేశ భవిష్యత్తు కోసం తమ పిల్లలను దగ్గరుండి చూసుకుని దేశభక్తిని నూరిపోసి, విద్యాబుద్ధులు నేర్పించి జాతి గర్వించే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వంతో పాటు పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగినులకు రెండేళ్ల శిశు సంరక్షణ సెలవులు ఇస్తున్నాయి. తమిళనాడు, మధ్యప్రదేశ్‌తోపాటు పలు రాష్ట్రాల్లో మహిళా ఉద్యోగులకు రెండేళ్ల చైల్డ్‌కేర్ లీవ్ అమల్లో ఉంది. వాస్తవమిది కాగా సీఎం చంద్రబాబు పీఆర్సీ సిఫార్సులను, కేంద్రం, ఇతర రాష్ట్రాలు అమలుచేస్తున్న జీవోలను పట్టించుకోకుండా కేవలం 2 నెలలు మాత్రమే చైల్డ్ కేర్ లీవ్ ఇస్తూ గతేడాది ఉత్తర్వులు జారీచేశారు. దీనిని పీఆర్సీ సిఫార్సుల ప్రకారం రెండేళ్లకు పెంచాలని ఒత్తిడి తేవాల్సింది పోయి ఇప్పటికే ఉన్న జీవోను మళ్లీ ఇప్పిస్తామన్నట్లు ఏపీఎన్‌జీవో నేతలు మాట్లాడటం శోచనీయమని మహిళా ఉద్యోగులు విమర్శిస్తున్నారు.

సీఈవో మెమోపై అత్యవసర విచారణకు హైకోర్టు నో

సాక్షి, హైదరాబాద్: నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా బయటి జిల్లాల నుంచి వచ్చిన రాజకీయ నాయకులందరూ కర్నూలు జిల్లాను విడిచి వెళ్లాలంటూ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి(సీఈవో) సోమవారం జారీ చేసిన మెమోపై అత్యవసర విచారణకు ఉమ్మడి హైకోర్టు నిరాకరించింది. సాధారణ పద్ధతిలోనే పిటిషన్ దాఖలు చేసుకోవాలని, అదే పద్ధతిలోనే తాము విచారణ చేపడతామని స్పష్టం చేసింది. దీంతో సీఈవో జారీ చేసిన మెమోను రద్దు చేయాలంటూ టీడీపీ కడప జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మంగళవారం మధ్యాహ్నం పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి, సీఈవో, జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరుల్ని ప్రతివాదులుగా చేర్చారు. సీఈవో జారీచేసిన మెమోలో స్పష్టత లోపించిందని, ఎవరెవరు జిల్లా విడిచివెళ్లాలో స్పష్టం చేయకుండా ఆదేశాలివ్వడం సరికాదన్నారు. సీఈవో మెమో నేపథ్యంలో పోలీసులు తనను కర్నూలు జిల్లా విడిచి వెళ్లాలని బలవంతం చేశారన్నారు. నంద్యాల ఉప ఎన్నిక ప్రచారం ముగిశాక చాలామంది నాయకులు కర్నూలు జిల్లాను విడిచి వారి వారి స్థానాలకు తిరిగి వచ్చేశారని, అయితే ఎమ్మెల్యేలు, ఎంపీలు కర్నూలు జిల్లాలోని మిగిలిన ప్రాంతాల్ని సందర్శిస్తూ, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకందుతున్నాయో లేదో తెలుసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. అయితే మెమో వల్ల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

తమిళనాట 'నీట్'గా

మెడికల్ కౌన్సెలింగ్

సుప్రీంకోర్టు ఆదేశాలతో రేపటి నుంచి ప్రారంభం

సాక్షి, చెన్నై: తమిళనాట వైద్య విద్యా కోర్సుల ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశ పరీక్ష (నీట్) మేరకు కౌన్సెలింగ్ జరగనుంది. తమిళనాడు ప్రభుత్వ మినహాయింపు ఆర్డినెన్స్‌కు అనుమతిలేదని కేంద్రం సుప్రీంకోర్టులో స్పష్టంచేయడంతో గత్యంతరంలేక నీట్‌ను అమల్లోకి తెచ్చేందుకు సిద్ధం అయ్యారు. తమిళనాడుకు ఈ ఏడాదికి నీట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ పది రోజుల కిందట ప్రత్యేక ఆర్డినెన్స్ సిద్ధమైన విషయం తెలిసిందే. ఇందుకు కేంద్రం ఆమోదం కూడా తెలిపింది. అయితే, మినహాయింపునకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ల విచారణ సమయంలో సుప్రీం కోర్టులో కేంద్రం హ్యాండిచ్చింది. కేంద్ర ప్రభుత్వ అటార్నీ జనరల్ ఆర్డినెన్స్‌కు అనుమతి లేదని తేల్చడంతో నీట్ అమలు చేయాల్సిందేనని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. దీంతో నీట్ పరీక్షల్లో తమిళ విద్యార్థులు సాధించిన మార్కులు, ర్యాంకుల ఆధారంగా గురువారం నుంచి కౌన్సెలింగ్ సాగనుంది. కాగా, నీట్ పరీక్షల్లో తమిళనాడు స్టేట్ సిలబస్ విద్యార్థులు చతికిలబడటం ప్రస్తుతం సీబీఎస్ఈ విద్యార్థులకు వరంగా మారింది. నీట్ పుణ్యమాని స్టేట్ సిలబస్ విద్యార్థులకు వైద్య సీట్లు అందని ద్రాక్షగా మారాయి.

జీవో 279 రద్దు చేయకుంటే నిరవధిక సమ్మె

- అధికార పార్టీ కాంట్రాక్టర్లకు అడ్డంగా దోచిపెట్టేందుకే ఈ జీవో
- ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించిన మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ జేఏసీ



విజయవాడలో మహాప్రదర్శన నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): మున్సిపల్ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసే జీవో నెం. 279 రద్దు చేయాలని మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇందుకు సెప్టెంబర్ 15 డెడ్‌లైన్‌గా విధించింది. ప్రభుత్వం స్పందించని పక్షంలో సెప్టెంబర్ 15 తర్వాత నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించింది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను స్తంభింపజేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. జీవో 279 రద్దు, సమాన పనికి సమాన వేతనం, పనిభద్రత వంటి పలు డిమాండ్ల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించారు. కార్మికులు రైల్వేస్టేషన్‌నుంచి అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్ వరకు ప్రదర్శన చేపట్టారు. అనంతరం ధర్నాచౌక్‌లో జరిగిన సభలో జేఏసీ నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. సభలో పాల్గొన్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు మాట్లాడుతూ కార్మికులు చేయాల్సిన పనిని యంత్రాలతో చేయించాలని చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ నేపథ్యంలోనే జీవో 279 విడుదల చేయడం జరిగిందన్నారు. జీవోను అడ్డంపెట్టి అధికార పార్టీ కాంట్రాక్టర్లకు ప్రజాధనాన్ని దోచిపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. జీవో రద్దుపై జరిపిన చర్చల్లో కార్మిక సంఘాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. జేఏసీ చైర్మన్ కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చలో విజయవాడ కార్యక్రమానికి ఎమ్మెల్సీలు శ్రీనివాసులురెడ్డి, బొడ్డు నాగేశ్వరరావు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల డిమాండ్లు న్యాయమైనవన్నారు. కార్మికుల సమస్యలపై మండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు వెంకటరెడ్డి, ఎం డేవిడ్, జ్యోతిబసు, ఆసుల రంగనాయకులు, చలసాని వెంకట రామారావు, కార్మికులు పాల్గొన్నారు.

నందిగామలో కౌలు రైతు ఆత్మహత్య

- గిట్టుబాటుకాని ధరలతో అప్పులు తీర్చలేని పరిస్థితి
- కౌలు గుర్తింపుకార్డులేక దక్కని బ్యాంకు రుణం
- ఈ నెల 20న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ ప్రైవేటు వైద్యశాలలో మృతి



నందిగామ (సత్తెనపల్లి): అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కౌలు రైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన వేలం వెంకట్రామయ్య (40) సాగుకు అయిన అప్పులు తీర్చే మార్గం కనిపించక ఈ నెల 20న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హుటాహుటిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం మంగళగిరి వద్ద గల ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. సోమవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కారంపూడి మండలం భట్టువారిపల్లి గ్రామానికి చెందిన వెంకట్రామయ్య భార్య కనకదుర్గ స్వగ్రామమైన సత్తెనపల్లి మండలం నందిగామలో పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గత ఏడాది 3.25 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరప పంట సాగు చేశాడు. నీరు సక్రమంగా అందకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. సుమారు 60 క్వింటాళ్ల మేర మిరప దిగుబడి రాగా 15 క్వింటాళ్లను క్వింటా రూ.6 వేలకు విక్రయించాడు. ఆ తరువాత ధరలు పతనం కావడంతో క్వింటా రూ.3 వేలు, రూ.1500 చొప్పున విక్రయించాడు. ఆ సొమ్ము కోత కూలీలకు కూడా సరిపోలేదు. పూర్తిగా నష్టపోయిన వెంకట్రామయ్య తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద రూ.3 లక్షలు అప్పు తెచ్చాడు. ఇది కాక తండ్రి వెంకటేశ్వర్లు పేరుతో కారంపూడిలో బంగారు ఆభరణాలు కుదవ పెట్టి రూ.2 లక్షలు అప్పు తీసుకున్నాడు. మొత్తం రూ.5 లక్షలు సాగు నిమిత్తం అప్పులు అయ్యాయి. కౌలు గుర్తింపు కార్డు కూడా లేకపోవడంతో బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం లేకుండా పోయింది. వీటికి వడ్డీలు పెరగడం, ఆ అప్పులు తీర్చే మార్గం కనిపించక పోవడంతో మనస్తాపం చెందాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి భార్య, పిల్లలు నిద్రిస్తుండగా వెంకట్రామయ్య గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భర్త మృతి చెందడంతో భార్య కనకదుర్గ, కుమారులు సతీష్, మణికంఠ, కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. సత్తెనపల్లి రూరల్ ఎస్సై మీర్జా నజీర్ బేగ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమరావతి గీతం.. నన్నయ వర్సిటీకి అంకితం

- వర్సిటీ కార్యక్రమంలో ప్రముఖ గీత రచయిత సుద్దాల అశోక్‌తేజ ప్రకటన
- జానపదాలను కాపాడుకోవాలని పిలుపు



సదస్సులో మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

రాజరాజనరేంద్రనగర్ (రాజానగరం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 13 జిల్లాల విశిష్టతను తెలియజేస్తూ ఇటీవల తాను రాసిన అమరావతి గీతాన్ని ఆదికవి నన్నయ యూనివర్సిటీకి అంకితం చేస్తున్నానని ప్రముఖ సినీ, జానపద గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో తెలుగు విభాగం, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ జానపద దినోత్సవాన్ని మంగళవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన రచించిన 'అమరావతి' గీతానికి అధ్యాపకులు, విద్యార్థుల నుంచి అపూర్వ స్పందన వచ్చింది. నన్నయ యూనివర్సిటీకే అమరావతి గీతాన్ని అంకితం ఇవ్వడానికి గల కారణాలను వివరిస్తూ.. అంతర్జాతీయ జానపద దినోత్సవంతో పాటు ఆదికవి నన్నయ రచించిన భారతాన్ని రాజరాజనరేంద్రునికి అంకితం చేసిన రోజు కూడా కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. జానపదం విశిష్టతను ఆయన వివరించారు. ఇప్పటికే చాలా జానపదాలు, కళలు మరుగైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని కాపాడుకోవలసిన బాధ్యత యూనివర్సిటీలు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలపైన ఎంతో ఉందన్నారు. డీన్ ఆచార్య ఎస్.టేకి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో నన్నయ ఉపకులపతి ఆచార్య ఎం.ముత్యాలు నాయుడు మాట్లాడుతూ.. అశోక్ తేజ వంటి వారు ఉన్నారు కాబట్టే ఇప్పటికీ మనమంతా కలిసే ఉన్నామనే భావం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా 30 మంది జానపద కళాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలోడీన్ పి.సురేశ్‌వర్మ, పి.వెంకటేశ్వరావు, ప్రిన్సిపాల్స్ ఎ.మట్టారెడ్డి, వి.పెర్సిస్, కె. సుబ్బారావు, నిర్వాహకులు టి. సత్యనారాయణ, ఎన్. కిరణ్‌చంద్ర, టి.వాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాజకీయ అవినీతి మితిమీరింది

బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు ఆరోపణ



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలో రాజకీయ అవినీతి మితిమీరిపోయిందని బీజేపీ ఉత్తర వైజాగ్ ఎమ్మెల్యే, ఆ పార్టీ శాసనసభాపక్షనేత పి.విష్ణుకుమార్ రాజు ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం అవినీతికి తావులేని విధంగా పరిపాలన చేస్తుండగా, రాష్ట్రంలో అవినీతితో నిండిన పాలన సాగుతోందని విమర్శించారు. గుంటూరులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో 'సంకల్ప సిద్ధి–నవ భారత నిర్మాణం' పేరుతో జరిగిన సభలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌తో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖలో వెలుగు చూసిన భూ కుంభకోణంపై బాధితుల నుంచి తనకు మూడు వేల ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఒక సంఘటనకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక పంపేందుకు రూ. 8 లక్షలు లంచం డిమాండ్ చేసిన అచ్యుతాపురం తహసీల్దార్‌ను ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టించామన్నారు. లంచాల పేరుతో అధికారులు ప్రజలను పీడిస్తే సహించబోమని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, ఆ పార్టీకి చెందిన పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సీనియారిటీ, ఆప్షన్ ప్రాతిపదికగా న్యాయాధికారుల విభజన

- ఉమ్మడి హైకోర్టు న్యాయాధికారుల విభజన వ్యవహారంపై కేంద్రం
- సుప్రీంకోర్టుకు మార్గదర్శకాల ముసాయిదా సమర్పణ
- సమ్మతం కాదన్న తెలంగాణ న్యాయాధికారుల సంఘం
- సెప్టెంబరు 5కు విచారణ వాయిదా




సాక్షి, న్యూఢిల్లీ: సీనియారిటీ, స్థానికత, ఆప్షన్లను ప్రాతిపదికగా తీసుకుని న్యాయాధికారుల విభజన చేపడతామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు విన్నవించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య న్యాయాధికారుల విభజన చేపట్టేందుకు వీలుగా మార్గదర్శకాల ముసాయిదాను సుప్రీంకోర్టుకు సమర్పించింది. న్యాయాధికారుల క్యాడర్ విభజనకు సంబంధించి ఉమ్మడి హైకోర్టు రూపొందించిన మార్గదర్శకాలను సవాలు చేస్తూ తెలంగాణ జడ్జెస్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జాస్తి చలమేశ్వర్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఉమ్మడి హైకోర్టు రూపొందించిన క్యాడర్ విభజన మార్గదర్శకాలను ముసాయిదాగా పరిగణించాలని, వీటిపై తగిన సూచనలు తీసుకుని కేంద్రం జూన్ 17లోగా మార్గదర్శకాల తుది ముసాయిదాను తయారు చేయాలని ఏప్రిల్ 28, 2017న సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ తుది ముసాయిదాను పరిశీలించి తుది మార్గదర్శకాలను తాము ఖరారు చేస్తామని చెబుతూ నాటి ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే ఉమ్మడి హైకోర్టుతో సంప్రదింపులు జరిపి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు తమ తమ రాష్ట్రాల్లో ఉండాల్సిన సబార్డినేట్ జ్యుడిషియల్ అధికారుల సంఖ్యను నిర్ధారించాలని కూడా పేర్కొంది. తాజాగా మంగళవారం ఈ కేసు విచారణకు రాగా కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ మణిందర్‌సింగ్ మార్గదర్శకాల తుది ముసాయిదాతో కూడిన అఫిడవిట్‌ను ధర్మాసనానికి సమర్పించారు. హైకోర్టు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు, వివాదంతో సంబంధం ఉన్న ప్రతినిధుల నుంచి సూచనలు స్వీకరించి మార్గదర్శకాల ముసాయిదా రూపొందించినట్టు తెలిపారు. న్యాయాధికారుల విభజనలో సీనియారిటీ, స్థానికతను పరిగణనలోకి తీసుకుని ప్రాంతం ఎంపికకు ఆప్షన్ ఇవ్వాలన్నదే ప్రధానమైన మార్గదర్శకమని వివరించారు. ఈ సందర్భంలో న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ జోక్యం చేసుకుంటూ... ఒక రాష్ట్రంలో స్థానికుడై ఉండి మరో రాష్ట్రంలో ఆప్షన్ ఎంచుకున్నప్పుడు దానిని ఏ ప్రాతిపదికన పరిగణనలోకి తీసుకుంటారని ప్రశ్నించారు. ఒక ప్రాంతానికి చెందిన వారు ఎక్కువమంది సీనియర్ అయి ఉండి ఇంకో ప్రాంతాన్ని ఎంచుకుంటే దానిని ఏ ప్రాతిపదికన పరిగణనలోకి తీసుకుంటారని ప్రశ్నించారు.

'మాకు ఆమోదయోగ్యం కాదు'

ఇదే సందర్భంలో తెలంగాణ జడ్జెస్ అసోసియేషన్ తరపున సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ తన వాదన వినిపిస్తూ... సీనియారిటీ, ఆప్షన్ ప్రాతిపదిక తమకు ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. తెలంగాణ తరపు న్యాయవాది హరేన్ రావెల్ తన వాదనలు వినిపించబోతుండగా కేంద్రం వాదనలు పూర్తయ్యాకే మీ వాదనలు వింటామని న్యాయమూర్తి పేర్కొన్నారు. విభజన తేదీ నాటికి మంజూరైన న్యాయాధికారుల పోస్టుల సంఖ్య, ఖాళీలు, విభజన తేదీ తరువాత రెండు రాష్ట్రాల్లో న్యాయాధికారుల సంఖ్య తదితర వివరాలు ఉన్నాయా? అంటూ న్యాయమూర్తి ప్రశ్నించగా...జాబితా సిద్ధంగా లేదని, కొంత సమయం కావాలని హైకోర్టు తరపు సీనియర్ న్యాయవాది రమణీరావు ధర్మాసనానికి విన్నవించారు. సంబంధిత వివరాలను బుధవారం నాటికి కోర్టుకు సమర్పించాలని ఆదేశిస్తూ విచారణ 5కి వాయిదా వేశారు.

ట్రిపుల్ తలాక్ చెల్లదు



అది చట్ట, రాజ్యాంగ విరుద్ధం

ఏకపక్షం, అహేతుకం


సుప్రీంకోర్టు కీలక తీర్పు

3:2 మెజారిటీతో తీర్పునిచ్చిన ధర్మాసనం


జస్టిస్ ఖేహర్


జస్టిస్ నజీర్


జస్టిస్ ఫాలీ నారిమన్


జస్టిస్ లలిత్


జస్టిస్ జోసెఫ్

సాక్షి నాలెడ్జ్ సెంటర్

ముస్లింలు అప్పటికప్పుడు ట్రిపుల్ తలాక్ ద్వారా భార్యలకు విడాకులు ఇవ్వడం కుదరదని సుప్రీంకోర్టు మంగళవారం తేల్చిచెప్పింది. ట్రిపుల్ తలాక్ చెల్లదనీ, ఇది చట్ట, రాజ్యాంగ విరుద్ధమని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 3:2 మెజారిటీతో తీర్పు చెప్పింది. ''ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ... 3:2 మెజారిటీతో తలాక్–ఎ–బిద్దత్ (ట్రిపుల్ తలాక్) చెల్లదని కొట్టివేస్తున్నాం'' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ 395 పేజీల తీర్పును వెలువరిస్తూ పేర్కొన్నారు. పునరాలోచన చేసుకునేందుకు ఆస్కారం లేని, క్షణాల్లో ఇచ్చేసే ట్రిపుల్ తలాక్ ఖురాన్ సూక్తులకు వ్యతిరేకమనీ, అంగీకారయోగ్యం కాదని జస్టిస్ కురియన్ జోసెఫ్, జస్టిస్ ఆర్.ఎఫ్.నారిమన్, జస్టిస్ యు.యు.లలిత్‌లు ఇచ్చిన మెజారిటీ తీర్పు అభిప్రాయపడింది. 'దీని ద్వారా విడాకులు అత్యంత ఏకపక్షం, అహేతుకం. రాజ్యాంగ ఉల్లంఘన కూడా. అందువల్ల ట్రిపుల్ తలాక్‌ను కొట్టివేయాల్సిందే' అని ఈ ముగ్గురు న్యాయమూర్తులు పేర్కొన్నారు. ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమని తేలుస్తూ జస్టిస్ జోసెఫ్, జస్టిస్ నారిమన్ విడివిడిగా తీర్పులివ్వగా... జస్టిస్ లలిత్ మాత్రం నారిమన్ తీర్పుతో ఏకీభవించారు. అలా వీరిది మెజారిటీ తీర్పు అయ్యింది. కాగా మైనారిటీ తీర్పునిచ్చిన జస్టిస్ ఖేహర్, జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌లు మాత్రం విరుద్ధ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ట్రిపుల్ తలాక్ దీర్ఘకాలంగా వాడుకలో ఉన్నదనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని... షరియా చట్టాలు కూడా ఆమోదిస్తున్నందున అది మతాన్ని ఆచరించే స్వేచ్ఛను ప్రసాదిస్తున్న ఆర్టికల్–25 కిందకు వస్తుందన్నారు. ట్రిపుల్ తలాక్‌పై ఆర్నెల్ల నిషేధం విధించాలనీ, ఆలోగా రాజకీయ పార్టీలన్నీ విభేదాలను పక్కనబెట్టి ఈ అంశంలో చట్టం చేయడానికి ఏకతాటిపైకి రావాలని కోరారు.

సుప్రీంకోర్టు 2015 అక్టోబర్ 16న సుమోటోగా ఓ పిల్‌ను చేపట్టింది. 'సమానత్వం కోసం ముస్లిం మహిళల ఆరాటం' అనే శీర్షికన దీన్ని చేపట్టింది. ఏకపక్ష విడాకులు, బహుభార్యత్వం, నిఖా హలాలా (విడాకులిచ్చిన భార్యను మళ్లీ నేరుగా పెళ్లి చేసుకునేందుకు మత నిబంధనలు ఒప్పుకోవు. విడాకులిచ్చిన భార్యకు వేరొకరితో వివాహమై, రెండో భర్తతోనూ ఆమె విడాకులు తీసుకుంటేనే తిరిగి మొదటి భర్తను పెళ్లాడవచ్చు)లు ముస్లిం మహిళల గౌరవానికి ఏమేరకు భంగకరమో విచారించేందుకు నడుం కట్టింది. లింగ వివక్షకు గురవుతున్నారనే కోణంలోనూ విచారణ జరిపింది. సుప్రీం పిల్‌కు షాయరా బానోతోపాటు మరో నలుగురు బాధిత మహిళల పిటిషన్లు తోడయ్యాయి. మరో రెండు పిటిషన్లను ఇతర సంస్థలు వేశాయి. మొత్తం ఈ ఏడు పిటిషన్లను సుమోటో పిల్‌తో కలిపి ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారించింది. అయితే ఆ తర్వాత ప్రధాన సమస్యగా ఉన్న ట్రిపుల్ తలాక్ అంశానికే విచారణను పరిమితం చేసింది. దీని రాజ్యాంగబద్ధతపై వాదనలు వింది. ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. ఉన్నట్లుండి మూడుసార్లు తలాక్ చెప్పేసి విడాకులు ఇవ్వడం, అదీ కొన్నిసార్లు ఫోన్‌లో, సంక్షిప్త సందేశాల ద్వారా చేయడం ఆక్షేపణీయమన్నారు. ఇది ఏకపక్షమనీ, మహిళలపై వివక్ష చూపడమని వాదించారు. మహిళల గౌరవానికి భంగకరమన్నారు. మౌలికంగా ఇస్లాంకు విరుద్ధం కాబట్టి ట్రిపుల్ తలాక్ చెల్లదని భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ (బీఎంఎంఏ) వాదించింది. నచ్చిన మతాన్ని ఆచరించుకునే స్వేచ్ఛను ప్రసాదించే ఆర్టికల్–25 కింద ముస్లిం పర్సనల్ లాలో భాగంగా తలాక్‌కు రాజ్యాంగ రక్షణ ఉంది కాబట్టి... ప్రాథమిక హక్కులకు భంగకరమని సవాల్ చేయలేరని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) వాదించింది. భారతీయ సున్నీ ముస్లింలలో హనాఫీలు 90% మందికి పైగా ఉన్నారనీ, గడచిన 1,400 ఏళ్లుగా దీన్ని పాటిస్తున్నారు కాబట్టి ఆర్టికల్–25 కింద ఇది మతస్వేచ్ఛ కిందకు వస్తుందని పేర్కొంది. అదే సమయంలో ఇది పురుషాధిక్య ధోరణేననీ, అభిలషణీయం కాదని ఏఐఎంపీఎల్‌బీ అంగీకరించింది. మరింత ముందుకు వెళ్లి నిఖానామా (పెళ్లి ఒప్పందం)లోనే ముందస్తు షరతు పెట్టడం ద్వారా ట్రిపుల్ తలాక్‌ను నివారించొచ్చని సర్వోన్నత న్యాయస్థానానికి సూచించింది. మరోవైపు కేంద్రం... ఏ పర్సనల్ లా అయినా రాజ్యాంగానికి లోబడే ఉండాలనీ, ప్రాథమిక హక్కులైన సమానత్వం, వివక్ష చూపకూడదనే వాటికి ట్రిపుల్ తలాక్ వ్యతిరేకమని వాదించింది. ఒకవేళ రాజ్యాంగ ధర్మాసనం ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమని తేలిస్తే... ముస్లింల వివాహ, విడాకులను పర్యవేక్షించేందుకు కొత్తచట్టాన్ని తెస్తామని కేంద్రం కోర్టుకు తెలిపింది. వివక్షకు గురవుతున్న ముస్లిం మహిళలకు–ముస్లిం పురుషులకు మధ్య సంఘర్షణగా ట్రిపుల్ తలాక్‌పై న్యాయపోరాటాన్ని అభివర్ణించింది.

ఎవరి తీర్పు ఏంటి...

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్: 'మతస్వేచ్ఛను ప్రసాదించే ఆర్టికల్–25లో తలాక్–ఎ–బిద్దత్ (ట్రిపుల్ తలాఖ్) విడదీయరాని భాగం. సున్నీల్లోని హనాఫీ ముస్లింలు గడిచిన 1,400 ఏళ్లుగా దీన్ని ఆచరిస్తున్నారు కాబట్టి మతాచారంలో ఇది భాగమైంది. ఆర్టికల్–14 (సమానత్వం), ఆర్టికల్ 19 (భావప్రకటనా స్వేచ్ఛ), ఆర్టికల్ 21 (జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ)లను ట్రిపుల్ తలాక్ ఉల్లంఘించదు. 1937 షరియా చట్టం ఆధారంగా దీనికి చట్టబద్ధత వచ్చింది. రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి తగినట్లుగా లేదనే కారణంతో న్యాయస్థానం తీర్పు ద్వారా ట్రిపుల్ తలాక్‌ను తోసిపుచ్చలేదు. ఏదైనా మార్పు జరిగితే...అది చట్టాలు రూపొందించడం ద్వారానే జరగాలి. ఆర్టికల్– 142 ద్వారా సంక్రమించిన ఆసాధారణ అధికార పరిధిని వినియోగిస్తూ... ముస్లింలు ఆరునెలల పాటు ట్రిపుల్ తలాక్ ద్వారా భార్యలకు విడాకులు ఇవ్వడాన్ని నిషేధిస్తున్నాం. రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి... తగు చట్టం రూపొందించేందుకు పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలి. ముస్లిం ఆధిక్యదేశాలే తలాక్–ఎ–బిద్దత్‌ను నిషేధించినపుడు... ఈ విషయంలో స్వతంత్ర భారతదేశం వెనుకపడటానికి సాకులు వెదుక్కోవాల్సిన అవసరం లేదు' అని జస్టిస్ ఖేహర్ తన తీర్పులో పేర్కొన్నారు.

- జస్టిస్ ఖేహర్ అభిప్రాయంతో **జస్టిస్ అబ్దుల్ నజీర్** ఏకీభవించారు. న్యాయస్థానం తీర్పు ద్వారా ట్రిపుల్ తలాక్‌ను తోసిపుచ్చలేరని... చట్ట రూపకల్పన ద్వారానే ఇది జరగాలనేది జస్టిస్ ఖేహర్ అభిప్రాయం.

జస్టిస్ రోహింటన్ ఫాలీ నారిమన్: 'ముస్లిం మహిళలు న్యాయం కోరి తమ ముందుకు వస్తే చేతులు ముడుచుకుని కూర్చోవడం కోర్టుకు సాధ్యం కాదు. తలాక్–ఎ–బిద్దత్‌తో సహా మొత్తం మూడు రకాల తలాక్‌లను 1937 షరియా చట్టంలో చేర్చి, గుర్తించారు. షరియా చట్టంలో చేర్చినంత మాత్రాన అది ప్రాథమిక హక్కులకు అతీతమైనదేమీ కాదు. 'చట్టం' అనే పదాన్ని నిర్వచించే ఆర్టికల్ 13 (1) ఏం చెబుతోందంటే... రాజ్యాంగరచన కంటే ముందు లేదా తర్వాత రూపొందిన ఏ చట్టమైనా సరే ప్రాథమిక హక్కులను ఉల్లంఘించకూడదు అని. ట్రిపుల్ తలాక్... ఇష్టారాజ్యంగా, జవాబుదారీతనం లేకుండా ఏకపక్షంగా ముస్లిం పురుషుడు తన భార్యకు విడాకులు ఇవ్వడానికి ఆస్కారం కల్పిస్తోంది. ఇది అత్యంత ఏకపక్షం, అహేతుకం... కాబట్టి ఆర్టికల్–25 కింద దీనికి రక్షణ లేదు. మతాచారాల్లో నిర్దిష్టంగా ప్రస్తావించిన హక్కు కాదు. ఆచరణలో అనుమతిస్తున్నది మాత్రమే కాబట్టి ఆర్టికల్–25 (నచ్చిన మతాన్ని ఆచరించే స్వేచ్ఛ) కింద రక్షణకు అర్హమైనది కాదు' అని నారిమన్ తీర్పు చెప్పారు.

- జస్టిస్ నారిమన్ తీర్పుతో **జస్టిస్ లలిత్** ఏకీభవించారు.

జస్టిస్ కురియన్ జోసెఫ్: 'ఇన్‌స్టంట్ (క్షణాల్లో) తలాక్ ఖురాన్ సూక్తులకు విరుద్ధం. ఖురాన్ నిషేధించినది షరియత్‌లో ఒప్పు కాకూడదు. మత శాస్త్రాల్లో నిషేధించినది చట్టాల్లో ఒప్పు కాకూడదు. 1,400 ఏళ్లుగా ఆచరిస్తున్నారు కాబట్టి ఆర్టికల్–25 కింద రక్షణ ఉండాలనే వాదన (జస్టిస్ ఖేహర్ అభిప్రాయం)తో నేను విభేదిస్తున్నాను. అలాగే మతపరమైన విశ్వాసాల ఆధారంగానే తలాక్ పర్సనల్ లాలో విడదీయరాని భాగమైందనే వాదనతోనూ ఏకీభవించను. ఏ మతాచారమైనా... నైతికత, ప్రజారోగ్యం, శాంతిభద్రతలకు భంగకరం కాకుండా ఉండాలి.' అని జస్టిస్ కురియన్ తన తీర్పులో పేర్కొన్నారు.

ఎవరేమన్నారంటే...



'సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం. ఈ తీర్పు ముస్లిం మహిళలకు సమానత్వాన్ని ప్రసాదించింది. మహిళా సాధికారత సాధనకు ఇదొక శక్తివంతమైన శాసనంలా పనిచేయనుంది.' *– నరేంద్ర మోదీ, ప్రధాని*

దేశంలో ముస్లిం మహిళలకు సమానత్వం, ఆత్మగౌరవం విషయంలో ఈ తీర్పుతో కొత్త శకం ప్రారంభమైంది. ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధం, సమానత్వంతో జీవించే హక్కును సుప్రీంకోర్టు ముస్లిం మహిళలకు ఇచ్చింది. వారికి అనుకూలంగా వచ్చిన ఈ తీర్పును స్వాగతిస్తున్నా.
– అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు



న్యాయం కోసం పోరాడిన మహిళలకు అభినందనలు. ట్రిపుల్ తలాక్‌పై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాను.
– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు

ముస్లిం మహిళల హక్కుల్ని సుప్రీం తీర్పు చాటిచెప్పింది. ట్రిపుల్ తలాక్‌తో వివక్షకు గురవుతున్న మహిళలకు ఈ తీర్పు ఉపశమనం
– రణ్‌దీప్ సూర్జేవాలా, కాంగ్రెస్ ప్రతినిధి

సెప్టెంబర్ 10న భోపాల్‌లో జరిగే వర్కింగ్ కమిటీ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటాం. తీర్పును పూర్తిగా అధ్యయనం చేశాక స్పందిస్తాం. *– ఆలిండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు*

మేం విజయం సాధించాం, ఇప్పుడు భద్రంగా ఉన్నట్లు భావిస్తున్నాం. ఈ తీర్పు అతిపెద్ద విజయం, ఉపశమనం. అయితే మా పోరాటంలో సగం విజయమే దక్కింది. కేంద్రం చట్టం చేసినప్పుడే పూర్తి విజయం సాధించినట్లు..
– ఆలిండియా ముస్లిం మహిళా పర్సనల్ లాబోర్డు



తీర్పును మనం గౌరవించాలి. అయితే క్షేత్ర స్థాయిలో దీన్ని అమలు చేయడం కష్ట సాధ్యం. అనేక ఇబ్బందులు తలెత్తుతాయి. ట్రిపుల్ తలాక్ అత్యంత వివాదాస్పద అంశం. అందుకే సుప్రీంకోర్టు ధర్మాసనంలో కూడా దీనిపై ఏకాభిప్రాయం లేదు. ప్రాథమిక హక్కుల పరిధిలో వ్యక్తిగత చట్టాల్ని సవాలు చేయలేరని న్యాయమూర్తులు పేర్కొనడం ఆహ్వానించదగ్గ పరిణామం.
– అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం అధ్యక్షుడు

ఈ తీర్పుతో ట్రిపుల్ తలాక్‌కు తాము వ్యతిరేకమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అన్ని వ్యక్తిగత చట్టాల్ని సంస్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలి.
– డి.రాజా, సీపీఐ జాతీయ కార్యదర్శి

సామాజిక అసమానతల్ని రూపుమాపే విషయంలో మొండి వైఖరి కాకుండా.. సంస్కరణల మార్గాన్ని అనుసరించాలి. *– ముఖ్తార్ అబ్బాస్ నక్వీ, కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి*




ట్రిపుల్ తలాక్ కాలం చెల్లిన, తప్పుడు విధానం. ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం.
– కపిల్ సిబల్, ముస్లిం పర్సనల్ లా బోర్డు తరపు న్యాయవాది

ఐదుగురు.. ఐదు మతాలు

ఐదు ధర్మాలకు ధర్మాసనంలో ప్రాతినిధ్యం

ట్రిపుల్ తలాక్ పిటిషన్లపై విచారణ జరిపి తీర్పునిచ్చిన ధర్మాసనంలో ఐదుగురు న్యాయమూర్తులూ వేర్వేరు మతాలకు చెందిన వారే. ఐదు మతాలకు చెందిన జడ్జీలు ఉండేలా రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుచేసి విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందనే అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు జనంలో కలిగించింది. బెంచ్‌కు నేతృత్వం వహించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేఎస్ ఖేహర్ సిక్కు మతస్తుడు కాగా, జస్టిస్ కురియన్ జోసెఫ్ క్రైస్తవుడు. జస్టిస్ రోహింగ్టన్ ఎఫ్ నారిమన్ పార్సీ (జోరాష్ట్రియన్) మతానికి చెందినవ్యక్తి. జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఓ ముస్లిం. మెజారిటీ తీర్పు ఇచ్చిన జడ్జీల్లో ఒకరైన ఉదయ్ ఉమేశ్ లలిత్ ఒక్కరే హిందువు. ఇలా ఏ ఒక్క మతానికి చెందిన ఇద్దరు జడ్జీలు ధర్మాసనంలో లేకుండా, విచారణ, తీర్పుపై ఎలాంటి అనుమానాలూ తలెత్తకుండా భారత న్యాయవ్యవస్థ జాగ్రత్తలు తీసుకుంది. మెజారిటీ తీర్పుతో ఏకీభవించని ఇద్దరిలో జస్టిస్ అబ్దుల్ నజీర్ ఉన్నారు. జస్టిస్ ఖేహర్ ఈ నెల 28న, జస్టిస్ జోసెఫ్ వచ్చే ఏడాది నవంబర్‌లో పదవీ విరమణ చేయబోతున్నారు. అందరి కన్నా తక్కువ అనుభవం ఉన్న జస్టిస్ నజీర్ ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. 2023 జనవరి మొదటివారంలో పదవీ విరమణ చేస్తారు.

'ఇన్‌స్టంట్'కే నో



సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది... ఉన్నపళంగా మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులు తీసుకోవడం (ఇన్‌స్టంట్) చెల్లదని మాత్రమే. అంతేకాని మొత్తం ట్రిపుల్ తలాక్ విధానాన్ని నిషేధించలేదు. ముస్లిం పర్సనల్ లా ప్రకారం విడాకులు మూడురకాలు.

- **తలాక్–ఎ–అహ్‌సాన్:** ముస్లిం దంపతులు విడాకులు తీసుకోవడానికి సరైన మార్గంగా దీన్ని పరిగణిస్తారు. అహ్‌సాన్ అనే పదానికి అర్థం... అత్యుత్తమ లేదా సరైన. దీని ప్రకారం... భార్య రుతుక్రమంలో లేనప్పుడు... భర్త ఏకవాక్యంలో విడాకులు ఇస్తున్నట్లు చెప్పాలి. తర్వాత భార్య నిర్దేశిత కాలంపాటు నిరీక్షించాలి. ఈ కాలాన్ని ఇద్దత్ అంటారు. మూడు నెలసరులు 'ఇద్దత్'గా ఉంటుంది. ఒకవేళ భార్య గర్భంతో ఉంటే శిశువు జన్మించేదాకా ఇద్దత్ కాలం ఉంటుంది. ఈ సమయంలోపు భర్త మనసు మార్చుకుంటే... తలాక్‌ను వెనక్కితీసుకోవచ్చు. ఇద్దత్ కాలం ముగిస్తే మాత్రం విడాకులు మంజూరైనట్లే.
- **తలాక్–ఎ–హసన్:** పునరాలోచనకు తగినంత సమయం ఉంటుంది కాబట్టి దీన్ని కూడా కొంత వరకు మంచి పద్ధతిగానే పరిగణిస్తారు. ఈ విధానంలో మూడునెలల వ్యవధిలో నెలకోమారు చొప్పున భర్త మూడుసార్లు భార్యకు తలాక్ చెబుతాడు. తర్వాత విడాకులు మంజూరవుతాయి. ఒకవేళ ఆలోపు మనసు మార్చుకుంటే... వైవాహిక బంధాన్ని కొనసాగించవచ్చు.
- **తలాక్–ఎ–బిద్దత్:** 'తలాక్... తలాక్... తలాక్' అని వరుసగా మూడుసార్లు చెప్పేసి విడాకులు తీసుకోవడమే తలాక్–ఎ–బిద్దత్. షరియా చట్టం ప్రకారం ఇది చెల్లుబాటవుతోంది. ఒమేయద్ రాజులు విడాకులకు సులభమార్గంగా దీన్ని పరిచయం చేశారు. ఒక్కసారిగా మూడు పర్యాయాలు భర్త తలాక్ చెప్పాడంటే ఇక అంతే. విడాకులే. నిర్ణయాన్ని మార్చుకోవడానికి అవకాశం ఉండదు.

క్షణికావేశంలో, అనాలోచితంగా నిర్ణయం తీసుకుని జీవిత భాగస్వామిని తీవ్ర మనోవేదనకు గురిచేస్తూ... క్షణాల్లో విడాకులిచ్చేయడం సరికాదని సర్వోన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. తలాక్‌ను 22 ముస్లిం మెజారిటీ దేశాలు నిషేధించడం గమనార్హం.

ప్రస్తుత చట్టాలు సరిపోతాయి..

ట్రిపుల్ తలాక్‌పై కేంద్రం సంకేతాలు

న్యూఢిల్లీ: ట్రిపుల్ తలాక్‌పై కొత్త చట్టం తీసుకురావాల్సిన అవసరం లేదని, ఇప్పుడున్నవి సరిపోతాయని కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా సంకేతాలిచ్చింది. గృహ హింస తరహా చట్టాల సాయాన్ని ఈ కేసుల పరిష్కారం కోసం వాడుకోవచ్చని సూచించింది. 'సుప్రీం తీర్పు నేపథ్యంలో భర్త ట్రిపుల్ తలాక్ ఇస్తే అది చెల్లుబాటు కాదు. వివాహ ఒప్పందం అలాగే నిలిచి ఉంటుంది. ఆ వ్యక్తిపై పోలీసు స్టేషన్‌లో వేధింపులు, గృహ హింస కింద కేసులు పెట్టేందుకు భార్యకు స్వేచ్ఛ ఉంటుంది' అని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. సుప్రీం ధర్మాసనంలో మెజారిటీ న్యాయమూర్తులు ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధం, చట్ట వ్యతిరేకమని స్పష్టం చేశారని, ఈ అంశంపై అన్ని కోణాల్లో ప్రభుత్వం క్షుణ్నంగా అధ్యయనం చేస్తుందని చెప్పారు.

యూకే 'ఆర్థిక ఆంక్షల' జాబితాలో దావూద్



లండన్: యూకే తాజాగా విడుదల చేసిన ఆర్థిక ఆంక్షల జాబితాలో భారత్‌కు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ అయిన దావూద్ ఇబ్రహీం ఉన్నాడు. దావూద్ 21 మారు పేర్లను కూడా ఇందులో ప్రస్తావించారు. యూకే కోశాగార విభాగం సోమవారం సవరించిన 'కన్సాలిడేటెడ్ లిస్ట్ ఆఫ్ ఫైనాన్సియల్ సాంక్షన్స్ టార్గెట్స్ ఇన్ యూకే'లో దావూద్‌కు పాకిస్తాన్‌లో మూడు అధికారిక చిరునామాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆ మూడూ కరాచీలోనే ఉన్నట్లు వెల్లడించారు. దావూద్ మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా ఖేర్‌లో జన్మించాడని, ఆయన భారత పౌరసత్వం కలిగి ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అయితే భారత్ తన పాస్‌పోర్టును రద్దుచేసిన తరువాత దావూద్ భారత్, పాక్ నుంచి ఇతరుల పేరిట పాస్‌పోర్టులు సేకరించి దుర్వినియోగం చేశాడని జాబితాలో పేర్కొన్నారు. ఈ జాబితాలో ఉన్న వ్యక్తులు, సంస్థలు ఇతరులతో ఆర్థికపర లావాదేవీలు జరపకుండా నిషేధం విధిస్తారు. అలాగే వారి ఆస్తులను స్తంభింపజేస్తారు.

బ్రిటన్‌లో భారతీయుల అరెస్టు

లండన్: అక్రమంగా నివసిస్తున్న వారిపై బ్రిటన్ వ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో అరెస్టయిన సుమారు 200 మందిలో ఎక్కువ మంది భారతీయులున్నట్లు ఆ దేశ హోం శాఖ వెల్లడించింది. వీసా గడువు ముగిసినా అక్కడే నివసిస్తూ పట్టుబడిన వారిలో పాకిస్తాన్, చైనా, అఫ్గానిస్తాన్, ఆల్బేనియా పౌరులు కూడా ఉన్నట్లు తెలిపింది. జనవరి నుంచి జూన్ మధ్య నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో పరిమితికి మించి నివాసం ఉంటున్న 253 ఇళ్లపై అధికారులు దృష్టిసారించారు. యూకేలోకి అక్రమంగా ప్రవేశించిన, వీసా గడువు ముగిసినా అక్కడే నివసిస్తున్న మొత్తం 200 మందిని అదుపులోకి తీసుకుని, 24 మంది ఇంటి యజమానులకు జరిమానా విధించారు. అయితే ఈ ఆపరేషన్‌లో దొరికిపోయి, స్వచ్ఛందంగా తిరిగి తమ దేశం వెళ్లిపోతామనుకునే వారికి సాయం చేస్తామని బ్రిటన్ హోం శాఖ ప్రకటించింది.



సైకిల్‌పై నిరసన యాత్ర చేస్తున్న ఈయన ఒక జడ్జి. మధ్యప్రదేశ్‌లో అదనపు సెషన్స్ జడ్జిగా ఉన్న ఆర్‌కే శ్రీవాస్ తనను అన్యాయంగా తరచూ బదిలీచేస్తున్నారని ఆరోపిస్తూ నీమచ్ నుంచి 700 కి.మీ. దూరంలోని జబల్పూర్‌కు ఇలా 'సత్యాగ్రహ' సైకిల్ యాత్ర చేస్తున్నారు.

కేసు వెనక ఎవరెవరు?

ఉన్నపళంగా మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులిచ్చే విధానాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేసిన వారంతా ముస్లిం మహిళలే. దీనికి సంబంధించి మొత్తం ఏడు పిటిషన్లను ఒకచోట చేర్చి సుప్రీంకోర్టు విచారించింది. ఈ కేసులు వేసిన మహిళలు ఎవరంటే...


ఫరా ఫైజ్


షయారా బానో

షయారా బానో
ఉత్తరాఖండ్ ఉద్ధమ్‌సింగ్‌నగర్ జిల్లాకు చెందిన షయారా బానో 2002లో అలహాబాద్‌కు చెందిన స్థిరాస్తి వ్యాపారి రిజ్వాన్ అహ్మద్‌ను పెళ్లాడింది. 2015 అక్టోబర్‌లో ఉత్తరం ద్వారా ఆమె భర్త మూడుసార్లు తలాక్ చెప్పడంతో పాటు ఇద్దరు పిల్లలనూ తీసుకెళ్లిపోయాడు. మూడునెలల విరామాన్ని (ఇద్దత్) పాటించకుండా ఈ విధమైన విడాకులు ఇవ్వడం అక్రమం, రాజ్యాంగ విరుద్ధమని బానో సుప్రీంకోర్టులో కేసు వేశారు.

ఇష్రత్ జహన్
పెళ్లికి ముగింపు పలికేందుకు తలాక్‌కు రాజ్యాంగబద్ధతను కల్పించడాన్ని ఇష్రత్ జహన్ ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్‌లోని హౌరాకు చెందిన ఆమె నలుగురు పిల్లలకు తల్లి. జహన్‌కు ఆమె భర్త ముర్తజా 2015లో దుబాయ్ నుంచి టెలిఫోన్ ద్వారా మూడుసార్లు తలాక్ చెప్పడం దిగ్భ్రాంతిని కలిగించింది. ఫోన్ ద్వారా తలాక్ సమ్మతం కాదనీ, న్యాయం చేయాలంటూ ఆమె కేసు వేశారు.

గుల్షన్ పర్వీన్
పుట్టింట్లో ఉండగా రూ. పది స్టాంప్ పేపర్‌పై భర్త పంపించిన విడాకుల పత్రం(తలాక్‌నామా)ను సవాల్ చేస్తూ యూపీలోని రాంపూర్‌కు చెందిన గుల్షన్ పర్వీన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పర్వీన్‌కు 2013 ఏప్రిల్‌లో వివాహం కాగా రెండేళ్ల కుమారుడున్నాడు. భర్త తరచుగా తనను ఇనుపరాడ్‌తో కొట్టేవాడనీ, విడాకులు ఇవ్వడంతో తాను, తన కొడుకు నిరాశ్రయులై పోయామనీ, న్యాయం చేయాలని ఆమె కోరారు.

ఆఫ్రీన్ రెహ్మాన్
వివాహ సంబంధాల పోర్టల్ ద్వారా 2014లో సయ్యద్ అలీ వార్సీని జైపూర్‌కు చెందిన ఆఫ్రీన్ రెహ్మాన్ పెళ్లి చేసుకున్నారు. పెళ్లైన రెండు నెలల తర్వాత కట్నం కోసం అత్తమామల వేధింపులు మొదలయ్యాయి. చివరకు 2015 సెప్టెంబర్‌లో తనను ఇంటి నుంచి గెంటేశారని ఆఫ్రీన్ చెబుతున్నారు. పుట్టింట్లో ఉన్న తనకు 2016 జనవరిలో స్పీడ్ పోస్ట్ ద్వారా విడాకులు అందాయనీ, ఇది తనకు ఆమోదయోగ్యం కాదని ఆమె సుప్రీంకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు.

మరో ముస్లిం న్యాయవాది పిటిషన్
సుప్రీంకోర్టు న్యాయవాది ఫరా ఫైజ్ కూడా పిటిషనర్లలో ఒకరు. షరియా చట్టం కింద ముస్లిం మహిళలకు భద్రత ఉన్నా ఖురాన్‌లో లిఖించని ట్రిపుల్ తలాక్, నిఖా హలాలాకు పర్సనల్‌లా బోర్డు ప్రాధాన్యతనిస్తోందని ఆమె అభ్యంతరం వ్యక్తంచేశారు.

- ఇంకా అతియా సాబ్రీతోపాటు భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్ (బీఎంఎంఏ) పిటిషన్ వేశారు.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

బీజేపీకి పోటీగా ప్రతిపక్షాల కమిటీ

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీని సమర్థంగా ఎదుర్కొనేందుకు 15 మంది ప్రతిపక్ష పార్టీల సభ్యులతో సమన్వయ కమిటీ ఏర్పాటైంది. జేడీ(యూ) తిరుగుబాటు నేత శరద్‌యాదవ్ దీనికి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. భావ సారూప్య ప్రతిపక్ష పార్టీలను ఐకమత్యంగా ఉంచడంతో పాటు, బీజేపీ విధానాలను నిరసిస్తూ అన్ని రాష్ట్రాల్లో 'మన వైవిధ్య సంస్కృతిని కాపాడుకుందాం' అనే నినాదంతో సమావేశాలు నిర్వహించడం కమిటీ లక్ష్యం. కమిటీలో... ఆనంద్ శర్మ (కాంగ్రెస్), రామ్‌గోపాల్(ఎస్పీ), వీర్‌సింగ్ (బీఎస్పీ), సీతారాం ఏచూరి (సీపీఎం), సుఖెందు శేఖర్ రాయ్(టీఎంసీ), తారిక్ అన్వర్(ఎన్సీపీ), డి.రాజా(సీపీఐ), మనోజ్ సిన్హా(ఆర్జేడీ), బీఆర్ అంబేడ్కర్(భారియా బహుజన్ మహాసంఘ్), హేమంత్ సోరెన్ (జేఎంఎం) తదితరులున్నారు.

బిస్మిల్లాఖాన్ 'పద్మ విభూషణ్'కు చెదలు

వారణాసి: దివంగత ప్రసిద్ధ షెహనాయ్ వాద్యకారుడు, భారతరత్న పురస్కార గ్రహీత ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ పద్మ విభూషణ్ ధ్రువపత్రంలో కొంత భాగాన్ని చెదలు తిన్నాయి. సోమవారం బిస్మిల్లా ఖాన్ 11వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఆయన వస్తువులను శుభ్రం చేసి సర్దుతుండగా ఈ విషయాన్ని గుర్తించారు. 1980లో నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి చేతుల మీదుగా బిస్మిల్లా ఖాన్ పద్మ విభూషణ్ పురస్కారాన్ని అందుకున్నారు. 2001లో భారతరత్న అందుకున్న ఖాన్ 2006లో గుండెపోటుతో మరణించడం తెలిసిందే. ఖాన్ ఉపయోగించిన సంగీత వాద్యాలు, సాధించిన పురస్కారాలు, ధ్రువపత్రాలను సంరక్షించేందుకు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి ఏమాత్రం బాగాలేదనీ ఆయన మనవడు వాపోయారు.

పాక్.. తీరు మార్చుకో: ట్రంప్



వాషింగ్టన్: ఉగ్రవాదులకు పాక్ స్వర్గధామంగా మారిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉగ్రవాద సంస్థలకు మద్దతు కొనసాగిస్తోందని, ఇలానే కొనసాగితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఉగ్రవాద సంస్థలకు, తాలిబన్లకు పాక్ చేస్తున్న సాయంపై ఎక్కువ కాలం నిశ్శబ్దంగా ఉండబోమని స్పష్టం చేశారు. అఫ్గానిస్తాన్‌లో అమెరికా చేపట్టిన ఆపరేషన్లలో భాగస్వామిగా ఉంటూ పాకిస్తాన్ భారీ లబ్ధి పొందిందని, కాని ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం ద్వారా కూడా భారీగానే నష్టపోతుందని హెచ్చరించారు. శాంతి నెలకొల్పేందుకు భారత్‌తో కలసి పనిచేయాలని సూచించారు. మంగళవారం వర్జీనియా రాష్ట్రం అర్లింగ్టన్‌లోని ఫోర్ట్ మేయర్‌లో తన పాలనా యంత్రాంగంలోని ముఖ్య అధికారులు సహా సుమారు 2 వేల మందిని ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. అఫ్గాన్‌లోని తమ సైనికులను వెనక్కి రప్పించే విషయంలో ఎలాంటి కాలపరిమితి లేదని స్పష్టం చేశారు. అఫ్గానిస్తాన్, దక్షిణాసియాపై తమ వ్యూహం మారిందని, అమెరికా దళాలు విజయం కోసమే పోరాడుతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం 8,500 దళాలు అఫ్గాన్‌లో ఉండగా.. మరో 4 వేల దళాలను అక్కడికి పంపనున్నట్లు సమాచారం.

భారత్ కీలక భాగస్వామి


తాము తెచ్చిన కొత్త 'దక్షిణాసియా విధానం'.. భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత అభివృద్ధి పరచడంలో ముఖ్య భూమిక పోషించనుందని ట్రంప్ పేర్కొన్నారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్. భద్రత, ఆర్థిక రంగాల్లో అమెరికాకు కీలక భాగస్వామి' అని పేర్కొన్నారు. 'పొరుగు దేశమైన అఫ్గాన్‌లో శాంతి, స్థిరత్వం తీసుకొచ్చేందుకు భారత్ చేస్తున్న కృషిని అభినందిస్తున్నాం. అమెరికాతో భారత్ బిలియన్ డాలర్ల వ్యాపారం చేస్తోంది. అలాగే అఫ్గాన్‌కు ఆర్థిక చేయూతనిస్తూ ఆదేశ అభివృద్ధిలో భాగస్వామి కావాలని కోరుతున్నాం' అని చెప్పారు. కాగా, పాక్ ఉగ్రవాదులకు స్వర్గధామంగా మారిందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ స్వాగతించింది. మరోవైపు పాక్‌కు మిత్ర దేశం చైనా మరోమారు బాసటగా నిలిచింది.

రాష్ట్రాభివృద్ధికే శత చండీయాగం

శ్రీ అరుణాచల అన్నపూర్ణ ఆశ్రమం పీఠాధిపతి శివానంద లహరి


వివరాలను తెలుపుతున్న శివానంద స్వామీజీ

తిరుచానూరు: నవ్యాంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధిని ఆకాంక్షిస్తూ ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు తిరుపతిలోని శిల్పారామంలో శత చండీయాగం నిర్వహించనున్నట్లు తమిళనాడు రాష్ట్రం, తిరువణ్ణామలైలోని శ్రీ అరుణాచల అన్నపూర్ణ ఆశ్రమం పీఠాధిపతి శివానంద లహరి స్వామీజీ తెలిపారు. శిల్పారామంలో మంగళవారం ఆయన విలేకరులకు వివరాలను వెల్లడించారు. రాష్ట్ర విభజన బాధాకరమని, ఎటువంటి వనరులు, రాజధానికి అనువైన నగరాలు లేకుండానే నూతన రాష్ట్రం ఏర్పాటైందని పేర్కొన్నారు. ఇటీవల నూతనంగా ఏర్పాటైన కొన్ని రాష్ట్రాలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అటువంటి సమస్యలు మన నవ్యాంధ్రకు కలగకుండా ఉండేందుకే గతంలో విజయవాడలో, ఇప్పుడు తిరుపతిలో శత చండీయాగం నిర్వహిస్తున్నట్లు వివరించారు. మానవ ప్రయత్నానికి దైవ శక్తి తోడవ్వాలనే సత్సంకల్పంతో నిర్వహిస్తున్న ఈ యాగంలో ప్రజలందరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు.



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టింగ్

మా కష్టాలు తీర్చరూ..!

- సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న పోలీసు ఆవేదన
- సీఎంకు తెలిసే వరకూ షేర్ చేయాలంటూ ఏపీ పోలీస్ విన్నపం

సాక్షి, అమరావతి: మాకు 500 కోట్లు అక్కర్లేదు.. మా పోలీసుల బాధలు తీర్చండి అంటూ ఆలోచన రేకెత్తించేలా పెట్టిన పోస్టు సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడు వైరల్ అవుతోంది. సర్కారు తీరుపై ప్రశ్నలతో కూడిన సమస్యలను వివరించే ప్రయత్నం అందులో చేశారు. పేరు ప్రస్తావించకుండా సాధారణ పోలీస్ సిబ్బంది పేరుతో ఆ పోస్టులో పేర్కొన్న కొన్ని ముఖ్యాంశాలు..

➤ మాకు కోట్లు అవసరంలేదు కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్, ఏఎస్ఐల బాధలు తీర్చండి.

➤ పనివేళలు తగ్గించండి. వీక్లీ ఆఫ్‌లు ఇవ్వండి. ప్రమోషన్‌లు ఇవ్వండి.

➤ కానిస్టేబుల్‌గా సెలెక్ట్ అయ్యి 25ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్నప్పటికీ ప్రమోషన్ రాని పరిస్థితి ఉంది.

➤ రాష్ట్రంలో కనీస వేతన చట్టం, లేబర్ యాక్ట్ ప్రకారం 8 గంటలు పని విధానం పోలీసులకు తప్ప ప్రతీ ఉద్యోగికి అమలవుతోంది.

➤ సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జీతభత్యాలు రెండింతలు పెంచుకోగా.. వారికి రక్షణ కల్పించే పోలీసులకు మాత్రం చాలీచాలని జీతాలా?

➤ రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు 52 ఆదివారాలు, 12 శనివారాలు, ఒక గుడ్‌ఫ్రైడే, వ్యక్తిగత సాధారణ సెలవులు 22, లోకల్ హాలిడేస్ 2, పండుగలు 32తో కలిపి మొత్తం 121 సెలవు రోజులుపోను మొత్తం 244 పని రోజులు మాత్రమే ఉంటున్నాయి. మరి పోలీసులకు ఏడాదికి 20సెలవులు మాత్రమే.

ఎండనకా, వాననకా, రాత్రీపగలు మీ రక్షణ కోసం పనిచేస్తున్న పోలీసుల కోసం ఆలోచించండి. పండుగ రోజుల్లో అందరూ కుటుంబంతో గడిపితే పోలీసులు మాత్రం ప్రజలకు రక్షణగా ఉంటున్నారు. అయినా, మాపైన ఎందుకు మీకు ఇంత కక్ష. ఇప్పటికైనా పోలీసులకు న్యాయం జరిగే వరకూ.. ఈ మెసేజ్ సీఎం దృష్టికి చేరేవరకు షేర్ చేయాలి.. ఇట్లు ఏపీ పోలీస్ అంటూ పేర్కోవడం విశేషం.

సెప్టెంబర్ 2న బక్రీద్

సాక్షి, హైదరాబాద్: మంగళవారం నెలవంక దర్శనం కాకపోవడంతో సెప్టెంబర్ 2వ తేదీ (శనివారం)న బక్రీద్ పండగ జరుపుకోవాలని రూయత్ –ఎ– హిలాల్ (నెలవంక నిర్ధారణ) కమిటీ అధ్యక్షుడు మౌలానా ఖుబుల్ పాషా షుత్తరీ ప్రకటించారు. మంగళవారం మోజంజాహీ మార్కెట్‌లోని కార్యాలయంలో కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న వివిధ కమిటీలతో ఈ విషయమై సంప్రదింపులు జరిపామని పాషా షుత్తరీ తెలిపారు.

చంద్రబాబుకు సరైన గుణపాఠం చెబుదాం!

- కాపు జాతిపై కక్ష కట్టారు
- ఆయన ఆస్తుల కోసం ఉద్యమం చేయడం లేదు
- కాపులను బీసీల్లో చేర్చే వరకూ నిరసనలకు పిలుపు


మంగళవారం తనకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన వారినుద్దేశించి మాట్లాడుతున్న ముద్రగడ

జగ్గంపేట: కాపు జాతిపై కక్ష కట్టిన చంద్రబాబుకు సరైన గుణపాఠం చెబుదామని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం పిలుపు ఇచ్చారు. తామేదో ఆయన ఆస్తుల కోసం ఉద్యమిస్తున్నట్లు పోలీసులతో కేసులు పెట్టించి అణచివేతకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడిలో తన నివాసంలో మంగళవారం నిరసన అనంతరం సాయంత్రం భారీగా తరలివచ్చిన అభిమానులు, మహిళలను ఉద్దేశించి ముద్రగడ ప్రసంగించారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు కాపులకు బీసీ రిజర్వేషన్ కల్పించే వరకూ నిరసనలు కొనసాగించాలన్నారు. రెండేళ్లుగా ఉద్యమం చేస్తున్నా మాయమాటలు చెప్పి పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా మీరందరూ జాతి కోసం పోరాటం సాగిస్తూ సంఘీభావం తెలిపేందుకు భారీగా కిర్లంపూడి రావడం అభినందనీయమన్నారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి మహిళలు, యువకులు రిజర్వేషన్ సాధించుకునే వరకు విశ్రమించరాదన్నారు. ఈ సందర్భంగా కాపులను బీసీల్లో చేర్చాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి యేసుదాసు, ఆరేటి ప్రకాష్, స్వామి, జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్పెషాలిటీ సీట్ల కేటాయింపులో అన్యాయం

కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు వైద్య విద్యార్థుల ఫిర్యాదు

సాక్షి, గుంటూరు: సూపర్ స్పెషాలిటీ సీట్ల కేటాయింపులో ఏపీకి చెందిన వైద్య విద్యార్థులకు అన్యాయం జరిగిందని గుంటూరు వైద్య కళాశాలకు వచ్చిన కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాకు సీనియర్ రెసిడెంట్‌లు, పీజీ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ పీజీ విద్యార్థులు శ్రీకాంత్, పవన్, ప్రసాద్‌లతో పాటు, మరికొందరు కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సూపర్ స్పెషాలిటీ కౌన్సెలింగ్ ఈ నెల 14వ తేదీన ఆన్‌లైన్‌లో జరిగిందని, 17వ తేదీన ఫలితాలు వచ్చాయని, ఇందులో ఏపీకి చెందిన సుమారు 100 మంది వివిధ రాష్ట్రాల్లోని కళాశాలల్లో సీట్లు సాధించారని చెప్పారు. వీరికి సీట్ల అలాట్‌మెంట్ కూడా ఇచ్చారని తెలిపారు. అయితే హైకోర్టు తీర్పును ఆధారంగా తీసుకుని అర్ధాంతరంగా వారిని మెరిట్ లిస్టు నుంచి తప్పించి ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి సీట్లు కేటాయించారని వివరించారు. ఈ విషయాన్ని రాష్ట్ర వైద్య శాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీలకు తెలియజేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. కేంద్రం ఏర్పాటు చేసిన మెడికల్ కౌన్సిల్ కమిటీ (ఎంసీసీ) ఎవరి ప్రమేయం లేకుండా 110 మంది విద్యార్థులను తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి చెప్పారన్నారు. అయితే ఇప్పటికే ఓ కౌన్సెలింగ్ పూర్తయి బుధవారం రెండో కౌన్సెలింగ్ కూడా మొదలవుతుందని వారు చెందుతున్నారు.

సీఎంను కలిసిన కేంద్ర మంత్రి నడ్డా


కేంద్ర మంత్రి జేపీ నడ్డా

సాక్షి, అమరావతి: రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా మంగళవారం సీఎం చంద్రబాబును కలిశారు. గుంటూరు జిల్లాలో పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి బయల్దేరే ముందు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ ఆయన్ను ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి తీసుకెళ్లారు. చంద్రబాబు నివాసంలో అల్పాహారం తీసుకున్న తర్వాత నడ్డా ఆయనతో కొద్దిసేపు వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంగళగిరిలో ఎయిమ్స్ నిర్మాణం పూర్తయ్యేవరకు చూడకుండా తరగతులు నిర్వహించాలని సీఎం నడ్డాను కోరగా తాత్కాలిక భవనాల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ కోర్సు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో సీట్ల పెంచుతామని హామీ ఇచ్చారు. ఫాతిమా కాలేజీ విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఆయన వెంట బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు ఉన్నారు.

ఐఆర్‌ఎన్ఎస్ఎస్-1 హెచ్ ప్రయోగానికి రంగం సిద్ధం

ఈ నెల 31న నింగిలోకి పంపనున్న ఇస్రో!


ఐఆర్‌ఎన్ఎస్ఎస్ 1జీ ఉపగ్రహానికి హీట్‌షీల్డ్ క్లోజ్ చేస్తున్న దృశ్యం.

శ్రీహరికోట (సూళ్లూరుపేట): భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీష్ థావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి ఈనెల 31న ప్రయోగించ తలపెట్టిన ఇండియన్ రీజినల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం (ఐఆర్ ఎన్ఎస్ఎస్–1 హెచ్) ఉపగ్రహాన్ని మంగళవారం పీఎస్ఎల్‌వీ సీ–39 రాకెట్‌కు అమర్చారు. 1,400 కిలోల బరువైన ఈ ఉపగ్రహాన్ని రాకెట్‌కు శిఖర భాగాన అనుసంధానించారు. అన్ని పరీక్షలు నిర్వహించి బుధవారం హీట్‌షీల్డ్ క్లోజ్ చేసే ప్రక్రియను పూర్తి చేయనున్నారు. 28న తుది విడత సంసిద్ధతా కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుంది. ఈనెల 31 సాయంత్రం 6.59 గంటలకు ప్రయోగాన్ని నిర్వహించనున్నారు.

చెన్నైలో ఆంధ్రా దంపతుల వద్ద 25 సవర్ల బంగారం చోరీ

టీ.నగర్ (చెన్నై): చెన్నైలోని కోయంబేడు బస్టాండ్‌లో ఆంధ్రా దంపతుల వద్ద 25 సవర్ల బంగారు నగలు చోరీకి గురయ్యాయి. తిరుపతి సమీపంలోని తిరుచానూరు శ్రీనివాసపురానికి చెందిన ఆంజనేయులు చీరల వ్యాపారి. ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొనేందుకు తన భార్యతో కలసి సోమవారం చెన్నై వచ్చిన ఆంజనేయులు రాత్రికి తిరిగి తిరుపతి వెళ్లేందుకు బస్టాండుకు వచ్చారు. అక్కడ వారి సూట్‌కేసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించి పరారయ్యాడు. అందులో 25 సవర్ల బంగారు నగలు, రూ.60 వేల నగదు ఉన్నట్లు బాధితుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

'కాపు ఉద్యమకారులు పట్టాలపై ఉండగా రైలు ఎలా కదిలింది?'

సాక్షి, న్యూఢిల్లీ: రిజర్వేషన్ల కోసం కాపు ఉద్యమకారులు తునిలో నిరసనకు దిగిన సమయంలో వారు పట్టాలపై ఉన్నారని తెలిసినా రైలు ముందుకు ఎలా కదిలిందని కాంగ్రెస్ మాజీ ఎంపీ వి.హనుమంతరావు ప్రశ్నించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ పాత్రపై విచారణ జరిపించాలని కేంద్ర రైల్వే మంత్రి సురేష్ ప్రభును కోరారు. ఈమేరకు మంగళవారం ఆయన రైల్వే మంత్రికి వినతిపత్రం సమర్పించారు. కాపులకు రిజర్వేషన్ కల్పిస్తామంటూ ఎన్నికల్లో టీడీపీ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, హామీ అమలు కాకపోవడంతో కాపులు కాపు గర్జన సభ నిర్వహించారన్నారు. ఈ నేపథ్యంలో తుని–అన్నవరం రైల్వే ట్రాక్ మీదకు వెళ్లి నిరసన వ్యక్తం చేస్తున్న ఆందోళనకారులు భావోద్వేగానికి గురై రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను తగులబెట్టారన్నారు. ఇందులో సంఘ వ్యతిరేక శక్తులు కూడా చొరబడి ఉంటాయని చెప్పారు. తన వినతిపై సానుకూలంగా స్పందించిన రైల్వే మంత్రి విచారణకు ఆదేశించారని వీహెచ్ మీడియాకు తెలిపారు.

హాఫ్ పే సెలవులకు 'నగదు' అవకాశం ఇవ్వండి

సీఎంకు భాషోపాధ్యాయ సంఘం వినతి

సాక్షి, అమరావతి బ్యూరో: రాష్ట్రంలో ఎయిడెడ్ కళాశాల బోధకులకు, బోధనేతరులకు అర్ధ వేతన సెలవులను నగదుగా మార్చుకునే సదుపాయం కల్పించాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మంగళవారం సీఎం చంద్రబాబును కలసి వినతి పత్రం అందించారు. రాష్ట్రంలో దాదాపు 113 ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో 1,200 మంది బోధకులు, 1,000 మంది బోధనేతరులు ఉన్నారన్నారు. అలాగే 127 డిగ్రీ కళాశాలల్లో1,800 మంది బోధకులు, 2 వేల మంది బోధనేతరులు ఉన్నారని తెలిపారు. వీరికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అర్ధ వేతన సెలవులు నగదుగా మార్చుకొనే అవకాశం కల్పించాలనీ ఆయన కోరారు. ఇప్పటికే తెలంగాణ సర్కారు ఈ విధానం అమలు చేస్తోందని మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలన్నారు.

సికింద్రాబాద్- విశాఖ, విశాఖ- తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ (విజయవాడ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్–విశాఖపట్నం, విశాఖ–తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ డివిజన్ ఇన్‌చార్జ్ పీఆర్వో జేవీఆర్కే రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్– విశాఖ ప్రత్యేక రైలు (07016) ఈ నెల 24న సాయంత్రం సికింద్రాబాద్‌లో బయలుదేరుతుందన్నారు. తిరిగి విశాఖ– సికింద్రాబాద్ ప్రత్యేక రైలు 27న సాయంత్రం 5 గంటలకు విశాఖలో బయలుదేరుతుందని తెలిపారు. విశాఖ– తిరుపతి ప్రత్యేక రైలు (07488) 25న రాత్రి 7.20 గంటలకు విశాఖలో బయలుదేరుతుందని, తిరిగి రైలు (07487) 26న రాత్రి 8 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటిరోజు ఉదయం విశాఖ చేరుతుందని పేర్కొన్నారు. ఈ రైళ్లు విజయవాడ మీదుగా తిరుగుతాయన్నారు.

వేళాంగిని ఉత్సవాల దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

వేళాంగిని ఉత్సవాల దృష్ట్యా సికింద్రాబాద్–వేళాంగిని ప్రత్యేక రైలు (07060) సెప్టెంబర్ 5న ఉదయం సికింద్రాబాద్‌లో బయలుదేరుతుందని, తిరిగి రైలు (07059) సెప్టెంబర్ 9న రాత్రి వేళాంగినిలో బయలుదేరి మరుసటి రోజు సికింద్రాబాద్ చేరుతుందన్నారు. ప్రత్యేక రైలు (07413) సెప్టెంబర్ 6న వేళాంగినిలో బయలుదేరి మరుసటిరోజు విజయవాడ చేరుతుందని, తిరిగి రైలు (07412) సెప్టెంబర్ 8న విజయవాడలో బయలుదేరి మరుసటిరోజు వేళాంగిని చేరుతుందన్నారు. రైలు (07061) సెప్టెంబర్ 5న కాకినాడ పోర్ట్‌లో బయలుదేరి అదే రోజు మధ్యాహ్నం విజయవాడ చేరుతుందని, తిరిగి రైలు (07062) సెప్టెంబర్ 10న విజయవాడలో బయలుదేరి అదే రోజు రాత్రి కాకినాడ చేరుతుందన్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం, 23-8-2017



సైరా... నాకు సవాల్‌లాంటిది
- చిరంజీవి
సినిమా పేజీలో...



నిజం గడపదాటే లోపు అబద్ధం
ఊరంతా తిరిగొస్తుందంటారు.
నిప్పులాంటి నిజాన్ని కూడా మింగేసేటంత
నోరెలా వచ్చింది.
పెద్దల వల్లే వచ్చింది.
ఊరి పెద్ద అబద్ధాలు చెబితే
ఆ ప్రభావం ఊరి మీద ఉండదా?
అలాగే... ఇంటిపెద్ద అబద్ధం చెబితే
ఆ ప్రభావం పిల్లల మీద ఉండదా?
ఈ సమాజంలో అబద్ధాన్ని కాలరాసి
నిజాన్ని నిలబెట్టే శక్తి ఎక్కడైనా ఉందంటే
అది... మనలోనే ఉంది.
మనం నిజాన్ని నిలబెట్టలేకపోతే
భావి తరమే ఒక అబద్ధమైపోతుంది.

పెద్దలే అబద్ధాలు చెబితే!

‘ఒరేయ్... చింటూ.. నిజం చెప్పు.. ఆ రోజు అక్క, రాహుల్ సినిమాకు వెళ్లారు కదూ. వాళ్లతోపాటు నువ్వూ వెళ్లావ్ కదా?’

తల అడ్డంగా ఊపాడు చింటు.

‘వీడు అబద్ధం చెప్తున్నాడు పిన్నీ... ఇప్పుడు కూడా తేజస్వీ క్లాస్‌మేట్స్‌తో పిక్‌నిక్ అని వెళ్లడం నిజం కాదు. రాహుల్, వాడి ఫ్రెండ్స్‌తో ఔటింగ్‌కి వెళ్లింది. వీడికి ఆ విషయం తెలుసు. మనకు చెప్పట్లేదు’ ఆవేశం, బాధ, ఆవేదనతో అరిచాడు సంజయ్. అతడు చింటూకు కజిన్. తేజస్వీ అన్నయ్య.

చింటు తల్లిదండ్రులు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. తల వంచుకొని గోళ్లు గిల్లుకుంటూ కూర్చున్న చింటూ దగ్గరకొచ్చి అడిగింది వాళ్ల పెద్దమ్మ అనునయంగా. ‘చెప్పు నాన్నా... తేజక్కయ్య నిజంగానే వాళ్ల ఫ్రెండ్స్‌తో వెళ్లిందా?’

చింటూ తలెత్తి హాల్లో ఉన్న పెద్దవాళ్లందరి వైపు చూశాడు. మళ్లీ తలదించుకుని గోళ్లు గిల్లుకోవడం మొదలుపెట్టాడు.

వాడి ఆ చర్యతో అందరికీ చిర్రెత్తుకొచ్చింది చింటూ తల్లిదండ్రులతో సహా. సంజయ్ అయితే కోపంతో ఊగిపోయాడు.

‘ఒరేయ్.. పెద్దమ్మ అడిగినదానికి సరిగ్గా జవాబు చెప్పు. ఆ నిర్లక్ష్యం ఏంటి?’ గదమాయించింది చింటూ వాళ్లమ్మ.



ప్రతీకాత్మక చిత్రం

‘నాకు తెలీదు.. తెలీదు.. తెలీదు’ అని అరుస్తూ గదిలోకి వెళ్లి తలుపేసుకున్నాడు చింటూ.

‘అన్నీ అబద్ధాలే పిన్నీ. వాడికి తెలుసు. వీడే తేజస్వీని బైక్ మీద బస్‌స్టాప్ పక్క గల్లీలో దింపాడట. అక్కడున్న సూపర్‌మార్కెట్ కుర్రోడు చెప్పాడు. అరే అన్నా. చింటూకి బైక్ ఎందుకు ఇస్తున్నరు. పొద్దున తేజక్కను ఎక్కించుకొని ఒచ్చిండు. కొద్దిగల పాయింది. లేకుంటే ఈడ్నే ఈ గల్లిల యాక్సిడెంట్ చేస్తుండే. మేమంతా ఉరికొచ్చినం. తేజక్క బండి దిగి ఆగంమాగం ఉరికి ఎవరి కార్లోనో ఎక్కింది. ఏంది చింటూ గంత స్పీడ్ అంటే.. అక్క ఫ్రెండ్స్‌తో బయటకు పోతుంది.. లేట్ అయితుందని స్పీడ్‌గా వచ్చిన అంతే అన్నడు... జెర భద్రం.. బండి ఇయ్యకుండ్రి.. అని చెప్పాడు ఆ కుర్రాడు. అంటే చింటూకి అన్నీ తెలిసినట్టే కదా. వీడు అబద్ధం చెప్తున్నాడు. ఆ రోజు మూవీలో కూడా మా ఫ్రెండ్ చూశాడట. చింటూ చెప్తేనే తేజస్వీ ఎక్కడుందో తెలుస్తుంది. ఆ రాహుల్ గాడు రాస్కెల్. ప్లీజ్ పిన్నీ నువ్వయినా అడుగు వాడిని’ ఏడిచినంత పనిచేశాడు సంజయ్.

చింటూ వాళ్లమ్మకు చింటూ మీద కోపం... సిట్యుయేషన్ పట్ల భయమూ... అందరిలో పరువు తీస్తున్నాడన్న అవమానమూ కలుగుతున్నాయ్.

‘అక్కయ్యా. ఎలాగైనా వాడితో నిజం చెప్పించి తేజస్వీని పదిలంగా తీసుకొచ్చే బాధ్యత మాది. కంగారు పడకండి. అది క్షేమంగానే ఉంటుంది. ఇంటికెళ్లి కాస్త రెస్ట్ తీసుకో. ఈలోపు నేను వాడితో మాట్లాడ్తా. అందరూ ఉంటే కూడా నోరు విప్పడు. వాడి మొండితనం నాకు తెలుసు’ అంది చింటూ వాళ్లమ్మ తన అక్క మాలతితో.

‘కొంచెం నువ్వే బుజ్జగించాలి కల్పన.. నాకు భయంగా ఉంది. దానికి ఏం మాయమాటలు చెప్పాడో. ఎటు తీసుకెళ్లాడో. తేజస్వీ ఫ్రెండ్స్ ఎవరిని అడిగినా రాహుల్ గురించి మంచిగా చెప్పట్లేదు. అసలు వాళ్లంతా దాన్ని వారించినా అది వినలేదనే అంటున్నారు. దాన్నెంత మత్తులో పెట్టాడో చూడు వాడు. ప్లీజ్ కల్పన.. చింటూ నిజం చెప్తే వెంటనే పోలీస్ కంప్లయింట్ ఇవ్వచ్చు’ బతిమాలింది మాలతి.

‘అయ్యో అక్కయ్యా. తేజు నాకూ కూతురే కదా. నాకు మాత్రం బెంగా, భయం ఉండవా? నేను మాట్లాడతాను’ అని అక్కకి అభయమిచ్చి సంజయ్ వంక చూసింది కల్పన.

అర్థమైనట్టుగా అందరూ లేచారు మాలతి, వాళ్లాయన, సంజయ్...

వాళ్లను గేట్ దాకా సాగనంపి లోపలికి వచ్చారు కల్పన దంపతులు.

చింటూ సోఫాలో కూర్చుని కనిపించాడు.

వంటింట్లోకి వెళ్లి కార్న్‌ఫ్లేక్స్ కలుపుకొచ్చి చింటూకిస్తూ వాడి పక్కన కూర్చున ఉంది.

‘చింటూ.. రోజూ టీవీల్లో , పేపర్లలో చూస్తున్నాం కదా. బ్యాడ్ బాయ్స్ అమ్మాయిలను తీసుకెళ్లి వాళ్లను ఎలా ఇబ్బంది పెడుతున్నారో. రాహుల్ కూడా అంతే. నీకు తెలిసింది చెప్తే తేజూను మనం జాగ్రత్తగా ఇంటికి తెచ్చుకోవచ్చు’ అని ఆపి వాడిని చూసింది కల్పన.

ఉదయం నుంచి జరుగుతున్న సీన్‌లో ఇప్పుడు ఫస్ట్ టైమ్ వాడి కళ్లల్లో భయం కనిపించింది.

‘తెలుసు’.. అన్నాడు నెమ్మదిగా.

ఆ మాటకు ఒక్క ఉదుటున వాడి దగ్గరకు వచ్చి ‘చెప్పు ఎక్కడికి తీసుకెళ్లాడో’ అంటూ వాడి భుజాలు ఊపేస్తూ ఆవేశంగా అడిగాడు చింటూ తండ్రి.

‘రాహుల్ వాళ్ల ఫామ్‌హౌజ్‌కే వెళ్లారు. ముందు రోజు రాత్రి తేజక్కయ్య రాహుల్తో ఫోన్‌లో ప్లాన్ చేసుకుంటుంటే విన్నాను’ అన్నాడు అమాయకంగా.

‘మరెందుకురా అబద్ధం చెప్పావ్ తెలీదని. ఈ ముక్క అప్పుడే చెప్తే ఈ పాటికి వెళ్లేవాళ్లం కదా’ అన్నాడు కోపంగా చింటూ వాళ్ల నాన్న.

‘తేజక్కయ్య ఎవరికీ చెప్పొద్దంది. రాహుల్‌ని అడిగి ట్యాబ్ ఇప్పిస్తానంది. డ్రాప్ చేస్తే పాకెట్ మనీ ఇస్తానంది. అందుకే చెప్పలేదు’.

‘తప్పు కదరా. అబద్ధం చెప్పడం. అబద్ధానికి అలా డబ్బులు, గిఫ్ట్స్ తీసుకోవడం’ అంది కల్పన.

‘నువ్వూ చాలాసార్లు అబద్ధం చెప్పమన్లేదా? సారీస్ అమ్మే ఆంటీ వస్తే లేనని చెప్పు కేఎఫ్‌సీ చికెన్‌కు మనీ ఇస్తా అని చెప్పలేదా? నాన్న అబద్ధం చెప్పలేదా? ప్రభాకర్ అంకుల్ వస్తే ఇంట్లో లేనని నాతో చెప్పించ లేదా? మొన్న నాన్న హెల్మెట్ లేకుండా వెళ్తుంటే పోలీస్ ఆపితే వైఫ్ హాస్పిటల్‌లో ఉంది... అర్జెన్సీలో హెల్మెట్ మరిచిపోయానని అబద్ధం చెప్పి తప్పించుకోలేదా. పైగా పోలీస్ అంకుల్‌ని ఎలా బురిడీ కొట్టించానో చూడు అని నాకు ఐస్‌క్రీమ్ కొనిపెట్టారు. మీరు అబద్ధం చెప్పినప్పుడు, నన్ను చెప్పమన్నప్పుడు డబ్బులిచ్చారు. తేజక్కయ్య కూడా అంతే చేసింది. నన్నెందుకు తప్పు పడుతున్నారు?’



ప్రతీకాత్మక చిత్రం

‘నీ వల్ల అక్కయ్య డేంజర్‌లో పడింది. నీకు ఆ మాత్రం తెలీదా?’

‘రాహుల్ ఏం భయం లేదని చెప్పాడు. కాసేపు పార్టీ చేసుకొని వచ్చేస్తాం అన్నాడు’

‘అది అబద్ధం’

‘ఏమో.. నాకు మూవీకి డబ్బులిచ్చాడు’

తల్లిదండ్రులిద్దరికీ కోపం వచ్చింది.

‘ఇదంతా నీ వల్లే’ భార్య మీదకు తోయబోయాడు.

అరచేతిని అడ్డం పెట్టి ‘ముందు బావగారికి కాల్ చేయండి. తేజు రాహుల్ వాళ్ల ఫామ్‌హౌజ్‌లో ఉన్నట్టు’ అంది.

• ❖ •

తేజస్వీ ఇంటికి చేరింది.

సమయానికి తేజస్వీ అన్నయ్య ఫామ్ హౌస్‌కు వెళ్లి తేజస్వీని తేగలిగాడు. లేకుంటే ఏం జరిగేదో. తనొక్కర్తే బయటకు వెళ్లలేక చింటూ సాయం తీసుకుంది తేజస్వీ. ఇంటర్ చదువుతున్న చింటూ తన తెలిసీ తెలియని తనంతో తేజస్వీకి ప్రమాదం తెచ్చి పెట్టాడు.

ఒకవేళ తేజస్వీకి ఏదైనా జరిగి ఉంటే? దీని బాధ్యత ఎవరు తీసుకోవాలి?

• ❖ •

చింటూ తల్లిదండ్రులు ఈ నిందను ఒకరి మీద ఒకరు తోయడంలో బిజీ అయిపోయారు.

‘నువ్వే నేర్పావ్ వాడికి అబద్ధాలు’ అని తండ్రి అంటే ‘ఇందులో మీ తప్పేం లేదా’ అని భర్తతో వాదులాటకు దిగింది తల్లి.

‘నేను మగాడిని... నాకు సవాలక్ష పనులుంటాయ్... వాటి కోసం ఏవో చిన్నచిన్న అబద్ధాలు ఆడాను.. ఆడాల్సి వస్తుంది.. నీకు నాకు తేడా లేదా?’ ‘

‘చిన్నదైనా.. పెద్దదైనా.. అబద్ధం అబద్ధమే. మీరు చేస్తే నిజం అవదు. నేను చేస్తే తప్పుగా మారదు. ప్రతిదానికి నా మీద పడి ఏడ్వకండి. అన్నిటికీ నన్ను తప్పు పట్టకండి’

‘పట్టకా? ఎవరని అనాలి? పిల్లలు చెడిపోతే తల్లులనే అంటారు గుర్తుంచుకో’

‘మరి మీ చెడుకి మీ అమ్మను అనొచ్చా’

‘నోర్ముయ్ మా అమ్మనంటావా? అసలు వాడికన్నీ నీ బుద్ధులే. అబద్ధాలు కూడా నీవే వంట బట్టాయి’

ఈ వివాదం అలా సాగుతూనే ఉంది .

పిల్లలు అబద్ధాలకోరులుగా మారకుండా ఉండాలంటే భిన్నమైన పేరెంటింగ్ కావాలి. ఎలా ఉండాలో సైకియాట్రిస్ట్‌ని అడుగుదాం!

-శరాది

అబద్ధాల కథలు చెప్పొద్దు



అన్ని విషయాల్లో పేరెంట్స్‌ని పిల్లలు అనుకరిస్తారు. అబద్ధాల విషయంలోనూ అంతే. పరిస్థితిని తప్పించడానికో, తప్పించుకోవడానికో పెద్దలు అబద్ధం ఆడుతారు. అదో టెండెన్సీగా మారింది. పిల్లలు వాటిని అలవాటు చేసుకుంటారు. అందుకే పెద్దలే జాగ్రత్తగా ఉండాలి. ఇంట్లో ఉండీ లేమని చెప్పించడం, ఎవరైనా అవసరానికి ఏదైనా అడిగితే.. అది తమ దగ్గరుందన్న విషయం పిల్లలకు తెలిసినా వాళ్లతోనే లేదని చెప్పించడం వంటివి అస్సలు చేయకూడదు. వీటిని పిల్లలు అవలీలగా అనుకరిస్తారు. పైగా అలా చేయడం తప్పుకాదని అనుకునే ప్రమాదమూ ఉంది. అంతేకాదు బయటి నుంచి మన పిల్లలు అబద్ధాలు ఆడుతున్నారనే కంప్లయింట్స్ వస్తే.. విషయమేంటో పిల్లలనే నేరుగా అడిగి తెలుసుకోవాలి. పిల్లల వివరణను బట్టే పరిస్థితిని తెలుసుకోవాలి. అలాగే పిల్లల ఎదురుగా పెద్దవాళ్లు తాము ఆడిన అబద్ధాల విషయంలో ఒకరి మీద ఒకరు తప్పుతోసుకోవడం ఆపాలి. దీనిల్ల.. ‘ఓహో.. అబద్ధం ఆడి.. ఆ తప్పును ఇలా ఎదుటివాళ్ల మీదకు తోసేయొచ్చన్నమాట’ అని నేర్చుకుంటారు. అబద్ధం ఆడి.. దాంట్లోంచి బయటపడడాన్ని ఓ రిలీఫ్‌లా భావిస్తుంటారు. పేరెంట్స్ పిల్లలకు చిన్నప్పుడు ఒక ఊహను.. అంటే అబద్ధాన్ని ఆధారం చేసుకుని చెప్పే కథలను బాల్యానికే పరిమితం చేయాలి. పిల్లలు పెద్దాయ్యాక నిజానికి దగ్గరగా ఉన్నవాటినే చెప్పాలి. పిల్లలు ముందు తల్లిదండ్రులు ఒకరినొకరు నిందించుకోకుండా పిల్లలు లేనప్పుడు ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఇంట్లో కార్డియల్ అండ్ ట్రాన్స్‌పరెంట్ వాతావరణాన్ని కల్పించాలి. అప్పుడే పిల్లలు ఏ విషయాన్నయినా పెద్దవాళ్లతో నిర్భయంగా షేర్ చేసుకోగలరు. దీని వల్ల అబద్ధాలు ఆడే చాన్సెస్ చాలా తగ్గుతాయి.

- డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్

ఆత్మీయం

మనసులో మంచి ఆలోచనలే ఉంటే...

మంచి పనులే చేస్తాం!



మనం చేసే కర్మ చెడుదా లేదా మంచిదా అన్నది నిశ్చయించేది అది చేయడానికి వెనక గల భావనే అని మన సనాతన ధర్మం స్పష్టం చేస్తోంది. చూడడానికి బయటికి చెడుకర్మగా కనిపించినా, ఒక్కోసారి అది భావనని బట్టి సుకర్మ కావచ్చు. మనిషికి కర్మ చేయడానికి వెనక గల భావనని బట్టే అతనికి ఆ కర్మ తాలూకు ఫలితం లభిస్తుంది. మన భావనలన్నింటిని గ్రహించే దేవుడికి అందుకే భావగ్రాహి అనే పేరు రుషులు పెట్టారు. ఇందుకే సద్భావాన్ని ప్రసాదించమని ప్రార్థిస్తారు. కర్మకీలకం తెలిసిన రుషులు మా కళ్లు ఎప్పుడూ మంచినే చూచుగాక, మా చెవులు ఎప్పుడూ మంచినే వినుగాక, మా నాలుక ఎప్పుడూ మంచినే రుచి చూడుగాక అని ప్రార్థిస్తారు.

మన మనసుని సద్భావాలతో నింపుకుంటే– సత్కర్మలని, దుష్టభావాలతో నింపుకుంటే దుష్కర్మలని చేస్తాం. ఆశాపరుడు అత్యంత దుష్టుడు. ఎందుకంటే ఆశపడేవాడి మనసు నిండా చెడుభావాలే ఉంటాయి. వారు చేసిన దుష్కర్మలే సరైన సమయంలో వారికి తగిన ఫలితాలనిస్తాయి. ఒకవేళ పూర్వజన్మలో వారు చేసిన సుకర్మలు ఈ జన్మలో అనుభవించాల్సిన అవసరం ఉంటే, అప్పుడు ఈ దుష్కర్మల ఫలితానుభవానికి పాత శుభకర్మల ఫలితానుభవం అడ్డుపడడంతో, అవి పై జన్మలకి వాయిదాపడి వచ్చే జన్మల్లో వారు దుర్భర కష్టాలు పడవచ్చు. అందుకే ముందు మన మనసులోని చెడును, చెత్తను తొలగించేసుకుందాం.. అప్పుడు మనకు మంచి ఆలోచనలే తడతాయి. మంచి పనులే చేస్తాం. ఆటోమేటిగ్గా మంచే జరుగుతుంది.

హెచ్చరిక

స్త్రీలకు ఆ బేబీ పౌడర్ ప్రమాదకరమా?

అవుననే అంగీకరించి తీర్పు ఇచ్చింది అమెరికాలోని లాస్ ఏంజిల్స్ కోర్టు. ప్రపంచమంతటా విరివిగా దొరికే ‘జాన్సన్ అండ్ జాన్సన్’ బేబీ పౌడరును స్త్రీలు తమ జననాంగాల శుభ్రత కోసం వాడటం వల్ల వారికి ‘ఒవేరియన్ కేన్సర్’ (అండాశయ కేన్సర్) వచ్చే ప్రమాదం ఉందని ఆ కోర్టు నమ్మడం వల్ల కాలిఫోర్నియాకు చెందిన ‘ఈవా ఎచివెరియా’ అనే మహిళకు దాదాపు 2700 కోట్ల రూపాయలు (417 మిలియన్ డాలర్లు) నష్టపరిహారంగా చెల్లించమని తీర్పు చెప్పింది. ఫేస్ పౌడర్ల వల్ల తమ ఆరోగ్యాలు పాడయ్యాయని అమెరికాలో దాఖలైన కేసులలో అత్యధిక జరిమానా విధించిన కేసుగా దీనిని చెప్పుకోవచ్చు.

ఈవా ఎచివెరియా అభియోగం ఏమిటి?

కాలిఫోర్నియాకు చెందిన 63 సంవత్సరాల ఈవా ఎచివెరియా జాన్సన్ అండ్ జాన్సన్ బేబీ పౌడర్‌ను జననాంగ శుభ్రత కోసం 1950 నుంచి 2016 వరకు ఉపయోగించింది. అయితే 2016లో ఆమె అండాశయ క్యాన్సర్ బారిన పడింది. దీనికి కారణం జాన్సన్ అండ్ జాన్సన్ పౌడరే అని భావించిన ఈవా వెంటనే లాస్ ఏంజిల్స్ కోర్టులో నష్టపరిహారానికి దావా వేసింది.

‘జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ తన టాల్కమ్ పౌడర్ బాటిల్ మీద తగిన జాగ్రత్తలు ఇవ్వలేదు, కేన్సర్ వచ్చే అవకాశం ఉందని హెచ్చరించలేదు, అందువల్లనే నేను కేన్సర్ బారిన పడ్డానని’ ఈవా అభియోగం చేసింది. ‘నా లాగా మరొకరికి నష్టం జరగకూడదు. మహిళలకు నా పరిస్థితి గురించి చెప్పి, వారిని హెచ్చరించాలన్న ఉద్దేశంతో కేసు ఫైల్ చేశాను’ అని ఆమె చెప్పింది. ఆమె వాదనతో అంగీకారం తెలిపిన కోర్టు జాన్సన్ సంస్థకు భారీ జరిమానా విధించింది. ‘ఈ తీర్పుతో నా క్లయింట్ ఊరడిల్లే అవకాశం ఉంది. చావుతో పోరాడుతున్న నా క్లయింట్ ఈ వచ్చిన జరిమానా సొమ్ముతో తనలా ఒవేరియన్ కేన్సర్‌తో బాధ పడుతున్నవారికి సహాయం



కేన్సర్ బారినపడి చికిత్స పొందుతున్న ఈవా ఎచివెరియా


చేయదలిచారు’ అని ఈవా లాయర్ మార్క్ రాబిన్‌సన్ చెప్పారు.

మరోవైపు ఈ తీర్పుపై జాన్సన్ అండ్ జాన్సన్ స్పందించింది. ‘మాకు కేన్సర్ బారిన పడ్డ ఈవా పట్ల సానుభూతి ఉంది. అయితే అంత మాత్రాన మా పౌడర్ వల్ల ఆమెకు కేన్సర్ వచ్చిందనడంతో ఏకీభవించలేం. దీనికి శాస్త్రీయ నిరూపణలు లేవు. మేము ఈ తీర్పును సవాలు చేస్తాం’ అని సంస్థ బాధ్యులు ప్రకటన చేశారు.

దాదాపు 4000 కేసులు

జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ మీద అమెరికాలో ప్రస్తుతం సుమారు నాలుగు వేల కేసులు విచారణలో మూలుగుతున్నాయి. ఇవన్నీ తీర్పు పెండింగ్‌లో ఉన్న కేసులే. జాన్సన్ ఉత్పత్తుల వాడకం వల్ల తమ ఆరోగ్యం పాడైందని దాఖలైన కేసులను కొన్ని రాష్ట్రాల్లోని కోర్టులు కొట్టేస్తుండగా మరికొన్ని రాష్ట్రాల కోర్టులు జరిమానాలు విధిస్తున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది మే నెలలో మిస్సోరీ కోర్టు నాలుగైదు కేసులలో 300 మిలియన్ డాలర్ల జరిమానాను విధించింది. ఇప్పుడు తాజాగా లాస్ ఏంజిల్స్ తీర్పుతో పెండింగ్‌లో ఉన్న కేసులన్నీ ప్రాణం పోసుకున్నట్టయ్యాయి. వీటన్నింటి నుంచి జాన్సన్ సంస్థ ఎలా బయటపడుతుందో చూడాలి. •

సాక్షి ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం
23-8-2017



● వెంకయ్యస్వామివారు నారాయణుడి అంశగా భక్తులు భావిస్తుంటారు. అందుకే ప్రతి సంవత్సరం వేంకటేశ్వర స్వామికి జరిపినట్లుగా ఆరాధనోత్సవాల పేరిట బ్రహ్మోత్సవాలు జరుపుతారు. ● 18వ తేదీన ప్రారంభమైన సర్వభూపాల వాహనసేవతో ఆరంభమైన ఈ బ్రహ్మోత్సవాలు 22న అశ్వవాహన సేవ, పెద్దశేషవాహనసేవ ● 23న సింహవాహనసేవ, గరుడ వాహనసేవ ● 24న రథోత్సవం, తెప్పోత్సవంతో ముగుస్తాయి. రాష్ట్రం నలుమూలల నుంచి ఈ ఆరాధనోత్సవాలకు భక్తులు తరలి వస్తారు.

సమాధి మందిరమే... సమాధానం



గొలగమూడి వెంకయ్యస్వామి ఆశ్రమం ప్రశాంతతకు నిలయంగా, భక్తుల కష్టాలు తీర్చే ఆశ్రమంగా వెలుగొందుతుంది. ఒకప్పుడు సాధారణ కుగ్రామంగా ఉన్న గొలగమూడి, నేడు స్వామి వారు నడియాడిన పుణ్యభూమిగా వెలుగొందుతూ ఇతర రాష్ట్రాల్లో కూడా ఖ్యాతి గడించింది. స్వామివారు గొలగమూడి వచ్చిన సమయంలో రాకపోకలు కూడా లేని అటవీప్రాంతంగా ఉండేది ఇక్కడి వాతావరణం. స్వామి ఇక్కడ చిన్న కుటీరం నిర్మించుకుని నివసిస్తూ నిత్యం ధుని వెలిగించి ధ్యానం చేస్తుండేవారు. కాలక్రమేణా గొలగమూడి ఆశ్రమం ఖ్యాతి గణనీయంగా పెరిగింది. నిత్యాన్నదానం కోసం 1000 మందికి పైగా ఏకకాలంలో భోజనం చేయడానికి భవనాన్ని నిర్మించారు. 145 గదులతో అన్ని వసతులతో కూడిన కాటేజీలను, కల్యాణ మండపాలను నిర్మించారు. వీటితోపాటు 2015లో కోటి వ్యయంతో 410 మంది పిల్లలకు విద్య, ఉచిత వసతి కల్పించేలా బడిని నిర్వహిస్తున్నారు.

స్వామివారి చరితామృతం

నెల్లూరు జిల్లా చేజర్ల మండలం నాగులవెల్లటూరు అనే చిన్న గ్రామంలో సోంపల్లి పిచ్చమ్మ, పెంచలనాయుడు పుణ్యదంపతులకు స్వామివారు జన్మించారు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో వెంకయ్యస్వామి చిన్నతనంలో కుటుంబపోషణకోసం కూలి పనులకు వెళ్లేవారు. దయ, కరుణలతో ఉంటూ పశుపక్ష్యాదులపట్ల ప్రేమ చూపుతుండేవారు. యుక్తవయస్సులో ఉన్నప్పుడు ఒకసారి తీవ్రజ్వరం రావడంతో స్వామి సమీపంలోని అడవికి వెళ్లిపోయారు. ఎప్పుడైనా ఊళ్లోకి రావడం, మిగిలిన సమయం అడవుల్లో ఉంటుండడంతో వెంకయ్యస్వామికి మతిభ్రమించిందని భావించేవారు. అలా కాలక్రమంలో పెంచలకోన, తిరుపతి, శ్రీశైలం అడవుల్లో యోగసాధన చేశారు. పెంచలకోన అడవుల్లో స్వామివారికి కణ్వ మహర్షి అనుగ్రహం లభించిందని. ఆ తర్వాత స్వామి ఏది చెబితే అది జరుగుతున్నట్లు ప్రచారం జరగడంతో ఆయనను భగత్‌స్వరూపంగా భక్తులు భావించారు. వివిధ ప్రాంతాల్లో జనారణ్యంలో ఉన్న సమయంలో స్వామివారి మహిమలు అందరికీ తెలిసేవి. అలా కాలక్రమేణా స్వామి వారు ఎక్కడికి వెళ్లినా ధునివేసి ఆ ప్రాంతాలను సస్యశ్యామలం చేసేవారు. స్వామివారు యోగసాధన చేసే క్రమంలో తమిళనాడులోని కంచి, చెన్నై నగరంలోనే ఎక్కువ కాలం ఉన్నారు. తర్వాత పెనుబద్వేలు తిప్ప, కోటితీర్థం గ్రామంలో కొంతకాలం నివసించారు. ప్రశాంతంగా భగవ ధ్యానం చేసుకోవడానికి గొలగమూడి అను వుగా ఉందని భావించి గ్రామానికి వచ్చారు.

సృష్టి చీటీలు.. నూలు దారాలు..

గొలగమూడిలో స్వామివారి రాకతో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఎలాంటి వైద్య సౌకర్యాలు లేని ఆ రోజుల్లో ప్రజలు వ్యాధుల బారిన పడిన సందర్భాల్లో తమ బాధలు తీర్చాలని స్వామివద్దకు వచ్చేవారు. అలా వచ్చేవారికి స్వామివారే వడికిన నూలుదారాన్ని రక్షాదారంగా ఇస్తూ ఉండేవారు. అలాగే భక్తులకు అభయమిస్తూ తన వేలిముద్రలు వేసి చీటీలను అందజేసేవారు. ఇవి కాలక్రమంలో సృష్టిచీటీలుగా ప్రసిద్ధి చెందాయి. స్వామివారు పూర్తి నిరాడంబర జీవితం గడిపేవారు. సమాజహితానికి 22 సూక్తులను బోధించారు. అందరినీ సమానంగా చూసుకుంటే దేవుడు కనిపిస్తుండ్లాయ్యా.. అని స్వామివారు తరచూ అంటుండేవారు. ఆశ్రమంలో కులమతాలకు తావులేదు. మీరు వెళ్లిపోతే ఆశ్రమం పరిస్థితి ఏంటని భక్తులు వేదనతో అడిగినప్పుడు ఎక్కడికయ్యా పోయేది సూర్య చంద్రులు ఉన్నంతవరకు ఉండేదే కదయ్యా అని సమాధానం చెప్పి, 1982 ఆగష్టు 24న యోగనిద్రకు చేరుకున్నారు. అలా స్వామివారి సమాధి మందిరం నేడు భక్తులకు సమాధాన మందిరంగా మారింది.

వందకు పైగా మందిరాలు

రాష్ట్రంలో 100కు పైగా భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ఆలయాల నిర్మాణం జరిగింది. నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం, అనంతపురం తదితర జిల్లాల్లో ఆలయాలు ఉన్నాయి. అక్కడ కూడా ఆరాధనలు జరుగుతుంటాయి. ఆశ్రమంలో నిత్యాన్నదానం బాగా ప్రసిద్ధి. నిత్యాన్నదానం ఎక్కువగా జరిగే క్షేత్రంగా స్వామివారికి ఆశ్రమానికి పేరుంది. కూరగాయలు మొదలుకొని పప్పుదినుసుల వరకు అన్నీ ఆశ్రమానికి విరాళాలుగా అందుతుంటాయి. ఆరాధన మహోత్సవాలకు రాష్ట్రంలో అన్ని జిల్లాలతోపాటు తమిళనాడు, కర్ణాటకల నుంచి కూడా భక్తులు హాజరవుతారు.

ఇలా చేరుకోవచ్చు

నెల్లూరు ఆత్మకూరు బస్టాండు నుంచి, రైల్వేస్టేషన్ నుంచి 11 కి.మీ దూరంలో గొలగమూడి ఉంది. ఆర్టీసీ బస్టాండు నుంచి నేరుగా గొలగమూడికి బస్సు సౌకర్యం ఉంది. ఆరాధన మహోత్సవాల నేపథ్యంలో ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు.

అలాగే నెల్లూరు నగరంలో ప్రసిద్ధ రంగనాథస్వామి దేవాలయం, మూలాపేటలో శివాలయం దర్శనీయ స్థలాలు. నెల్లూరు నగరానికి 10 కి.మీ దూరంలో జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి దేవస్థానం ఉంది. అక్కడికి సమీపంలోనే వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఉంది. బుచ్చిరెడ్డిపాళెం వెళ్లే మార్గంలో ఈ ఆలయాలున్నాయి.

- కాట్రపాటి కిషోర్, సాక్షి, నెల్లూరు

పుణ్య తీర్థం



చుట్టూ పచ్చికబయళ్లు, పిల్లగాలుల తెమ్మెరల నడుమ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే ప్రకృతి శోభిత? శంభుని కొండపై సిద్దిపేట జిల్లా వర్గల్‌లో విద్యాధరి క్షేత్రం వెలసింది. భాగ్యనగరానికి 50 కిలోమీటర్ల దూరాన హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్‌రహదారికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం ఉంది.

శంభుని కొండపై చదువుల తల్లి



సకల దేవతలు సంచరించిన ప్రదేశం.. మహాత్ములు నడచిన నేల, మునులు, తపోధనులు తపమాచరించిన మహిమాన్విత స్థలం.. సప్తస్వరాల గుండు పక్కన.. స్వయంభువుగా శంభు దేవుడు వెలసిన శంభుని కొండ విద్యాసరస్వతి ఆలయానికి నెలవైంది. పంచాంగకర్త యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి సంకల్పం, సత్యపథం సేవాసమితి సహకారంతో 1989లో వసంత పంచమిన ఆలయ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది.1992లో పుష్పగిరి పీఠాధిపతి శ్రీవిద్యా నృసింహ భారతీ స్వామి వారు ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు.

ఉత్సవాల తోరణం..

వర్గల్ క్షేత్రంలో ప్రతి నిత్యం అమ్మవారి సన్నిధిలో విశేష పూజలు, కుంకుమార్చనలు ఉంటాయి. ప్రతి నెల అమ్మవారి జన్మనక్షత్రమైన మూలానక్షత్రం రోజు విశేష అర్చనలు, చండీ హోమం జరుగుతాయి. ప్రతి మాఘ శుద్ధ త్రయోదశి రోజున దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, చండీ హోమం జరుగుతాయి.

దేవీ శరన్నవరాత్రోత్సవాలు

ప్రతియేటా ఆశ్వయుజ మాసంలో మూలనక్షత్రం రోజున అమ్మవారికి లక్ష పుష్పార్చన, చండీహోమం, మహర్నవమి రోజున అష్టోత్తర శతకలశాభిషేకం, విజయ దశమిరోజున విజయ దర్శనాది కార్యక్రమాలు, కళాకారుల కళాప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నేత్రపర్వం చేస్తాయి.

వసంతపంచమి మహోత్సవం

శ్రీవిద్యాసరస్వతి అమ్మవారి సన్నిధిలో మాఘ మాసంలో వసంత పంచమి మహోత్సవం జరుగుతుంది. మాఘ శుద్ధ పంచమి సందర్భంగా విశేష పంచామృతాభిషేకం, చండీహోమం, లక్ష పుష్పార్చన, 56 రకాల భోగాలతో నివేదన, విద్యాజ్యోతి దర్శనం తదితర కార్యక్రమాలు నేత్రపర్వం చేస్తాయి

నిత్యాన్నదానం.. మహాప్రసాదం

ప్రతి భక్తునికి అమ్మవారి మహా ప్రసాదం అందించాలనే సంకల్పంతో 2001లో అన్నదాన సత్రం ఆరంభమైంది. విశాలమైన వంటగదిలో ఆధునిక యంత్రాలతో వంటకాలు కొనసాగేలా భారీ కుకర్లు, రుచికరమైన భోజనం, చక్కని డైనింగ్ హాల్ ఏర్పాటు చేసారు. ప్రతి సంవత్సరం ఐదు లక్షలమంది భక్తులకు ఇక్కడ అన్నదానం జరుగుతుంది.

టవర్ లిఫ్ట్..

కొండ మీద ఉన్న సరస్వతీ మాతను దర్శించుకునేందుకు మెట్ల మార్గంలో వెళ్లలేని వికలాంగులు, వయో వృద్ధులు, అనారోగ్య పీడితులకు ఉపయుక్తంగా టవర్ లిఫ్ట్ ఏర్పాటు చేసారు. లిఫ్ట్ నుంచి ఆలయ గర్భ గుడికి చేరేందుకు వీల్‌చైర్లు సమకూర్చారు.

భక్తులు బస చేసేందుకు సత్రాలు

క్షేత్ర సందర్శనకు వచ్చే యాత్రికులు బస చేసేందుకు 22 సత్రాలు ఉన్నాయి. వీటికి అదనంగా కల్యాణ మండపం, శారదీయమ్ తదితర అనేక విశాలమైన భవనాలు అందుబాటులో ఉన్నాయి.

ఆకట్టుకునే వీణాపాణి విగ్రహం..

కొండ మీద భక్తులు వెళ్లే మెట్ల మార్గంలో ఎత్తైన వీణాపాణి విగ్రహం టూరిస్టులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆలయ ప్రధాన ద్వారం ముందర వాటర్ ఫౌంటేన్, స్వాగత మహా కలశం, పచ్చదనంతో అలరారే గిరులు, పచ్చని తివాచీలను మరిపించే పచ్చిక బయళ్ల భక్తులను ఆకట్టుకుంటాయి.

అక్షర సారస్వత మండపం

చదువుల తల్లి సన్నిధిలో వేలాదిగా చిన్నారుల అక్షర స్వీకారాలు జరుగుతాయి. ప్రత్యేకంగా విశేష పర్వదినాల్లో రద్దీ మరింత పెరుగుతుంది. ఈ రద్దీని తట్టుకునేందుకు భక్తులకు సౌకర్యవంతంగా రూ.15 లక్షల వ్యయంతో సారస్వత మండపం నిర్మించారు. పక్కనే సాంస్కృతిక కార్యక్రమాలు, ధార్మిక ప్రసంగాలకు వీలుగా వేదికను ఏర్పాటు చేసారు. అమ్మవారి ఆలయానికి వచ్చే చిన్నారులకోసం చిల్డ్రన్స్ పార్క్ ప్రత్యేక ఆకర్షణ. ఈ పార్కులో పెద్దలు కూడా సేదతీరుతారు.

గోశాల.. కొబ్బరి తోట

ఆలయానికి భక్తులు దానరూపంలో ఇచ్చిన గోవుల సంరక్షణకు ఇక్కడ ప్రత్యేకంగా గోశాల ఏర్పాటు చేసారు. దాదాపు 10 వరకు గోమాతలు ఇక్కడ సేదతీరుతున్నాయి. అదే విధంగా ఆలయం దిగువన కొబ్బరితోట పెంపకం చేపట్టారు. ఈ తోటలో కొబ్బరి చెట్లతోపాటు అరటి చెట్లు కూడా ఉన్నాయి.

క్షేత్రం సందర్శించిన ప్రముఖులు

వర్గల్ క్షేత్రాన్ని కంచి కామకోటి, శృంగేరి, పుష్పగిరి, హంపీ, తొగుట తదితర పీఠాధిపతులు, మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, తెలంగాణ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు తదితర ప్రముఖులు సందర్శించారు. అమ్మవారి సేవలో పునీతులయ్యారు.

ఈ క్షేత్రానికి ఇలా వెళ్లాలి

వర్గల్ విద్యాధరి క్షేత్రానికి తరలి వచ్చే భక్తులకు ఆర్టీసీ సౌకర్యాలు ఉన్నాయి. సికిందరాబాద్ గురుద్వార్ నుంచి ఉదయం 8.00 గంటలకు, 10.00 గంటలకు, మధ్యాహ్నం 12.00 గంటలకు, సాయంత్రం 2.00 గంటలకు, 4.00 గంటలకు బస్సులు వర్గల్ క్షేత్రానికి వచ్చి వెళతాయి. సికిందరాబాద్ నుంచి సిద్ధిపేట, కరీంనగర్ మార్గంలో రాజీవ్ రహదారిపై వర్గల్ క్రాస్‌రోడ్డు వరకు గజ్వేల్, సిద్ధిపేట, కరీంనగర్ రూట్‌లో వెళ్లే ఆర్టీసీ బస్సులలో చేరుకోవచ్చు. క్రాస్‌రోడ్డు నుంచి క్షేత్రానికి ఆటోలు అందుబాటులో ఉంటాయి.

మార్గమధ్యంలో రత్నాలయం

సికిందరాబాద్ నుంచి వర్గల్ సరస్వతి ఆలయానికి వెళ్లే భక్తులు మార్గమధ్యంలో రాజీవ్ రహదారిపై అలియాబాద్ చౌరస్తా వద్ద వెంకటేశ్వరుడు కొలువుదీరిన రత్నాలయాన్ని సందర్శించవచ్చు.

- గౌరారం విజయ్‌కుమార్, సాక్షి, వర్గల్

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్




ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా... నేను ఒక అబ్బాయిని ఐదేళ్లుగా ఇష్టపడుతున్నా. తనే నాకు ప్రపోజ్ చేశాడు. తనకు నేనంటే ఇష్టమే కానీ తనని నమ్మాలంటే భయమేస్తోంది. నాతో ప్రేమగా ఉంటునే... వేరే అమ్మాయితో బ్యాడ్‌గా మెసేజ్‌లు చేశాడు. ఏంటని నిలదీస్తే... 'తను మెసేజ్ చేసింది అందుకే నేనూ చేశాను' అన్నాడు. చాలా బాధగా అనిపించి చాలా రోజులు మాట్లాడలేదు. తనే నా దగ్గరకి వచ్చి 'ఇంకోసారి ఇలా చేయను, నువ్వే నాకు ఇంపార్టెంట్' అని చెప్పాడు. మారతానన్నాడు కదా అని మాట్లాడం మొదలుపెట్టాను. కానీ చాలా భయమేస్తోంది లైఫ్ అంటే. నేను ఏమైనా అంటే కొడతాడు. కోపమొస్తే గోల్డ్ చైన్, ఫోన్ లాక్కెళ్లిపోతాడు. తనంటే చాలా ఇష్టమున్నా నా పేరెంట్స్‌కి ఏం చెప్పి ఒప్పించగలను? నాకంటే డబ్బుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు అనిపించింది. ఇంట్లో సంబంధాలు చూస్తున్నారు. ఏం చెయ్యాలో అర్థం కావడంలేదు సలహా ఇవ్వండి.

- మౌనిక

మౌనిక అరటిపండు తిని ఎన్ని రోజులు అయ్యిందో..?



'సార్.. అబ్బాయి – అమ్మాయి మధ్యలో అరటిపండు ఏంటి సార్?'

అదే అరటి పండు వలిచి పెడదామని...!


'ఓహ్.. అంత క్లియర్‌గా ఉన్నా అమ్మాయికి అర్థం కావడంలేదు అంటున్నారా?'

నువ్వే... నా చెల్లెలికి వలిచి చెప్పు నీలాంబరి!!

'అబ్బాయి శుద్ధ దండుగ! అస్సలు చాన్స్ ఇవ్వొద్దు!! వాడిలో సెర్చ్ లైట్ వేసి వెతికినా ఎక్కడా అభిమానం కనబడటం లేదు. క్యాండిల్ లైట్లో కూడా ఒళ్లంతా డర్టీ ఫెలో – ఏ కనబడుతున్నాడు. ఇక లైట్ హౌస్.. అదే సముద్రం దగ్గర పొడుగ్గా వుంటుంది దాంట్లో పెద్ద లైట్ ఉంటుంది చూడండి... ఆ లైట్‌తో ఫోకస్ చేసినా అబ్బాయిలో ఒక్క చుక్క లవ్ కనబడటం లేదు.'

అర్థమయిందా చెల్లెమ్మా... తొందరగా అబౌట్ టర్న్ కొట్టి లైఫ్‌ని కాపాడుకో...!

'అరటిపండ్లు తింటూ ఉండమని చెప్పండి సార్... లవ్‌లో ఉన్న మోసాలను ఇట్టే కనిపెట్టెయ్యొచ్చు' అని నవ్వింది నీలాంబరి!!



ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

సెల్ఫ్ చెక్

విశ్వాసంతో జయిస్తున్నారా?

ఒక్కసారి మనల్ని మనం నమ్మితే అద్భుతాలు సృష్టించవచ్చు, ఎప్పుడూ సంతోషంతో ఉండవచ్చు. మనకు కావలసిన ఎలాంటి అనుభూతులనైనా సాధ్యం చేసుకోవచ్చు. ఇది జరగనప్పుడు? ఏదైనా సాధించగలను అనుకోవటం మరుక్షణం డీలా పడిపోవటం... నా జీవితం ఎప్పటికీ ఇంతే... లోకంలో కష్టాలన్నీ నాకే ఎందుకు వస్తాయి? జీవించటం అవసరమా? ఇలా ఎప్పుడూ అభద్రతా భావంతో, నిరాశా వాదంతో, నిస్సత్తువతో ఉండటంవల్ల మనశ్శాంతి ఉండదు. దేనినీ నమ్మక, ఎవరిపై నమ్మకం ఉంచక చివరికి వారినివారే ద్వేషించుకుంటూ తమపై విశ్వాసాన్ని కోల్పోయేవారు ఏదీ సాధించలేరు. తమపై తాము విశ్వాసాన్ని కోల్పోవటానికి సాధారణంగా కుటుంబ, వ్యక్తిగత, సమాజ పరిస్థితులు కారణంగా ఉంటాయి. అయితే వీటిని అధిగమించటం పెద్ద సమస్యేమీ కాదు. మీ విశ్వాసాన్ని రెట్టింపు చేసుకోవటం కష్టమేమీ కాదు.

1. మీ పనులను మీరు చేసుకొంటున్నా అవసరమైనప్పుడు ఇతరుల సహాయం తీసుకుంటారు. అహానికి తావివ్వరు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
2. ''నువ్వు దేనికీ పనికిరావు, నువ్వు సరిగా పనిచేయటం లేదు'' ఇలా మిమ్మల్ని ఎవరైనా నిరుత్సాహ పరిస్తే ఎలాంటి ఒత్తిడికి లోనవ్వరు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
3. హడావిడి పడరు, ప్లాన్డ్‌గా ఉంటారు. ప్రతిచిన్న విషయానికి ఇతరులపై ఆధారపడటం మీకిష్టం ఉండదు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
4. మిమ్మల్ని ఇబ్బందిపెట్టే సమస్యలను గుర్తు చేసుకొని నోట్ చేసుకుంటారు. వాటిని ఎలా పరిష్కరించవచ్చో, మార్గాలు అన్వేషిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
5. అసంబద్ధంగా ఉన్నదాన్ని నమ్మాలంటే సదేహిస్తారు. కాని మీ అభిప్రాయం మీద మీకున్న విశ్వాసాన్ని కోల్పోరు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
6. దార్శనికతను ఏర్పరచుకుంటారు. దానికోసం కావలసిన ఇన్‌పుట్స్‌ను పొందుతారు. మీ విజన్‌కున్న ప్రతికూల అంశాలను గుర్తించగలరు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
7. విజన్‌ను ఏర్పరచుకొని అంతటితో వదిలేయరు. దాన్ని ఎప్పటికప్పుడు గుర్తు చేసుకుంటూ మోటివేట్ అవుతారు. అనుకున్నది సాధించలేనేమోనని భయపడరు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
8. మీ విశ్వాసాన్ని నీరుకార్చే ఆలోచనలు వస్తే వాటిని ఆహ్వానిస్తారు. తర్వాత వాటిని పాజిటివ్‌గా మరల్చుకొనేందుకు ప్రయత్నిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
9. కొన్ని సందర్భాల్లో, నమ్మకాన్ని కోల్పోవటం మీకు మాత్రమే జరగదని, ఇలా ప్రతివ్యక్తిలో జరుగుతుందని అనుకుంటారు. అందుకే దీనిని కామన్ ప్రాబ్లమ్‌గా నిర్వచిస్తారు.
   ఎ. అవును ☐ బి. కాదు ☐
10. ప్రయత్నించడం అంటే మీకిష్టం. మీరు ట్రై చేసిన మొదటిసారే మీరనుకున్న ఫలితం రావాలని ఆశించరు. ప్రయత్నం మీద దేనినైనా సాధించవచ్చని నమ్ముతారు.
    ఎ. అవును ☐ బి. కాదు ☐



'ఎ' సమాధానాలు ఏడు దాటితే మీ విశ్వాసాన్ని ఎలాంటి పరిస్థితుల్లో కోల్పోరు. విశాలదృక్పథంతో, ఆప్టిమిజంతో పనులను చేస్తుంటారు. దీనివల్ల మంచి ఆరోగ్యం మీ సొంతమవుతుంది. ఇబ్బందిపెట్టే ఆలోచనలను దరిచేరనివ్వరు. 'బి' లు ఆరు దాటితే మనశ్శాంతితో ఉండరు. జీవితంలో ఎలా ఆనందించాలో, సమస్యలపై ఎలా స్పందించాలో మీకు తెలియదు. మీ నిరాశావాదానికి ఇకనైనా చెక్ చెప్పండి. 'ఎ' సమాధానాలను సూచనలుగా తీసుకోవటంతోపాటు ఆత్మవిశ్వాసం ఎలాపొందాలో తెలిపే పుస్తకాలు చదవండి. ఆశావాదులతో స్నేహం చేయండి. ఆల్ ద బెస్ట్.

పరిపరిశోధన

నిద్రలేమితో భవిష్యత్తులో అల్జైమర్స్!

కంటి నిండా నిద్రలేకపోతే చురుకుదనం లోపిస్తుందన్న అంశం మరోమారు నిర్ద్వంద్వంగా నిరూపితమైంది. బ్రెయిన్ అనే మెడికల్ జర్నల్‌లో తాజాగా ప్రచురితమైన అధ్యయనం ప్రకారం ప్రతి రాత్రీ తగినంతగా నిద్రలేనివారిలో మెదడు చురుకుదనం లోపించడంతో పాటు జ్ఞాపకశక్తిపై కూడా దుష్ప్రభావం పడుతుంది. అంతేగాక భవిష్యత్తులో ఇది జ్ఞాపకశక్తిని పూర్తిగా కోల్పోయే అల్జైమర్స్ వ్యాధికి దారితీయవచ్చు.

ఇటీవలే నిర్వహించిన ఒక అధ్యయన ఫలితం ప్రకారం... రాత్రిపూట తగినంత నిద్రపోనివారిలో అమైలాయిడ్ అనే ప్రోటీన్ పాళ్లు పెరుగుతాయి. ఇవి మెదడు కణాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. అంతేగాక టావు అనే మరో ప్రోటీన్ పాళ్లు కూడా పెరుగుతాయి. ఈ ప్రోటీన్ల పెరుగుదల అల్జైమర్స్ వ్యాధిని ప్రేరేపించే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. ఈ అధ్యయనం కోసం కొంత మంది ఆరోగ్యవంతులైన ఎలాంటి నిద్ర సంబంధమైన వ్యాధులు లేని వాలంటీర్లను ఎంచుకొని వారిని రాత్రి సరిగా నిద్రపోనివ్వకుండా చూశారు. ఒక నెల రోజులు పరిశీలించి చూసినప్పుడు ఆ వ్యక్తుల్లో అంతకు ముందు లేని అమైలాయిడ్, టావు ప్రోటీన్ల పెరుగుదలను గమనించారు. ఈ ప్రోటీన్లు పెరిగినప్పుడు అవి భవిష్యత్తులో అల్జైమర్స్ వ్యాధిని కలగజేసే అవకాశం ఉన్నందున కంటి నిండా నిద్రపోవాలనీ, డిస్టర్బ్‌డ్ స్లీప్ మంచిది కాదని హెచ్చరిస్తున్నారు ఈ అధ్యయనంలో పాల్గొన్న నిపుణులు.



కాసుకో సుడోకు

5				9	4			8
			3			1	9	4
1				6		2		3
4		8		3			2	
	3	7				8	1	
	5			8		4		7
3		5		7				2
7	4	9			5			
6			9	1				5

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

8	7	4	1	3	2	6	5	9
6	3	9	4	5	8	1	2	7
1	5	2	6	9	7	3	4	8
7	6	1	8	4	3	2	9	5
2	8	5	9	7	6	4	3	1
4	9	3	2	1	5	7	8	6
3	4	6	7	8	9	5	1	2
5	2	8	3	6	1	9	7	4
9	1	7	5	2	4	8	6	3


● 'సైరా నరసింహారెడ్డి' పోస్టర్


(కింద) వరుణ్‌తేజ్, పరుచూరి బ్రదర్స్, సాయిధరమ్‌తేజ్, అల్లు అరవింద్, సురేందర్ రెడ్డి, రాజమౌళి, రామ్‌చరణ్

సైరా... నాకు సవాల్‌లాంటిది - చిరంజీవి

''ఎప్పటి నుంచో స్వాతంత్య్ర సమరయోధుల పాత్రలో... ముఖ్యంగా భగత్‌సింగ్ పాత్రలో నటించాలనుకుంటున్నా. ఇన్నాళ్లకు తొలి స్వాతంత్య్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితకథలో నటించే అవకాశం రావడం నా అదృష్టం. ఈ పాత్ర నాకు సవాల్‌లాంటిది'' అని చిరంజీవి అన్నారు. ఆయన పుట్టినరోజు వేడుకలను హైదరాబాద్‌లో మంగళవారం ఫ్యాన్స్ సమక్షంలో జరిపారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి దర్శకత్వంలో తండ్రి చిరంజీవి హీరోగా తనయుడు రామ్‌చరణ్ నిర్మిస్తున్న 151వ సినిమా 'సైరా నరసింహారెడ్డి' మోషన్ పోస్టర్‌ను దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నిర్మాత అల్లు అరవింద్ విడుదల చేశారు. ఈ వేడుకకు చిరంజీవి రాకపోయినా, తన మనసులోని మాటలను వీడియో ద్వారా అభిమానులతో పంచుకున్నారు. చిరంజీవి మాట్లాడుతూ – ''సైరా నరసింహారెడ్డి' కోసం సురేందర్‌రెడ్డి చాలా శ్రద్ధ తీసుకుంటున్నారు. అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కనున్న ఈ చిత్రం అద్భుత దృశ్యకావ్యంలా ఉంటుంది. నాపై ఇంత ప్రేమ చూపిస్తున్న మీలాంటి అభిమానుల కోసం నేనేం చేయగలను? మీరు గర్వపడే సినిమాలు చేయడం తప్ప. 'సైరా నరసింహారెడ్డి' మీరందరూ గర్వపడే సినిమా అవుతుంది'' అన్నారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''చిరంజీవిగారి 40ఏళ్ల సినీ ప్రయాణంలో 37ఏళ్లు ఆయనతో కలసి నేనూ ప్రయాణించడం సంతృప్తిగా ఉంది. ఆయన వేసిన తారు రోడ్డులో పవన్‌కల్యాణ్, రామ్‌చరణ్, అల్లు అర్జున్, వరుణ్ తేజ్, సాయిధరమ్ తేజ్, శిరీష్, నీహారిక సాఫీగా ప్రయాణం సాగిస్తున్నారు. ఇందుకు వారు చిరంజీవికి కృతజ్ఞతగా ఉంటారు'' అన్నారు. ''బాహుబలి' అంత పెద్ద విజయం సాధించడానికి కారణం సాంకేతిక నిపుణులే. 'సైరా నరసింహారెడ్డి'కి కూడా మంచి టెక్నీషియన్స్ కుదిరారు. ఇది చిరంజీవిగారి 151వ చిత్రం అంటున్నారు. కానీ, 150 సినిమాల మైలురాయి దాటిన తర్వాత ఆయన నటిస్తున్న తొలి చిత్రం అనిపిస్తోంది'' అన్నారు రాజమౌళి. రామ్‌చరణ్ మాట్లాడుతూ– ''మీరు మా అభిమానులా? లేక మేము మీ అభిమానులా? అని నాకు డౌట్‌గా ఉంది. నాన్నగారి పుట్టినరోజును పురస్కరించుకుని 42,000 మంది రక్తదానం చేయడం గ్రేట్. అందుకే నాన్నగారు అభిమానులను 'మెగా ఫ్యాన్స్ కాదు.. మెగా బ్లడ్ బ్రదర్స్' అంటుంటారు. సినిమాలు వస్తుంటాయి.. పోతుంటాయి. కానీ, మీ అభిమానం మాత్రం ఎప్పుడూ ఇలాగే ఉండాలి. ఈ సినిమాలో పనిచేయనున్న ఆర్టిస్టులందరూ అడగ్గానే ఒప్పుకోవడం ఆంజనేయస్వామి ఆశీస్సుల వల్లే అనిపిస్తోంది'' అన్నారు. ''ఎందుకో తెలియదు కానీ, 'సైరా నరసింహారెడ్డి' పేరు చెబితే నాకు ఒక విధమైన వణుకు మొదలవుతోంది. ఇప్పుడు నా ఫోకస్ మొత్తం ఈ సినిమాపైనే. నాపై పెద్ద బాధ్యత పెట్టారు. నాకు చిరంజీవిగారు, రామ్‌చరణ్ సపోర్ట్‌గా ఉన్నారు. మెగా ఫ్యాన్స్, ప్రేక్షకుల సపోర్ట్ కూడా కావాలి'' అని సురేందర్ రెడ్డి అన్నారు. రచయితలు పరుచూరి వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ, దర్శకుడు సుకుమార్, హీరోలు సాయిధరమ్‌తేజ్, వరుణ్ తేజ్, నిర్మాత పి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు. బిగ్ బి అమితాబ్ బచ్చన్, జగపతిబాబు, నయనతార, సుదీప్, విజయ్ సేతుపతి తదితరులు నటిస్తున్న ఈ సినిమాకి సంగీతం: ఎ.ఆర్. రెహమాన్, కెమెరా: రవివర్మన్, కథ: పరుచూరి బ్రదర్స్, మాటలు: సాయిమాధవ్ బుర్రా, సమర్పణ: సురేఖ కొణిదెల.


● శర్వానంద్, ప్రణయ్‌రెడ్డి వంగా, సందీప్‌రెడ్డి వంగా, విజయ్ దేవరకొండ, షాలిని

అందుకే బెట్ కట్టడానికి రెడీ అన్నా! - విజయ్ దేవరకొండ

''అర్జున్‌రెడ్డి' బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుందనీ, అదేమాటపై నేను బెట్ కట్టడానికి కూడా రెడీ అని ట్రైలర్ విడుదల రోజు చెప్పా. ఆ మాటలు కొంతమందిని బాధించాయి. ఓ యాక్టర్‌కి తన సినిమాపై నమ్మకం లేకపోతే సిగ్గుచేటు. నా సినిమాపై నాకు నమ్మకం లేకపోతే ఇంకెవరికి ఉంటుంది. నా సినిమాపై నమ్మకం లేని రోజు కూడా తప్పకుండా వస్తుంది. అయితే, అది ఈరోజు కాదని చెప్పగలను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. విజయ్‌దేవర కొండ, షాలిని జంటగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించిన 'అర్జున్ రెడ్డి' సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. సోమవారం ఈ సినిమా ప్రీ-రిలీజ్, ఆడియో వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హీరో శర్వానంద్ ఆడియో సీడీని విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మధ్య కాలంలో విన్న హార్ట్ హిట్టింగ్ లవ్‌స్టోరీ ఇదనీ, నిజమైన ప్రేమ అంటే ఏంటో ఈ సినిమా చెబుతుందని కూడా శర్వానంద్ అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''సెన్సార్ వాళ్లు మా సినిమాకు 'ఎ' సర్టిఫికెట్ ఇచ్చారు. కొన్ని సన్నివేశాల్లో మ్యూట్ చేశారు. నన్ను మ్యూట్ చేశారు కానీ, ప్రేక్షకులను మ్యూట్ చేయలేరు. ప్రేక్షకులే థియేటర్‌లో నాకు డబ్బింగ్ చెప్పాలి'' అన్నారు. ''సందీప్‌రెడ్డి మంచి మిత్రుడు. ఈ సినిమా చూశా. చాలా బాగుంది. ఎమోషనల్ పార్ట్ హై రేంజ్‌లో ఉంటుంది. వండర్‌ఫుల్ లవ్‌స్టోరీ'' అన్నారు దర్శకుడు క్రాంతి మాధవ్. సందీప్‌రెడ్డి మాట్లాడుతూ – ''మూడు గంటల ఒక నిమిషం నలభై ఏడు సెకన్ల నిడివి ఉన్న మూవీ ఇది. హెవీ ఎమోషన్స్‌తో సాగే మంచి రొమాంటిక్ మూవీ. నేను ఏదైతే ఊహించుకున్నానో అలానే వచ్చింది. కుటుంబ సభ్యులతో కలసి చూసేలా ఉంటుంది'' అన్నారు. దర్శకులు ప్రణయ్‌రెడ్డి, నందినీరెడ్డి, తరుణ్ భాస్కర్, శివ నిర్వాణ, నిర్మాత స్వప్నదత్ మాట్లాడారు.

పవర్‌ఫుల్ దేవి

● నదియా



పవర్‌ఫుల్, స్టైలిష్ అత్త–అమ్మ పాత్రలంటే నదియానే చేయాలన్నంతగా ఆమె 'మిర్చి', 'అత్తారింటికి దారేది', 'అఆ' తదితర చిత్రాల్లో అద్భుతంగా నటించారు. తమిళంలో ఆమె లీడ్ రోల్ చేసిన 'తిరైక్కు వరాద కథై' అనే చిత్రం 'దేవి' పేరుతో తెలుగులో రిలీజ్ కానుంది. డి.తులసిదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను వైనవి సమర్పణలో సువర్ణ తెలుగులోకి అందిస్తున్నారు. సువర్ణ మాట్లాడుతూ – ''పగ, ప్రతీకారం నేపథ్యంలో హారర్ జోనర్‌లో తెరకెక్కిన సినిమా ఇది. నదియా పవర్‌ఫుల్ పోలీస్ పాత్ర చేశారు. ఆమె పాత్ర సినిమాకే హైలెట్. త్వరలోనే సినిమాను రిలీజ్ చేయనున్నాం. తమిళంలో 15 కోట్లు వసూలు చేసిన ఈ చిత్రం తెలుగులోనూ మంచి విజయాన్ని అందుకుంటుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

మంచి బ్రేక్ అవుతుంది!

● చంద్రకాంత్



చంద్రకాంత్, రాధికా మెహరోత్రా జంటగా తెరకెక్కిన చిత్రం 'ప్రేమ ఎంత మధురం ప్రియురాలు అంత కఠినం'. గోవర్ధన్.జి స్వీయ దర్శకత్వంలో రఘురాం రొయ్యూరుతో కలిసి నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ అధిక భాగం అమెరికాలో జరిగింది. ఇటీవల విడుదలైన ఈ మోషన్ పోస్టర్‌కు విశేషమైన స్పందన వస్తోంది. ఈ సందర్భంగా చంద్రకాంత్ మాట్లాడుతూ– ''నేను పుట్టి, పెరిగింది హైదారాబాద్‌లోనే. ఇంజినీరింగ్ పూర్తి చేసి యాక్టింగ్‌ను కెరీర్‌గా తీసుకోవాలని డిసైడ్ అయ్యాక అమెరికాలో ట్రైనింగ్ తీసుకున్నా. 'ప్రేమ ఎంత మధురం ప్రియురాలు ఎంత కఠినం' వంటి ఒక బ్యూటిఫుల్ రొమాంటిక్ థ్రిల్లర్‌తో హీరోగా పరిచయం కావడం నా లక్. చక్కని టీమ్‌తో రూపొందిన ఈ సినిమా నాకు మంచి బ్రేక్ ఇస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు

మహేశ్‌ని ఎవరితోనూ పోల్చలేను.. ఎందుకంటే? - మురుగదాస్


"తెలుగు, తమిళ భాషల్లో తీసిన 'స్పైడర్'ను మలయాళంలో, అరబిక్‌లో అనువదిస్తున్నాం. సెప్టెంబర్ 27నే గల్ఫ్ కంట్రీస్‌లో అరబిక్ భాషలో, కేరళలో మలయాళంలో విడుదలవుతుంది"
– మురుగదాస్



"హీరో మందు తాగి ఫ్రెండ్స్‌తో సరదాగా అమ్మాయిలను ఏడిపిస్తే... సినిమాలో కామెడీగా ఉండొచ్చు. కానీ, రియల్ లైఫ్‌లో అలా చేస్తే ట్రాజెడీగా ఉంటుంది. విలన్ అలాంటి పనులు చేస్తే నెగిటివ్ షేడ్స్ అంటారు. మరి, హీరో చేస్తే ఓకేనా? అందుకే నా సినిమాల్లో అలాంటి సీన్స్ అవాయిడ్ చేస్తున్నా. పెద్ద హీరోలకు బాధ్యత ఉంటుంది. ఎందుకంటే... కోట్లాది మంది వాళ్లను గుడ్డిగా అనుసరిస్తున్నారు. అమ్మను ప్రేమించాలి, మహిళలను గౌరవించాలి... వంటి అంశాలను సినిమాల్లో చూపిస్తే ప్రేక్షకులు ప్రభావితమవుతారు. క్రియేటర్లుగా దర్శకులు, హీరోలు బాధ్యతగా నడుచుకోవాలి" అన్నారు ఏఆర్ మురుగదాస్. మహేశ్‌బాబు హీరోగా ఆయన దర్శకత్వంలో 'ఠాగూర్' మధు సమర్పణలో ఎన్వీ ప్రసాద్ నిర్మిస్తున్న సినిమా 'స్పైడర్'. ఈ సినిమా, మహేశ్ గురించి మురుగదాస్‌తో ఇంటర్వ్యూ..

● 'స్టాలిన్' తర్వాత పదేళ్లకు తెలుగులో మీరు చేస్తున్న మూవీ 'స్పైడర్'...

'స్టాలిన్' టైమ్‌లో పరుచూరి వెంకటేశ్వరరావుగారు నన్ను మహేశ్‌కు పరిచయం చేశారు. అప్పటికే మహేశ్ 'ఒక్కడు' చూశా. సెటిల్డ్ పర్ఫార్మెన్స్ చేశారు. ఆయన్ను కలసినప్పుడు మీతో సినిమా చేయాలనుందన్నా. సరే అన్నారు. ఇప్పటికి కుదిరింది.

● తెలుగులో సూపర్‌స్టార్ అయిన మహేశ్‌ను తమిళ్‌కు పరిచయం చేస్తున్నాననే ఒత్తిడేమైనా?

డబ్బింగ్ సినిమాలు, ఇంటర్నెట్ వల్ల మహేశ్ తమిళ ప్రేక్షకులకూ తెలుసు. తమిళంలో మహేశ్‌కు ఇది మొదటి సినిమా కాబట్టి క్యారెక్టర్ బ్యాలెన్సింగ్‌గా ఉండాలనుకున్నా. తెలుగు, తమిళ సంప్రదాయాలను దృష్టిలో పెట్టుకుని మోడ్రన్ స్క్రిప్ట్ రెడీ చేశా. అలాగే, మహేశ్ ఫ్యాన్స్, ప్రేక్షకులు ఆశించే హీరోయిజమ్, కమర్షియల్ అంశాలతో స్క్రిప్ట్ రాశా. తమిళంలో మహేశే డబ్బింగ్ చెప్పారు. టీజర్‌లో డబ్బింగ్ బాగుందంటూ మెసేజ్‌లొస్తున్నాయి.

● 'సినిమాకు కథే కావాలి. సందేశాలు అవసరం లేదు' అని ఓ స్టేట్‌మెంట్ ఇచ్చారు! కానీ, మీ సిన్మాల్లో ఏదొక సందేశం ఉంటుంది కదా! ఈ 'స్పైడర్'లోనూ మెసేజ్ ఉందా?

ట్విట్టర్, వాట్సాప్, ఫేస్‌బుక్... ఎక్కడ చూసినా సందేశాలే. ప్రతి రోజూ ఎవరొకరు ఎక్కడొక చోట సందేశం ఇస్తున్నారు. నేను కూడా మెసేజ్ అంటే ప్రేక్షకులంతా 'ఇంకో సందేశమా?' అనుకుంటారు. మనం మెసేజ్ ఇవ్వకున్నా ఫర్వాలేదు. కానీ, డ్రింకింగ్, స్మోకింగ్ వంటి చెడు సందేశాలను పంపకూడదు. మహేశ్‌లాంటి స్టార్ స్క్రీన్‌పై సిగరెట్ తాగితే ఆయన్ను గుడ్డిగా ఫాలో అయ్యే వీరాభిమానులు టెమ్ట్ అవుతారు. అందుకే, నేను అలాంటివి అవాయిడ్ చేస్తున్నా. 'స్పైడర్'లో మానవత్వం గురించి చెప్పా. ఈ రోజుల్లో ప్రజలంతా త్వరగా ఓ అభిప్రాయానికి వచ్చేస్తున్నారు. అరవింద్ కేజ్రీవాల్‌ను హీరోని చేసి, సడన్‌గా జోకర్‌ను చేస్తారు. అన్నా హజారేను హీరో చేస్తారు. ఆ తర్వాత ఆయన సభలో జనాలు కనిపించరు. ఎంత త్వరగా ఇష్టపడుతున్నారో అంతే త్వరగా అయిష్టం పెంచుకుంటున్నారు. మానవత్వం లేనిచోట, ఇతరుల్ని ప్రేమించలేని పరిస్థితుల్లో తీవ్రవాదం, అవినీతి పెరుగుతాయి ఇందులో అలాంటి మెసేజ్ ఇచ్చా.

● సినిమాను ఆలస్యంగా తీసినట్టున్నారు?

బైలింగ్వల్ అంటే... 'వన్ మోర్ టేక్' చేయడమే అనుకున్నా. తెలుగులో ఓ సీన్ తీశాక, వెంటనే తమిళ సీన్ పూర్తవుతుందనుకున్నా. కానీ, స్టార్ట్ చేశాక 'వన్ మోర్ టేక్' కాకుండా 'వన్ మోర్ ఫిల్మ్' అయ్యింది. డైలాగులు ఉన్నా లేకున్నా ప్రతి ఫ్రేమ్, షాట్‌ను రెండు భాషల్లో తీశాం. దాంతో ఆలస్యమైంది.

● లేటవుతోంటే మహేశ్ ఏం అనలేదా?

ఒక్క మాట కూడా అనలేదు. 'మీరు 5 సీన్లు తీసేసి, మరో 5 సీన్లు కలుపుదామంటే రెడీ. డేట్స్ ఇస్తా. ఈ షూటింగ్ పూర్తయితేనే నెక్ట్స్ సిన్మాకు వెళ్తా' అనేవారు. సూపర్‌స్టార్స్ అందరితో వర్క్ చేశా. మహేశ్‌ను ఎవరితోనూ పోల్చలేను. దర్శకులందరూ మహేశ్‌తో ఒక్క సినిమా అయినా చేయాలనేది నా కోరిక. నేనింతవరకు ఆయనలాంటి హీరోను చూడలేదు. మహేశ్ దర్శకుల నటుడు. స్క్రిప్ట్, స్క్రీన్‌ప్లే గురించి చెప్పాక నా వర్క్‌లో ఇన్వాల్వ్ కాలేదు. ఇండియాలో మిగతా హీరోలెవరూ ఇంత కోపరేట్ చేస్తారనుకోవడం లేదు. మహేశ్ లేకుండా మరో హీరోతో 'స్పైడర్'ను ఊహించుకోలేను. ఈ సిన్మా వస్తుందని కూడా అనుకోలేను.

● మరి, నిర్మాతలు ఏమనేవారు?

'ఠాగూర్' మధు, ఎన్వీ ప్రసాద్‌లు... డబ్బులు పెట్టడం మాత్రమే కాకుండా సినిమాను ప్రేమించే నిర్మాతలు. నాకు మధుగారు 12 ఏళ్లుగా తెలుసు. ఓసారి మహేశ్‌గారు 'మధు, 'తిరుపతి' ప్రసాద్ (ఎన్వీ ప్రసాద్) అయితే మీకు హ్యాపీనా?' అనడిగారు. 'నాకు వాళ్లు ఎన్నో ఏళ్లుగా తెలుసు. నో ప్రాబ్లమ్' అన్నా. ముందు అనుకున్న దానికంటే సినిమా గ్రాండ్‌నెస్ పెరిగింది. క్లైమాక్స్‌తో పాటు కొన్ని సీన్లు బెటర్‌గా చేశా. నిర్మాతలు ఫుల్ సపోర్ట్ చేశారు. తెలుగు లిరిక్స్ విషయంలో ఎంతో హెల్ప్ చేశారు.

ష్... భయపెట్టడం మాకూ తెలుసు!

గ్లింప్స్ ఆఫ్ స్పైడర్: మే 31న (కృష్ణ బర్త్‌డే సందర్భంగా) విడుదల చేశారు. ● సుమారు కోటిన్నరకు పైగా (యూట్యూబ్‌లో) చూశారు.
● **హైలైట్:** సింగిల్ డైలాగ్ లేదు. సినిమా థీమ్‌ను పరిచయం చేసేలా ఓ ఎలక్ట్రానిక్ స్పైడర్‌ను చూపించారు. మహేశ్ 'ష్...' అనడం నచ్చింది.
స్పైడర్ ఫస్ట్ సింగిల్-'బూమ్ బూమ్': ఆగస్టు 2న విడుదల చేశారు.
● తెలుగు–తమిళ భాషల్లో కలిపి సుమారు 50 లక్షలమంది చూశారు.
● **హైలైట్:** హ్యారీస్ జయరాజ్ స్వరపరిచిన పెప్పీ అండ్ మోడ్రన్ ట్యూన్, 'స్పై..' అంటూ సాగే లిరిక్స్ జనాలకు నచ్చాయి. ముఖ్యంగా మహేశ్ కుమార్తె సితార ఈ పాట పాడుతున్న వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.
స్పైడర్ టీజర్: ఆగస్టు 8న విడుదల చేశారు. ● తెలుగులో 80 లక్షలు, తమిళంలో సుమారు 30 లక్షలకు పైగా (యూట్యూబ్‌లో) చూశారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్... డిజిటల్ ప్లాట్‌ఫార్మ్స్‌తో కలుపుకుంటే 15 మిలియన్ (కోటిన్నర) వ్యూస్ వచ్చాయి. ● **హైలైట్:** 'పెరుగుతున్న జనాభాను కంట్రోల్ చేసేందుకు గవర్నమెంట్, భూకంపం, సునామి, నేనూ ఒక భాగమే' అని డైలాగ్ చెబుతున్న ముసుగు విలన్‌ను పరిచయం చేశారు. అతడికి కౌంటర్‌గా 'నీలాంటి వాడు ఉన్న ఒక ఊరిలోనే ఇలాంటోడు ఒకడుంటాడు' అని మహేశ్‌ను గూఢచారిగా పరిచయం చేశారు. 'భయపెట్టడం మాకూ తెలుసు' అని మహేశ్ చెప్పిన డైలాగ్, స్టైలిష్ మేకింగ్ సినిమాపై అంచనాలను పెంచాయి.

సాక్షి స్పోర్ట్స్
బుధవారం 23-8-2017



యూఎస్ ఓపెన్‌కు అజరెంకా దూరం

ప్రపంచ మాజీ నంబర్‌వన్, రెండుసార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ విజేత విక్టోరియా అజరెంకా సోమవారం మొదలయ్యే యూఎస్ ఓపెన్‌కు దూరం కానుంది. గతేడాది డిసెంబర్‌లో అజరెంకాకు బాబు జన్మించగా.. తాజాగా ఈ శిశువు సంరక్షణ విషయంలో తనకు ఆమె మాజీ బాయ్‌ఫ్రెండ్ మధ్య వివాదం నడుస్తోంది. దీంతో కొన్ని న్యాయపరమైన సమస్యలను పరిష్కరించుకునే నేపథ్యంలో యూఎస్ ఓపెన్‌లో ఆడటం లేదని 28 ఏళ్ల ఈ బెలారస్ టెన్నిస్ స్టార్ ట్విట్టర్‌లో పేర్కొంది.


సింధు

సింధు, సాయిప్రణీత్ శుభారంభం

ప్రిక్వార్టర్స్‌లోకి సిక్కి రెడ్డి-ప్రణవ్ జంట ● జయరామ్ కూడా ముందంజ ● ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న భారత అగ్రశ్రేణి క్రీడాకారులు పూసర్ల వెంకట (పీవీ) సింధు, భమిడి పాటి సాయిప్రణీత్ ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో బోణీ చేశారు. అంచనాలకు అనుగుణంగా రాణించి తమ ప్రత్యర్థులపై విజయాలు నమోదు చేశారు. భారత్‌కే చెందిన అజయ్ జయరామ్ కూడా తొలి అడ్డంకిని దాటి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో మాత్రం భారత జోడీలకు మిశ్రమ ఫలితాలు లభించాయి.

గ్లాస్గో (స్కాట్లాండ్): భారీ అంచనాలతో బరిలోకి దిగిన భారత బ్యాడ్మింటన్ స్టార్స్ పీవీ సింధు, సాయిప్రణీత్, అజయ్ జయరామ్ సింగిల్స్ విభాగంలో శుభారంభం చేశారు. మహిళల సింగిల్స్‌లో తొలి రౌండ్‌లో 'బై' పొందిన సింధు మంగళవారం జరిగిన రెండో రౌండ్‌లో 21-16, 21-14తో కిమ్ హ్యో మిన్ (దక్షిణ కొరియా)పై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. ఈ గెలుపుతో గతేడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో కిమ్ హ్యో మిన్ చేతిలో ఎదురైన ఓటమికి సింధు బదులు తీర్చుకుంది. గతంలో కిమ్‌పై మూడుసార్లు గెలిచిన సింధుకు ఈసారి అంతగా పోటీ ఎదురుకాలేదు. 49 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో సింధు వరుసగా ఎనిమిది పాయింట్లు స్కోరు చేసి 8-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత కిమ్ తేరుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఈ గేమ్‌లో ఇద్దరి స్కోర్లు ఒక్కసారి కూడా సమం కాలేదు. రెండో గేమ్‌లోనూ సింధు తన జోరు కొనసాగించింది. ఆరంభంలోనే 8-3తో ఆధిక్యంలోకి వెళ్లి పట్టు బిగించింది. ఆ తర్వాత అదే దూకుడులో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను కూడా కైవసం చేసుకుంది. ఎవెగెనియా కొసెత్స్కాయా (రష్యా)-చెయింగ్ ఎన్గాన్ యి (హాంకాంగ్)ల మధ్య మ్యాచ్ విజేతతో సింధు మూడో రౌండ్‌లో తలపడుతుంది. సోమవారం ఆలస్యంగా జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో రితూపర్ణ దాస్ 2-0తో ఆధిక్యంలో ఉన్నపుడు ఆమె ప్రత్యర్థి అనా మికెలా (ఫిన్‌లాండ్) గాయం కారణంగా వైదొలిగింది.

పురుషుల సింగిల్స్‌లో 15వ సీడ్ సాయిప్రణీత్ 21-18, 21-17తో వీ నాన్ (హాంకాంగ్)పై, 13వ సీడ్ అజయ్ జయరామ్ 21-14, 21-12తో లుకా వ్రాబెర్ (ఆస్ట్రియా)పై విజయం సాధించారు. వీ నాన్‌తో జరిగిన మ్యాచ్‌లో సాయిప్రణీత్ రెండు గేముల్లోనూ ఒకదశలో వెనుకబడి పుంజుకోవడం విశేషం. ఈ ఏడాది సింగపూర్ ఓపెన్ సూపర్ సిరీస్ టైటిల్ నెగ్గిన సాయిప్రణీత్ రెండో రౌండ్‌లో ఆంథోనీ జిన్‌టింగ్ (ఇండోనేసియా)తో ఆడతాడు. 'మ్యాచ్ కఠినంగా ఉంటుందని ముందే అంచనా వేశాను. వెనుకబడిన దశలో నా వ్యూహాన్ని మార్చాను. వీ నాన్ కొన్ని పొరపాట్లు చేయడంతో నేను వాటిని సద్వినియోగం చేసుకున్నాను' అని సాయిప్రణీత్ వ్యాఖ్యానించాడు.


సాయిప్రణీత్

డబుల్స్ విభాగాల్లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మిక్స్‌డ్ డబుల్స్ రెండో రౌండ్‌లో సిక్కి రెడ్డి-ప్రణవ్ చోప్రా జంట 21-12, 21-19తో ప్రాజక్తా సావంత్ (భారత్)-యోగేంద్రన్ కృష్ణన్ (మలేసియా) జోడీపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. మరోవైపు సుమీత్ రెడ్డి-అశ్విని పొన్నప్ప (భారత్) జోడీ 17-21, 21-18, 5-21తో వాంగ్ యిలు-హువాంగ్ డింగ్‌పింగ్ (చైనా) ద్వయం చేతిలో... సాత్విక్ సాయిరాజ్-మనీషా (భారత్) జంట 20-22, 18-21తో క్రిస్టియాన్సన్-సారా థిగెసన్ (డెన్మార్క్) జోడీ చేతిలో ఓడిపోయాయి.

మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి-అశ్విని ద్వయం 21-15, 21-13తో రిరిన్ అమెలియా (ఇండోనేసియా)-చింగ్ చెయోంగ్ (మలేసియా) జోడీపై నెగ్గగా... పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ 8-21, 12-21తో హిరోయుకి ఎండో-వతనాబె (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది.


లెవెర్‌డెజ్

లీ చోంగ్ వీకి షాక్

పురుషుల సింగిల్స్‌లో మంగళవారం పెను సంచలనం నమోదైంది. ప్రపంచ మాజీ నంబర్‌వన్, రెండో సీడ్ లీ చోంగ్ వీ (మలేసియా) తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. బ్రైస్ లెవెర్‌డెజ్ (ఫ్రాన్స్) 21-19, 22-24, 21-17తో లీ చోంగ్ వీపై అద్భుత విజయం సాధించి ఆశ్చర్యపరిచాడు. గంటా 15 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో లీ చోంగ్ వీ తొలి గేమ్‌ను కోల్పోయి, రెండో గేమ్‌లో రెండుసార్లు మ్యాచ్ పాయింట్లను కాపాడుకున్నాడు. అయితే నిర్ణాయక మూడో గేమ్‌లో లెవెర్‌డెజ్ ఏకాగ్రత కోల్పోకుండా ఆడాడు. ఒకదశలో 11-15తో వెనుకబడిన లెవెర్‌డెజ్ పట్టువిడవకుండా పోరాడి స్కోరును సమం చేయడమే కాకుండా ఆధిక్యంలోకి వెళ్లి చివరిదాకా దానిని కాపాడుకొని గెలుపొందాడు. పదోసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగిన 34 ఏళ్ల లీ చోంగ్ వీ ఈ మెగా ఈవెంట్ చరిత్రలో తొలి రౌండ్‌లోనే ఓడిపోవడం ఇదే తొలిసారి. 2005లో కాంస్యం నెగ్గిన ఈ మలేసియా దిగ్గజం 2011, 2013, 2015లలో రజత పతకాలు గెలిచాడు. 2014లోనూ లీ చోంగ్ వీ రజతం గెలిచినా... ఆ ఏడాది డోపింగ్‌లో పట్టుబడటంతో అతని నుంచి పతకాన్ని వెనక్కి తీసుకున్నారు.


లీ చోంగ్ వీ

భారత్ 'ఎ' ఘనవిజయం

దక్షిణాఫ్రికా 'ఎ'తో నాలుగు రోజుల మ్యాచ్


కరుణ్ నాయర్

పోష్‌స్ట్రూమ్: దక్షిణాఫ్రికా 'ఎ'తో జరిగిన నాలుగు రోజుల అనధికారిక టెస్టు మ్యాచ్‌లో భారత్ 'ఎ' ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. చివరి రోజు మంగళవారం ఆటలో అంకిత్ రాజ్‌పుత్ (3/15), షాబాజ్ నదీమ్ (3/47) తమ బౌలింగ్‌తో బెంబేలెత్తించగా ఆతిథ్య జట్టు తమ రెండో ఇన్నింగ్స్‌లో 65.2 ఓవర్లలో 177 పరుగులకే కుప్పకూలింది. వీరి ధాటికి 138/4 ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన ప్రొటీస్ కేవలం 39 పరుగులకే మిగతా ఆరు వికెట్లను కోల్పోయింది. దీంతో ఆ జట్టుకు 223 పరుగుల ఆధిక్యం లభించింది. స్టీఫెన్ కుక్ (196 బంతుల్లో 70 నాటౌట్; 10 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. గౌతమ్‌కు రెండు వికెట్లు దక్కాయి. అనంతరం 224 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన భారత్ 62.3 ఓవర్లలో 4 వికెట్లకు 226 పరుగులు చేసి అద్భుత విజయాన్ని అందుకుంది. కెప్టెన్ కరుణ్ నాయర్ (144 బంతుల్లో 90; 13 ఫోర్లు), ఓపెనర్ సమర్థ్ (90 బంతుల్లో 55; 6 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌తో రాణించారు.

ఎదురులేని గుజరాత్ జెయింట్స్



లక్నో: ప్రొ కబడ్డీ లీగ్‌లో గుజరాత్ ఫార్చ్యూన్ జెయింట్స్ తమ హవాను కొనసాగిస్తోంది. మంగళవారం పుణేరి పల్టన్‌తో జరిగిన మ్యాచ్‌లో 35-21 తేడాతో ఘనవిజయం సాధించింది. ఆడిన 10 మ్యాచ్‌ల్లో కేవలం ఒక్క మ్యాచ్‌లోనే ఓడిన ఈ జట్టుకిది ఏడో విజయం కాగా రెండు 'టై'గా ముగిశాయి. దీంతో గుజరాత్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. దీపక్ హుడా ఐదు, సుకేశ్ హెగ్డే నాలుగు రైడింగ్ పాయింట్లు సాధించారు. ప్రారంభం నుంచే పుణేరిపై ఎదురుదాడికి దిగిన గుజరాత్ ప్రథమార్ధంలో 16-7తో స్పష్టమైన ఆధిక్యం పొందింది. ఆ తర్వాత కూడా పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేకపోవడంతో గుజరాత్ సులభంగా నెగ్గింది. ఇక చివరి వరకు ఉత్కంఠభరితంగా జరిగిన మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 32-31 తేడాతో యూపీ యోధపై నెగ్గింది. బుధవారం జరిగే మ్యాచ్‌ల్లో హర్యానా స్టీలర్స్‌తో దబంగ్ ఢిల్లీ, తెలుగు టైటాన్స్‌తో యూపీ యోధ తలపడతాయి.

అమృత్‌రాజ్‌కు చుక్కెదురు

సీటీఎల్ కాంట్రాక్ట్ రద్దు చేసిన 'ఐటా'

న్యూఢిల్లీ: భారత మాజీ ఆటగాడు విజయ్ అమృత్‌రాజ్ ఆధ్వర్యంలోని చాంపియన్స్ టెన్నిస్ లీగ్ (సీటీఎల్)కు బ్రేక్ పడింది. నిబంధనలు ఉల్లంఘించినందుకు సీటీఎల్ కాంట్రాక్ట్‌ను అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) రద్దు చేసింది. ఒప్పందం ప్రకారం విరామం లేకుండా వరుసగా తొమ్మిదేళ్ల పాటు సీటీఎల్‌ను నిర్వహించాల్సి ఉంది. పైగా కాంట్రాక్ట్ ఫీజు రూ. 30 లక్షలతో పాటు లాభాల్లో 10 శాతాన్ని కూడా 'ఐటా'కు చెల్లించాలి. అయితే గత ఏడాది సీటీఎల్‌ను నిర్వహించలేకపోయిన అమృత్‌రాజ్ బృందం ఫీజును కూడా చెల్లించలేదు.

మన రెజ్లర్లు విఫలం

పారిస్: ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో గ్రీకో రోమన్ విభాగంలో భారత రెజ్లర్ల పోరాటం ముగిసింది. రెండో రోజు బరిలోకి దిగిన జ్ఞానేందర్ (59 కేజీలు), రవీందర్ (66 కేజీలు), హర్‌ప్రీత్ సింగ్ (80 కేజీలు), నవీన్ (130 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్‌ను దాటలేకపోయారు. జ్ఞానేందర్ తొలి రౌండ్‌లో 4-1తో లిబిన్ డింగ్ (చైనా)పై గెలిచి, ప్రిక్వార్టర్ ఫైనల్లో 0-9తో మిరామ్‌బెక్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు.

'నైకీ' నచ్చడం లేదు!

టీమ్ కిట్‌పై భారత ఆటగాళ్ల ఫిర్యాదు ● కొత్త దుస్తులు పంపించిన నైకీ



ముంబై: మైదానంలో అద్భుతమైన ఆటతో చెలరేగిపోతున్న భారత క్రికెట్ జట్టు ఇప్పుడు తమకు సంబంధించిన ఒక కొత్త ఫిర్యాదును ముందుకు తెచ్చింది. అధికారిక అపెరల్ పార్ట్‌నర్ 'నైకీ' తమకు అందజేస్తున్న కిట్‌లపై ఆటగాళ్లు అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. ప్రపంచంలోనే అత్యుత్తమ స్పోర్టింగ్ బ్రాండ్‌గా అగ్రస్థానంలో ఉన్న 'నైకీ' 2006 నుంచి భారత క్రికెట్ టీమ్‌కు భాగస్వామిగా వ్యవహరిస్తోంది. గత కొన్ని నెలలుగా వివిధ మ్యాచ్‌లలో తాము ధరిస్తున్న జెర్సీలు 'నాసిరకంగా' ఉన్నాయని కెప్టెన్ కోహ్లి సహా ఇతర ఆటగాళ్లు బీసీసీఐకి తెలియజేశారు. భారత క్రికెట్ జట్టుతో 2020 సెప్టెంబర్ వరకు కాంట్రాక్ట్ ఉన్న 'నైకీ'... అందుకోసం గత ఏడాది బోర్డుకు రూ. 370 కోట్లు చెల్లించింది. మొత్తంగా తమ బ్రాండ్‌ను ధరిస్తున్నందుకు కాంట్రాక్ట్ అమల్లో ఉన్న సమయంలో జరిగే ఒక్కో అంతర్జాతీయ మ్యాచ్‌కు నైకీ దాదాపుగా రూ. 87 లక్షల 34 వేలు బీసీసీఐకి చెల్లిస్తోంది.

భారత ఆటగాళ్ల ఫిర్యాదు గురించి తెలుసుకున్న 'నైకీ' వెంటనే స్పందించింది. తమ బ్రాండ్‌కు చెందిన కొత్త జెర్సీలు, ఇతర దుస్తులను బెంగళూరు నుంచి హడావిడిగా పంపించింది. పల్లెకెలె మైదానంలో మంగళవారం క్రికెటర్ల ఆప్షనల్ ప్రాక్టీస్ సమయానికి కిట్‌లు మైదానం చేరుకున్నాయి. నలుగురు సభ్యుల 'నైకీ' బృందం టీమిండియా ఆటగాళ్లు, అధికారులతో కూడా అక్కడే చర్చించింది. ధోని, రోహిత్ శర్మలు కొత్త జెర్సీలను పరిశీలించిన తమ అభిప్రాయాలు, సూచనలు వారికి తెలియజేశారు.

కోహ్లి కోసమేనా...

భారత కెప్టెన్‌గా, నంబర్‌వన్ ఆటగాడిగా శిఖరాన ఉన్న విరాట్ కోహ్లి ఇప్పుడు ఏం చేసినా, చెప్పినా అది చెల్లుబాటయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల కోచ్‌గా కుంబ్లేను తొలగించడం అలాంటి పరిణామమే. తాజాగా 'నైకీ' గురించి ఆటగాళ్లు గళమెత్తడం వెనక కూడా కోహ్లినే కారణమని వినిపిస్తోంది. బయటికి నాణ్యతాలోపం గురించి చెప్పినా అసలు విషయం కోహ్లి బ్రాండ్ 'పూమా'కు ప్రయోజనం చేకూర్చే ప్రయత్నం చేస్తున్నట్లుగా అంతర్గత సమాచారం. 'పూమా'తో గత ఫిబ్రవరిలో కోహ్లి రూ. 110 కోట్ల భారీ మొత్తానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇటీవలే అది అమల్లోకి వచ్చింది. అయితే ఉసేన్ బోల్ట్ సహా పలువురు స్టార్ ఫుట్‌బాలర్లు 'పూమా'కు అంబాసిడర్లుగా ఉన్నా...నైకీ, అడిడాస్‌లతో పోలిస్తే ఆ బ్రాండ్ మార్కెట్ భారత్‌లో చాలా తక్కువ. దానిని పెంచుకునే ప్రయత్నంలోనే అది కోహ్లిని ఎంచుకుంది. భారత్‌లో ఎక్కువ మందికి చేరువ కావాలంటే క్రికెట్‌తో జత కట్టాల్సిన అవసరాన్ని 'పూమా' గుర్తించింది. నంబర్‌వన్ బ్రాండ్‌ను పదేళ్లకు పైగా వాడుతున్న తర్వాత జెర్సీల నాణ్యత గురించి ఆటగాళ్లు ప్రశ్నించడం నిజంగా ఆశ్చర్యకరం. ఈ సాకుతో ఒప్పందంలో ఉన్న 'అవసరమైతే కాంట్రాక్ట్‌ను రద్దు చేయవచ్చు'లాంటి క్లాజ్‌ను ఉపయోగించి ఇప్పుడు నైకీని కూడా పక్కన పెడతారా, ఆ తర్వాత కోహ్లి కోరితే పూమాను ముందుకు తెస్తారా అనేది చూడాల్సిందే.

'ఖేల్‌రత్న'లకు ఆమోదముద్ర

న్యూఢిల్లీ: భారత హాకీ ఆటగాడు సర్దార్ సింగ్, పారాలింపియన్ దేవేంద్ర జజరియా ప్రతిష్టాత్మక 'రాజీవ్ ఖేల్‌రత్న' అవార్డు ఎంపిక అధికారికంగా ఖరారైంది. సెలక్షన్ కమిటీ కొద్ది రోజుల క్రితమే వీరిద్దరి పేర్లను ప్రతిపాదించగా... కేంద్ర క్రీడా శాఖ మంగళవారం వీటికి ఆమోద ముద్ర వేసింది. వీటితో పాటు ద్రోణాచార్య, ధ్యాన్‌చంద్ పురస్కారాల కోసం ప్రతిపాదించిన జాబితాను కూడా కేంద్రం ఆమోదించింది. హైదరాబాద్‌కు చెందిన హకీమ్ (ఫుట్‌బాల్) ధ్యాన్‌చంద్ అవార్డును, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గంగుల ప్రసాద్ (బ్యాడ్మింటన్) ద్రోణాచార్య (లైఫ్‌టైమ్) అవార్డును అందుకోనున్నారు.

'అర్జున' విజేతలకు జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: జాతీయ క్రీడా పురస్కారాల్లో భాగంగా 'అర్జున' అవార్డులకు ఎంపికైన తెలుగు క్రీడాకారులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభినందనలు తెలిపారు. కమిటీ ప్రతిపాదించిన 17 మంది ఆటగాళ్ల జాబితాను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఆమోదించింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన జ్యోతి సురేఖ (ఆర్చరీ), సాకేత్ మైనేని (టెన్నిస్)లకు 'అర్జున' అవార్డులు దక్కాయి.

అక్షత్ రెడ్డి సెంచరీ

- ఆంధ్రపై హెచ్‌సీఏ ఎలెవన్ విజయం
- రవితేజ శతకం వృథా
- మొయినుద్దౌలా గోల్డ్ కప్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: ఆలిండియా మొయినుద్దౌలా గోల్డ్ కప్ క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ ఎలెవన్ జట్టు శుభారంభం చేసింది. మంగళవారం ఈసీఐఎల్ మైదానంలో జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో హెచ్‌సీఏ ఎలెవన్ 80 పరుగుల తేడాతో ఆంధ్ర కోల్ట్స్‌పై ఘన విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన హెచ్‌సీఏ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 305 పరుగులు చేసింది. అక్షత్ రెడ్డి (109 బంతుల్లో 113; 7 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీతో చెలరేగాడు. తన్మయ్ అగర్వాల్ (115 బంతుల్లో 88; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా... అంబటి రాయుడు (37 బంతుల్లో 63; 2 ఫోర్లు, 6 సిక్సర్లు) మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చాడు. ఆంధ్ర బౌలర్లలో గిరినాథ్ రెడ్డి, వేణు చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆంధ్ర 50 ఓవర్లలో 9 వికెట్లకు 225 పరుగులు మాత్రమే చేయగలిగింది. డీబీ రవితేజ (165 బంతుల్లో 113 నాటౌట్; 11 ఫోర్లు) శతకం సాధించినా తమ జట్టును గెలిపించడంలో విఫలమయ్యాడు. హైదరాబాద్ బౌలర్లలో మెహదీ హసన్, సీవీ మిలింద్, ఆకాశ్ భండారి, రవికిరణ్ తలా 2 వికెట్లు తీశారు.

ఇతర మ్యాచ్‌ల స్కోర్లు

❖ విదర్భ: 242/4 (కె. సచిన్ 75, అపూర్వ్ వాంఖెడే 63 నాటౌట్, జితేశ్ శర్మ 50); గోవా: 190/7 (స్వప్నిల్ అస్నోడ్కర్ 59, ఆదిత్య 3/42).
ఫలితం: వర్షం కారణంగా గోవా విజయ లక్ష్యాన్ని సవరించి 48 ఓవర్లలో 234 పరుగులుగా నిర్దేశించారు. 44 పరుగులతో విదర్భ విజయం

❖ బరోడా: 289/9 (కార్తీక్ కాక్డే 51, ఖయ్యూమ్ 3/54, జి.మధు 3/59); కంబైన్డ్ డిస్ట్రిక్ట్స్ ఎలెవన్: 207/7 (సుకాంత్ 91, కరణ్ పవార్ 3/32).
ఫలితం: 82 పరుగులతో బరోడా విజయం

❖ హెచ్‌సీఏ ప్రెసిడెంట్స్ ఎలెవన్: 231 (జావీద్ అలీ 53, రోహిత్ రెడ్డి 42, చందన్ సహాని 42, రాబిన్ కృష్ణ 3/34); కేరళ: 232/6 (ఫాబిద్ ఫరూఖ్ అహ్మద్ 89 నాటౌట్, రోహన్ కున్నుమ్మెల్ 74, ప్రణీత్ రెడ్డి 2/26, తనయ్ త్యాగరాజన్ 2/35).
ఫలితం: 4 వికెట్లతో కేరళ విజయం


అక్షత్

రైనా బరిలోకి...

భారత ఆటగాడు సురేశ్ రైనా నేడు జరిగే మ్యాచ్‌లో ఎయిరిండియా తరఫున బరిలోకి దిగుతున్నాడు. ఈసీఐఎల్ మైదానంలో ఎయిరిండియా, కంబైన్డ్ డిస్ట్రిక్ట్స్ ఎలెవన్ జట్ల మధ్య ఈ మ్యాచ్ జరుగుతుంది.

మహిళల విభాగంలో హారిక 'టాప్'



సాక్షి, హైదరాబాద్: అబుదాబి ఓపెన్ చెస్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక మహిళల విభాగంలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. యూఏఈలోని అబుదాబిలో మంగళవారం ముగిసిన ఈ టోర్నీలో హారిక మొత్తం 5.5 పాయింట్లు స్కోరు చేసింది. చివరిదైన తొమ్మిదో రౌండ్‌లో హారిక 43 ఎత్తుల్లో డేవిడ్ ఎగెల్‌స్టన్ (ఇంగ్లండ్)పై విజయం సాధించింది. ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో మాత్రం హారిక 29వ స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో హారిక నాలుగు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో రెండు గేముల్లో ఓడిపోయింది. ఓపెన్ విభాగంలో అమీన్ బాసిమ్ (ఈజిప్ట్) 7.5 పాయింట్లతో విజేతగా నిలువగా... నైజెల్ షార్ట్ (ఇంగ్లండ్-7 పాయింట్లు) రెండో స్థానంలో, ఆర్యన్ చోప్రా (భారత్-6.5 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచారు.